www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 7-5-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 21 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి ఉ. 11.41 తదుపరి అమావాస్య నక్షత్రం: అశ్విని మ. 3.32 తదుపరి భరణి, వర్జ్యం: ఉ. 11.53-1.21, రా. 12.20-1.48, దుర్ముహూర్తం: ఉ. 8.22-9.13, రా. 10.14-10.58, అమృతఘడియలు: ఉ. 8.59-10.26, రాహుకాలం: మ. 3.00-4.30, సూర్యోదయం: 5.49, సూర్యాస్తమయం: 6.33 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



పనిమనిషి ఇంట్లో 30 కోట్లు

ఝార్ఖండ్‌లో కలకలం

మంత్రి పీఏస్ పనిమనిషి నివాసంలో ఈడీ సోదాలు

గుట్టలుగా బయటపడిన నోట్ల కట్టలు

2

నేడు మూడో దశ

దేశవ్యాప్తంగా 93 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఓటింగ్

గుజరాత్‌లోని అన్ని సీట్లకూ ఒకేసారి

మహారాష్ట్రలో 11, ఉత్తరప్రదేశ్‌లో 10, మధ్యప్రదేశ్‌లో 8, కర్ణాటక 14, అసోంలో 4 స్థానాలకు..

2



రాజమహేంద్రవరం సభలో ప్రధాని మోదీ, పవన్, లోకేశ్, పురందేశ్వరి, ఇతర నేతల అభివాదం

మాఫియా రాజ్

కరప్షన్ కింగ్.. జగన్ ప్రభుత్వంపై ప్రధాని మోదీ నిప్పులు

ఏపీలో ఇసుక, లిక్కర్, భూ మాఫియా

- నిషేధమని చెప్పి మరీ మద్యం వ్యాపారం
- అవినీతి తప్ప మరేమీ తెలియని జగన్
- ఆయన జపించే మంత్రం అదొక్కటే
- మేలు చేయరు.. డబ్బులొచ్చే పనులే చేస్తారు
- ఐదేళ్ల అధికారం అప్పగిస్తే వృథా చేశారు
- బాబు హయాంలో అభివృద్ధిలో అగ్రస్థానం
- వైసీపీ వచ్చాక గాడి తప్పిన పురోగతి
- అభివృద్ధి సున్నా.. అవినీతి వంద శాతం
- పోలవరం ప్రాజెక్టునూ పూర్తిచేయలేదు
- రాష్ట్రం కోసం, దేశం కోసం ఓటేయండి
- మోదీ గ్యారెంటీ, బాబు నాయకత్వం, పవన్ విశ్వాసం.. 4న తియ్యటి కబురు తథ్యం
- రాష్ట్ర, దేశ అభివృద్ధికి మాదీ గ్యారెంటీ
- రాజమండ్రి, అనకాపల్లి సభల్లో మోదీ హామీ

(కాకినాడ/రాజమహేంద్రవరం/అనకాపల్లి - ఆంధ్రజ్యోతి)

"ఈనెల 13వ తేదీన ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ కోసం ఓటు వేయండి. ఈసారి మీకోసం మోదీ గ్యారెంటీ ఉంది. చంద్రబాబు నాయకత్వం ఉంది. ఇంకా... పవన్ కల్యాణ్ విశ్వాసమూ ఉంది! తెలుగు మధురమైనది. అనకాపల్లి బెల్లం తియ్యనైనది. జూన్ 4వ తేదీన ఇంతకంటే తియ్యటి, మంచి కబురు వినిపిస్తుంది. ఏపీలో ఎన్డీయే సర్కారు ఏర్పడుతుంది. ఢిల్లీలోనూ ఎన్డీయే పతాకం రెపరెపలాడుతుంది. డబుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి కొత్త శిఖరాలకు చేరుతుంది" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం

మిగతా 14వ పేజీలో...

దేశంలో అమృత ఘడియలు.. రాష్ట్రంలో విష ఘడియలు

- ఏపీలో ఎటుచూసినా దోపిడీలు, స్కామ్‌లే
- రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని తీసుకొస్తాం
- రాజమహేంద్రి సభలో జనసేనాని పవన్

14



అనకాపల్లి సభలో ప్రధాని మోదీకి చంద్రబాబు సత్కారం

మోదీ పంచ్‌లు

మా మంత్రం... డెవలప్‌మెంట్, డెవలప్‌మెంట్, డెవలప్‌మెంట్! వైసీపీ మంత్రం... కరప్షన్, కరప్షన్, కరప్షన్.

ఏపీలో అవినీతి ఫుల్ స్పీడ్! అభివృద్ధికి మాత్రం బ్రేకులు!

జగన్ పాలనలో అభివృద్ధి సున్నా... అవినీతి వంద శాతం!

వైసీపీ ప్రభుత్వానికి కరప్షన్ మేనేజ్‌మెంటే తెలుసు! ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ తెలీదు.

ఇప్పుడు రిఫామ్, పెర్‌ఫామ్, ట్రాన్స్‌ఫామ్... మంత్రం జపిస్తున్నాం. భారత్ పట్ల ప్రపంచవ్యాప్తంగా 'పాజిటివిటీ' ఉంది. ఇలాంటి సమయంలో ఏపీ ప్రజలు వైసీపీ నెగిటివిటీ నుంచి దూరంగా ఉండాలి.

అంతా 'స్క్రిప్టు' ప్రకారమే!

- వివేకా హత్య రోజున మీడియా ముందుకు జగన్..
- లెటర్ గురించి తెలిసినా.. 'పోలీసుల సృష్టి' అనే ముద్ర
- గవర్నర్‌కు కూడా అదే విధంగా చెప్పారు
- భారతి పాత్రపైనా విచారణ జరగాలి
- దారిలో ఉండగానే అంత్యక్రియల ప్రస్తావన
- వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి వెల్లడి

'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణతో 'బిగ్ డిబేట్'



(కడప - ఆంధ్రజ్యోతి)

వివేకానంద రెడ్డి హత్య జరిగిన రోజు వైఎస్ జగన్ పులివెందులలో 'స్క్రిప్టు' ప్రకారమే మాట్లాడారని... వివేకా అల్లుడు రాజశేఖర్ రెడ్డి తెలిపారు. వివేకాతో రాయించిన లేఖ గురించి తెలిసినా... అది పోలీసుల సృష్టి అనేలా మీడియాకు చెప్పారన్నారు. ఆ రోజు ఉదయం వివేకా రక్తపు వాంతులతో మృతి చెందారని సమాచారం రావడంతో హైదరాబాద్ నుంచి బయలుదేరామని, శంషాబాద్ టోల్‌గేట్ దాటే సమయంలో అది 'హత్య' అని తెలిసిందని, ఆ వెంటనే దారిలో ఉండగానే అంత్యక్రియల గురించి కూడా మాట్లాడారని వెల్లడించారు. 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ సోమవారం నిర్వహించిన 'బిగ్ డిబేట్'లో సునీత, రాజశేఖర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఇవీ వివరాలు...

ఆర్కే: చుట్టూ శత్రువులు.. ఒక్కరే పోరాటం చేస్తున్నారు. వ్యయ ప్రయాసలు,

మిగతా 11వ పేజీలో...

సీఎం కాగానే జగనన్న మారిపోయాడు!

ఒకప్పుడు ఆయనకు నేనెంతో దగ్గర: షర్మిల

- అన్న కోసం 3,200 కిమీ పాదయాత్ర చేశా.. గద్దెనెక్కాక అన్నీ మరిచాడు
- చిన్నాన్న హత్య కేసులో సునీతకు న్యాయం చేయాలని అడిగా
- సీబీఐ దర్యాప్తు కోరదామంటే వినలేదు.. అవినాశ్‌కు వైసీపీ టికెట్ ఇవ్వకుంటే కడపలో పోటీ చేసేదాన్ని కాదు
- ఓ ఆంగ్ల చానెల్‌తో ముఖాముఖిలో పీసీసీ చీఫ్ షర్మిల

11



జగన్ సీన్ అయిపోయింది

వైసీపీ ఎన్ని వందల కోట్లు ఖర్చు పెట్టినా ప్రయోజనం లేదు: చంద్రబాబు

- వచ్చేది డబుల్ ఇంజన్ సర్కారే
- 25 ఎంపీ, 160 అసెంబ్లీ స్థానాల్లో కూటమి విజయం ఖాయం
- ఉద్యోగులను చూసి కడుపు నిండింది
- ఓట్లు కొనడానికి వెళ్తే వైసీపీ నేతలను ఛీత్కరించారు
- పోలవరం పూర్తి చేస్తాం.. రాష్ట్రంలో అభివృద్ధిని మళ్లీ పట్టాలెక్కిస్తాం
- తాళ్లపాలెం సభలో ప్రధానితో పాటు పాల్గొన్న బాబు.. పాణ్యంలోనూ సభ

అనకాపల్లి/కర్నూలు, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ అధికారంలోకి రావడం ఖాయమని, సైకో జగన్ ఇంటికి పోవడం తథ్యమని టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి 160 అసెంబ్లీ స్థానాల్లో, పాతికకు పాతిక లోక్‌సభ స్థానాల్లో ఘనవిజయం సాధించబోతోందని ధీమా వ్యక్తంచేశారు. వైసీపీ ఎన్ని వందల కోట్లు ఖర్చుపెట్టినా ప్రయోజనం లేదని, జగన్ సీన్ అయిపోయిందని తేల్చిచెప్పారు. సోమవారం అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలో ప్రధాని మోదీ పాల్గొన్న బహిరంగ సభలో, అంతకుముందు కర్నూలు జిల్లా

మిగతా 14వ పేజీలో...

పిడికెడు పెట్టి.. బండెడు పట్టి

ఇదీ జగన్ మార్క్ డొల్ల 'సంక్షేమం'

పేదలగూడుపై పెత్తందారు పగ

టిడ్కో ఇళ్లకు జగన్ గ్రహణం



సమగ్ర కథనాలు నేటి 'జన కేతనం'లో..

12 13



సోమవారం మచిలీపట్నం ఎన్నికల సభలో మాట్లాడుతున్న సీఎం జగన్

జగన్ బేల మాటలు!

ఈసీ చర్యలపై ఆక్రోశం

- ఎన్నికలు సక్రమంగా జరుగుతాయనే నమ్మకం సన్నగిల్లుతోంది
- ఇష్టానుసారం అధికారులను మార్చేస్తున్నారు
- ఆన్‌గోయింగ్ స్కీమ్‌లనూ ఆపేయిస్తున్నారు
- జగన్‌ను లేకుండా చేయాలని కుట్రలు
- రేపల్లె, మాచర్ల, బందరులో వైసీపీ అధినేత

వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాటల్లో బేలతనం కనిపించింది. 'వీరభక్త ఐపీఎస్'ల సహాయంతో ఎలాగైనా ఎన్నికల్లో గెలుద్దామనుకున్న తన వ్యూహాలు బెడిసికొడుతుండటంతో ఏకంగా ఎన్నికల కమిషన్‌పైనే ఆయన ఆక్రోశం వ్యక్తంచేశారు. ఎన్నికల

మిగతా 14వ పేజీలో...

'కోడ్' దాటొద్దు!

14

సంయమనంతో మాట్లాడండి.. జగన్, చంద్రబాబుకు ఈసీ ఆదేశం

సీఎస్ జోరుకు ఈసీ కళ్లెం

- పోలింగ్ వేళ వైసీపీ కోసం పలు ప్రతిపాదనలు
- వైసీపీ కాంట్రాక్టర్లకు మేలు చేసేందుకేనా?
- కమిటీ పునః పరిశీలనకు ఈసీ ఆదేశం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ సర్కార్‌కు పోలింగ్‌కు ముందు సాయం చేయాలన్న తలంపుతో సీఎస్ జవహర్‌రెడ్డి ప్రతిరోజూ ఎన్నికల కమిషన్‌కు ఏదో ఒక ప్రతిపాదన పంపిస్తున్నారు. నిధుల విడుదలతో ముడిపడిన, ఎప్పుడో పూర్తిచేయాల్సిన పనులను సరిగ్గా ఎన్నికల ముందు తెరపైకి తెస్తున్నారు. వాటిని అమలు చేసేందుకు అనుమతివ్వాలంటూ ఎన్నికల ప్రధానాధికారికి ప్రతిపాదనలు పంపుతున్నారు. ఇటీవల ఈ ధోరణి

మిగతా 3వ పేజీలో...

సర్కార్‌కు ఈసీ షాక్!

- ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్ము విడుదలకు బ్రేక్
- మార్చి 6వ తేదీనే బటన్ నొక్కిన జగన్
- సొమ్ము విడుదల చేయకుండా జాప్యం
- ఎన్నికల ముందు రైతుల ఖాతాల్లో వేసే ఎత్తుగడ
- ఏప్రిల్ 19న ఈసీ అనుమతి కోరుతూ లేఖ
- పోలింగ్ అయ్యే వరకు ఆగాలన్న ఈసీ
- జగన్ డ్రామాతో కరువు ప్రాంత రైతులకు నష్టం
- నాడు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి.. టీడీపీ రుణమాఫీకి అడ్డుపడిన వైసీపీ

3

పోలీస్ బాస్‌గా హరీశ్ గుప్తా



డీజీపీగా బాధ్యతలు చేపడుతున్న హరీశ్ గుప్తా

- బాధ్యతలు స్వీకరించిన 1992బ్యాచ్ ఐపీఎస్
- ఫిర్యాదులు రావడంతో రాజేంద్రనాథ్‌రెడ్డి తొలగింపు
- స్థానికత కారణంగా ద్వారకకు దక్కని అవకాశం
- మాదిరెడ్డి పేరు కూడా ఈ కారణంగానే పక్కకు...
- జమ్మూకు చెందిన గుప్తాను ఎంపిక చేసిన ఈసీ
- అనంతపురం డీఐజీ అమ్మిరెడ్డిపై బదిలీ వేటు

3



అబ్ కీ బార్?



అసోంలోని కామ్‌రూప్ జిల్లాలో పోలింగ్ విధులకు వెళ్తున్న సిబ్బంది

నేడు మూడో దశ పోలింగ్

దేశవ్యాప్తంగా 93 నియోజకవర్గాల్లో ఓటింగ్

న్యూఢిల్లీ, మే 6(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమరంలో భాగంగా మంగళవారం మూడో దశ పోలింగ్ జరగనుంది. దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 93 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఓటింగ్ నిర్వహించనున్నారు. గుజరాత్(25), కర్ణాటక(14), మహారాష్ట్ర(11), ఉత్తరప్రదేశ్(10), మధ్యప్రదేశ్(8), ఛత్తీస్‌గఢ్(7), బిహార్(5), పశ్చిమ బెంగాల్(4), అసోం(4), గోవా(2), దాద్రానగర్ హవేలీ, డామన్ డయ్యూ, జమ్ముకశ్మీర్(1)లో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ దశతో గుజరాత్, కర్ణాటక, అసోంలోని అన్ని స్థానాల్లోనూ పోలింగ్ పూర్తి కానుంది. దేశంలోని మొత్తం 283 నియోజకవర్గాల్లో ఓటింగ్ ముగియనుంది. కాగా, మూడో దశలో 17.24 కోట్ల మంది ఓటర్లు తమ హక్కును వినియోగించుకోనున్నారు. మరోవైపు బీఎస్పీ అభ్యర్థి మృతితో వాయిదా పడ్డ మధ్యప్రదేశ్‌లోని బేతుల్ స్థానానికి కూడా ఈ దశలో ఓటింగ్ జరగనుంది. ప్రధాని మోదీ అహ్మదాబాద్‌లో తన ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కేంద్ర హోం మంత్రి, బీజేపీ కీలక నేత అమిత్ షా (గాంధీనగర్)తో పాటు గుజరాత్‌కు చెందిన కేంద్ర మంత్రులు పురుషోత్తం రూపాలా (రాజ్‌కోట్), మన్‌సుఖ్ మాండవీయ (పోరుబందర్) పోటీ చేస్తున్న నియోజకవర్గాలు మూడో దశలోనే ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లో జ్యోతిరాదిత్య సింధియా(గుణ), మాజీ సీఎంలు శివరాజ్‌సింగ్ (విదిశ), దిగ్విజయ్(రాజ్‌గఢ్) బరిలో ఉన్నారు. కర్ణాటకలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి (ధార్వాడ్) ఈ దశలోనే పోటీలో ఉన్నారు.

నకిలీ సమాచారాన్ని 3 గంటల్లోగా తొలగించండి

న్యూఢిల్లీ, మే 6: తమ సోషల్ మీడియా ప్లాట్‌ఫారాల్లో నకిలీ సమాచారం ఉందన్న విషయం తెలిసిన మూడు గంటల్లోగా దాన్ని తొలగించాలని ఎన్నికల సంఘం సోమవారం అన్ని పార్టీలను ఆదేశించింది. ఒకరి మాటలను మరొకరికి ఆపాదించడం, మహిళలను కించపరచడం వంటి సమాచారం ఉన్న వీడియోలను, డీప్‌ఫేక్ వీడియోలను పెట్టకూడదని తెలిపింది.

రిజర్వేషన్లపై పరిమితి ఎత్తేస్తాం



ఇండియా కూటమి అధికారంలోకి వచ్చాక రిజర్వేషన్లపై ఉన్న 50% పరిమితిని ఎత్తివేస్తాం. దళితులకు, గిరిజనులకు, వెనుకబడిన వర్గాలకు అవసరమైన మేర రిజర్వేషన్లను పెంచుతాం. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 150 సీట్లు కూడా గెలవదు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే రైతుల రుణాలను మాఫీ చేస్తాం. అలాగే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీని రూ.250 నుంచి రూ.400లకు పెంచుతాం.

- మధ్యప్రదేశ్‌లో రాహుల్ గాంధీ

హిట్లర్‌తో నాకు పోలికా!



జర్మన్ నియంత అడాల్ఫ్ హిట్లర్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రతిపక్షాలు నన్ను పోలుస్తున్నాయి. కానీ, అసలైన నియంతలెవరో దేశ ప్రజలకు తెలుసు. ఎమర్జెన్సీని ప్రవేశపెట్టింది, కళాకారులపై సెన్సార్‌షిప్‌ను విధించింది, ప్రభుత్వ అధికారాలను దుర్వినియోగం చేసిందెవరో అందరికీ తెలుసు. వారు నియంతలని నిరూపించేందుకు మా వద్ద 100 ఆధారాలున్నాయి.

- ఓ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ

నా డ్యాన్స్ చూసి ఎంజాయ్ చేశా!



న్యూఢిల్లీ, మే 6: ప్రధాని మోదీ డ్యాన్స్ చేస్తున్నట్టున్న ఓ యానిమేటెడ్ వీడియో ఆకట్టుకుంటుండగా.. దానిపై మోదీ కూడా స్పందించారు. 'కాన్సెప్ట్ మీమ్ టెంప్లెట్ ఆధారంగా రూపొందించిన ఈ వీడియోను కృష్ణ అనే వ్యక్తి 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'డిక్టేటర్ తనను అరెస్టు చేయించరని తెలుసు కాబట్టే ఈ వీడియో పోస్టు చేస్తున్నానని వ్యాఖ్య జోడించాడు. దీనికి మోదీ స్పందిస్తూ 'నా డ్యాన్స్ చూసి నేను కూడా మీ అందరిలాగే సంతోషించాను. ఎన్నికల వేళ ఇలాంటి సృజనాత్మకత నిజంగా ఉత్సాహాన్నిస్తుంద'ని పేర్కొన్నారు. దీంతో 'అసలు వ్యక్తి' కూడా స్పందించారంటూ మరో యూజర్ వ్యాఖ్యానించాడు.


'ప్రజ్వల్' ప్రభావమెంతో?

కర్ణాటకలో నేడు 14 స్థానాల్లో పోలింగ్.. వీటిలో లింగాయత్‌ల ప్రాబల్యం అధికం

- అన్నిచోట్లా కాంగ్రెస్-బీజేపీ ముఖాముఖి
- జేడీఎస్ పోటీలో లేకున్నా ఇబ్బందికరమే?
- పైచేయి సాధించేందుకు కాంగ్రెస్ యత్నం

(సెంట్రల్ డెస్క్)

దక్షిణాదిన టార్గెట్-50 అంటున్న బీజేపీకి కర్ణాటక అత్యంత కీలకం. మిగతా ఏ రాష్ట్రంలోనూ రెండంకెల స్కోరు దాటే పరిస్థితి లేని నేపథ్యంలో ఇక్కడ గెలిచే స్థానాలే ముఖ్యం. అయితే, ఇటీవల జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల అంశం దేశాన్ని కుదిపేయడంతో పాటు కాంగ్రెస్‌కు ప్రచారాస్త్రంగా మారింది. జేడీఎస్‌తో పొత్తులో ఉండటంతో ఈ వ్యవహారం బీజేపీకి తలనొప్పిగా మారింది. కాంగ్రెస్ వ్యూహాత్మకంగా.. జేడీఎస్‌కు పూర్తి అండగా నిలిచే ఒక్కళిగలు అధికంగా ఉండే దక్షిణ కర్ణాటకలో పోలింగ్ పూర్తయిన తర్వాత ప్రజ్వల్ వ్యవహారాన్ని బయటపెట్టింది. రాష్ట్రంలో మొత్తం 28 సీట్లకు గాను తొలి దశలో 14 స్థానాలకు ఏప్రిల్ 26న పోలింగ్ జరిగింది. మిగిలినవాటికి మంగళవారం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ స్థానాల్లో జేడీఎస్ పోటీలో లేకపోయినప్పటికీ, 'ప్రజ్వల్' ప్రభావం బీజేపీపై తప్పక ఉంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జేడీఎస్ పోటీ చేస్తున్న 3 సీట్లకు గత నెలలోనే పోలింగ్ ముగిసింది. రెండో దశ పోలింగ్ జరిగే స్థానాల్లో ఎక్కువ శాతం ఉత్తర, సెంట్రల్ కర్ణాటకలో.. ప్రభావవంతమైన సామాజిక వర్గం లింగాయత్‌ల ప్రాబల్యంలోనివే. వీటిలోని కిట్టూర్ కర్ణాటక (ముంబై-కర్ణాటక)లో 30 ఏళ్లుగా బీజేపీకి గట్టి పట్టుంది. వెనుకబడిన కల్యాణ్ కర్ణాటక (హైదరాబాద్ కర్ణాటక)లో కాంగ్రెస్-బీజేపీ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. సెంట్రల్ కర్ణాటకలో కాంగ్రెస్‌దే పైచేయి అయినా, రెండు దశాబ్దాలుగా బీజేపీ పుంజుకొంటోంది.





ఏప్రిల్ 14న ఎన్నికల ప్రచారంలో ప్రజ్వల్, దేవెగౌడతో కలిసి మోదీ అభివాదం(ఫైల్)

బీజేపీ నష్ట నివారణ చర్యలు

ప్రజ్వల్ ఉదంతం వెలుగులోకి వచ్చిన వెంటనే తీవ్రంగా ఖండించడం ద్వారా బీజేపీ నష్ట నివారణకు దిగింది. కాగా, ప్రత్యర్థిని దెబ్బతీసేందుకు రేవణ్ణ సెక్స్ కుంభకోణాన్ని కాంగ్రెస్ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లింది. ఇది ఏమేరకు ఫలితాన్ని ఇస్తుందో చూడాలి. వాస్తవానికి ఎన్నికల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం పడిపోతుందని బీజేపీ, జేడీఎస్ నేతలు ప్రచారం చేశారు. ఇప్పుడంతా మారిపోయింది. ప్రజ్వల్, ఆయన తండ్రి రేవణ్ణను కుమారస్వామి పూర్తిగా పక్కనపెట్టడం జేడీఎస్‌ను చీలికకు కారణం కానుందనే వాదనలు వినిపిస్తున్నాయి. కర్ణాటక పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ అయితే.. జేడీఎస్‌కు చెందిన 19 మంది ఎమ్మెల్యేల్లో 15 మంది తమ పార్టీలో చేరుతారని వ్యాఖ్యానించడం గమనార్హం.

సిటింగ్‌ల మార్పు.. మంత్రుల వారసులు

రెండో విడత పోలింగ్ జరగనున్న 14 స్థానాలనూ 2019లో బీజేపీనే గెలుచుకుంది. ఈ ఎన్నికల్లో సగంచోట్ల సిటింగ్ అభ్యర్థులను మార్చింది. కొప్పల్, ఉత్తర కన్నడ మరికొన్ని నియోజకవర్గాల ఎంపీలపై పార్టీ కేడర్‌లోనే వ్యతిరేకత ఉంది. ఇక కాంగ్రెస్ ఐదుచోట్ల రాష్ట్ర మంత్రుల కుమారులు లేదా కుమార్తెలను దింపడం గమనార్హం. మరో 3 స్థానాల్లో సీనియర్ నేతల వారసులకు, ఒకచోట రిటైర్డ్ ఐఏఎస్‌కు టికెట్లిచ్చింది. వీరిలో ఒక్కరు తప్ప అందరూ కొత్తవారే. ఇది బీజేపీ-కాంగ్రెస్ మధ్య వ్యత్యాసం చూపొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పోలింగ్ జరిగే నియోజకవర్గాలు: చిక్కోడి, బెళగావి, బాగల్కోటె, ఉత్తర కన్నడ, బీదర్, రాయచూరు, బళ్లారి, కొప్పళ, విజయపుర, కలబురగి, దావణగెరె, శివమొగ్గ, హావేరి, ధారవాడ.

పోటీలోని ప్రముఖులు: మాజీ సీఎంలు బొమ్మై, శెట్టర్, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే అల్లుడు రాధాకృష్ణ దొడ్డమని, మంత్రుల వారసులు సాగర్ ఖండ్రె, ప్రియాంక జార్కిహొళి, మృణాల్ హెబ్బాళ్కర్, సంయుక్తా పాటిల్, మంత్రి మల్లికార్జున భార్య ప్రభ ఈ విడతలో పోటీలో ఉన్నారు. శివమొగ్గలో మాజీ సీఎంలు యడియూరప్ప కుమారుడు రాఘవేంద్ర, బంగారప్ప కోడలు గీతాశివరాజ్ తలపడుతున్నారు.

లింగాయత్‌ల అడ్డా

బీజేపీకి బలమైన ఓటు బ్యాంకు లింగాయత్‌ల ప్రాబల్యం ఉత్తర కర్ణాటకలోనే అధికం. 2014 నుంచి 60%పైగా లింగాయత్‌లు కమలం పార్టీ వైపే నిలుస్తున్నారు. 2019 ఎన్నికల్లో అయితే 87% మంది మద్దతు పలికారు. యడియూరప్పకు తిరిగి కీలక బాధ్యతలు అప్పగించడం, ఆయన కుమారుడికి రాష్ట్ర పార్టీ పగ్గాలివ్వడం, లింగాయత్‌లైన ఇద్దరు మాజీ సీఎంలు శెట్టర్, బొమ్మైలు ఈ ప్రాంతం నుంచి పోటీ చేస్తుండడంతో లింగాయత్‌ల ఓట్లు గంపగుత్తగా తమకే పడతాయని బీజేపీ భావిస్తోంది. కాగా, ఓబీసీలు కొన్నేళ్లుగా బీజేపీనే ఎక్కువ ఆదరిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ వారిని ఆకర్షించింది. దళితులు మాత్రం పూర్తి స్థాయిలో హస్తం వైపే ఉన్నారు. కల్యాణ్ కర్ణాటకలో ప్రభుత్వ పథకాలైన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ఉధృతంగా ప్రచారం చేస్తోంది. బీజేపీ మోదీ మేనియాను నమ్ముకుంది.

పని మనిషి ఇంట్లో రూ. 34 కోట్లు



రాంచి, మే 6: గుట్టలు గుట్టలుగా నోట్ల కట్టలు.. గంటలు గడిచిన కొద్దీ లెక్క పెరుగుతూ పోయింది.. పలువురు అధికారులు యంత్రాల సాయంతో నిర్విరామంగా శ్రమిస్తే కానీ ఓ కొలిక్కి రాలేదు. ఝార్ఖండ్‌లో ఓ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి (పీఎస్) ఇంట్లో పని చేసే వ్యక్తి వద్ద భారీ ఎత్తున నగదు పట్టుబడింది. ఇది దాదాపు రూ.34 కోట్లని.. ఇదంతా లెక్కల్లోకి రాని అక్రమ సొమ్మేనని అధికారులు పేర్కొన్నారు. సోదాల్లో భాగంగా మరో చోట రూ.3 కోట్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఝార్ఖండ్ గ్రామీణాభివృద్ధి శాఖలో చీఫ్ ఇంజినీర్‌గా పని చేసిన వీరేంద్రకుమార్ రామ్ గతేడాది రూ.10 వేల లంచం కేసులో అరెస్ట్ అయ్యారు. అయితే, ఆ తర్వాత మనీ లాండరింగ్ కేసులో ఈడీ ఆయన్ను అదుపులోకి తీసుకున్నాక సీన్ మారిపోయింది. ఆయన ఇచ్చిన సమాచారంతో సోమవారం రాష్ట్ర రాజధాని రాంచీలోని పలు ప్రాంతాల్లో ఈడీ సోదాలు జరిపింది. కాంగ్రెస్ సీనియర్ నేత, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఆలంగీర్ ఆలం పీఎస్ సంజీవ్‌లాల్ ఇంట్లో పని మనిషిగా ఉన్న జహంగీర్ ఆలం అనే వ్యక్తి నివాసంలో కూడా సోదాలు జరిగాయి. అక్కడ రూ.500 నోట్ల కట్టలు గుట్టలుగా బయటపడటం కలకలం రేపింది. ఒడిశాలో ఎన్నికల ప్రచారంలో ఉన్న ప్రధాని మోదీ ఈ వ్యవహారాన్ని తన ప్రసంగంలో ప్రస్తావించారు. 'ఝార్ఖండ్‌లో నోట్ల గుట్టలు బయటపడ్డాయి. పనిమనిషి ఇంటినే అవినీతి గోడౌన్‌గా మార్చారు. నగదు లెక్కింపు యంత్రాలే అలిసిపోయేంతగా నోట్ల కట్టలు బయటపడ్డాయి. ఇదంతా కాంగ్రెస్ ప్రథమ కుటుంబం తాలుకూ నల్లధనమేనా..? దీనిపై యువరాజు సమాధానం చెప్పాలి' అని మోదీ ప్రశ్నించారు.

కరెంటు ఆపేసి.. చీకట్లో మాటేసి!

- ఆమదాలవలస టీడీపీ అభ్యర్థి భార్యపై కత్తితో దాడి
- ఎన్నికల ప్రచారం చేస్తుండగా ఘటన
- అడ్డుకున్న డ్రైవర్‌కు తీవ్రగాయాలు



గాయపడిన డ్రైవర్ సింగూరు కసవయ్య

పొందూరు, మే 6: శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం మజ్జిలపేటలో ఆమదాలవలస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపీపీ కూన ప్రమీలపైనే వైసీపీ కార్యకర్త ఒకరు కత్తితో దాడికి ప్రయత్నించారు. అడ్డుకున్న ప్రమీల కారుడ్రైవర్ చేతికి తీవ్రగాయాలయ్యాయి. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్ ఫిర్యాదు చేశారు. వివరాలివీ.. కూన ప్రమీల సోమవారం పలు గ్రామాల్లో కూటమి అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాత్రి 8 గంటల సమయంలో కోటిపల్లి పంచాయతీ మజ్జిలపేట గ్రామంలో ప్రచారం చేస్తుండగా వైసీపీకి చెందినవారు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం మొదలుపెట్టారు. అయినా వారిని పట్టించుకోకుండా ముందుకు వెళ్తున్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అదే సమయంలో గ్రామానికి చెందిన గురుగుబెల్లి రమణ అనే వైసీపీ కార్యకర్త కత్తితో ఒక్కసారిగా కూన ప్రమీలపై దాడికి ప్రయత్నించాడు. అప్రమత్తమైన ప్రమీల కారు డ్రైవర్ సింగూరు కసవయ్య అడ్డుకోవడంతో అతడి చేతికి గాయమైంది. వెంటనే టీడీపీ నాయకులు నిందితుడు గురుగుబెల్లి రమణను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. ప్రమీలపై హత్యాయత్నం జరిగిన సమయంలో వైసీపీకి చెందినవారే కరెంటు తీసేసి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదుచేయాలని టీడీపీ నాయకులు కోరారు.

నేనూ టైటిల్ యాక్టుకు బాధితుడినే!

- చనిపోయిన నా తల్లిదండ్రుల భూముల మ్యుటేషన్‌కు రెవెన్యూ అధికారులు నిరాకరించారు
- ఐఏఎస్‌గా పనిచేసిన నాపరిస్థితే ఇలా ఉంటే.. సామాన్యరైతుల దుస్థితి ఊహించలేం: పీవీ రమేశ్

అమరావతి, మే 6 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో ల్యాండ్ టైటిల్ యాక్టుకు అందరూ బాధితులే. చివరకు ప్రభుత్వ అధికారులుగా పనిచేసినవారు కూడా ఇందుకు మినహాయింపు కాదు. ఐఏఎస్ అధికారిగా 36 ఏళ్ల పాటు ఆంధ్రప్రదేశ్‌లో వివిధ హోదాల్లో సేవలందించిన పీవీ రమేశ్ అనుభవం ఇదే విషయం తేటతెల్లం చేస్తోంది. ల్యాండ్ టైటిల్ యాక్టుకు తానూ ప్రత్యక్ష బాధితుడినేనంటూ పీవీ రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వాట్సాప్ మాధ్యమం వేదికగా తన అనుభవం పంచుకున్నారు. ప్రకటించారు. "కృష్ణా జిల్లా విన్నకోట గ్రామంలో చనిపోయిన నాతల్లిదండ్రుల పట్టా భూములను మ్యుటేషన్ చేసేందుకు రెవెన్యూ అధికారులు నిరాకరించారు. తహసిల్దార్ నా దరఖాస్తును తిరస్కరించారు. పోస్టు ద్వారా పంపిన పత్రాలను తెరవకుండానే ఆర్డీవో తిరిగి ఇచ్చేశారు. నా తల్లిదండ్రుల భూములపై నాకు హక్కు లేకుండా చేస్తున్నారు. ఐఏఎస్‌గా సేవలందించిన ఓ అధికారి పరిస్థితి ఇలా ఉంటే, సామాన్య రైతుల పరిస్థితిని ఊహించలేం" అని ఆవేదన వ్యక్తం చేశారు.

'కోవిషీల్డ్'పై విచారణకు సుప్రీంకోర్టు అంగీకారం

న్యూఢిల్లీ, మే 6 (ఆంధ్రజ్యోతి): కరోనా వ్యాక్సిన్ 'కోవిషీల్డ్'ను వినియోగించడం ద్వారా కలిగిన సైడ్ ఎఫెక్ట్ విషయమై దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీం కోర్టు అంగీకరించింది. అయితే దీనిని సత్వరమే చేపట్టాలన్న వినతిని మాత్రం తిరస్కరించింది. బ్రిటిష్ ఫార్మా దిగ్గజం ఆస్ట్రాజెనెకా, ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన కోవిడ్-19 వ్యాక్సిన్‌ను సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఇండియాలో కోవిషీల్డ్ పేరుతో తయారు చేసి విక్రయించింది. తమ వ్యాక్సిన్ తీసుకున్న వారిలో అరుదైన సందర్భాల్లో రక్తం గడ్డకట్టడం, ప్లేట్‌లెట్ల సంఖ్య పడిపోవడం జరుగుతుందని ఆస్ట్రాజెనెకా ఇటీవల అంగీకరించిన సంగతి తెలిసిందే.

సునీత.. ముచ్చటగా మూడోసారి

- నేటి ఉదయం 8.04 గంటలకు రోదసీ యాత్ర



వాషింగ్టన్, మే 6: భారత సంతతికి చెందిన అమెరికా వ్యోమగామి సునీతా విలియమ్స్(58) ముచ్చటగా మూడోసారి అంతరిక్ష యాత్రకు సిద్ధమయ్యారు. మరో వ్యోమగామి బుచ్ విల్‌మోర్‌తో కలిసి బోయింగ్‌కు చెందిన స్టార్‌లైనర్ వ్యోమనౌకలో ఆమె రోదసీలోకి వెళ్లనున్నారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం (మే 7) ఉదయం 8.04 గంటలకు ఫ్లోరిడాలోని కేప్ కెనవెరాల్ నుంచి బోయింగ్‌కు చెందిన స్టార్‌లైనర్ వ్యోమనౌక అంతర్జాతీయ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్)కు బయల్దేరనుంది. సునీత విలియమ్స్ ఇప్పటికే రెండుసార్లు అంతరిక్షంలోకి వెళ్లొచ్చారు. తాజా యాత్రలో ఆమె మిషన్ పైలట్‌గా వ్యవహరించనున్నారు. తానొక ఆధ్యాత్మిక వాదినని, తనకు వినాయకుడు అంటే ఇష్టమని.. అందుకే ఈ సారికూడా తాను అంతరిక్షంలోకి వెళ్లేటప్పుడు తనతోపాటు వినాయకుడి విగ్రహాన్ని తీసుకెళ్తున్నానని సునీతా విలియమ్స్ చెప్పారు.

కవిత బెయిల్ పిటిషన్ల తిరస్కరణ

న్యూఢిల్లీ, మే 6(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం పాలసీలో అనుచిత లబ్ధి పొందటం కోసం డబ్బులు సేకరించి ఆమ్ ఆద్మీపార్టీకి ఇచ్చిన వ్యవహారంలో కవిత కీలక పాత్రధారిగా కనిపిస్తున్నారని ఢిల్లీలోని రౌస్‌ఎవెన్యూ జిల్లా కోర్టు పేర్కొంది. ఈ కేసులో వ్యక్తిగత స్వేచ్ఛ కన్నా ప్రజాప్రయోజనం ముఖ్యమైనదని స్పష్టం చేసింది. కేసు దర్యాప్తు కీలక దశలో ఉందని, ఈ నేపథ్యంలోనే కవిత బెయిల్ పిటిషన్లను తిరస్కరిస్తున్నట్లు తెలిపింది. ఢిల్లీ మద్యం కేసులో అరెస్టై తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత.. సీబీఐ, ఈడీ నమోదు చేసిన రెండు కేసుల్లోనూ తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లపై రౌస్ అవెన్యూ జిల్లా కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. 'కవిత విదేశాలకు పారిపోయే అవకాశం లేదు. అయితే, ఈ కేసులో సాక్షులను ఆమె గతంలో బెదిరించారు. బెయిల్ ఇస్తే, సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉంది. అందుకనే బెయిల్ ఇవ్వటం లేదు' అని న్యాయమూర్తి కావేరీ బవేజా పేర్కొన్నారు.



రఫాపై ఇజ్రాయెల్ దాడి

కాల్పుల విరమణకు సిద్ధమన్న హమాస్

సెంట్రల్‌గాజా/టెల్ అవీవ్, మే 6: ముందుగా హెచ్చరించినట్టుగానే గాజా-ఈజిప్ట్ సరిహద్దు నగరం రఫాపై ఇజ్రాయెల్ సోమవారం దాడులను ప్రారంభించింది. గాజాపై ఇజ్రాయెల్ భూతల దాడులు ప్రారంభమయ్యాక.. పాలస్తీనా శరణార్థులకు ఆశ్రయమిస్తున్న రఫాలో నక్కిన హమాస్ నేతల ఏరివేత పేరుతో ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) ముందుకు సాగుతోంది. ఆదివారం హమాస్ జరిపిన కాల్పుల్లో నలుగురు ఐడీఎఫ్ సైనికులు మృతిచెందడంతో.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలో భేటీ అయిన అత్యవసర యుద్ధ క్యాబినెట్.. రఫాపై దాడికి ఏకగ్రీవంగా ఆమోదించింది. హమాస్ తాజా దాడితో చర్చలకు విఘాతమేర్పడిందని క్యాబినెట్ అభిప్రాయపడింది. దీంతో.. సోమవారం ఉదయం నుంచే రఫాలోని శరణార్థులను సముద్రతీర ప్రాంతమైన మువాసి నగరానికి తరలించడం ప్రారంభించింది. ప్రాణభయంతో పౌరులు బిక్కుబిక్కుమంటూ దొరికిన వాహనాలపై మువాసికి పరుగులు తీశారు. సాయంత్రం సమయంలో ఐడీఎఫ్ వర్గాలు తూర్పు రఫాపై డ్రోన్ దాడులను ప్రారంభించాయి. రఫాపై దాడి యత్నాన్ని మానుకోవాలంటూ అమెరికా, ఫ్రాన్స్, ఐరోపా సమాఖ్య, ఇతర దేశాలు కోరినా.. ఇజ్రాయెల్ పట్టించుకోకపోవడం గమనార్హం..! కాగా.. కాల్పుల విరమణకు తాము సిద్ధంగా ఉన్నామని హమాస్ అగ్ర నేత ఇస్మాయిల్ హనియే సోమవారం సాయంత్రం ప్రకటించారు. ఈజిప్ట్, ఖతార్ మధ్యవర్తిత్వం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

లోకం తీరు



పోస్టల్ బ్యాలెట్ రగడ.. రగడ..



నంద్యాల జిల్లా ఆత్మకూరులో రిటర్నింగ్ ఆఫీసర్‌ను ప్రశ్నిస్తున్న ఉద్యోగులు

నంద్యాలలో తొలిరోజే గందరగోళం

నంద్యాల, మే 6(ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ నంద్యాల జిల్లాలో తొలిరోజు గందరగోళం మధ్య సాగింది. శ్రీశైలం నియోజకవర్గానికి సంబంధించి ఆత్మకూరులో ఓటింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇక్కడ పోస్టల్ బ్యా లెట్‌కు సరిపడినన్ని కవర్లు అందుబాటులో ఉంచలేదు. దీంతో చాలామంది ఒకే కవర్‌లో రెండు బ్యాలెట్ పేపర్లను పెట్టి బాక్సులో వేసేశారు. కవర్లను అతికించేందుకు గమ్ కూడా అందుబాటులో ఉంచకపోవడంతో బ్యాలెట్‌ను కవర్ మూసివేయకుండానే బాక్సులో వేయాల్సి వచ్చింది. ఇలాంటి ఓట్లన్నీ చెల్లకుండా పోతే ఎవరు బాధ్యత వహిస్తారని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఆత్మకూరు పోలింగ్ సెంటర్‌లో బ్యాలెట్ బాక్సుకు కనీసం సీలు కూడా వేయలేదని ఆరోపిస్తున్నారు.

'అనంత'లో పోలీసుల బేరసారాలు

కళ్యాణదుర్గం/రాయదుర్గం మే 6: అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుటే సోమవారం ఓ కానిస్టేబుల్ పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల జాబితాను పట్టుకుని.. వైసీపీ నేతల కొనుగోలు ప్రయత్నాలకు సహకరించారు. సమాచారం అందుకున్న టీడీపీ కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు తనయుడు యశ్వంత్ చౌదరి అక్కడికి చేరుకుని కానిస్టేబుల్‌ను నిలదీశారు. ఆయనపై ఆర్వో రాణి సుస్మితకు ఫిర్యాదు చేశారు. బయటకు వస్తున్న యశ్వంత్‌పై వైసీపీ కార్యకర్తలు దాడికి యత్నించారు. పోలీస్ స్టేషన్ ఎదుటే ఆయన వాహనాన్ని చుట్టుముట్టారు. ఓ వైసీపీ కార్యకర్త టీడీపీ నాయకులపైకి రాళ్లు విసిరారు. ఇక రాయదుర్గంలో ఓ హెడ్ కానిస్టేబుల్ పోస్టల్ ఓట్లను కొనుగోలు చేస్తూ కనిపించారు. వైసీపీ నాయకులు డబ్బు పంపిణీ బాధ్యతను ఆయనకే అప్పగించినట్లు తెలిసింది. ఇద్దరు ఉపాధ్యాయులను వెంటబెట్టుకుని ఓటుకు రూ.1,500 దాకా పంపిణీ చేస్తున్నారు. 'వైసీపీకి 110 స్థానాలు వస్తాయి. అప్పుడు మీ సంగతి చూస్తాం' అని ఓటింగ్‌లో పాల్గొనే ప్రభుత్వ వ్యతిరేక ఉద్యోగులను బెదిరిస్తున్నారని సమాచారం.

పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో వైసీపీ ఎమ్మెల్యే హల్‌చల్

నరసరావుపేట, మే 6: పల్నాడు జిల్లాలో మరోసారి వైసీపీ మూకలు బరితెగించాయి. నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ కేంద్రం గేటు వద్ద విశ్రాంత ఆర్మీ ఉద్యోగి సత్యనారాయణ రెడ్డి వచ్చి పోలీసులతో పిచ్చాపాటి మాట్లాడుతున్నారు. ఆ సమయంలో టీడీపీ అభ్యర్థి చదలవాడ అరవిందబాబు వచ్చారు. అయన కారును పోలీసులు లోపలికి అనుమతించలేదు. అదే సందర్భంలో సత్యనారాయణరెడ్డిని టీడీపీ కార్యకర్తలు గమనించి, ఆయన మొబైల్‌పై ఉన్న వైసీపీ స్టిక్కర్‌ను తొలగించారు. సత్యనారాయణరెడ్డిని కేంద్రానికి దూరంగా తరిమేశారు. టీడీపీ కార్యకర్తలు తనపై దాడి చేశారంటూ ఆయన సమాచారం ఇవ్వడంతో వైసీపీ ఎమ్మెల్యే, అభ్యర్థి గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వందల మంది అనుచరులతో కేంద్రం వద్దకు వచ్చారు. తమ పార్టీ వ్యక్తిపై దాడి జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ఆర్వో సరోజపై మండిపడ్డారు. దాదాపు గంటపాటు కేంద్రాన్ని వైసీపీ శ్రేణులు చుట్టుముట్టాయి. కర్రలు, రాళ్లతో టీడీపీ శ్రేణులపై దాడులకు తెగబడ్డాయి. అదే సమయంలో అటుగా వెళుతున్న కన్నా లక్ష్మీనారాయణ కారుపై కర్రలతో దాడిచేసి అద్దాలు ధ్వంసం చేశారు. కారు టైర్లలో గాలితీశారు. భయభ్రాంతులకు గురైన కొందరు ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకోకుండానే వెనుదిరిగారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

బ్యాలెట్ కోసం బారులు

- మండుటెండల్లోనూ క్యూలలో ఉద్యోగులు

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవడానికి ఉద్యోగులు పెద్దఎత్తున తరలి వస్తున్నారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా ఫెలిసిలిటేషన్ సెంటర్లలో గంటల తరబడి క్యూలలో నిలబడి మరీ ఓటేస్తున్నారు. జాబితాలో పేరు ఉండి బ్యాలెట్ రాలేదంటూ కొన్నిచోట్ల చెబుతుండటంతో... బ్యాలెట్ వచ్చేదాకా వస్తామని, ఓటు హక్కు వినియోగించుకునే వరకూ విశ్రమించేదే లేదన్నట్లుగా ఉద్యోగులు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ సోమవారం నాటికి కొన్ని జిల్లాల్లో రెండో రోజుకి, మరికొన్ని జిల్లాల్లో మూడోరోజుకి చేరింది. మూడోరోజు కూడా పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై చాలాచోట్ల గందరగోళం కొనసాగింది. మరో రెండు రోజులు (8 వరకు) బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఈసీ అవకాశం కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా 5లక్షల మందికి పైగా ఉద్యోగులు ఎన్నికల విధుల్లో ఉన్నట్లు సమాచారం. ఫాం-12 ఎంతమందికి మంజూరు చేశారు, ఎందరికి పోస్టల్ బ్యాలెట్ జారీ చేశారనే పూర్తి వివరాలను ఎన్నికల సంఘం 8వ తేదీ తర్వాత వెల్లడించే అవకాశం ఉందని చెబుతున్నారు. అన్ని ఇబ్బందులను అధిగమించి ఓటు వేయడానికి ఉద్యోగులు పట్టువదలని విక్రమార్కుల్లా మారారు. ఓటు వేయడమే ఒక ఉద్యమంగా పెట్టుకుని కేంద్రాలకు వెళ్తున్నారు.

'పేట' వ్యవహారంపై ఈసీ సీరియస్.. రీపోలింగ్‌కు ఆదేశం

చిలకలూరిపేట, మే 6: పల్నాడు జిల్లా చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ బదులు ఈవీఎం టెండర్ బ్యాలెట్ ఇచ్చిన ఘటనలో రీపోలింగ్ జరపాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ నెల 5న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ సందర్భంగా జరిగిన పొరపాటుకు సంబంధించి బాధ్యులైన అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని సీఈవో మీనాకు ఆదేశాలు జారీ చేసింది.

'ఆపరేషన్ హైదరాబాద్'

- పులివెందుల పాలిటిక్స్‌లో కొత్త ట్రెండ్
- 'కడప' బయట నుంచి వివేకా నిందితుల పావులు
- కడపలో వైసీపీకి చాలామంది గుడ్‌బై
- వారందరికీ హైదరాబాద్‌నుంచి ఫోన్లు
- తీవ్రస్థాయిలో బెదిరింపులు

(కడప-ఆంధ్రజ్యోతి)

కడప రాజకీయం అంటే ఒకప్పుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబం గుర్తుకు వచ్చేది. తమ్ముడు వివేకానందరెడ్డితో కలిసి ఆ జిల్లాపై ఆయన తనదైన మార్కు చూపించారు. ఆపదలో ఉండి ఇంటి గడప తొక్కినవారి సమస్యలు తీర్చేవారు. అందువల్ల రాజశేఖరరెడ్డి, వివేకాల కోసం జనం, కార్యకర్తలు ప్రాణంపెట్టి పనిచేసేవారు. ఇదంతా గతం. వివేకానందరెడ్డి హత్య తర్వాత పులివెందుల పాలిటిక్స్ ఒక్కసారిగా మారిపోయాయి. అప్పట్లో అభిమానంతో ఓట్లు రాబట్టుకుంటే, ఇప్పుడు బెదిరింపులతో ఓట్లు సాధించే ప్రయత్నాలకు హైదరాబాద్ నుంచి వేగంగా పావులు కదులుతున్నట్టు సమాచారం. వివేకానంద హత్య కేసు నిందితుల్లో వైఎస్ భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డికి కండిషన్ బెయిల్ కావడంతో వారు హైదరాబాద్‌లో ఉన్నారు. ఇండిపెండెంట్‌గా దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి కడప ఎంపీ స్థానానికి నామినేషన్ వేశారు. అయితే ప్రమాణపత్రం దాఖలు చేయడానికి ఆయన హాజరు కాకపోవడంతో నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. దేవిరెడ్డి హైదరాబాద్‌లోనే ఉంటూ కడప జిల్లా రాజకీయాల్లో తనదైన శైలిలో పావులు కదుపుతున్నారని అంటున్నారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారిని గుర్తించి నేరుగా ఆయన ఫోన్‌లో టచ్‌లోకి వెళ్లి బెదిరింపులకు పాల్పడుతున్నారని చెబుతున్నారు. 'మళ్లీ జగనే సీఎంగా ఉంటాడు. మీరు పార్టీ మారి ఎందుకు ఇబ్బంది పడతారు. తిరిగొచ్చి పార్టీలో కొనసాగండి. మీకు నేనున్నా' నంటూ బెదిరిస్తున్నారని సమాచారం. పులివెందుల, కడప, కమలాపురం, జమ్మలమడుగు, బద్వేల్, మైదుకూరుకు చెందిన కొందరు వైసీపీ నేతలు టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధం కాగా.. ఆయన నేరుగా వారికి ఫోన్ చేసి తనదైన స్టైల్లో బెదిరింపులకు దిగడంతో వారు పార్టీ మారడం విరమించుకున్నారని ప్రచారం సాగుతోంది. కడపలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా పదవీ కాలంలో అభివృద్ధి కన్నా అక్రమాలు, కబ్జాలు, దందాలే ఎక్కువ చేశారని ఆరోపణలు ఉన్నాయి. దీనిని సహించలేక కొందరు నేతలు టీడీపీలో చేరేందుకు సిద్ధమవగా.. హైదరాబాద్ నుంచి ఆయన ఫోన్ చేయడంతో ఆగిపోయారని అంటున్నారు. ఇక ఈయన అనుచరులు పులివెందులలో మరింతగా రెచ్చిపోతున్నారని అంటున్నారు.

పోలీస్ బాస్‌గా హరీశ్ గుప్తా

- బాధ్యతలు స్వీకరించిన 1992బ్యాచ్ ఐపీఎస్
- ఫిర్యాదులు రావడంతో రాజేంద్రనాథ్‌రెడ్డి తొలగింపు
- స్థానికత కారణంగా ద్వారకాకు దక్కని అవకాశం
- మాదిరెడ్డి పేరు కూడా ఈ కారణంగానే పక్కకు...
- జమ్మూకు చెందిన గుప్తాను ఎంపిక చేసిన ఈసీ
- అనంతపురం డీఐజీ అమ్మిరెడ్డిపై బదిలీ వేటు



ఇంచార్జి డీజీపీ బాగ్చీ, డీజీపీ హరీశ్ గుప్త కరచాలనం

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి)/ అనంతపురం క్రైమ్ : రాష్ట్ర నూతన డీజీపీగా హరీశ్ కుమార్ గుప్తా నియమితులయ్యారు. అధికార వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డిని బదిలీ చేసిన ఎన్నికల సంఘం, 24గంటల్లోనే కొత్త పోలీస్ బాస్‌ను ఎంపిక చేసింది. 1992 బ్యాచ్‌కు చెందిన గుప్తాను ఎంపిక చేసింది. ఇదే బ్యాచ్‌కు చెందిన కేవీ రాజేంద్రనాథ్ రెడ్డిపై ఆదివారం ఈసీ వేటు వేసింది. ఆయన స్థానంలో నియమించేందుకు ముగ్గురు డీజీపీ ర్యాంకు అధికారుల పేర్లు పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అడిగింది. సీనియారిటీలో ముందున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు, పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న మాదిరెడ్డి ప్రతాప్‌తోపాటు హరీశ్ గుప్తా పేరును రాష్ట్ర ప్రభుత్వం ఈసీకి పంపింది. వీరిలో గుప్తాను ఈసీ ఎంపిక చేసింది. సోమవారం సాయంత్రం ఐదు గంటల్లోపు బాధ్యతలు తీసుకోవాలని ఆదేశాల్లో పేర్కొనడంతో మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఇంచార్జి డీజీపీ శంకబ్రత బాగ్చి నుంచి గుప్తా బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్లుగా రాష్ట్ర హోంశాఖ కార్యదర్శిగా ఉన్న ఆయన, కొన్ని నెలలుగా జైళ్లశాఖ డీజీగా అదనపు బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. డీజీపీగా రాజేంద్రనాథ్ రెడ్డి కొనసాగితే ఎన్నికలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగే అవకాశాల్లేవని ప్రతిపక్షాలు ఈసీకి ఫిర్యాదు చేశాయి. పలువురు సీనియర్లను సీఎం జగన్ పక్కనబెట్టి సొంత జిల్లాకు చెందిన రాజేంద్రనాథ్ రెడ్డికి డీజీపీ పోస్టు ఇవ్వడం వెనుక ఉద్దేశం ఇదేనని అనుమానం వ్యక్తం చేశాయి. ఎన్నికల్లో వైసీపీకి మేలు చేసేలా వ్యవహరిస్తున్న ఆయనను మార్చాలని టీడీపీ, బీజేపీ, జనసేన పలుమార్లు విన్నవించడంతో పోలింగ్‌కు వారం ముందు ఈసీ పక్కన బెట్టింది. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యే వరకూ ఆయనను విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో జరిగిన కొత్త పోలీస్ బాస్ ఎంపిక ప్రక్రియలో సీనియారిటీ ప్రాతిపదికన 1990బ్యాచ్‌కు చెందిన ద్వారకా తిరుమల రావు, ఆ తర్వాతి బ్యాచ్‌కు చెందిన అంజనా సిన్హా, మాదిరెడ్డి ప్రతాప్ పేర్లను తొలుత రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. అధికారుల ట్రాక్ రికార్డు పరిశీలించగా అంజనా సిన్హాపై విచారణ పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆమె పేరు తప్పించి 1992బ్యాచ్‌కు చెందిన హరీశ్ కుమార్ గుప్తా పేరు చేర్చింది. ఈ మూడింటిని పరిశీలించిన ఎన్నికల కమిషన్, ద్వారకా తిరుమల రావు స్థానికుడు కావడంతో ఆయన పేరును పరిశీలనకు తీసుకోలేదు. రాజేంద్రనాథ్ రెడ్డి ఇదే రాష్ట్రానికి చెందిన వ్యక్తి అయినందునే ఆరోపణలు వచ్చాయని గుర్తించడంతో ఈ వైఖరి తీసుకుంది. మాదిరెడ్డికి శాంతి భద్రతల నిర్వహణలో అనుభవం తక్కువ అని ఈసీ భావించింది. పైగా ఆయన స్థానికుడు. దీంతో జమ్మూ ప్రాంతానికి చెందిన హరీశ్ కుమార్ గుప్తాను ఎంపిక చేసినట్లు తెలిసింది.

అనంత డీఐజీ అమ్మిరెడ్డిపై వేటు..

అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డిపై ఈసీ బదిలీ వేటువేసింది. తక్షణమే ఆయనను తప్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి విధులూ ఆయనకు అప్పగించవద్దని సూచించింది. వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ అమ్మిరెడ్డిపై ప్రతిపక్షాలు ఈసీకి ఫిర్యాదు చేశాయి. ధర్మవరంలో బీజేపీ కార్యకర్తపై వైసీపీ గూండాలు చేసిన దాడి అసలు పోలీసింగ్ అనేది రాష్ట్రంలో ఉందా అనే ప్రశ్నను బలంగా ముందుకు తెచ్చింది. ఈ ఘటన గురించిన వివరాలను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ధర్మవరం పర్యటనకు వచ్చినప్పుడు, ఎన్డీఏ నేతలు ఆయనకు వివరించారు. కేంద్ర హోం మంత్రి పర్యటన ముగిసిన 24గంటల్లోనే అమ్మిరెడ్డి బదిలీ కావడం గమనార్హం. ఈ చర్య ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అధికారుల్లో భయాన్ని పుట్టించింది. ఇప్పటికే అనంతపురం ఎస్పీ అన్బురాజన్‌ను బదిలీ చేసి, ఆయన స్థానంలో అమిత్ బర్దార్‌ను ఈసీ నియమించింది.

అనంత డీఐజీ పోస్టుకు మూడు పేర్లు

అనంతపురం డీఐజీ అమ్మిరెడ్డిని బదిలీ చేసిన ఈసీ ముగ్గురి పేర్లు పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అడిగింది. డీఐజీ ర్యాంకు అధికారులైన గోపీనాథ్ జెట్టి(లీగల్), రాజకుమారి(బెటాలియన్స్), షేముషి బాజ్‌పాయ్(వీ అండ్ ఈ) పేర్లు సోమవారం ఈసీకి ఏపీ సీఎస్ పంపారు. ఆ ముగ్గురిలో ఒకరిని ఎంపిక చేసి మంగళవారం నియమించే అవకాశం ఉంది. కర్నూలు ఎస్పీగా గతంలో ఉప ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించిన జెట్టి అంతకు ముందు తిరుపతి ఎస్పీగా సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు. సుదీర్ఘ కాలం టీటీడీ చీఫ్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారిగా పనిచేసిన ఆయనకు అనంతపురం రేంజ్ పరిధిలోని శాంతి భద్రతలపై అవగాహన, పట్టు ఉన్నాయి. ఆయనతోపాటు గత ఎన్నికల్లో విజయనగరం ఎస్పీగా పనిచేసిన రాజకుమారి, రాజమండ్రి ఎస్పీగా పనిచేసిన షేముషికి ఎన్నికల ప్రక్రియపై అవగాహన ఉంది.

మీ డబ్బులొద్దూ.. మీకు ఓటేయనూ వద్దూ..!

- వైసీపీ నేతలపై మండిపడ్డ 105 ఏళ్ల వృద్ధురాలు
- ఇంటి దగ్గర ఓటింగ్‌కు 4వేలు ఎరచూపినా తిరస్కరణ



వైసీపీకి ఓటు వేయలేదని చెప్తున్న వృద్ధురాలు హుస్సేన్‌బీ

కనిగిరి, మే 6: "మీ డబ్బులొద్దూ.. మీ పార్టీకి ఓటేయనూ వద్దూ" అంటూ వైసీపీ నేతలపై 105 ఏళ్ల వృద్ధురాలు మండిపడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రకాశం జిల్లా కనిగిరి మండలం చింతలపాలెంలో షేక్ గోగులపల్లి హుస్సేన్‌బీ వయోరీత్యా ఇంటి వద్దే ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల అధికారులు అనుమతిచ్చారు. కనిగిరి మండలంలో 14 మంది ఇదే తరహాలో తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. హుస్సేన్‌బీకి 105 ఏళ్లు వచ్చాయి. గత ఎన్నికల్లో మనుమళ్లు ఆమెను మభ్యపెట్టి వైసీపీకి వేయించారని చెబుతోంది. అందుకే ఈసారి ఎన్నికల్లో ఆ వృద్ధురాలు టీడీపీకే ఓటేయాలని నిశ్చయించుకుంది. ఇంటి వద్దనే ఓటేసేందుకు అనుమతి రావటంతో వైసీపీ నేతలు ఆమెను కలిసి తమ పార్టీకి ఓటు వేస్తే రూ.4 వేలు ఇస్తామని ఆశ చూపారు. దీంతో ఆమె వారి మీద ఆగ్రహం వ్యక్తం చేసినట్టు స్థానికులు చెప్తున్నారు. సోమవారం ఆ వృద్ధురాలిని 'ఆంధ్రజ్యోతి' పలకరించగా.. జరిగినదంతా వివరించింది. 'నాకు ఎన్టీఆర్ అంటే అభిమానం.. టీడీపీకి ఓటేస్తే మా ఊరు బాగుపడుతుంది. అందుకే వైసీపీ వాళ్లకు మీ డబ్బులొద్దూ.. మీ పార్టీ వద్దూ అని చెప్పా. ఏంటంటా నన్నేమైనా చేస్తారా..? కాటికి కాళ్లుచాపుకుని ఉన్నాను' అని ధైర్యంగా చెప్పింది.

'మన ప్రభుత్వం' మాకేం చేసింది!

- సీఎం సతీమణికి సొంత గడ్డ కడపలో మహిళల ప్రశ్నల పరంపర

కడప, మే 6(ఆంధ్రజ్యోతి): "మన ప్రభుత్వం అంటున్నారు. కానీ, మాకేం చేశారు? అమ్మ ఒడి రాలేదు. ఇళ్ల పట్టాలు ఇవ్వలేదు" అని సీఎం జగన్ సతీమణి భారతి ముందు ఆయన సొంత నియోజకవర్గం పులివెందులకు చెందిన మహిళలు వాపోయారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా భారతి గత కొన్ని రోజులుగా ఇంటింటికీ తిరుగుతూ వైసీపీకి ఓటేయాలని కోరుతున్నారు. ఈ క్రమంలో సోమవారం పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట మండలం బాలతిమ్మాయపల్లెలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మొదట గ్రామంలోని కొంతభాగం ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు. అనంతరం ప్రచార రథం ఎక్కి పలు ప్రాంతాల్లో పర్యటించారు. సీఎం జగన్‌కు, ఎంపీ అవినాశ్‌కు ఓట్లు వేసి మరోసారి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. సుదర్శనమ్మ అనే మహిళ తన కుమారుడికి గుండె జబ్బు ఉందని, ఆపరేషన్ చేయించాలని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. దీంతో భారతి మళ్లీ మన ప్రభుత్వం వస్తుంది న్యాయం చేస్తామని అన్నారు. అందుకు ఆమె స్పందిస్తూ "మన ప్రభుత్వం వచ్చినా.. కనీసం మా కుటుంబానికి అమ్మఒడి రాలేదు. ఇంటి పట్టా ఇవ్వలేదు. మాకు మాత్రం ఏ న్యాయం జరగలేదు" అని భారతికి వివరించారు. దీంతో భారతి తన వ్యక్తిగత కార్యదర్శిని పిలిచి వివరాలు తీసుకోమన్నారు. మీకు తప్పకుండా న్యాయం చేస్తామని ఆమెకు హామీ ఇచ్చారు. అనంతరం రమేశ్ అనే వ్యక్తి మాట్లాడుతూ.. ప్రమాదంలో గాయపడి అనారోగ్యం పాలయ్యానని, ఆర్థికసాయం చేయాలని అభ్యర్థించారు. ఆయనకు కూడా మన ప్రభుత్వం వస్తూనే న్యాయం చేస్తామని భారతి హామీ ఇచ్చారు. ఇంటింటి ప్రచారంలో ఓట్లు అభ్యర్థిస్తున్న సమయంలో అనేక మంది అర్హులం అయినప్పటికీ ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలు విన్న భారతి.. మళ్లీ మన ప్రభుత్వం వస్తుంది మీకు తప్పక న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సోమవారంతో పులివెందుల నియోజకవర్గంలో భారతి ప్రచారం ముగిసిందని వైసీపీ వర్గాలు తెలిపాయి.

కోడ్ చాటుగా నియామకాలు!

- ఏపీటీడీసీలో ఉద్యోగాలకు తెలంగాణలో ఇంటర్వ్యూలు
- ఓ ప్రైవేటు హోటల్స్ అసోసియేషన్ వెబ్‌సైట్‌లో ప్రకటన
- రహస్యంగా హైదరాబాద్‌లోని మృగవని రిసార్ట్స్‌లో ఇంటర్వ్యూలు
- ఆ రిసార్టు ఏపీటీడీసీ ఉన్నతాధికారి సతీమణిదే
- ఈసీకి ఉద్యోగ సంఘాల నేతల ఫిర్యాదు

విజయవాడ, మే 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా.. పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)లో ఉద్యోగ నియామకాలు చేపట్టడంపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఏపీటీడీసీ ఉద్యోగుల సంఘం ఫిర్యాదు చేసింది. ఈ ఘటనతో మరోమారు ఏపీటీడీసీ ఉన్నతాధికారులు వివాదంలో చిక్కుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే.. పర్యాటక కాటేజీల ఆధునికీకరణ కోసం విజయవాడలోని ఏపీటీడీసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి పాత తేదీలతో అగ్రిమెంట్లు చేసుకోవటం వివాదాస్పదమైన తర్వాత.. తాజాగా నియామకాలు చేపట్టడం అత్యంత వివాదాస్పదంగా మారింది. సహజంగా ఉద్యోగ నియామకాలకు సంస్థ వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్ ఇస్తుంటారు. లేదంటే పత్రికలలో నోటిఫికేషన్ ఇస్తుంటారు. దీనికి భిన్నంగా ప్రైవేటు హోటల్స్ అసోసియేషన్ వెబ్‌సైట్‌లో ప్రకటన ఇవ్వటం గమనార్హం. తిరుమల(తిరుపతి)లో డైరెక్ట్ ఎంప్లాయ్‌మెంట్ పేరుతో ఈ నోటిఫికేషన్ ఇచ్చారు. ఈనెల 3వ తేదీ తుది గడువుగా పేర్కొన్నారు. ప్రకటనలో ఏపీటీడీసీ డైరెక్ట్ ఎంప్లాయిమెంట్ అని పేర్కొన్నప్పటికీ, హైరింగ్ పేరుతో కేటగిరీలను నిర్దేశించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నేరుగా సంప్రదించవచ్చునని 8333922933, 8333922626 నంబర్లను ఇచ్చారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గుట్టు చప్పుడు కాకుండా నియామకాలు చేపడదామనుకున్నారు. అయితే, అభ్యర్థులకు ఇంటర్వ్యూలను హైదరాబాద్‌లోని మృగవని రిసార్ట్స్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించడంతో ఈ బాగోతం బయటపడింది. ఆ రిసార్ట్స్ ఏపీటీడీసీలోని ఓ ఉన్నతాధికారి సతీమణిదని సమాచారం. చివరికి ఏపీటీడీసీ ఉద్యోగుల సంఘానికి విషయం తెలియడంతో రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం విచారించి నిర్ణయం తీసుకోవటమే మిగిలి ఉంది.

ల్యాండ్ టైటిలింగ్ ముసుగులో దోపిడీ

- క్రిటికల్ రివర్ కంపెనీకి రూ.100 కోట్లు దోచిపెట్టిన జగన్: నీలాయపాలెం

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): ల్యాండ్ టైటిలింగ్ చట్టం ముసుగులో సుమారు రూ.100 కోట్లకుపైగా కాంట్రాక్టును క్రిటికల్ రివర్ సంస్థకు కట్టబెట్టినట్లు వెల్లడైందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 'క్రిటికల్ రివర్ సంస్థ సోమవారం తెలుగు దినపత్రికల్లో బహిరంగ ప్రకటన ఇచ్చింది. రివర్స్ టెండరింగ్ ఆధారంగా తమకు ల్యాండ్ సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టు వచ్చిందని పేర్కొంది. దీంతో రివర్స్ ముసుగులో దోపిడీ జరిగిందని వెల్లడైంది. ప్రజల ఆస్తి క్రయ విక్రయ డిజిటలైజ్ పత్రాలను నేషనల్ ఇన్‌ఫర్మాటిక్స్ సెంటర్(ఎన్ఐసీ)లో భద్రపరుచుకోవడానికి ఇబ్బంది ఏమిటి? అన్న ప్రశ్నకు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి జవాబు లేదు. ఉచితంగా ఎన్ఐసీ ఇస్తామన్న సాఫ్ట్‌వేర్‌ను కాదని, 1996లో పెట్టిన కార్డ్ సిస్టం కంటే కార్డ్ 2.0 కింద మరింత అభివృద్ధి చేసిన సాఫ్ట్‌వేర్ కావాలని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటన ఇచ్చి సంస్థలను ఆహ్వానించింది. కేవలం రూ.49 కోట్ల టర్నోవర్ మాత్రమే ఉన్న ఈ సంస్థకు రెండు కాంట్రాక్టుల పేరుతో మొత్తం రూ.134 కోట్లు కట్టబెట్టారు. ఆ సంస్థ చేతికి రాష్ట్రంలోని పౌరుల ఆస్తి పత్రాల డిజిటలైజేషన్, స్టోరేజీ, సెక్యూరిటీ ఇచ్చేస్తున్నారంటే భయంతో పాటు మన ఆస్తులు ఏమై పోతాయోనన్న వణుకు నిలువెల్లా ఆవరిస్తోంది. ప్రజల ఆస్తుల పత్రాలకు సంబంధించిన భద్రత బాధ్యత అంత చిన్న సంస్థకు ఎలా అప్పగిస్తారు? కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దీన్ని రద్దు చేస్తాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు అనుబంధంగా ఇచ్చిన ప్రతి పని టెండరూ ఆటోమేటిక్‌గా రద్దవుతుంది' అని విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

జగన్ చట్టం చూసి ఐఏఎస్‌లూ భయపడుతున్నారు

- కేంద్రం చెప్పింది ఒకటి... జగన్ చేసింది ఒకటి: టీడీపీ

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తెచ్చిన భూహక్కు చట్టం చూసి ఐఏఎస్ అధికారులు కూడా భయపడిపోతున్నారని టీడీపీ వ్యాఖ్యానించింది. 'ముఖ్యమంత్రి కార్యాలయంలో పనిచేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్ వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టానికి తాను బాధితుడినని బహిరంగంగా ఎక్స్‌లో పేర్కొన్నారు. ఎంతో పలుకుబడి ఉండే ఐఏఎస్ అధికారులే ఈ చట్టానికి బాధితులుగా మారితే ఇక సామాన్య ప్రజల సంగతి ఏమిటి? వారి గోడు పట్టించుకొనే వారు ఉంటారా? వైసీపీ నేతలు సామాన్య రైతుల భూములపై వివాదం సృష్టించి వారికి హక్కులు లేకుండా చేస్తే ఆ రైతులకు ఇక ఆత్మహత్యలే గతి అవుతాయి. అందుకే ఈ దుర్మార్గ చట్టంపై మేం పోరాటం చేస్తున్నాం' అని ఆ పార్టీ అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'ఇంత భయంకరమైన చట్టం మరొకటి లేదు. ఇడుపులపాయలో జగన్ భూమి నాదని నేను ఈ చట్టం ద్వారా అమ్ముకోవచ్చు. ఇడుపులపాయ భూమి నాదని నేను ఫిర్యాదు చేసినట్లుగా జగన్‌కు తెలియకపోతే రెండేళ్ల తర్వాత ఆ భూములు నావైపోతాయి. తరతరాల నుంచి వస్తున్న భూములను కూడా అప్పనంగా కొట్టేయవచ్చు. అంత దుర్మార్గమైన చట్టం ఇది. ఈ చట్టాన్ని టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో సమర్థించారని వైసీపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. పయ్యావుల సమర్థించిన విషయాలను ఈ చట్టంలో వైసీపీ నేతలు ఉంచలేదు. వాటిని తీసేశారు. పెట్టవద్దని ఆయన చెప్పిన విషయాలను పనిగట్టుకొని చట్టంలో పెట్టారు. అందువల్లే ఇప్పుడు ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది. ఇప్పుడు ప్రజల్లో ఆగ్రహం పెల్లుబుకుతుంటే దీనిని ఎవరిపై తోయాలా అని వైసీపీ వెతుకుతోంది' అని ఆనం విమర్శించారు.

ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

వేంపల్లె, మే 6: రాష్ట్రంలో ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ట్రిపుల్ ఐటీల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరు సంవత్సరాల సమీకృత ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఏడాది 10వ తరగతి పాసైన విద్యార్థులు 8వ తేదీ నుంచి జూన్ 25 వరకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్జీయూకేటీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

నాలుగు రోజులు వర్షాలు

- కొన్ని చోట్ల యథావిధిగా ఎండతీవ్రత.. నంద్యాలలో 46 డిగ్రీల ఉష్ణోగ్రత

అమరావతి, విశాఖపట్నం, మే 6(ఆంధ్రజ్యోతి): విదర్భ నుంచి తమిళనాడు వరకు విస్తరించిన ద్రోణి ప్రభావంతో రానున్న నాలుగు రోజులు రాష్ట్రంలో అనేక చోట్ల ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. అక్కడక్కడా భారీ వర్షాలు, అనేక చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు జల్లులు పడతాయని తెలిపింది. మంగళవారం మన్యం, అల్లూరి, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని పేర్కొంది. ఇంకా గంటకు 40 నుంచి 50 కి.మీ. వేగంతో బలమైన గాలులు వీస్తాయని తెలిపింది. అలాగే అల్లూరి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో వడగాడ్పులు వీస్తాయని తెలిపింది. మరోవైపు రాష్ట్రంలోని ఎండ తీవ్రత, వడగాడ్పుల ప్రభావం కొనసాగింది. ప్రధానంగా రాయలసీమలో ఎక్కువ ప్రాంతాల్లో గాడ్పులు వీచాయి. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే నాలుగు నుంచి ఏడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. సోమవారం దేశంలో అత్యధికంగా నంద్యాలలో 46 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కాగా, విదర్భ నుంచి తెలంగాణ, రాయలసీమ, కర్ణాటక మీదుగా తమిళనాడు వరకూ కొనసాగుతున్న ఉపరితల ద్రోణి సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో విస్తరించింది. ఇదే సమయంలో రాష్ట్రంలో ఎండ తీవ్రత కొనసాగడంతో వాతావరణ అనిశ్చితి నెలకొంది. ఈ ప్రభావంతో సోమవారం ఉత్తరాంధ్రలో పలుచోట్ల ఈదురుగాలులు వీచాయి. అక్కడక్కడా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి.

సర్కారుకు ఈసీ షాక్!

సీఎస్ జోరుకు ఈసీ కళ్లెం

- ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్ము విడుదలకు బ్రేక్
- మార్చి 6వ తేదీనే బటన్ నొక్కిన జగన్
- సొమ్ము విడుదల చేయకుండా జాప్యం
- ఎన్నికల ముందు రైతుల ఖాతాల్లో వేసే ఎత్తుగడ
- ఏప్రిల్ 19న ఈసీ అనుమతి కోరుతూ లేఖ
- పోలింగ్ అయ్యే వరకు ఆగాలన్న ఈసీ
- జగన్ డ్రామాతో కరువు ప్రాంత రైతులకు నష్టం
- నాడు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి.. టీడీపీ రుణమాఫీకి అడ్డుపడిన వైసీపీ



అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వానికి ఎన్నికల కమిషన్ షాకిచ్చింది. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీకి బ్రేక్ వేసింది. పోలింగ్ పూర్తయ్యేదాకా పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేసుకోవాలని చెప్పింది. వాస్తవానికి కరువు ప్రాంత రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీకి సంబంధించిన నిధులు విడుదల చేస్తూ మార్చి 6వ తేదీనే సీఎం జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కారు. బటన్ అయితే నొక్కారు కానీ రైతుల ఖాతాల్లో డబ్బులు మాత్రం జమ చేయలేదు. ప్రభుత్వం దగ్గర డబ్బుల్లేక రైతులకు ఇవ్వడం లేదని అంతా అనుకున్నారు. కానీ ఎన్నికల ముందు రైతుల ఖాతాల్లో నిధులు జమచేసి, రాజకీయంగా ప్రయోజనం పొందే ఎత్తుగడ వేసిందని ఆతర్వాత చర్యలను బట్టి అర్థమవుతోంది. 2023 ఖరీఫ్ సీజన్‌లో కరువు కారణంగా నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేస్తూ మార్చి 6న సీఎం జగన్ బటన్ నొక్కినా.. మార్చి 16 వరకూ ఆర్థిక శాఖ నిధులు విడుదల చేయలేదు. మార్చి 16న కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో నిధుల విడుదలకు బ్రేక్ పడింది. దీంతో పోలింగ్‌కు ముందు రైతుల ఖాతాలకు చెల్లింపులు జరిపి, రాజకీయంగా లబ్ధి పొందేందుకు ప్రభుత్వ పెద్దలు రాష్ట్రస్థాయి స్ర్కీనింగ్ కమిటీ ద్వారా కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి కోరారు. అయితే పోలింగ్ పూర్తయ్యే వరకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపుల ప్రక్రియను వాయిదా వేయాలని ఎన్నికల కమిషన్ రాష్ట్ర అధికారులను ఆదేశించింది. ఈమేరకు రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి తాజాగా సమాచారం పంపారు. అయితే 2019 ఎన్నికల సమయంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం రైతు రుణమాఫీ 4,5 కిస్తీల సొమ్మును కోడ్ వచ్చేలోపే విడుదల చేసినా.. రైతులకు లబ్ధి చేకూరకుండా చేసేందుకు వైసీపీ నేతలు ఈసీకి ఫిర్యాదులు చేశారు. కానీ ఇప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ విషయంలో ఎవరూ ఫిర్యాదు చేయకున్నా.. స్ర్కీనింగ్ కమిటీ ప్రతిపాదనను ఈసీ తిరస్కరించింది. ఎన్నికల్లో లబ్ధి కోసమే పోలింగ్ ముందు బటన్ నొక్కి, రైతుల ఖాతాలకు నగదు చెల్లింపుల్లో ప్రభుత్వం జాప్యం చేసిందని ఈసీ గుర్తించినట్లు సమాచారం. మరోవైపు వేసవి కారణంగా తాగునీటి సరఫరా కోసం రూ.14.84 కోట్ల ఖర్చు చేసేందుకు ఈసీ అనుమతి ఇచ్చింది. అలాగే రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కింద పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులకు బీమా పథకం అమలు కోసం టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు కూడా ఈసీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే ఎవరి రాజకీయ ప్రయోజనాలకు తావివ్వకూడదని షరతు పెట్టింది.

(మొదటి పేజీ తరువాయి)

మరీ తీవ్రంగా మారింది. తామరతంపరగా సీఎస్ పలు అనుమతుల కోసం ఎన్నికల కమిషన్‌కు ఫైళ్లు పంపిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే చేయాల్సిన పనులివి. గతంలోనే బటన్ నొక్కి డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లోకి విడుదల చేయకుండా వాటిని ఇప్పుడు విడుదల చేసేందుకు ఈసీ అనుమతి కోరుతూ సీఎస్ లేఖలు రాస్తుండటం గమనార్హం. వైసీపీ పార్టీకి చెందిన కాంట్రాక్టర్లకు మేలు చేసేందుకే ఇదంతా చేస్తున్నారన్నా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. వాస్తవానికి ఇప్పటికే అమల్లో ఉన్న నగదు బదిలీ పథకాలను కోడ్ సమయంలో కూడా కొనసాగించేందుకు అభ్యంతరం ఉండదు. అయితే లబ్ధిదారులందరూ పాతవారే అయి ఉండాలి. జగన్ నగదు బదిలీ పథకాలన్నీ ఎప్పటికప్పుడు కొత్త లబ్ధిదారులను చేరుస్తూ, గతంలో ఉన్న లబ్ధిదారులను తొలగిస్తూ అమలయ్యేవే. అఆమ్మఒడి, చేయూత తదితర పథకాలకు సంబంధించి ప్రతి విడత కొత్త లబ్ధిదారులుంటారు. అలాంటప్పుడు ఈ తరహా పథకాల అమలును ఎన్నికల కోడ్ సమయంలో అనుమతించే అవకాశం ఉండదు. ఈ కారణంగానే ఇటీవల విద్యాదీవెన పథకానికి సంబంధించి రూ.610 కోట్లు విడుదల చేయాల్సి ఉందని సీఎస్ చేసిన విజ్ఞప్తిని ఎన్నికల కమిషన్ అంగీకరించలేదు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత అమలు చేయవచ్చని ఈసీ తెలిపింది. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం రుద్రమకోట గ్రామంలో పురావస్తు తవ్వకాలకు సంబంధించి అనుమతి ఇవ్వాలని, పరిశ్రమలశాఖకు సంబంధించి ఎన్నికల కోడ్‌కు ముందు భూములు కేటాయించామని, ఆ ప్రక్రియను కొనసాగించేందుకు అనుమతించాలని, వైఎస్ఆర్ చేయూత కింద నాలుగో విడత కోసం రూ.5021 కోట్లు లబ్ధిదారులకు విడుదల చేసేందుకు, వైఎస్ఆర్ ఆసరా పథకం కింద రూ.1843 కోట్లు విడుదల చేసేందుకు, ఈబీసీ నేస్తం మూడో విడత కోసం రూ.629 కోట్లు విడుదల చేసేందుకు సమ్మతించాలని ఎన్నికల కమిషన్‌కు సీఎస్ ప్రతిపాదనలు పంపారు. అయితే సీఎస్ పంపిన ప్రతిపాదనలు సమగ్రంగా లేకపోవడంతో వాటికి సంబంధించి కొన్ని వివరాలను పంపాలని సీఎస్‌కు ఈసీ తిప్పి పంపింది. లబ్ధిదారులు కొత్తవారా? పాతవారా? ఆయా పథకాలకు సంబంధించి విడుదల చేయాల్సిన పీరియడ్ ఏది? ఏ విధానంలో పంపిణీ చేస్తారు? ఈ పంపిణీ అత్యవసరంగా జరగాల్సిన అవసరం ఏమైనా ఉందా అనేవాటిపై వివరాలను చెప్పాలని స్పష్టం చేసింది.

జగన్‌కు ఓటమి తప్పదు

- మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు మల్లెల వెంకట్రావు



పిడుగురాళ్ల, మే 6: వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో దళితుల పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారయిందని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు అన్నారు. సోమవారం పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో మాలల సామాజికవర్గం అభివృద్ధికి నోచుకోలేదని, ఓటు వేసిన అందరికీ జగన్ చుక్కలు చూపిస్తూ రాష్ట్రాన్ని తాకట్టు పెట్టే పరిస్థితి తీసుకు వచ్చారన్నారు. జగన్‌కు ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావుకు మాలల సామాజికవర్గం అండగా ఉంటుందని, సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు ఓటువేసి గెలిపించాలన్నారు.

మాదిగలను దగా చేసిన జగన్

- వైసీపీకి ఓటు వేస్తే దళితుల సంక్షేమానికి ముప్పు: మందకృష్ణ



అనంతపురం అర్బన్/ఆలూరు, మే 6: వైఎస్.జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో దళితులను దగా చేశాడని, అలాంటి వ్యక్తిని మరోసారి గెలిపిస్తే దళితుల సంక్షేమానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సోమవారం ఆయన అనంతపురం, కర్నూలు జిల్లా ఆలూరులో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతపురంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో మాదిగలతోపాటు అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ఆలూరు టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మందకృష్ణ మాట్లాడుతూ... నాలుగున్నర ఏళ్ల జగన్ పాలనలో దళితులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. దళితుల సంక్షేమానికి కేటాయిస్తున్న సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టించారన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో టీడీపీ అధినేత చంద్రబాబు మాదిగలకు న్యాయం చేసే విధంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఎస్సీ వర్గీకరణ గురించి మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. ఎన్డీయే కూటమి పార్టీలైన బీజేపీ, జనసేన, టీడీపీలకు మాదిగలు అండగా ఉండాలని సూచించారు. జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు వారం రోజుల పాటు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు కష్టపడాలన్నారు.

ద్వారంపూడి బినామీపై ఐటీ దాడులు..?

రూ. 25 కోట్లకు పైగా అక్రమ ఆదాయం గుర్తింపు

కాకినాడ, మే 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సిటీ వైసీపీ అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి ఎన్నికల వేళ పెద్ద షాక్ తగిలింది. ద్వారంపూడి అనుచరుడిగా భావిస్తున్న వ్యక్తిపై నాలుగు రోజులుగా ఐటీ సోదాలు జరుగుతున్నాయి. ఈ సోదాల్లో రూ.25 కోట్లకు పైగా లెక్కల్లో చూపని అక్రమ ఆదాయాన్ని గుర్తించినట్లు తెలిసింది. కొన్ని పత్రాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని సమాచారం. ఐదేళ్లలో ద్వారంపూడిని అడ్డం పెట్టుకుని గ్రావెల్, చెరువులు, మట్టి తవ్వకాల్లో కూడగట్టిన ఈ డబ్బంతా అక్రమ సంపాదనగా భావిస్తున్నారు. ఈ లావాదేవీల్లో ద్వారంపూడికి సంబంధం ఉందనే విషయమై ఐటీ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శాంతి సాధ్యమేనా?

భయపడినట్టే జరుగుతోంది. రాఫా నగరంనుంచి తక్షణమే ఓ లక్షమంది పాలస్తీనియన్లను ఖాళీచేయించాలని ఇజ్రాయెల్ నిర్ణయించుకుంది. నగరంలోకి చొరబడేందుకు సైన్యానికి అత్యున్నతస్థాయి అనుమతులు లభించినందున పౌరులను ఖాళీచేయించే పనిలో సైన్యం ఉన్నదని వార్తలు వస్తున్నాయి. ఇజ్రాయెల్ సైన్యానికీ, హమాస్‌కు మధ్య భీకర పోరు ఆరంభం కాబోతున్నదన్న భయంతో రాఫానగరం నుంచి ప్రజలు తరలిపోతున్నారు. చేతికి దొరికినవాహనాల్లోనూ, గాడిదలమీదా, నడుచుకుంటూ ప్రజలు కదిలిపోతున్నారు. హమాస్‌తో కాల్పుల విరమణకు సంబంధించిన చర్చలను ప్రభావితం చేయడానికీ, దానిని లొంగదీయడానికీ ఇజ్రాయెల్ ఈ రాఫా నిర్ణయాన్ని ప్రకటించిందని ఓ వాదన. రాఫా జోలికి వస్తే ఊరుకొనేది లేదనీ, ఆ నగరంలోకి అడుగుపెడితే ఇక మాటలుండవని హమాస్ హెచ్చరిస్తోంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమీన్ నెతన్యాహూకు ఫోన్ చేసి, పదిలక్షలమంది పాలస్తీనా శరణార్థులు తలదాచుకుంటున్న ఈ నగరంలోకి సైన్యాన్ని పంపి, మారణహోమానికి పాల్పడవద్దని హితవుచెప్పారట. వాళ్ళిద్దరూ నిజంగా ఏమి మాట్లాడుకున్నారో తెలియదు కానీ, నెతన్యాహూ ఎవరిమాటా వినడని అందరికంటే ఎక్కువగా అమెరికా అధ్యక్షుడికే ఎరుక.

పరిమితస్థాయి చొరబాటు మాత్రమే జరుగుతుందని వార్తలు వస్తున్నప్పటికీ వాటిని ఏమాత్రం విశ్వసించలేం. వందలాదిమంది సైనికులు మారణాయుధాలతో రాఫాలోకి అడుగుపెడితే, వారు రాక్షసంగా వ్యవహరించడం, రెండుపక్షాల పోరులో సామాన్యులు సమిధలు కావడం ఖాయం. పైగా, హమాస్ యోధానుయోధులంతా ఈ నగరంలోనే ఉన్నారని, రాఫా వారి కీలకమైన స్థావరమని ఇజ్రాయెల్ అంటోంది. నాలుగు హమాస్ బెటాలియన్లకు ఈ నగరం స్థావరమని, వీరికితోడు గత ఆర్నెల్లయుద్ధంలో ఇతర ప్రాంతాలనుంచి పారిపోయివచ్చిన వేలాదిమంది హమాస్ ఫైటర్లు ఇక్కడే తలదాచుకుంటున్నారని ఇజ్రాయెల్ వాదిస్తోంది. అందువల్ల ఇప్పటివరకూ గ్రౌండ్ ఆపరేషన్స్ చేపట్టని కీలకమైన నగరంలోకి ఇజ్రాయెల్ సేనలు ప్రవేశిస్తే పరిస్థితులు ఎంత తీవ్రంగా ఉంటాయో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. ఈ కారణంగానే అమెరికా సహా చాలా యూరప్ దేశాలు ఇజ్రాయెల్ సాగించబోయే విధ్వంసకాండతో తమకు అప్రదిష్టవస్తుందని భయపడుతున్నాయి, కూడదని హితవుచెబుతున్నాయి.

ఈజిప్ట్, ఖతార్ మధ్యవర్తిత్వంలో, హమాస్–ఇజ్రాయెల్‌మధ్య సాగుతున్న చర్చలు ఫలించాయని, కాల్పుల విరమణ ఒప్పందానికి హమాస్ అంగీకరించిందని వార్తలు వస్తున్నాయి. రాఫానుంచి తొలివిడతగా లక్షమందిని ఖాళీచేయించి, తన సైన్యాన్ని ప్రవేశపెట్టేందుకు ఇజ్రాయెల్ సిద్ధపడటంతోనే హమాస్ దిగివచ్చిందని కొందరివాదన. కాల్పుల విరమణకు హమాస్ సానుకూలంగా ఉన్నదని తెలిసి, అది తన నిర్ణయాన్ని ప్రకటించేలోగా నెతన్యాహూ రాఫామీద పడ్డారని మరోవాదన. కాల్పులవిరమణకు లొంగినపక్షంలో రాఫాలోకి చొరబడటం ఇక అసాధ్యమైపోతుంది. ఆ నగరం సంగతి తేల్చకుండానే ఇజ్రాయెల్ సైనికులు వెనక్కుమళ్ళాల్సిరావచ్చు. అందువల్లనే, రాఫా విషయంలో రాజీపడవద్దనీ, యుద్ధంలో మనదే విజయమని రేపొద్దున ప్రజలకు చెప్పుకోవాలంటే అందులోకి చొరబడి, హమాస్‌ను ఊచకోతకోయాల్సిందేనని నెతన్యాహూ మీద ఆయన మిత్రపక్షాలు తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నాయట. రాఫాలోకి అడుగుపెట్టవద్దంటూ హమాస్ చేస్తున్న హెచ్చరికలకు, అంతర్జాతీయ ఒత్తిళ్ళకు లొంగితే రచ్చగెలిచి ఇంట ఓడిపోతానని నెతన్యాహూ నమ్ముతున్నారనీ, శాంతియత్నాలు, హమాస్‌తో సంధి ఆయనకు ఈ దశలో ఇష్టంలేదని వార్తలు వస్తున్నాయి. అందువల్ల హమాస్‌మీద ఒత్తిడి తేవడానికి కాక, దానిని రెచ్చగొట్టడానికే చర్చలు ఫలించబోతున్న ఆఖరుదశలో నెతన్యాహూ రాఫా మీద పడ్డారని ఓ వాదన. కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా హమాస్ తన దగ్గరున్న బందీలందరి అప్పగింత, గాజాలోని పలుప్రాంతాలనుంచి ఇజ్రాయెల్ దళాల ఉపసంహరణ ఉంటాయని ఖతార్ ఎప్పటినుంచో అంటోంది. శాశ్వత కాల్పులవిరమణ, గాజానుంచి ఇజ్రాయెల్ పూర్తిగా వెనక్కుపోవడం, నిరాశ్రయులైనవారంతా తిరిగి ఇళ్ళకు చేరడం వంటివి హమాస్ ప్రధానంగా డిమాండ్ చేస్తోంది. ఇప్పుడు హమాస్ సరేనన్న ఒప్పందంలో ఏయే అంశాలున్నాయో, వాటికి ఇజ్రాయెల్ అంగీకరిస్తుందో లేదో తెలియదు. నెతన్యాహూ యుద్ధకండూతికి వ్యతిరేకంగా ఇంటాబయటా రేగుతున్న ఆగ్రహం ఇప్పటికే తీవ్రస్థాయికి చేరుకుంది. రాఫాను వదిలి, కాల్పుల విరమణకు సరేనని, బందీలను విడిపించుకున్న పక్షంలోనే ప్రజలు ఆయనను క్షమిస్తారు.

ఏపీలో ఏమవుతున్నదో మోదీకి తెలుసు!

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అభివృద్ధిపై పూర్తిగా దృష్టిని కేంద్రీకరిస్తే ఆంధ్రప్రదేశ్‌లో జగన్ పూర్తిగా అవినీతిపై దృష్టి కేంద్రీకరించారని, అవినీతి లేకపోతే ఆయన ఏ పనీ చేయరని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం రాజమండ్రి, అనకాపల్లి సభల్లో చేసిన విమర్శలు ప్రజలను ఆలోచింప చేస్తున్నాయి. ఆఖరుకు మద్యం, ఇసుక మాఫియాల గురించి కూడా మోదీ మాట్లాడటంతో రాష్ట్రంలో ఏం జరుగుతుదో ఆయనకు స్పష్టంగా తెలుసని అర్థమవుతోంది.

మూడు రాజధానుల నిర్మాణం పేరుతో వైసీపీ సర్కారు ఖజానాను ఖాళీచేయడం, ఒక్క రాజధాని కూడా నిర్మించలేకపోవడం, రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరానికి తాము రూ.15వేల కోట్లు ఇచ్చినా వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోవడం గురించి కూడా మోదీ, అమిత్ షాలు మాట్లాడారు. కేంద్రంలో 26 పార్టీల ఇండియా అలయెన్స్‌కు 26 సీట్లు కూడా రావని, ఇదే పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో జగన్ కూడా ఎదుర్కొంటారని అమిత్ షా రెండు రోజుల క్రితం ధర్మవరం నియోజకవర్గంలో జరిగిన ప్రచార సభలో స్పష్టం చేశారు. ఏపీలో గుండాగిరి అంతానికే కూటమిని ఏర్పరిచామని, ఇక్కడి అవినీతి ప్రభుత్వాన్ని గద్దెదించేందుకే చేతులు కలిపామని స్పష్టం చేశారు. భూ మాఫియాను అంతం చేసి, అమరావతిని మళ్లీ రాజధానిగా ఏర్పాటు చేసేందుకే తాము కలిసి పనిచేయాలని నిర్ణయించామని తెలిపారు. జూన్‌లో ఏపీలో చంద్రబాబు, కేంద్రంలో మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు తీసుకుని రెండేళ్లలో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని అన్నారు. మోదీ – చంద్రబాబు మైత్రి సూపర్ హిట్ జోడీ అని, ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ మూలంగా శరవేగంతో అభివృద్ధి జరగడం ఖాయమని ఆయన చెప్పారు. 25కు 25 ఎంపీ స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని, అసెంబ్లీలో మూడింట రెండొంతు సీట్లతో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని ఆయన రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

ఒక దేశ ప్రధానమంత్రి, హోంమంత్రి ఇలాంటి ప్రకటనలు చేయడం సాధారణ విషయం కాదు. అయిదేళ్ళ జగన్ పాలనలో దుష్కృత్యాలగురించి వారికి ఎప్పటికప్పుడూ నివేదికలు వెళుతూ ఉంటాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను చంద్రబాబు నాయుడు ప్రథమ స్థానంలో నిలిపారని, విభజన తర్వాత కూడా రాష్ట్రాన్ని ప్రగతి బాటలో నడిపారని, ఆయన చేసిన అభివృద్ధిని జగన్ అధోగతి పట్టించారని మోదీ, అమిత్ షా చెప్పిన మాటల్ని చూస్తే వారికి రాష్ట్రం గురించి ఎంతో అధ్యయనం చేశారని అర్థమవుతోంది.



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను చంద్రబాబు నాయుడు ప్రథమ స్థానంలో నిలిపారని, విభజన తర్వాత కూడా రాష్ట్రాన్ని ప్రగతి బాటలో నడిపారని, ఆయన చేసిన అభివృద్ధిని జగన్ అధోగతి పట్టించారని మోదీ, అమిత్ షా చెప్పిన మాటల్ని చూస్తే వారు రాష్ట్రం గురించి ఎంతో అధ్యయనం చేశారని అర్థమవుతోంది.

నిజానికి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ అభివృద్ధికి జగన్ కల్పిస్తున్న ఆటంకాలు స్పష్టంగానే కనిపిస్తున్నాయి. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను రద్దు చేయడం నుంచీ, పోలవరం ప్రాజెక్టుకు విఘాతం కల్పించడం వరకూ జగన్ ఒక అభివృద్ధి వ్యతిరేకిగా తనను తాను రుజువు చేసుకున్నారు. అనేక పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లాయి. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రైల్వేజోన్‌ను మంజూరు చేసినా ఈ జోన్ ముఖ్య కార్యాలయానికి జగన్ ప్రభుత్వం భూమిని కేటాయించలేదని సాక్షాత్తూ ప్రధానమంత్రే అన్నారు. 21 లక్షల మేరకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన క్రింద ఇళ్ల నిర్మాణాన్ని మంజూరు చేసినా వాటిలో సగం కూడా కట్టలేదని మోదీయే అన్నారు. జగన్ చేసిన అప్పులు, రాష్ట్ర ఖజానా ఖాళీ కావడం మోదీ చాలా కాలంగా గమనిస్తూ ఉన్నారు. కార్పొరేషన్ల పేరిట కూడా అప్పులు చేయడం, కేంద్రం ఇస్తోన్న నిధులను ఇష్టారాజ్యంగా మళ్లించడం ఆయనకు తెలుసు. అందుకే జగన్‌కు అవినీతి నిర్వహణ తప్ప ఆర్థిక నియంత్రణ తెలియదని, రాష్ట్రం అందుకే అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆయన ఘాటుగా విమర్శించారు.

నిజానికి రాష్ట్రంలో జగన్ అస్తవ్యస్థ అరాచక పాలన గురించి తెలిసిన తర్వాతే బీజేపీ తెలుగుదేశం–జనసేనలతో పొత్తు పెట్టుకోవాలని నిర్ణయించింది. చంద్రబాబు హయాంలో నంబర్ వన్‌గా ఉన్న రాష్ట్రం ఇప్పుడెందుకు అప్పుల్లో కూరుకుపోయిందని మోదీ, షాలు చేస్తున్న విమర్శలకు జగన్, ఆయన అనుయాయుల వద్ద జవాబులు లేవు.

పోనీ జగన్ తాను ఏమైనా వాగ్దానాలు నిలబెట్టుకున్నారా అంటే అదీ లేదు. అమరావతిని రాజధానిగా నిర్ణయించడాన్ని జగన్ అసెంబ్లీలో స్వాగతించారు. అధికారంలోకి రాగానే విశాఖపట్టణం, అమరావతి, కర్నూల్‌లలో మూడు రాజధానులు నెలకొల్పుతామని ప్రకటించారు. ఇవాళ చూస్తే ఏపీలో ఒక్క రాజధాని కూడా లేదు. రాష్ట్రంలో మద్యాన్ని పూర్తిగా నిషేధిస్తామని జగన్ వాగ్దానం చేశారు. కాని అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ తరఫున మద్యాన్ని అమ్మడం ప్రారంభించారు. వైసీపీ నేతల డిస్టిలరీస్‌లో తయారు చేసిన మద్యాన్నే ఈ సంస్థ అమ్ముతోంది. జగన్ అనుయాయులంతా మద్యం సిండికేట్ నడుపుతూ వేల కోట్లు వెనుకేసుకుంటున్నారు.

2023 డిసెంబర్‌లో ఆరోగ్యశ్రీ పథకాన్ని జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. కాని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీస్ హాస్పిటల్ అసోసియేషన్ (ఆశా) ఈ పథకం ద్వారా రోగులకు చికిత్స అందించకూడదని నిర్ణయించింది. అనేక ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో రోగులను చేర్చుకోవడానికి నిరాకరిస్తున్నారు. ఎందుకంటే వారికి చెల్లించాల్సిన బకాయిల్లో పది శాతం కూడా జగన్ ప్రభుత్వం చెల్లించడంలేదు.

జగన్ రాయలసీమకు చెందినవారు కనుక ఆ ప్రాంతానికైనా ఏదో ఒక మేలు చేశారనుకుంటే అది కూడా లేదు. ఈ అయిదేళ్లలో రాయలసీమను పూర్తిగా విస్మరించారు. ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి కావల్సిన పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడంలో బీజేపీ కీలక పాత్ర పోషించింది. కాని జగన్ అవినీతి, అరాచక చర్యల వల్ల గత అయిదేళ్ళల్లో ఈ ప్రాజెక్టు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. మోదీ ప్రభుత్వం రూ.15వేల కోట్లు మంజూరు చేసినప్పటికీ పోలవరం ప్రాజెక్టు స్తంభించిపోయింది. పోలవరం మాత్రమే కాదు, హంద్రీ నీవా సుజల స్రవంతి, వెలిగొండ, ప్రజలు ఏడు దశాబ్దాలుగా కలలు కంటున్న వరికపూడిసెల ప్రాజెక్టు అమలు విషయంలో జగన్ ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.

ఏపీలో ఎన్డీఏ కూటమి అటు వైసీపీ నుంచీ, ఇటు కాంగ్రెస్ నుంచీ పోటీని ఎదుర్కొంటోంది. జగన్ వ్యతిరేక ఓట్లను చీల్చేందుకు ఆయన సోదరి తీవ్రంగా యత్నిస్తున్నారు. పైకి ఇరువురూ తీవ్ర విమర్శలు చేసుకుంటున్నా, ఇద్దరూ ఒకరికి ఒకరు సహాయపడుతున్నారని ప్రధానమంత్రి మోదీ సైతం అభిప్రాయపడ్డారు. దాదాపు ఆరు దశాబ్దాల పాటు దేశాన్ని అధోగతిపాలు చేసిన కాంగ్రెస్ అవినీతిలో కూరుకుపోయింది. ఈడీ, ఈడీ అంటూ గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్ నేతల ఇళ్లలోనే ఎందుకు గుట్టలుగా డబ్బులు దొరుకుతున్నాయన్న మోదీ ప్రశ్నకు ఎవరు సమాధానం చెప్పగలరు? ప్రజల నుంచి నేతలు దోచుకున్న డబ్బు పేదలకు ఎలా పంచాలో ఆలోచిస్తున్న మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చాక ఈ దేశంలో అవినీతి పూర్తిగా మటుమాయం కావడం ఖాయం.

జయాపజయాల నిర్ణేత!

లోక్‌సభ ఎన్నికల మూడో విడత పోలింగ్ నేడు జరగనున్నది. ఈ మూడో దశ చాలా కీలకమైనది. అధికార, ప్రతిపక్ష కూటములు గెలుచుకున్న లేదా కోల్పోయే నియోజకవర్గాల సంఖ్య మొత్తంగా వాటి జయాపజయాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేసే అవకాశం ఎంతైనా ఉన్నది. మంగళవారం 93 నియోజకవర్గాలలో పోలింగ్ పరిపూర్తితో సగానికి పైగా లోక్‌సభ నియోజకవర్గాలు కచ్చితంగా చెప్పాలంటే 238 స్థానాలు–ఓటర్లు తమ ప్రతినిధులను ఎన్నుకోవడం పూర్తవుతుంది. మా అంచనా ప్రకారం ఎన్డీఏ ఐదు సంవత్సరాల క్రితం గెలుచుకున్న 111 స్థానాలలో 20ని ప్రస్తుత ఎన్నికల మొదటి రెండు దశల్లో కోల్పోనున్నది. ఈ మూడో దశలో మరో 20 సీట్లను సైతం అది కోల్పోయే అవకాశాలు ఉన్నాయి. నిజంగా ఇదే జరిగితే బీజేపీకి తీవ్ర నష్టం వాటిల్లడం ఖాయం. కొత్త లోక్‌సభలో బీజేపీకి కనీస మెజారిటీ (272) కంటే తక్కువ స్థానాలు మాత్రమే లభిస్తాయి. ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే బీజేపీ, దాని మిత్రపక్షాలు ఈ దశలో అత్యధిక స్థానాలను గెలుచుకుని తీరాలి. ఇది జరిగితేనే బీజేపీ తన ఆధిక్యతను కాపాడుకోగలుగుతుంది. రెండో దశలో వలే మూడో దశలో కూడా, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న చాలా సీట్లను కాపాడుకోవల్సి రావడమే ఎన్డీఏ సమస్య. పోలింగ్ జరగనున్న 93 (బీజేపీ అభ్యర్థి ఏకగ్రీవంగా గెలిచిన సూరత్‌ను కూడా కలుపుకుంటే 94) సీట్లలో 80 సీట్లు ఎన్డీఏవే కావడం గమనార్హం. అయితే మూడో విడత పోలింగ్ జరగనున్న నియోజకవర్గాలు ఉన్న గుజరాత్ మొదలైనవి ఎన్డీఏకు కంచుకోటలుగా ఉండడం విస్మరింపలేని వాస్తవం. నేడు పోలింగ్ జరగనున్న పది రాష్ట్రాలలో ఎనిమిది బీజేపీ ప్రభుత్వాల పాలనలో ఉన్నాయి. ఈ 94 సీట్లలో, గతంలో కేవలం 12 మాత్రమే గెలుచుకున్న ఇండియా కూటమి ఈసారి మరో 15 సీట్లను కైవసం చేసుకునే అవకాశమున్నది. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు సాధించిన విజయాలే అందుకు నిదర్శనం. ఎన్డీఏ అనుకూలత 80:12 నుంచి 65:27కి తగ్గనున్నది.



■ యోగేంద్ర యాదవ్

మూడో దశ ఎన్నికలలో కర్ణాటక ఓటర్ల తీర్పు నిర్ణయాత్మకం కానున్నది. ఈ రాష్ట్రంలో బీజేపీకి తీవ్ర ప్రతికూలతలు ఉండగా, ఇండియా కూటమికి విజయావకాశాలు మెరుగ్గా ఉన్నాయి. పోలింగ్ జరగనున్న 14 స్థానాలలో అత్యధికం ఉత్తర, మధ్య కర్ణాటకలో ఉన్నాయి. వీటన్నిటినీ ఎన్డీఏ కోల్పోయే అవకాశమున్నది. 2019లో ఎన్డీఏ ఈ 14 స్థానాలనూ గెలుచుకున్నది; 2014లో 11 స్థానాలను, 2009లో 12 స్థానాలనూ గెలుచుకున్నది. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ మంచి ఫలితాలను సాధించింది. ఆ ఫలితాల ప్రాతిపదికన చూస్తే ఈ 14 నియోజకవర్గాలలో కనీసం ఏడు స్థానాలలో కాంగ్రెస్ ముందంజలో ఉన్నది. అయితే అంతిమ విజయం కాంగ్రెస్‌నే వరిస్తుందని చెప్పలేము. ఎందుకంటే గత మూడు దశాబ్దాలుగా లోక్‌సభ ఎన్నికలలో, బీజేపీనే విజయం సాధిస్తూ వస్తోంది. అయితే ఈ తడవ బీజేపీకి అటువంటి సానుకూల పరిస్థితి లేదు. ఇందుకు పలు కారణాలు ఉన్నాయి. సిద్దరామయ్య ప్రభుత్వం తన ఎన్నికల హామీలను పూర్తిగా అమలుపరిచింది. ఐదు గ్యారంటీల అమలు ఫలితంగా ముఖ్యంగా మహిళలు ఇతోధిక లబ్ధి పొందారు. ఈ కారణంగా కాంగ్రెస్ పార్టీ వైపే ఓటర్లు మొగ్గు చూపుతున్నారు. గతంలో వలే రాష్ట్ర స్థాయి నాయకులు ఈ జాతీయ ఎన్నికలపై ఉదాసీనత చూపే పరిస్థితి లేదు. ఈసారి కాంగ్రెస్ అభ్యర్థులలో సగం మంది రాష్ట్ర మంత్రుల సమీప బంధువులే. ఇక కాంగ్రెస్ నాయకులు అసెంబ్లీ ఎన్నికలలో వలే లోక్‌సభ ఎన్నికలలో కూడా సమైక్యంగా పని చేస్తున్నారు. అయితే బీజేపీలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉన్నది. బీజేపీ జాతీయ నాయకత్వం కర్ణాటకలో ఎన్నికల బాధ్యతను బీఎస్ యెడ్యూరప్పకు అప్పగించింది. అయితే మాజీ ఉప ముఖ్యమంత్రి కెఎస్ ఈశ్వరప్ప ఈ విషయమై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. యెడ్యూరప్పకు అమిత ప్రాధాన్యాన్ని ఇవ్వడాన్ని ఆయన వ్యతిరేకిస్తున్నారు. అలాగే లింగాయత్ సామాజికవర్గ ఆధ్యాత్మిక నేత ఒకరు యడ్యూరప్ప నాయకత్వాన్ని హర్షించడం లేదు. మూడో దశ ఎన్నికలు జరగనున్న నియోజకవర్గాలలో లింగాయత్‌లు ప్రభావ ప్రాబల్యాలు గణనీయమైన స్థాయిలో ఉన్నాయి. జనతాదళ్ (ఎస్) నాయకుడు, హస్సన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక దురాగతాల ఉదంతం ఎన్డీఏ విజయావకాశాలను తీవ్రంగా దెబ్బ తీసింది ప్రజ్వల్‌కు మద్దతుగా ప్రధాని మోదీ కూడా ప్రచారం చేశారు. పోలింగ్ అయిన తరువాత ప్రజ్వల్ జర్మనీకి పరారయ్యాడు. ఇందుకు మోదీ సర్కార్ సహకరించిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఓబీసీ రిజర్వేషన్లలో ముస్లింలకు 4 శాతం సబ్ కోటాను ఇవ్వడాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను ముస్లింలకు బదిలీ చేసేందుకు కాంగ్రెస్ పన్నాగమని మోదీ తీవ్ర స్థాయిలో చేసిన ఆరోపణలకు కూడా ప్రజల నుంచి పెద్దగా ప్రతిస్పందన లేదు (నిజానికి ఈ సబ్ కోటాను 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు నాటి బీజేపీ ప్రభుత్వం రద్దు చేసేంతవరకు బీజేపీతో సహా అన్ని పార్టీల ప్రభుత్వాలూ అమలుపరిచాయి). ఏడాది క్రితం అసెంబ్లీ ఎన్నికలలో సాధించుకున్న ఓట్ల శాతాన్ని ఈ ఎన్నికలలోనూ నిలబెట్టుకోగలిగితే బీజేపీ అధీనంలో ఉన్న 14 సీట్లలో ఏడింటిని తప్పకుండా కైవసం చేసుకోగలుగుతుంది. ప్రజ్వల్ ఉదంతంతో అప్రతిష్ఠపాలైన జనతాదళ్(ఎస్) పార్టీకి చెందిన ఓటర్లను తన వైపుకు తిప్పుకోగలిగితే కాంగ్రెస్‌కు లభించే స్థానాల సంఖ్య 11కి పెరిగే అవకాశమున్నది.

మహారాష్ట్రలో మూడో విడత పోలింగ్ 11 నియోజకవర్గాలలో జరగనున్నది. 2019లో ఈ 11 స్థానాలలో ఏడింటిని నాటి బీజేపీ–శివసేన కూటమి కైవసం చేసుకున్నది. ప్రస్తుత ఎన్నికలలో అందరి దృష్టి పశ్చిమ మహారాష్ట్రపై ఉన్నది. మనుగడ ముప్పునెదుర్కొంటున్న ఎన్సీపీని రక్షించుకునేందుకు ఆ పార్టీ అధినేత శరద్ పవార్ తన సర్వశక్తులనూ ఒడ్డుతున్నారు. కాగా ఈ దశలో ఇండియా కూటమి స్వల్పస్థాయిలో లబ్ధి పొందే అవకాశమున్నది. ఇక మధ్యప్రదేశ్‌లో ఇండియా కూటమి విజయావకాశాలు ముఖ్యంగా చంబల్–గ్వాలియర్ ప్రాంతంలో మెరుగ్గా ఉన్నాయి. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ హవా ప్రచండంగా వీచినప్పటికీ ఈ ప్రాంతాలలో కాంగ్రెస్ పూర్తిగా తుడిచిపెట్టుకు పోలేదు. నేడు పోలింగ్ జరగనున్న 9 స్థానాలనూ 2019లో బీజేపీనే గెలుచుకున్నది. కాంగ్రెస్ మూడు సీట్లలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ దృష్ట్యా కాంగ్రెస్ ఆ స్థానాలను గెలుచుకునే అవకాశమున్నది. ఉత్తరప్రదేశ్‌లో నేడు పోలింగ్ జరగనున్న పది స్థానాలూ సమాజ్‌వాది పార్టీ ప్రభావ ప్రాబల్యాలు బలంగా ఉన్న ప్రాంతాలలో ఉన్నాయి. అయితే బీఎస్పీ తరఫున ఐదుగురు ముస్లిం అభ్యర్థులు రంగంలో ఉన్నందున ఇండియా కూటమి గట్టి సవాల్ నెదుర్కొంటుందని చెప్పవచ్చు.



పశ్చిమ బెంగాల్‌లో నేడు పోలింగ్ జరగనున్న నాలుగు నియోజక వర్గాలలోనూ త్రిముఖ పోటీ జరగనున్నది. ముస్లింలు అత్యధికంగా ఉన్న ఈ నాలుగు నియోజక వర్గాలలోనూ కాంగ్రెస్–లెఫ్ట్ కూటమి ముస్లిం అభ్యర్థులను నిలబెట్టినందున బీజేపీ పరిస్థితి మెరుగుపడే అవకాశమున్నది.

ప్రధాని మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో గత రెండు సార్వత్రిక ఎన్నికలలోనూ అన్ని స్థానాలనూ బీజేపీనే గెలుచుకున్నది. అయితే ఈసారి ఆ పరిస్థితి ఉండకపోవచ్చు. ఆదివాసీలు అత్యధికంగా ఉన్న ప్రాంతాలలో బీజేపీకి కాంగ్రెస్ గట్టి పోటీనిస్తోంది. క్షత్రియులు, పటేళ్ల మొదలైన సామాజికవర్గాలు బీజేపీ పట్ల తీవ్ర అసంతృప్తితో ఉండడం కాంగ్రెస్‌కు కలిసివచ్చే విషయం.

పశ్చిమ బెంగాల్‌లో నేడు పోలింగ్ జరగనున్న నాలుగు నియోజకవర్గాలలోనూ త్రిముఖ పోటీ జరగనున్నది. ముస్లింలు అత్యధికంగా ఉన్న ఈ నాలుగు నియోజకవర్గాలలోనూ కాంగ్రెస్–లెఫ్ట్ కూటమి ముస్లిం అభ్యర్థులను నిలబెట్టినందున బీజేపీ పరిస్థితి మెరుగుపడే అవకాశమున్నది. అస్సాంలో నియోజకవర్గాల పునర్విభజన ఆయా పార్టీల జయాపజయాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేయనున్నది. బిహార్, ఛత్తీస్‌గఢ్, గోవాలలో కూడా ఇండియా కూటమికి విజయావకాశాలు మెరుగ్గా ఉన్నాయి.

మొత్తం మీద ఈ మూడో దశలో ఎన్డీఏ కూటమి మరో 20 సీట్లను కోల్పోయిన పక్షంలో, ఈ సార్వత్రిక ఎన్నికల ఆరంభంలో ఎవరూ ఊహించని పరిస్థితి నెలకొనే అవకాశమున్నది: బీజేపీ నేతృత్వంలోని అధికార కూటమికి కనీస మెజారిటీ (272) సైతం దక్కే అవకాశముండదు.

(వ్యాసకర్త జాతీయ కన్వీనర్, భారత్ జోడో అభియాన్)

అల్లూరి ఆశయసాధనకు కృషి చేయాలి

'విప్లవజ్యోతి' అల్లూరి సీతారామరాజును మేజర్ గుడాల్ కాల్చి చంపి నేటికి వందేళ్లు. శ్రీరామరాజు మరణించే నాటికి ఆయన వయస్సు 27 సంవత్సరాలు. ఇందులో 13 ఏళ్లు రాజమండ్రి గోదావరి గట్టు ప్రాంతంలో నివసించాడు. ఆ ప్రాంతంలో చదువుకున్న ఉల్లితోట బంగారయ్య స్కూలుకు, గోదావరి పుష్కరాల రేవు ప్రాంతం నుంచి ఉన్న పాత రైలు వంతెనకు, ఏజెన్సీకి ముఖద్వారంగా



ఉన్న రాజమండ్రి విమానాశ్రయానికి అల్లూరి శ్రీరామరాజు పేరు పెట్టాలని ఐదు దశాబ్దాలుగా కోరుతుంటే ఉమ్మడి విశాఖ జిల్లాను మూడుగా విభజించి ఒక జిల్లాకు ఆయన పేరు పెట్టారు. అయితే రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుంది. పార్లమెంటు భవన ప్రాంగణంలో అనుమతి ఉన్నా ఆయన విగ్రహాన్ని పెట్టలేదు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ 125వ జయంత్యోత్సవం సందర్భంగా 125 రూపాయల నాణేన్ని విడుదల చేశారు. కానీ అల్లూరి 125 సంవత్సరాల జయంత్యోత్సవం జరుపుకుంటున్న తరుణంలో నాణేన్ని విడుదల చేయాలని కోరినా పెడచెవిన పెట్టారు. గతంలో పాఠ్యపుస్తకాల్లో అల్లూరి చరిత్ర ఉండేది. దానిని ఎత్తేశారు. తిరిగి దానిని ప్రవేశపెట్టాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో అల్లూరి చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలి. రాష్ట్రంలో గిరిజన యువత, చదువుకున్నవారు, శ్రామికులు వలస వెళ్లకుండా ఆ ప్రాంతాల్లో చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. కేంద్ర బడ్జెట్‌లో ఆదివాసీలకు కేటాయించిన సొమ్ము వారికే పూర్తిగా ఖర్చు చేయాలి. గిరిజన విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు పెంచాలి. శ్రీరామ రాజు పేరున ఏర్పాటు చేసిన జిల్లాను అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలి. శ్రీరామరాజు చరిత్ర వ్యాప్తికి, ఆయన ఆశయ సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి.

– పడాల వీరభద్రరావు
అల్లూరి సీతారామరాజు చరిత్ర పరిశోధకులు

ద్రవిడ లోకంలో బ్రాహ్మణ వికాసమెట్టిది?

కులాల్లో మార్పులు కొత్తకాదు. వాటి వృత్తి పునాదులు కదలటమూ కొత్తకాదు. కులాల్లో అంతరాలూ కొత్తవి కావు. కులాల వలసలూ పాత విషయమే. 200 ఏళ్లల్లో ఎన్నో మార్పులు! అయినా మారని సత్యాలూ కొన్ని ఉన్నాయి. సగటు మనిషి ఆలోచనలను, అభిరుచుల్ని, వివాహాన్ని నిర్ణయించటంలో కులం పాత్ర ఇప్పటికీ గణనీయమే. దీన్ని వదులుకుని అడుగులు వేయటం అంత తేలిక కాదు. మరోవైపు ఆధునిక జీవిత ఒత్తిళ్లతో ఉద్యోగ, వ్యాపారాల్లో నిలదొక్కుకోటానికి ఎన్నో కుల ప్రభావాలను వదులుకోవాల్సి వస్తోంది. లాభాపేక్షతో నడిచే ఆర్థిక వ్యవస్థలో కులం పాత్ర ఎట్లా మారుతోంది? అది నిర్దేశించే ఆలోచనలు, అలవాట్లు, భేషజాలు ఏమవుతున్నాయి? అన్న ప్రశ్నలు అందరిలోనూ ఏదో రూపంలో ఉదయిస్తూనే ఉంటాయి.

కులం ప్రభావంలేని రంగమంటూ లేదు. అందుకే ఎన్నో పరిశోధనలు.. విశ్లేషణలు. కొన్ని కులాల్లో మార్పులపై ఇప్పటికే సమగ్ర వ్యాసాలు, పుస్తకాలు వచ్చాయి. కానీ బ్రాహ్మణుల గురించి వచ్చినవి తక్కువ. అందులోనూ ఒక ప్రాంత బ్రాహ్మణుల గురించి వచ్చినవి ఇంకా తక్కువ. దీనికి భిన్నంగా తమిళ బ్రాహ్మణులపై ప్రముఖ అంత్రపాలజిస్టు సి.జె.ఫులర్ లోతైన పరిశోధన చేశారు. హరిప్రియా నరసింహన్‌తో కలిసి 'తమిళ్ బ్రాహ్మన్స్' పేరుతో రాసిన పుస్తకం చాలా ఆసక్తికరమైంది. కావేరీ డెల్టాలోని అగ్రహార గ్రామాల్లో దండిగా భూసంపద ఉండి, అన్నింటా ఒకనాడు ఆధిపత్యాన్ని చలాయించిన సంప్రదాయ బ్రాహ్మణులు మధ్య–ఎగువ మధ్యతరగతిగా ఎలా మారారు? రిజర్వేషన్ల అమలుతో ఏర్పడిన ప్రతికూల పరిస్థితులను అధిగమించి ఆధిక్యతను ఎలా నిలబెట్టుకున్నారు? ముఖ్యంగా ద్రవిడ ఉద్యమం సృష్టించిన బ్రాహ్మణ వ్యతిరేకతకు, విసిరిన సవాళ్లను ఎలా అధిగమించారు? సంప్రదాయం అందించిన ఆధిక్యతలు అంతరించిపోయినా ఇంకా తమని తాము ఒక విశిష్ట సమూహంగా ఎలా భావించుకుంటున్నారు? అన్నవి కుతూహలం కలిగించే ప్రశ్నలే.

తమిళ బ్రాహ్మణులు ఏ స్థాయి నుంచి ఎక్కడికి చేరుకున్నారో అర్థం చేసుకోటానికి ద్రవిడ ఉద్యమం తలెత్తిన నాటి పరిస్థితులు చూడాలి. అంతకు కొన్ని దశాబ్దాల నాటి గ్రామీణ జీవనంలో వాళ్ల పాత్రనూ పరిశీలించాలి. 1916 డిసెంబరులో సౌత్ ఇండియన్ పీపుల్స్ అసోసియేషన్.. నాన్–బ్రాహ్మిన్ మ్యానిఫెస్టోను విడుదల చేయటం దేశంలోనే సంచలనం. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో 3 శాతంగా ఉన్న బ్రాహ్మణులు ఉద్యోగాల్లో, పదవుల్లో ఎంతటి ఆధిక్యతను నెలకొల్పుకున్నారో వివరిస్తూ గణాంకాలను పొందుపరచారు. ప్రావిన్షియల్ సివిల్ సర్వీసు పరీక్ష అప్పట్లో చాలా కీలకమైంది. 1892–1904 మధ్య 16 మంది ఆ పరీక్షలో నెగ్గితే అందులో 15 మంది బ్రాహ్మణులే ఉన్నారు. 1913లో 128 మంది శాశ్వత జిల్లా మున్సిఫ్ పోస్టులుంటే 93 పోస్టుల్లో బ్రాహ్మణులే కుదురుకున్నారు. మద్రాసు హైకోర్టులోని అయిదుగురు భారతీయ న్యాయమూర్తుల్లో నలుగురు బ్రాహ్మణ వర్గానికి చెందినవారే. 1914 నాటికి మద్రాసు వర్సిటీకి చెందిన 650 మంది రిజిస్టరు గ్యాడ్యుయేట్లల్లో 450 మంది బ్రాహ్మణులే. జాతీయోద్యమంలో కూడా వారి ప్రాబల్యమే ఎక్కువ. అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి మద్రాసు నుంచి ఎన్నికైన 16గురిలో 15గురు బ్రాహ్మణులే. విద్య, ఉద్యోగ రంగాల్లో బ్రాహ్మణేతర కులాలకు సముచిత వాటా దక్కాలనే లక్ష్యంతో నాన్–బ్రాహ్మిన్ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఈ మ్యానిఫెస్టో రూపకల్పన వెనుక వ్యవసాయ కులాల్లోని పైవర్గాలకు చెందినవారే ప్రముఖంగా ఉన్నారు. విద్యారంగంలో ఈ వర్గాలూ అప్పటికి ఎంతో కొంత ప్రగతిని సాధించారు. వాటాల కోసం అందుకే గొంతెత్తారు. ప్రభుత్వ అండతో బ్రాహ్మణ ఆధిక్యాన్ని తగ్గించటానికి పూనుకున్నారు. బ్రాహ్మణయేతర్లకు రిజర్వేషన్లు ఉండాలనే ఆలోచనలకు అంకురార్పణ ప్రధానంగా అప్పుడే జరిగింది. బ్రాహ్మణ వ్యతిరేకతతో 1920లో అధికారంలోకి వచ్చిన జస్టిస్ పార్టీ రిజర్వేషన్లకు ఆ నేపథ్యంలోనే శ్రీకారం చుట్టింది. కాంగ్రెస్ పార్టీకి వాటిని కొనసాగించక తప్పలేదు. అందుకే 1951లోనే ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఓబీసీలకు 25 శాతం రిజర్వేషన్లను కల్పించింది. 1973లో డీఎంకే ప్రభుత్వం వాటిని 31 శాతానికి పెంచింది. 1980లో ఏడీఎంకే ప్రభుత్వం వాటిని 50 శాతానికి చేర్చింది. ఎస్సీ ఎస్టీలకు ఇచ్చిన 18 శాతాన్ని కలుపుకొంటే మొత్తం రిజర్వేషన్లు తమిళనాట 1980నాటికే 68 శాతానికి చేరాయి.


నగర, పట్టణ ప్రాంతంలోని పరిస్థితులను పక్కనబెట్టి గ్రామాల్లోకి చూస్తే మరోరకం ఆధిపత్యం కనపడుతుంది. పాత తంజావూరు జిల్లా పరిస్థితి చూస్తే అదేంటో అర్థం అవుతుంది. ఆ జిల్లాలో బ్రాహ్మణులు 6.4 శాతం ఉండేవారు. వ్యవసాయం అభివృద్ధి పొందిన జిల్లా కాబట్టి బ్రాహ్మణుల సంఖ్య అక్కడ ఎక్కువ. కిందటి శతాబ్దం తొలినాళ్లలో ధనిక మిరాశీదార్లలో (వారసత్వ భూస్వాములు) బ్రాహ్మణుల వాటా 38 శాతం. బ్రాహ్మణుల్లో పౌరోహిత్యం చేసే వాళ్లే ఎక్కువనే భావన ప్రజల్లో ఉంది. అది నిజం కాదు. భూముల మీదా, ఉద్యోగాల ద్వారా వచ్చే ఆదాయంపై ఆధారపడే వారి సంఖ్యే ఎక్కువ. 1951–52 నాటి కుంబపెట్టై అగ్రహార గ్రామాన్ని తీసుకుంటే విపరీత అసమానతలతో కూడిన సామాజిక జీవితం స్పష్టంగా కనపడుతుంది. 1827లో ఆ గ్రామ భూములపై మొదటిసారి సర్వే జరిగింది. మొత్తం భూములన్నీ దాదాపుగా బ్రాహ్మణుల చేతుల్లోనే ఉండేవి. 1950ల నాటికి పరిస్థితి చాలా మారింది. కొన్ని భూములు బ్రాహ్మణేతర కులాల చేతుల్లోకి వెళ్లాయి. మరికొంత భూమిని కౌలుకు ఇచ్చారు. అగ్రహారంలో 49 ఇళ్లు ఉండేవి. 1950ల నాటికే కొందరు పట్టణాలకు వలస వెళ్లటంతో 35 ఇళ్లలో 174 మంది మాత్రమే ఉండేవారు. అదే 1871లో 412 మంది అక్కడ నివసించేవారు. అగ్రహార వీధికి దూరంగా 18 కులాల ప్రజలు జీవించేవారు. వీళ్లకు మరికొంత దూరంలో 354 మంది ఆది ద్రవిడులు (దళితులు) ఉండేవారు. వ్యవసాయ కాలం ఆరంభంలో అగ్రహారంలోని రామాలయంలో ఉత్సవాలు జరిగేవి. బ్రాహ్మణేతర రైతులు, కూలీలు ఆలయ ద్వారం బయటే నిల్చొనేవారు. ఆది ద్రవిడులైతే అక్కడికి రావటానికే వీల్లేదు. అదే రోజు సాయంకాలం గ్రామదేవతకూ పూజలు చేసేవారు. బ్రాహ్మణేతర పూజారి వాటిని నిర్వహించేవాడు. రామాలయం నుంచి వచ్చిన హారతిని దేవతకు సమర్పించేవారు. గ్రామదేవత విగ్రహం దగ్గర కూర్చునే గౌరవం మాత్రం బ్రాహ్మణ కుటుంబాలకే దక్కేది. ఇతర కులాలవారు దూరంగా నిల్చొనేవారు. ఆది ద్రవిడులకు ఇక్కడా కూడా నిషేధమే. మిరాశీదారులుగా ఉన్న బలంతోనూ కులవ్యవస్థలోని అగ్రస్థానం కారణంగా అన్ని సందర్భాల్లోనూ బ్రాహ్మణులకే పెద్దపీట వేసేవారు. మిరాశీదార్లు భూముల్లో పనిచేసేవారు కాదు. నాగలిపడితే మహాపాపం అనుకునేవారు. ఇళ్లల్లో అంటూ సొంటూ, మడి సంప్రదాయాన్ని కఠినంగా పాటించేవారు. రైతాంగ కులాల వారిని సైతం వంటింటివైపు రానిచ్చేవారు కాదు. ఆది ద్రవిడులు ఇంటి వెనుక ద్వారం వరకూ మాత్రమే రాగలిగేవారు.



■ రాహుల్ కుమార్

ఇతర కులాలతో బ్రాహ్మణుల సంబంధాలు పరిమితంగా ఉండేవి. అందుకే గ్రామ జీవితంతో తెగతెంపులు చేసుకోవటం వారికి కష్టం అనిపించలేదు. వ్యవసాయం ప్రధాన ఆదాయ వనరైనా అందులో క్రియాశీల పాత్ర లేదు. భూమిపై మమకారం చాలా తక్కువ. అందుకే వలస పోవటంలో అందరికంటే ముందున్నారు. వివిధ ఉద్యోగాల్లో తేలికగా కుదురుకున్నారు. ప్రభుత్వ ఉదోగాల్లో మహారాష్ట్ర దేశస్థ బ్రాహ్మణులు తమిళనాడులో తొలుత పట్టుసాధించినా తర్వాత దాన్ని కోల్పోయారు. తెలుగు నియోగ బ్రాహ్మణులు అందుకు ప్రయత్నించినా తమిళ బ్రాహ్మణులతో పోటీ పడలేకపోయారు.

గడిచిన 150 సంవత్సరాల్లో తమిళ బ్రాహ్మణులు వివిధ రంగాల్లో ఎలా పాతుకుపోయారో చూస్తే వాళ్ల మధ్య–ఎగువ తరగతి స్థాయి కొంతైనా అర్థమవుతుంది. 1885–1905 మధ్య లా విద్యార్థుల్లో 70–80 శాతం మంది బ్రాహ్మణులే ఉన్నారు. మరో 15 ఏళ్ల నాటికీ పరిస్థితిలో మార్పులేదు. ఇంజినీరింగులో 74 శాతం ఉన్నారు. అంటూసొంటూ వల్ల వైద్య విద్యలో చేరటానికి మొదట్లో తటపటాయించారు. అయినా 1900 నాటికి వైద్య విద్యలో 30 శాతం బ్రాహ్మణులు ఉన్నారు. మరో 20 ఏళ్లలో అది 60 శాతానికి పెరిగింది. మొత్తం యూనివర్సిటీ విద్యార్థుల్లో బ్రాహ్మణులు 80 శాతం ఉండేవారు. 1921 నుంచి అమలైన రిజర్వేషన్ల వల్ల క్రమేపీ ఈ శాతాల్లో తగ్గుదల నమోదై 1940ల నాటికి 40–50శాతానికి పరిమితమైంది. ఓబీసీ రిజర్వేషన్ల కోటాతో అవకాశాలు తగ్గటంతో బ్రాహ్మణులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలపై దృష్టిపెట్టి వాటిని ఎక్కువే దక్కించుకున్నారు. 1992 వరకూ కేంద్రంలో ఓబీసీ రిజర్వేషన్లు లేవు. ఉద్యోగాల్లోనే గాక వ్యాపార, పారిశ్రామిక, బ్యాంకింగ్ రంగాల్లో కూడా బ్రాహ్మణులు చొచ్చుకెళ్లారు. 1946లో ప్రారంభమైన ఇండియా సిమెంట్ పరిశ్రమ దీనికి ఉదాహరణ. రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటారుబైక్స్‌ను తయారుచేసిన ఈఏఎస్‌యుఎన్ ఇంజినీరింగ్ కంపెనీ కూడా ఈ వర్గానిదే. 1929లో మొదలైన టీవీఎస్ కంపెనీ కూడా వీళ్లదే. ఐటీ కంపెనీల స్థాపనలోనూ కీలక పాత్ర ఉంది. ఇక పైస్థాయి ఐటీ ఉద్యోగాల్లో 40–50 శాతం వాటా వారిదే.



బ్రాహ్మణేతరులూ ఆధునిక రంగాల్లో అడుగుపెట్టారు. కానీ గ్రామాలతో, భూములతో సంబంధాలను వదులుకోలేదు. తమిళ బ్రాహ్మణులు మాత్రం వాటిని వదులుకున్నారు. పట్టణ మధ్య–ఎగువ తరగతిగా పూర్తిగా పరివర్తన చెందారు. కానీ కులం స్పృహను వదులుకోలేదు. అవసరమైన చోట పక్షపాత ప్రదర్శననూ వదులుకోలేదు. తమను విశిష్ట వర్గంగా భావించుకోవటమూ మానలేదు. కర్ణాటక సంగీతాన్ని, భరతనాట్యాన్ని అభివృద్ధి చేయటంలోనూ ఆ విశిష్టత కోసం చేసిన ప్రయత్నమే కనపడుతుంది.

బ్రాహ్మణేతరులూ ఆధునిక రంగాల్లో అడుగుపెట్టారు. కానీ గ్రామాలతో, భూములతో సంబంధాలను వదులుకోలేదు. తమిళ బ్రాహ్మణులు మాత్రం వాటిని వదులుకున్నారు. పట్టణ మధ్య–ఎగువ తరగతిగా పూర్తిగా పరివర్తన చెందారు. కానీ కులం స్పృహను వదులుకోలేదు. అవసరమైన చోట పక్షపాత ప్రదర్శననూ వదులుకోలేదు. తమను విశిష్ట వర్గంగా భావించుకోవటమూ మానలేదు. కర్ణాటక సంగీతాన్ని, భరతనాట్యాన్ని అభివృద్ధి చేయటంలోనూ ఆ విశిష్టత కోసం చేసిన ప్రయత్నమే కనపడుతుంది. ఒకనాడు భరతనాట్యాన్ని దేవదాసీ నృత్యకళగా భావించిన వారే ఇప్పుడు దాన్ని సంప్రదాయానికి చిహ్నంగా భావిస్తున్నారు. ద్రవిడ ఉద్యమాన్ని పోటీ తర్కంతో, దీటైన సిద్ధాంతంతో ఢీకొట్టకుండా చల్లగా మెల్లగా తాము ఒకనాడు తక్కువగా చూసిన వృత్తుల్లోకి ప్రవేశించి సంపూర్ణ మధ్య–ఎగువ తరగతికి ఎగబాకటం ఒక విచిత్రంగానే చెప్పుకోవాలి. అవసరం ఉన్నంతమేరకే సంప్రదాయ సరిహద్దులను దాటే అవకాశవాద ఆధునికతగా దీన్ని చెప్పుకోవాలేమో! దీనికి మినహాయింపు ఎవరన్నదే ఇప్పుడు పెద్ద ప్రశ్నార్థకం!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

www.andhrajyothy.com
ABN ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ABN ఆంధ్రజ్యోతి
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సమ్మర్ కేర్

కూల్‌డ్రింకే కదా అని తాగితే..!

వేసవి ఎండలు మండిపోతున్నాయి. ఐదు నివి ఎషాలు బయటకు వెళ్లి వస్తే చాలు... చల్లగా ఏదైనా తాగాలనిపిస్తోంది. వెంటనే మన కళ్ల ముందు కదిలేవి... ఇంపైన రంగుల్లో... నురగలు కక్కే కూల్‌డ్రింక్స్. అయితే వీటిని తాగటంవల్ల అనేక రకాల సమస్యలు వస్తాయంటున్నార వైద్యులు. వేసవిలో తప్పనిసరైతే మజ్జిగ, పండ్ల రసాలు, నిమ్మకాయ, కొబ్బరి నీళ్లు వంటివి తీసుకోవాలని... వీలైనంతవరకు కూల్‌డ్రింక్స్ జోలికి వెళ్లవద్దని చెబుతున్నారు. అసలు కూల్‌డ్రింక్స్‌వల్ల కలిగే అనర్థాలేమిటో చూద్దాం...

గుండె జబ్బులు...

కూల్‌డ్రింక్స్‌కు తీపిని ఇచ్చే ఫ్రక్టోజ్‌వల్ల మనకు అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి. వీటిలో మొదటిది- మెటబాలిక్ డిజార్డర్. అంటే మన శరీరం శక్తిని ఖర్చు చేసే క్రమంలో మార్పులు వస్తాయి. దీనివల్ల రక్తపోటు పెరుగుతుంది. ఎక్కువ కాలంపాటు రక్తపోటును నియంత్రించకపోతే గుండె జబ్బులు వస్తాయి. కొన్నిసార్లు దీనికి అనుబంధంగా కాలేయ సమస్యలు కూడా తలెత్తవచ్చు.

కాలేయంలో కొవ్వు...


మనకు శక్తి రావాలంటే గ్లూకోజ్ తప్పనిసరి. శరీరంలోకి ప్రవేశించే గ్లూకోజ్‌ను కణాలు శక్తిగా మార్చుకుంటాయి. కానీ కూల్‌డ్రింక్స్‌లో చక్కెర రూపంలో ఉండే ఫ్రక్టోజ్‌ను కణాలు శక్తిగా మార్చుకోలేవు. దీంతో ఈ ఫ్రక్టోజ్ బాధ్యత కాలేయంపై పడుతుంది. అవసరానికి మించి ఫ్రక్టోజ్ శరీరంలోకి చేరుతూ ఉంటే... అదంతా కాలేయంలో చేరి కొవ్వుగా మారుతుంది. ఇలా పెరిగిన కొవ్వులో కొంత శాతం ట్రైగ్లిజరైట్స్‌గా రక్తంలోకి ప్రవేశిస్తుంది. మిగిలినది కాలేయంలోనే ఉండిపోతుంది. ఇలా కొవ్వు పట్టిన కాలేయాన్ని నాన్‌ఆల్కాహాలిక్ ఫ్యాటీ లివర్ అంటారు. ఆల్కాహాల్ తాగటం వల్ల కాలేయానికి ఎంత ప్రమాదమో... కూల్‌డ్రింక్స్‌ను ఎక్కువ కాలం తాగినా కూడా అంతే ప్రమాదం.

ఉబ్బసం...

శీతలపానీయాలు తాగే వారిలో ఉబ్బసం ఎక్కువగా కనబడుతూ ఉంటుంది. దీనికి ఒక ప్రధానమైన కారణముంది. సాధారణంగా కూల్‌డ్రింక్స్‌లో సోడియం బెంజాయేట్ అనే రసాయనాన్ని ఎక్కువ కాలం నిల్వ ఉండటానికి వాడతారు. ఇది మన శరీరంలోకి ప్రవేశించినప్పుడు రెండు ప్రమాదకరమైన సమస్యలు ఏర్పడతాయి. వీటిలో మొదటిది- పోటాషియం సమస్య. బెంజాయేట్ ఇతర ఆహారంతో కలిసినప్పుడు రకరకాల మార్పులు జరుగుతాయి. పోటాషియాన్ని శరీరం శోషించుకోదు. ఉబ్బసానికి ఇది తొలి మెట్టు. ఇదే విధంగా తరచూ కూల్‌డ్రింక్స్ తాగేవ్వారి దంతాలపై ఉన్న పై పొర దెబ్బతింటుంది.

స్థూలకాయం...

కూల్‌డ్రింక్స్‌ను తరచుగా తాగే వారు స్థూలకాయులై ఉంటారు. దీనికి కారణం శరీరంలో అవసరమైనదాని కన్నా ఎక్కువ కొవ్వు పేరుకుపోవటమే. ఈ కొవ్వును కరిగించేటంత శ్రమ చేయకపోతే, అది నడుము, పిరుదల భాగంలో పేరుకుపోతుంది. ఆ తర్వాత శరీరంలోని ఇతర భాగాలకు కూడా చేరి, స్థూలకాయం ఏర్పడుతుంది.



వ్యసనంగా మారి...

తీపి తిన్నప్పుడు మెదడులో డోపమైన్ అనే హార్మోన్ విడుదలవుతుంది. ఈ హార్మోన్ వల్ల మనకు ఎక్కువగా తీపి తినాలనిపిస్తుంది. కూల్‌డ్రింక్స్ తాగితే ఈ డోపమైన్ ఎక్కువగా విడుదలవుతుంది. ఇది అలవాటుగా మారితే ఎప్పుడైనా ఒత్తిడి ఎక్కువగా ఉంటే కూల్‌డ్రింక్‌ను తాగాలనిపిస్తుంది. ఇది ఒక వ్యసనంగా మారుతుంది.

ఎముకల గుల్లబారటం...

శీతలపానీయాలు ఎక్కువగా తాగినప్పుడు విసర్జించే మూత్రంలో ఫాస్పారిక్ యాసిడ్‌తో పాటుగా కాల్షియాన్ని కూడా జీర్ణవ్యవస్థ శరీరం బయటకు పంపేస్తుంది. సాధారణంగా ఈ కాల్షియం మన శరీరానికి ఆహారం ద్వారా లభిస్తుంది. ఇలా లభించిన కాల్షియం శోషణ జరగకుండా మూత్రం ద్వారా బయటకు వెళిపోవటంవల్ల ఎముకలకు తగినంత కాల్షియం అందదు. ఇది దీర్ఘకాలంలో ఎముకల గుల్లతనంపై ప్రభావం చూపుతుంది. 'ఆస్టియో పోరోసిస్' వంటి వ్యాధులకు కారణమవుతుంది.

మూత్ర పిండాల సమస్యలు

కూల్‌డ్రింక్స్‌లో ఫాస్పారిక్ యాసిడ్ కూడా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపుతుంది. దీని పరిమాణం పెరిగితే మూత్రపిండాల్లో రాళ్లు తయారవుతాయి. కూల్‌డ్రింక్స్ ఎక్కువగా తాగేవారిలో మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడటం మనం గమనించవచ్చు.

పునరుత్పత్తి సమస్యలు...

కూల్‌డ్రింక్స్ క్యాన్లలో రెసిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది మన శరీరంలోకి ప్రవేశిస్తే అనేక రకాల సమస్యలు ఏర్పడతాయి. వీటిలో ప్రధానమైనది పునరుత్పత్తి సమస్య. అందుకే గర్భిణిలను కూల్‌డ్రింక్స్ తాగవద్దని వైద్యులు సలహా ఇస్తూ ఉంటారు.

కీళ్ల నొప్పులు...

మన శరీరంలో యూరిక్‌యాసిడ్ బాగా పెరిగిపోయినప్పుడు... అది కీళ్ల మధ్యకు చేరుకుంటుంది. దీనివల్ల గౌట్ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి వచ్చిన వారికి పాదాల్లోని బొటనవేలి కీళ్లు వాచిపోతాయి. విపరీతమైన నొప్పి కలుగుతుంది. శరీరంలో యూరిక్ యాసిడ్ బాగా పెరగటానికి ఫ్రక్టోజ్ ఒక ప్రధానమైన కారణమని వైద్య పరిశోధనల్లో తేలింది. ఫ్రక్టోజ్ శరీరంలోకి కూల్‌డ్రింక్స్ ద్వారా చేరుతుంది కాబట్టి, వాటిని తాగటం మానేయటం ఉత్తమం.

మతి మరుపు...

శరీరంలో చక్కెర స్థాయి హఠాత్తుగా విపరీతంగా పెరిగిపోతే... ఆ ప్రభావం మెదడులోని న్యూరాన్లపై పడుతుంది. ఇలా ఎక్కువసార్లు జరిగితే న్యూరాన్ల పనితీరు దెబ్బతింటుంది. మతిమరుపు సమస్య ఏర్పడుతుంది.



నరాలు లాగేస్తున్నాయా?

ఈ ఆధునిక ప్రపంచంలో నరాల బలహీనత చాలామందిని వేధించే ఒక పెద్ద సమస్య. దీనిని ముందే గుర్తిస్తే మందుల అవసరం లేకుండానే నయం చేయవచ్చు అంటున్నారు వైద్య నిపుణులు. మందుల అవసరం లేకుండా వారు చెబుతున్న చిట్కాలేమిటో చూద్దాం.

- రోజూ ఉదయాన్నే ఎక్కువ చెట్లు ఉన్న ప్రదేశంలో ప్రశాంతంగా కూర్చోవాలి. గుండె నిండా గాలి పీల్చి దీర్ఘ శ్వాసలు వదలాలి. ప్రాణాయామంలా చేస్తే.. శరీరంలోని నాడీవ్యవస్థకు ఆయువు పోసే ప్రాణవాయువు పుష్కలంగా అందుతుంది. ప్రతి అవయవానికీ జీవశక్తి లభిస్తుంది. మెదడు పనితీరుకు అవసరమైన రసాయనాలన్నీ ఊరే సామర్థ్యం పెరుగుతుంది. తద్వారా నాడీ వ్యవస్థ బలంగా మారుతుంది.
- నాడీ వ్యవస్థ శక్తిమంతంగా ఉండేందుకు విటమిన్-డి చాలా అవసరం. దీని కోసం ప్రతి రోజూ ఎండలో తప్పనిసరిగా నడవాలి. నరాల బలహీనతవల్ల కూడా డిప్రెషన్ వచ్చే అవకాశం ఉంది. నిత్యం తలనొప్పి, చికాకు, కోపం, ఒళ్లు నొప్పులు, గ్యాస్ట్రిక్ సమస్యలు చుట్టుముడతాయి. అందువల్ల నాడీ వ్యవస్థను చురుకుగా ఉంచాలంటే ఎండలో తప్పక నడవాలి.
- నరాలు శక్తిమంతంగా పని చేయాలంటే మెగ్నీషియం చాలా అవసరం. మెగ్నీషియం పుష్కలంగా లభించే బాదం, అరటిపండ్లు, పిస్తా, బచ్చలికూర మొదలైనవి ఆహారంలో భాగం చేసుకోవాలి.
- ఉదయాన్నే గోరువెచ్చని నీటిలోకి తేనె, నిమ్మరసం కలిపి తీసుకోవాలి. రాత్రి పడుకునే ముందు ఒక పెద్ద గ్లాసు పాలు తాగాలి. అధిక నూనె పదార్థాలు, మిఠాయిలు వంటివి తినకూడదు. శరీరాన్ని వేడెక్కించే మసాలాలకు దూరంగా ఉండాలి.
- దేహంలోని కండరాలు, నరాలు కేవలం శారీరక శ్రమతోనే కాదు, మానసిక ఆందోళనతోనూ అలసిపోతాయి. అప్పుడు రక్తప్రసరణ స్వేచ్ఛగా సాగదు. దాంతో నొప్పులు మొదలవుతాయి. ఆయుర్వేద తైలాలతో మర్దన చేయించుకుంటే కండరాలు, నరాలకు సాంత్వన కలుగుతుంది.

కడుపు కండరాల కోసం...

కొందరు ఉదయాన్నే లేచి వ్యాయామం తప్పనిసరిగా చేస్తూ ఉంటారు. వీటిలో కడుపు కండరాలకు మేలు చేసే ఎబ్‌డామెన్ ఎక్సర్‌సైజ్‌లు ఉంటాయి. వీటివల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో తెలుసుకుందాం.

కండరాలు బలపడతాయి

ప్రతి రోజూ వ్యాయామం చేయటం వల్ల కడుపు ప్రాంతంలో ఉన్న కండరాలు బలపడతాయి. దీని ప్రభావం మొత్తం శరీరంపై పడుతుంది. దీనివల్ల నిటారుగా నిలబడగలుగుతారు. చురుకుగా కదలగలుగుతారు. జీర్ణశక్తి మెరుగుపడుతుంది. ఎటువంటి సాయం లేకుండా నేల మీద నుంచి లేచి నిలబడగలుగుతారు. ఎక్కువసేపు నేలపై కూర్చోగలుగుతారు. ఒంటి నొప్పులు తగ్గుతాయి.



శరీరాకృతిలో మార్పు...

చాలామందికి నిలబడే విధానంలో కొన్ని సమస్యలు ఉంటాయి. ఈ వ్యాయామం చేయటం వల్ల ఈ సమస్యలన్నీ తొలగిపోయి నిటారుగా నిలబడగలుగుతారు.
దీని ప్రభావం వారి శ్వాసపై పడుతుంది. ఎక్కువ ఆక్సిజన్ అందుతుంది. అంతే కాకుండా ఈ వ్యాయామ ప్రభావం వారి మానసిక స్థితిపై కూడా పడుతుంది. వారు మరింత ఆత్మ విశ్వాసంతో పని చేసుకోగలుగుతారు. ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలు తొలగిపోతాయి.

జాగ్రత్తలు...

ఈ వ్యాయామంవల్ల అనేక రకాల లాభాలు ఉన్నా.. వ్యాయామం చేసే సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. వ్యాయామం తప్పుగా చేస్తే దాని వల్ల మొత్తానికే మోసం వచ్చే అవకాశముంది.

అపోహ వాస్తవం

రక్తదానంతో బలహీనపడతామా..?

తలసీమియా... ఒక అరుదైన రక్తపు వ్యాధి. దీని బారిన పడినవారికి తరచూ రక్తాన్ని మార్చాల్సి వస్తుంది. ఈ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన పెంచటానికి ఏటా మే 8న ప్రపంచ తలసీమియా దినోత్సవం నిర్వహిస్తున్నారు. తలసీమియా రోగులకు రక్తం అత్యవసరం. కానీ ఇప్పటికీ ఈ విషయంలో కొన్ని ప్రాంతాల్లో కొరత ఉంది. ఈ నేపథ్యంలో రక్తదానం గురించి ప్రజల్లో ఉన్న అపోహలు ఏమిటో... వాస్తవాలేమిటో చూద్దాం.

అపోహ: రక్తదానంవల్ల బలహీనపడిపోతాం
వాస్తవం: ఒకటి రెండు రోజుల్లో కొత్త రక్తకణాలు పుడతాయి. వాస్తవానికి కొత్త రక్తకణాలు మనకు మంచే చేస్తాయి.
అపోహ: అవసరమైతే ఎక్కువ రక్తం కూడా తీసుకొంటారు.
వాస్తవం: 350 నుంచి 450 మిల్లీలీటర్ల రక్తాన్ని మాత్రమే తీసుకొంటారు. ఒకసారి అంతకన్నా ఎక్కువ రక్తాన్ని తీయరు.
అపోహ: ఏడాదికి ఒకసారే రక్తదానం చేయాలి
వాస్తవం: ప్రభుత్వ విధివిధానాల ఆధారంగా... 18-60 ఏళ్ల మధ్య ఉన్న ఆరోగ్యకరమైన పురుషుడు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు. రక్తదానం అలవాటు ఉన్నవారు 65 ఏళ్ల దాకా చేయవచ్చు. ఇదే విధంగా 18-60 ఏళ్ల మధ్య ఉన్న మహిళలు నాలుగు నెలలకు ఒకసారి చేయవచ్చు. గర్భిణులు, పాలిచ్చే తల్లులు రక్త దానం చేయకూడదు.
అపోహ: శాఖాహారులు రక్త దానం చేస్తే బలహీనపడిపోతారు
వాస్తవం: మాంసాహారులు, శాఖాహారులు అనే తేడా లేకుండా ఎవరైనా రక్త దానం చేయవచ్చు. అయితే రక్త దానం చేసేవారికి హిమోగ్లోబిన్ శాతం 12.5 జీఎం కన్నా ఎక్కువ ఉండాలి. అంతే కాదు.. 45 కేజీల కన్నా ఎక్కువ బరువు ఉన్నవారు మాత్రమే రక్త దానం చేయాలి.



అపోహ: టాటూలు వేసుకున్నవారు రక్త దానం చేయకూడదు
వాస్తవం: టాటూలు వేయించుకున్న ఏడాది తర్వాత రక్త దానం చేయవచ్చు.
అపోహ: అరుదైన బ్లడ్ గ్రూపులు ఉన్నవారు రక్త దానం చేస్తే సరిపోతుంది
వాస్తవం: అన్ని బ్లడ్ గ్రూపులవారూ చేసే దానం ఎంతో అవసరం. కొన్ని అరుదైన బ్లడ్ గ్రూపులవారు చేసే దానాలకు ఎక్కువ ప్రచారం వస్తుంది. కానీ అన్ని బ్లడ్ గ్రూపులవారి రక్తం చాలా అవసరం.
అపోహ: బీపీ ఉన్నవారు రక్త దానం చేయకూడదు
వాస్తవం: రక్తదానం చేసే సమయంలో 140-90 కన్నా ఎక్కువ బ్లడ్ ప్రెషర్ ఉండకూడదు. బ్లడ్ ప్రెషర్ మందులు వేసుకొనేవారు కూడా రక్త దానం చేయవచ్చు.
అపోహ: మధుమేహులు రక్త దానం చేయకూడదు
వాస్తవం: ఇన్సులిన్ తీసుకొనేవారు రక్త దానం చేయకూడదు. మధుమేహం కోసం మందులు వాడుతూ, మధుమేహం అదుపులో ఉన్నవారు రక్త దానం చేయవచ్చు.



ఘృతపాత్ర న్యాయం

ఆందోళనను ఆయుర్వేదంలో 'ఘృతపాత్రన్యాయం' అంటారు. మనసు ఆందోళనకు గురైతే శరీరం కూడా ప్రభావితం అవుతుంది. ఉదాహరణకు ఒక చల్లటి పాత్రలో వేడి నూనె పోస్తే.. పాత్ర వేడెక్కుతుంది. అదే వేడిగా ఉన్న పాత్రలో చల్లటి నూనె పోస్తే పాత్ర చల్లబడుతుంది. మనసు, శరీరం కూడా అంతే. ఒకటి సరిగా లేకపోతే మరొకటి ఇబ్బందికి గురవుతుంది. శరీరం, మనసు ఒకదానికొకటి పాడు చేసుకుంటాయి. ఈ మనో దోషాలవల్ల రజస్సు, తమస్సు పెరిగిపోతాయి. సత్వం స్థిరంగా ఉంటుంది. రజస్సు, తమస్సువల్ల అది కూడా అస్తవ్యస్తమవుతుంది. శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారుతుంది. రాత్రి పూట సరిగా నిద్ర పట్టదు. చిన్న విషయానికే చికాకు పడుతుంటారు. ఈ టెన్షన్, కోపం, చికాకు జీర్ణవ్యవస్థ మీద పడుతుంది. దీనివల్ల తిన్న ఆహారం సరిగా జీర్ణం కాదు. తద్వార గ్యాస్ట్రిక్ సమస్య వస్తుంది. ఇలా.. ఒకదానికొకటి సమస్యలు చుట్టుముడతాయి. కొన్నిసార్లు వాంతి అవుతున్నట్లుగా అసహనంగా అనిపిస్తుంది. స్థూలంగా చూస్తే ప్రశాంతంగా ఉండలేరు. స్థితప్రజ్ఞత ఉండదు. ఒత్తిడివల్ల ఆందోళన కలుగుతుంది. కొన్ని రకాల మందులు వాడేవాళ్లలోనూ ఇలాంటి సమస్య వస్తుంది. ఆయుర్వేద వైద్యుల వద్దకు వెళ్తే ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

అవేర్‌నెస్

కొవిషీల్డ్ వ్యాక్సిన్‌ను వేయించుకున్నవారికి దుష్ప్రభావాలు తప్పవా? ప్రస్తుతం అనేకమందిలో ఉన్న అనుమానమిది. గత వారం కొవిషీల్డ్ తయారీ సంస్థ ఆస్ట్రాజెనెకా... తమ వ్యాక్సిన్ తీసుకోవడంవల్ల కలిగే దుష్ప్రభావాలపై ఒక ప్రకటన విడుదల చేసింది. దీంతో అనేకమందిలో రకరకాల అనుమానాలు ప్రారంభమయ్యాయి. అయితే దుష్ప్రభావాల విషయంలో ఎలాంటి భయాలూ పెట్టుకోవాల్సిన అవసరం లేదంటున్నారు 'ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ' (ఏఐజీ) ఇన్‌ఫెక్షస్ డిసీజెస్ నిపుణురాలు డాక్టర్ హరిప్రియా రెడ్డి.

వ్యాక్సిన్‌తో ప్రమాదమేంలేదు

"కొవిషీల్డ్ వ్యాక్సిన్ వేయించుకున్న వారికి సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో విపరీత ప్రచారం జరుగుతోంది. నా ఉద్దేశంలో ఇవన్నీ తప్పుడు ప్రచారాలు. ఇక్కడ ఒక విషయాన్ని అందరూ స్పష్టంగా తెలుసుకోవాలి. ఎప్పుడైనా వ్యాక్సిన్ వేయించుకుంటే... దానివల్ల కలిగే దుష్పరిణామాలు 4 నుంచి 40 రోజుల దాకా మాత్రమే ఉంటాయి. ఆ తర్వాత ఉండవు. కొవిషీల్డ్ వ్యాక్సిన్‌ను వేయించుకొని చాలా కాలం అయిపోయింది కాబట్టి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. అంతే కాకుండా ఈ మధ్యకాలంలో బూస్టర్ వ్యాక్సిన్లు కూడా రాలేదు కాబట్టి ఎలాంటి సమస్యా తలెత్తదు.

జలుబు... దగ్గు వస్తే...

కొవిడ్ వచ్చి తగ్గినవారు కొన్ని ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంది. ముఖ్యంగా జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఉన్నప్పుడు కుటుంబ సభ్యులకు దూరంగా ఉండాలి. వెంటనే మందులు వాడటం మొదలుపెట్టాలి. ఇదే విధంగా మధుమేహం, రక్తపోటు ఉన్నవారు కూడా జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే ఏదైనా సమస్య ఏర్పడితే తగ్గటం చాలా కష్టమవుతుంది.

లాంగ్ కొవిడ్ మాత్రమే సమస్య...

ఏ వ్యాక్సిన్‌నైనా వేసేముందు దానివల్ల లాభాలేమిటి? నష్టాలేమిటి అనే విషయాన్ని గమనిస్తారు. నష్టం కన్నా లాభం ఎక్కువ ఉందని అనిపిస్తేనే దానిని అనుమతిస్తారు. ఉదాహరణకు కొవిషీల్డ్‌ను ఉపయోగించిన 10 లక్షల మందిలో ఒకరికి ఇబ్బంది కలిగిందనుకుందాం. అది సమస్య కాదు. కొవిషీల్డ్ వ్యాక్సిన్‌ను వందల కోట్ల మంది వేయించుకున్నారు. అందువల్ల కొందరికి కొన్ని సమస్యలు ఏర్పడి ఉండచ్చు. ఇక్కడ ఇంకో విషయాన్ని చెప్పుకోవాలి. ఒక వంద మందికి కొవిడ్ వస్తే... వారిలో పది మందిలో మాత్రమే తీవ్రత చాలా ఎక్కువగా ఉందని గణాంకాలు చెబుతున్నాయి. ఈ పది మందిలోనూ ముగ్గురికి తరచూ జ్వరం రావటం, జ్ఞాపకశక్తి తగ్గటం, నిద్రలేమి, కొందరిలో సంతానలేమి మొదలైన సమస్యలు రెండేళ్ల పాటు కొనసాగుతూనే ఉన్నాయి. దీనినే లాంగ్ కొవిడ్ అంటున్నాం. దీనివల్ల ప్రాణాలకు ప్రమాదం ఉండదు. కానీ లక్షణాలు మాత్రం చికాకు పెడుతూ ఉంటాయి.

కచ్చితంగా చెప్పలేం...

మళ్లీ కొవిడ్ వస్తే..? చాలామంది ఈ ప్రశ్న అడుగుతున్నారు. కానీ నా ఉద్దేశంలో మళ్లీ అంత తీవ్రతతో కొవిడ్ రాదు. ఒకవేళ వచ్చినా అందరిలోనూ యాంటీబాడీలు ఉత్పత్తి అయ్యాయి కాబట్టి దానివల్ల కలిగే ఫలితాలు అంత తీవ్రంగా ఉండవు. ఇక కొందరు... కొవిడ్‌వల్ల జన్యుపరంగా ఏవైనా మార్పులు వచ్చే అవకాశం ఉందా? అని అడుగుతున్నారు. ఇప్పటిదాకా ఈ విషయంపై కొన్ని పరిశోధనలు జరిగాయి. కానీ జన్యువుల్లో మార్పులు జరిగాయనటానికి కచ్చితమైన ఆధారాలేవీ లేవు.



'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/HGxEqEZలో చదవండి.

రికార్డు స్థాయికి ఎంఎఫ్‌ల పెట్టుబడులు

మార్చి త్రైమాసికంలో రూ.81,539 కోట్లు ఇన్వెస్ట్

11 నెలల కనిష్ఠ స్థాయికి ఎఫ్‌పీఐల వాటా



న్యూఢిల్లీ: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ)లో నమోదైన కంపెనీల షేర్లలో మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) పెట్టుబడులు రికార్డు స్థాయికి చేరాయి. 2024 మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఈ కంపెనీల ఈక్విటీలో ఎంఎఫ్‌ల పెట్టుబడులు గతంలో ఎన్నడూ లేని విధంగా 8.92 శాతానికి చేరాయి. 2023 డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే ఇది 0.11 శాతం ఎక్కువ. మార్చి త్రైమాసికంలో ఎంఎఫ్‌లు.. ఈక్విటీ మార్కెట్‌లో రూ.81,539 కోట్లు పెట్టుబడి పెట్టాయి.

ఎల్ఐసీదే అగ్రస్థానం

ఎన్ఎస్ఈ లిస్టెడ్ కంపెనీల షేర్లలో సంస్థాగత మదుపరుల పెట్టుబడుల విషయంలో ఎల్ఐసీదే అగ్రస్థానం. ఈ ఏడాది మార్చి నెలాఖరుకు ఎన్ఎస్ఈలో లిస్టయిన దాదాపు 280 కంపెనీల ఈక్విటీలో ఎల్ఐసీ ఒక శాతానికి పైగా వాటా కలిగి ఉంది. మొత్తం పెట్టుబడులను పరిగణనలోకి తీసుకుంటే 2023 డిసెంబరు త్రైమాసికానికి ఈ కంపెనీల ఈక్విటీలో ఎల్ఐసీకి సగటున 3.64 శాతం వాటా ఉంది. మార్చి త్రైమాసికానికి ఇది 3.75 శాతానికి పెరిగింది.

తగ్గిన ఎఫ్‌పీఐల వాటా

అయితే ఈ ఏడాది మార్చి త్రైమాసికంలో ఎన్ఎస్ఈ లిస్టెడ్ కంపెనీల ఈక్విటీలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) పెట్టుబడులు 18.19 శాతం నుంచి 17.68 శాతానికి పడిపోయాయి. గత 11 ఏళ్లలో ఎఫ్‌పీఐల పెట్టుబడులు ఈ స్థాయికి పడిపోవడం ఇదే మొదటిసారి. ఇదే సమయంలో ఎంఎఫ్‌లు, బీమా కంపెనీలు, బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీ వంటి దేశీయ సంస్థాగత మదుపరుల (డీఐఐ) పెట్టుబడుల వాటా 15.96 శాతం నుంచి 16.05 శాతానికి పెరిగాయి.

మార్చి త్రైమాసికంలో ఈ సంస్థలన్నీ కలిసి దేశీయ స్టాక్ మార్కెట్లో రూ.1.08 లక్షల కోట్లు మదుపు చేయడం ఇందుకు ప్రధాన కారణం. పెట్టుబడుల జోరు ఇదే స్థాయిలో కొనసాగితే వచ్చే కొద్ది త్రైమాసికాల్లో డీఐఐల పెట్టుబడులు ఎఫ్‌పీఐలను మించి పోతాయని ప్రైమ్‌డేటా బేస్ గ్రూప్ ఎండీ ప్రణవ్ హల్దియా అంటున్నారు.

నెఫ్రోప్లస్‌లో క్వాడ్రియా క్యాపిటల్ రూ.850 కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్: ప్రైవేట్ ఈక్విటీ సంస్థ క్వాడ్రియా క్యాపిటల్ నుంచి సీరిస్ ఎఫ్ రౌండ్‌లో రూ.850 కోట్లు సమీకరించినట్లు డయాలసిస్ నెట్‌వర్క్ సంస్థ నెఫ్రోప్లస్ వెల్లడించింది. లావాదేవీలో భాగంగా నెఫ్రోప్లస్‌లోని ప్రస్తుత వాటాదారుల నుంచి షేర్లు కొనుగోలు చేయటంతో పాటు కంపెనీలో మైనారిటీ వాటాను క్వాడ్రియా క్యాపిటల్ దక్కించుకోనుంది. కాగా భారతీయ నెఫ్రాలజీ రంగంలో ఇంత పెద్దమొత్తంలో నిధులు సమీకరించటం ఇదే తొలిసారి. గడిచిన కొన్నేళ్లుగా కంపెనీ వ్యాపారం గణనీయంగా పుంజుకుంటూ వస్తోందని, దాదాపు 30,000 మంది రోగులకు నాణ్యమైన డయాలసిస్ సేవలను అందిస్తున్నట్లు నెఫ్రోప్లస్ వ్యవస్థాపకుడు, సీఈఓ విక్రమ్ ఉప్పల తెలిపారు. క్వాడ్రియా పెట్టుబడులతో భారత్ సహా ఆసియా వ్యాప్తంగా కంపెనీ కార్యకలాపాలను మరింతగా విస్తరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2010లో కార్యకలాపాలు ప్రారంభించిన నెఫ్రోప్లస్ ప్రస్తుతం భారత్, ఫిలిప్పీన్స్, ఉజ్బెకిస్థాన్‌లలోని 250కి పైగా పట్టణాలు, నగరాల్లో 450 డయాలసిస్ కేంద్రాలను నిర్వహిస్తోంది.

'ఎన్ఆర్ఐ'లకూ యూపీఐ చెల్లింపుల సౌకర్యం

ఐసీఐసీఐ బ్యాంక్

దుబాయ్: ఐసీఐసీఐ బ్యాంక్ తన ఎన్ఆర్ఐ ఖాతాదారుల కోసం మరో ప్రత్యేక సౌలభ్యం కల్పించింది. వీరు ఇక తమ ఎన్ఆర్ఈ/ఎన్ఆర్ఓ ఖాతాలతో అనుసంధానమైన అంతర్జాతీయ మొబైల్ ఫోన్ నంబర్ల ద్వారా దేశంలో యూపీఐ చెల్లింపులను అప్పటికప్పుడు చేయవచ్చు. దీంతో తమ ఎన్ఆర్ఐ ఖాతాదారులు రోజువారీ చేసే యుటిలిటీ బిల్లుల చెల్లింపులు, మర్చంట్ అండ్ ఈ-కామర్స్ లావాదేవీలు అత్యంత సౌకర్యవంతంగా మారతాయని బ్యాంక్ తెలిపింది. తమ 'ఐమొబైల్ పే' యాప్ ద్వారా ఎన్ఆర్ఐ ఖాతాదారులకు ఈ సౌకర్యం కల్పిస్తున్నట్టు పేర్కొంది. అమెరికా, బ్రిటన్, యూఏఈ, కెనడా, సింగపూర్, ఆస్ట్రేలియా, హాంకాంగ్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియాలోని ఎన్ఆర్ఐ ఖాతాదారులకు మాత్రమే ఈ సౌకర్యం లభిస్తుందని బ్యాంక్ తెలిపింది.

జూన్ 6 నుంచి స్పెక్ట్రమ్ వేలం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పెక్ట్రమ్ వేలానికి సిద్ధమవుతోంది. జూన్ 6 నుంచి ఈ వేలం ప్రారంభం కానుంది. దాదాపు రూ.96,317 కోట్ల కనీస ధరతో ప్రభుత్వం ఈ స్పెక్ట్రమ్‌ను వేలం వేయనుంది. ఈ వేలంలో పాల్గొనేందుకు రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా కంపెనీలు ఇప్పటికే ఆసక్తి వ్యక్తం చేశాయి. గతంలోలా అదానీ గ్రూప్ నుంచి మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదు. 800, 900, 1800, 2,100, 2,300, 2,500, 3,300 మెగాహెర్ట్జ్ బ్యాండ్స్‌తో పాటు 26 గిగా హెర్ట్జ్ బ్యాండ్ స్పెక్ట్రాన్ని ప్రభుత్వం వేలం వేయనుంది. ఈ వేలంలో అత్యధిక ధర చెల్లించిన కంపెనీ ఆయా స్పెక్ట్రమ్‌ను 20 ఏళ్ల పాటు వినియోగించుకోవచ్చు. ఈ చెల్లింపులను 20 వార్షిక వాయిదాల్లో చెల్లించాలి.

నరేశ్ గోయల్‌కు బెయిల్

ముంబై: జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేశ్ గోయల్‌కు బాంబే హైకోర్టులో కొద్దిగా ఊరట లభించింది. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయనకు కోర్టు రెండు నెలల తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. అయితే ఇందుకోసం ఆయన తన పాస్‌పోర్టును ఈడీ అధికారులకు అప్పగించడంతో పాటు రూ.లక్షకు పూచీకత్తు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. అలాగే ట్రయల్ కోర్టు అనుమతి లేకుండా ముంబై దాటిపోవద్దని కోరింది. అక్రమ నగదు లావాదేవీల చట్టం (పీఎంఎల్ఏ) కింద ఈడీ గత ఏడాది సెప్టెంబరులో గోయల్‌ను అరెస్టు చేసింది.

ఆగస్టు నుంచి బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు !

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఎట్టకేలకు 4జీ సేవల్లోకి ప్రవేశిస్తోంది. ఆగస్టులో దేశవ్యాప్తంగా ఈ సేవలు ప్రారంభించనున్నట్టు పేరు చెప్పేందుకు ఇష్టపడని బీఎస్ఎన్ఎల్ అధికార వర్గాలు చెప్పాయి. ఇందుకు అవసరమైన టెక్నాలజీని బీఎస్ఎన్ఎల్ పూర్తిగా దేశీయంగా సమకూర్చుకుంటోంది. సీ-డాట్, టీసీఎస్, ఐటీఐ సమకూర్చిన సాఫ్ట్‌వేర్, పరికరాలతో కంపెనీ గత ఏడాది కాలంగా పంజాబ్ సర్కిల్‌తో పాటు మరికొన్ని సర్కిళ్లలో 4జీ సేవలు అందిస్తోంది. ఈ పరీక్షలు విజయవంతం కావడంతో ఆగస్టులో దేశవ్యాప్తంగా ఈ సేవలు ప్రారంభించాలని యోచిస్తోంది. ఈ 4జీ పరికరాలను అవసరమైతే 5జీ సేవలకు కూడా అప్‌గ్రేడ్ చేయవచ్చని బీఎస్ఎన్ఎల్ వర్గాలు చెప్పాయి.

బీఏఎస్ఎఫ్ నుంచి 'ఎఫికాన్' కీటక నాశిని

280 ఎంఎల్ బాటిల్ ధర రూ.1,830



హైదరాబాద్: ప్రముఖ పురుగు మందుల తయారీ కంపెనీ బీఏఎస్ఎఫ్ 'ఎఫికాన్' పేరుతో ప్రత్యేక క్రిమిసంహారక మందును భారత మార్కెట్లోకి విడుదల చేసింది. పత్తి వంటి వాణిజ్య పంటలతో పాటు కూరగాయల మొక్కలను నాశనం చేసే పేను బంక, తెల్ల దోమ, పచ్చ దోమలను ఈ మందు సమర్థవంతంగా అడ్డుకుంటుందని కంపెనీ ఆసియా పసిఫిక్ ప్రాంత అగ్రికల్చరల్ సొల్యూషన్స్ విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సైమన్ బర్గ్ విలేకరులతో చెప్పారు. భారత్‌తో పాటు అనేక దేశాల్లో ఈ క్రిముల కారణంగా పంటల ఉత్పాదకత 35 నుంచి 40 శాతం పడిపోతోంది. ఎఫికాన్ ఈ బెడదను సమర్థవంతంగా ఎదుర్కొంటుందని బర్గ్ తెలిపారు. ఇప్పటికే ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా దేశాల రైతులు ఈ క్రిమినాశిని మందును ఉపయోగిస్తున్నట్టు చెప్పారు. రూ.1,830 ధరతో 280 ఎంఎల్ బాటిల్స్‌లో ఇది లభిస్తుందని బీఏఎస్ఎఫ్ అగ్రికల్చరల్ సొల్యూషన్స్ బిజినెస్ డైరెక్టర్ గిరిధర్ రణువ చెప్పారు. ఎకరా పైరుకు ఒక 280 బాటిల్ ఎఫికాన్ సరిపోతుందన్నారు. పిచికారీ చేసిన తర్వాత పంటలపై దీని ప్రభావం చాలా కాలం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఈ క్రిమినాశిని మందుకు అవసరమైన ఫార్ములేషన్‌ను సింగపూర్ నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు చెప్పారు. త్వరలోనే ఈ ఫార్ములేషన్‌ను భారత్‌లో తయారు చేస్తామన్నారు. వచ్చే ఏడాది వరి పంటకు సోకే క్రిమి కీటకాలను నాశనం చేసే ప్రత్యేక క్రిమిసంహారక మందును మార్కెట్లోకి విడుదల చేయబోతున్నట్టు గిరిధర్ చెప్పారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,050 ▲	66,050 ▲	87,500 ▲
ముంబై	71,816 ▲	65,784 ▲	81,892 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

7వ తేదీ

హైదరాబాద్	480	విజయవాడ	460
వరంగల్	482	గోదావరి	460
చిత్తూరు	563	విశాఖపట్నం	470

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	138	గోదావరి	146
వరంగల్	138	విజయవాడ	146
కరీంనగర్	138	గుంటూరు	146
మహబూబ్‌నగర్	138	ఒంగోలు	146
కర్నూలు	138	చిత్తూరు	145
విశాఖపట్నం	138		

హైదరాబాద్‌లో 48 ఎకరాలు కొనుగోలు చేసిన మైక్రోసాఫ్ట్

హైదరాబాద్: సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలంలోని ఎలికట్ట గ్రామంలో రూ.267 కోట్లతో 48 ఎకరాలు కొనుగోలు చేసింది. గత నెల 18న దీనికి సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయింది. ఈ డాక్యుమెంట్ల ప్రకారం మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ (ఇండియా) ఒక్కో ఎకరానికి రూ.5.56 కోట్లు చెల్లించింది. డేటా సెంటర్ల ఏర్పాటు కోసం 2022లోనూ మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌లో రూ.275 కోట్లతో మూడు చోట్ల భూమి కొనుగోలు చేసింది.

విదేశీ విమానయాన ట్రాఫిక్‌లో సగం వాటా భారత సంస్థలదే

న్యూఢిల్లీ: మన దేశం నుంచి విదేశీ సందర్శనలకు వెళ్లే ప్రయాణికుల్లో సగం మందిని 2027-28 నాటికి భారత విమానయాన సంస్థలు వారి గమ్యాలకు తరలిస్తాయని క్రిసిల్ రేటింగ్స్ తాజా అధ్యయనంలో తేలింది. ప్రస్తుతం ఈ వాటా 43 శాతం ఉంది. భారత విమానయాన సంస్థలు అదనంగా విమానాలు, కొత్త రూట్లు ప్రవేశపెట్టడం, విదేశీ విమానయాన సంస్థలతో పోల్చితే మెరుగైన కనెక్టివిటీ కలిగి ఉండడం భారత విమానయాన రంగం బలమని క్రిసిల్ పేర్కొంది. గత 15 నెలల కాలంలో భారత విమానయాన సంస్థలు 55 కొత్త అంతర్జాతీయ రూట్లకు విమాన సర్వీసులను విస్తరించాయి.

జోరు లేని మార్కెట్

17 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

ముంబై: భారత షేర్లు అధిక విలువల్లో ట్రేడవుతున్నాయన్న ఆందోళనల కారణంగా దిగ్గజ కంపెనీల్లో ఇన్వెస్టర్లు లాభాల స్వీకారానికి దిగడంతో సోమవారం మార్కెట్ పరిమిత పరిధిలోనే కదలాడి చివరికి ఫ్లాట్‌గా ముగిసింది. ఇంట్రాడేలో 74,359.69 నుంచి 73,786.29 పాయింట్ల మధ్యన కదలాడిన సెన్సెక్స్ చివరికి 17.39 పాయింట్ల లాభంతో 73,895.54 వద్ద ముగిసింది. అయితే నిఫ్టీ మాత్రం 33.15 పాయింట్ల నష్టంతో 22,442.70 వద్ద క్లోజైంది. సెన్సెక్స్ షేర్లలో కోటక్ మహీంద్రా బ్యాంక్ 5 శాతం లాభంతో అగ్రస్థానంలో నిలవగా టీసీఎస్, హెచ్‌యూఎల్, ఎం అండ్ ఎం, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా, ఇండస్ ఇండ్ బ్యాంక్ లాభపడిన షేర్లలో ఉన్నాయి.

9 నుంచి ఎనర్జీ మిషన్ మెషనరీస్ ఐపీఓ: వచ్చే గురువారం ప్రారంభం కానున్న ఎనర్జీ మిషన్ మెషినరీస్ ఐపీఓలో షేరు ధర శ్రేణిని రూ.131-138గా నిర్ణయించారు. రూ.41 కోట్ల సమీకరణ లక్ష్యంతో కంపెనీ మార్కెట్లోకి వస్తోంది. ఈ ఇష్యూ మే 13న ముగుస్తుంది. షేర్లు ఎన్ఎస్ఈ ఎస్ఎంఈ ఎమర్జ్‌లో లిస్టింగ్ అవుతాయి. ఇష్యూలో భాగంగా ఒక్కోటి రూ.10 ముఖ విలువ గల 29.82 లక్షల ఈక్విటీ షేర్లు జారీ చేస్తారు.

ఐపీఓకు బ్రెయిన్ బీస్ తిరిగి దరఖాస్తు: ఆన్‌లైన్ ఈ-కామర్స్ వేదిక ఫస్ట్ క్రై మాతృసంస్థ బ్రెయిన్ బీస్ సొల్యూషన్స్ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి తిరిగి దరఖాస్తు చేసింది. కంపెనీ కీలక సమాచారం అసంపూర్తిగా ఇచ్చిన కారణంగా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తూ సెబీ గతంలో చేసిన దరఖాస్తును తిప్పి పంపింది. కొత్తగా చేసిన దరఖాస్తులో కూడా కంపెనీ నిధుల సమీకరణ లక్ష్యంలో ఎలాంటి మార్పు చేయలేదు.

పీ నోట్ పెట్టుబడులు ఆరేళ్ల గరిష్ఠం: భారత మార్కెట్లో పార్టిసిపేటరీ నోట్ల (పీ నోట్) ద్వారా పెట్టుబడులు ఫిబ్రవరి చివరి నాటికి రూ.1,49,517 కోట్లకు చేరాయి. ఇది ఆరేళ్ల గరిష్ఠ స్థాయి. దేశీయ ఆర్థిక వ్యవస్థలో బలం ఇందుకు మద్దతు ఇచ్చింది. భారత ఈక్విటీ, డెట్, హైబ్రిడ్ సెక్యూరిటీల్లో పెట్టుబడులన్నింటినీ ఇందులో పరిగణనలోకి తీసుకున్నారు. జనవరిలో పీ నోట్ పెట్టుబడుల విలువ రూ.1,43,011 కోట్లుంది. 2017 జూన్ తర్వాత పీ నోట్ పెట్టుబడులు ఇంత గరిష్ఠంగా రావడం ఇదే ప్రథమం. ఫిబ్రవరిలో వచ్చిన పీ నోట్ పెట్టుబడుల్లో 1.27 లక్షల కోట్లు ఈక్విటీల్లోకి, రూ.21,303 కోట్లు డెట్ సెక్యూరిటీల్లోకి, రూ.541 కోట్లు హైబ్రిడ్ సెక్యూరిటీల్లోకి వచ్చాయి.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్ | రాత్రి 7.30 గం. | వేదిక: ఢిల్లీ
ఢిల్లీ X రాజస్థాన్



ఒలింపిక్స్‌కు 4X400 రిలే జట్లు

నసౌ (బహమాస్): భారత పురుషులు, మహిళల 4×400 రిలే జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాయి. వరల్డ్ అథ్లెటిక్స్ రిలేలో సోమవారం జరిగిన రెండో రౌండ్ హీట్స్‌లో తెలుగమ్మాయి దండి జ్యోతికశ్రీ, రూపల్, పూవమ్మ, శుభా వెంకటేశన్‌లతో కూడిన జట్టు 3 నిమిషాల 29.35 సెకన్ల టైమింగ్‌తో రెండో స్థానంలో నిలిచి పారిస్‌కు క్వాలిఫై అయింది. అనాస్, అజ్మల్, రాజీవ్, జాకబ్‌లతో కూడిన పురుషుల రిలే జట్టు 3 నిమిషాల 3.23 సెకన్లలో రేస్ పూర్తి చేసింది. అమెరికా తర్వాత రెండో స్థానంలో నిలిచి పారిస్ బెర్త్‌ను పట్టేసింది.

విజయంలో తెలుగమ్మాయి


జ్యోతికశ్రీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): రిలేలో భారత్‌కు పారిస్ ఒలింపిక్ బెర్త్ అందించిన క్రీడాకారిణల బృందంలో తెలుగమ్మాయి దండి జ్యోతికశ్రీ కూడా సభ్యురాలు. జ్యోతిక స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా తణుకు. దిగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన జ్యోతిక తండ్రి శ్రీనివాసరావు ఇనుప బీరువాలు తయారు చేసి, కుటుంబాన్ని పోషిస్తాడు. తల్లి లక్ష్మీ నాగ వెంకటేశ్వరి గృహిణి. శ్రీనివాసరావుకు క్రీడలపై ఉన్న ఆసక్తితో జ్యోతికను ఐదేళ్ల వయస్సు నుంచి ఆ దిశగా నడిపించాడు. 2021 వరకు విజయవాడ 'సాయ్' కేంద్రంలో శిక్షణ తీసుకున్న జ్యోతిక, అక్కడి కోచ్ వినయ్ సహకారంతో హైదరాబాద్ సాయ్ సెంటర్‌కు మారింది. అక్కడి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ గత రెండేళ్లగా జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న జ్యోతిక, అనతి

ఈ కప్పులో ఇతడే పెద్దోడు



కంపాల (ఉగాండా): ఉగాండా జట్టు ఆఫ్ స్పిన్నర్ ఫ్రాంక్ ఎన్‌సుబుగా (43 ఏళ్ల 252 రోజులు) ఈ వరల్డ్ కప్‌లో ఆడుతున్న అతి పెద్ద వయస్సు క్రికెటర్‌గా రికార్డు సృష్టించనున్నాడు. ఇక బ్రయాన్ మసాబా సారథ్యంలోని 15 మంది సభ్యుల జట్టును ఉగాండా బోర్డు సోమవారం ప్రకటించింది. కాగా న్యూజిలాండ్, వెస్టిండీస్ తదితర జట్లతో కలిసి ఉగాండా టీమ్ గ్రూప్-సిలో ఉంది.

ప్రపంచకప్‌నకు ఉగ్ర ముప్పు



పోర్ట్ ఆఫ్ స్పెయిన్: వెస్టిండీస్, యూఎస్ఏలో జరిగే టీ20 ప్రపంచకప్‌నకు ఉగ్రవాదుల నుంచి ముప్పు ఉన్నట్టు కథనాలు వెలువడుతున్నాయి. వీటిని ట్రినిడాడ్ అండ్ టుబాగో ప్రధాని కీత్ రోలీ కూడా ధ్రువీకరించారు. ఉత్తర పాకిస్థాన్‌కు చెందిన ఇస్లామిక్ స్టేట్ సంస్థ తమ మీడియా ద్వారా ఇలాంటి హెచ్చరికలను జారీ చేస్తున్నట్టు తెలుస్తోంది. అయితే పరిస్థితిని ఐసీసీ కూడా నిశితంగా గమనిస్తోందని ట్రినిడాడ్ ప్రధాని స్పష్టం చేశారు.

సూర్య ప్రతాపం

51 బంతుల్లో అజేయ శతకం

ముంబై ఘనవిజయం ● సన్‌రైజర్స్‌కు నిరాశ


సూర్యకుమార్ (51 బంతుల్లో 102 నాటౌట్)

3 టీ20ల్లో ఎక్కువ శతకాలు (6) బాదిన మూడో భారత బ్యాటర్‌గా రుతురాజ్, రాహుల్‌తో సమంగా నిలిచిన సూర్య. విరాట్ (9), రోహిత్ (8) ముందున్నారు.

ముంబై: టీ20ల్లో వరల్డ్ నెంబర్‌వన్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ (51 బంతుల్లో 12 ఫోర్లు, 6 సిక్సర్లతో 102 నాటౌట్) స్థాయికి తగ్గ ప్రదర్శనతో చెలరేగాడు. స్వల్ప ఛేదనలో ముంబై ఇండియన్స్ కాస్త తడబడినా.. తన అజేయ శతకంతో అద్భుతంగా పుంజుకుంది. దీంతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. పట్టికలోనూ తమ ఆఖరి స్థానాన్ని కాస్త మెరుగుపర్చుకుంది. అటు కమిన్స్ సేన మాత్రం బ్యాటింగ్, బౌలింగ్‌లోనూ విఫలమైంది. ముందుగా సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 173 పరుగులు చేసింది. హెడ్ (48), కమిన్స్ (17 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 35 నాటౌట్) రాణించారు. హార్దిక్ పాండ్యా, పీయూష్ చావ్లాలకు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ముంబై 17.2 ఓవర్లలో 3 వికెట్లకు 174 పరుగులు చేసి గెలిచింది. తిలక్ వర్మ (37 నాటౌట్) అండగా నిలిచాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సూర్య నిలిచాడు.

సూర్య-తిలక్ శతక భాగస్వామ్యం: ఓ మాదిరి ఛేదనలో ముంబై ఇన్నింగ్స్ సైతం రైజర్స్ మాదిరే సాగింది. తొలి ఐదు ఓవర్లలోనే ఇషాన్ (9), రోహిత్ (4), నమన్ ధిర్ (0)ల వికెట్లను కోల్పోయింది. అప్పటికి స్కోరు 31 మాత్రమే. గత 12 మ్యాచ్‌ల్లో కేవలం రెండుసార్లు మాత్రమే ముంబై ఓపెనర్లు పవర్‌ప్లే దాటడం గమనార్హం. అయితే సూర్యకుమార్ తన స్ట్రోక్‌ప్లేతో అదరగొట్టగా.. అతడికి తిలక్ చక్కటి సహకారం అందించాడు. ఆరో ఓవర్‌లో తిలక్ 4,4 సూర్య 6తో 16 రన్స్ రాగా.. తర్వాతి ఓవర్‌లోనే సూర్య మరింత చెలరేగి 4,4,6,6తో 22 రన్స్ రాబట్టాడు. దీంతో స్కోరు గాడిన పడింది. అటు రైజర్స్ బౌలర్లు కూడా ఈ జోడీని విడదీసేందుకు చెమటోడ్చాల్సి వచ్చింది. వరుస ఫోర్లతో ఆకట్టుకున్న సూర్య 30 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. 17వ ఓవర్‌లోనైతే వరుసగా 4,4,6తో 18 రన్స్ రాబట్టి సెంచరీ ముంగిట నిలిచాడు. చివర్లో జట్టు విజయానికి ఏడు.. సూర్య శతకానికి ఆరు పరుగులు అవసరమైన దశలో తిలక్ సింగిల్ తీయగా, సూర్య సిక్స్‌తో మ్యాచ్‌ను ముగించాడు. నాలుగో వికెట్‌కు ఇద్దరూ అజేయంగా 143 పరుగులు అందించడం విశేషం.

ఆఖర్లో కోలుకుని..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ తన సహజశైలిలో దూకుడు కనబర్చలేకపోయింది. ఓపెనర్ హెడ్ బ్యాట్ నుంచి పెద్దగా మెరుపులు కనిపించలేదు. అయితే ఆఖర్లో కెప్టెన్ కమిన్స్ పుణ్యమా అని కాస్త పరుగులు జత చేరడంతో స్కోరు 170 దాటగలిగింది. పవర్‌ప్లేలో 56/1తో సన్‌రైజర్స్ ఫర్వాలేదనిపించినా.. ఆ తర్వాత ముంబై బౌలర్లు వికెట్లతో పాటు రన్స్‌ను కట్టడి చేశారు. దీంతో హెడ్ 11వ ఓవర్ వరకు ఉన్నా స్కోరు వంద పరుగులు కూడా దాటలేకపోయింది. ఐదో ఓవర్‌లోనే హెడ్‌ను అరంగేట్ర పేసర్ అన్షుల్ అవుట్ చేసినా అది నోబ్‌గా తేలింది. అటు 6,4,4తో అతను ఆ ఓవర్‌లో 19 రన్స్ రాబట్టాడు. మరో ఓపెనర్ అభిషేక్ (11)ను ఆరో ఓవర్‌లో బుమ్రా పెవిలియన్ చేర్చాడు. ఇక, అన్షుల్ ఇన్నింగ్స్ ఎనిమిదో ఓవర్‌లోనూ హెడ్ క్యాచ్‌ను తుషార వదిలేశాడు. అదే ఓవర్‌లో మయాంక్ అగర్వాల్ (5)ను అవుట్ చేసిన అన్షుల్ కెరీర్‌లో తొలి వికెట్‌తో సంతృప్తి చెందాడు. ఆ తర్వాత నితీశ్ వచ్చీ రాగానే రెండు ఫోర్లతో ఆకట్టుకున్నాడు. కానీ స్పిన్నర్ పీయూష్ చావ్లా తన వరుస ఓవర్లలో హెడ్, క్లాసెన్ (2)లను అవుట్ చేయగా.. నితీశ్‌ను హార్దిక్ వెనక్కిపంపడంతో 96/5 స్కోరుతో జట్టు కష్టాల్లో పడింది. ఈ దశలో మార్కో జాన్సెన్ (17) 6,4తో జోరు ప్రదర్శించాడు. అయితే ఆ వెంటనే 16వ ఓవర్‌లో షాబాజ్ (10), జాన్సెన్‌ల వికెట్లతో హార్దిక్ ఝలక్ ఇచ్చాడు. ఇక అబ్దుల్ సమద్ (3)ను చావ్లా ఎల్బీ చేయడంతో రైజర్స్ 150 స్కోరు కూడా కష్టమే అనిపించింది. కానీ కెప్టెన్ కమిన్స్ ఆఖర్లో అదరగొట్టాడు. బుమ్రా ఓవర్‌లో ఫోర్ బాదిన అతను తుషారను లక్ష్యంగా చేసుకుని చివరి ఓవర్‌లో 6,4తో 17 రన్స్ రాబట్టడంతో జట్టు మెరుగ్గానే కోలుకుంది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	11	8	3	0	16	1.453
రాజస్థాన్	10	8	2	0	16	0.622
చెన్నై	11	6	5	0	12	0.700
హైదరాబాద్	11	6	5	0	12	-0.065
లఖ్‌నవూ	11	6	5	0	12	-0.371
ఢిల్లీ	11	5	6	0	10	-0.442
బెంగళూరు	11	4	7	0	8	-0.049
పంజాబ్	11	4	7	0	8	-0.187
ముంబై	12	4	8	0	8	-0.212
గుజరాత్	11	4	7	0	8	-1.320

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: హెడ్ (సి) తిలక్ (బి) చావ్లా 48, అభిషేక్ (సి) ఇషాన్ (బి) బుమ్రా 11, మయాంక్ (బి) అన్షుల్ 5, నితీశ్ (సి) అన్షుల్ (బి) హార్దిక్ 20, క్లాసెన్ (బి) చావ్లా 2, జాన్సెన్ (బి) హార్దిక్ 17, షాబాజ్ (సి) సూర్య (బి) హార్దిక్ 10, అబ్దుల్ (ఎల్బీ) చావ్లా 3, కమిన్స్ (నాటౌట్) 35, సన్వీర్ (నాటౌట్) 8, **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 20 ఓవర్లలో 173/8; వికెట్ల పతనం:** 1-56, 2-68, 3-90, 4-92, 5-96, 6-120, 7-124, 8-136; **బౌలింగ్:** నువాన్ తుషార 4-0-42-0, అన్షుల్ కాంబోజ్ 4-0-42-1, బుమ్రా 4-0-23-1, హార్దిక్ 4-0-31-3, పీయూష్ చావ్లా 4-0-33-3.

ముంబై: ఇషాన్ (సి) మయాంక్ (బి) జాన్సెన్ 9, రోహిత్ (సి) క్లాసెన్ (బి) కమిన్స్ 4, నమన్ ధిర్ (సి) జాన్సెన్ (బి) భువనేశ్వర్ 0, సూర్యకుమార్ (నాటౌట్) 102, తిలక్ (నాటౌట్) 37, **ఎక్స్‌ట్రాలు: 22; మొత్తం: 17.2 ఓవర్లలో 174/3; వికెట్ల పతనం:** 1-26, 2-31, 3-31; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-1-22-1, జాన్సెన్ 3-0-45-1, కమిన్స్ 4-1-35-1, నటరాజన్ 3.2-0-31-0, నితీశ్ 2-0-16-0, షాబాజ్ 1-0-11-0.

నాలుగో టీ20 కూడా మనదే

సిల్హెట్: బంగ్లాదేశ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో భారత మహిళల జైత్రయాత్ర కొనసాగుతోంది. సోమవారం జరిగిన నాలుగో మ్యాచ్‌లోనూ హర్మన్‌ప్రీత్ కౌర్ సేన 56 పరుగుల తేడాతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో నెగ్గింది. వర్షం వల్ల మ్యాచ్‌ను 14 ఓవర్లకు కుదించగా తొలుత భారత్ 122/6 స్కోరు చేసింది. ఇక..డక్‌వర్త్ నిబంధన ప్రకారం బంగ్లాదేశ్ లక్ష్యాన్ని 125 పరుగులుగా నిర్ధారించారు. అయితే ఛేదనలో బంగ్లా 14 ఓవర్లలో 68/7 స్కోరుకే పరిమితమై ఓడింది.

సరీన్ ఓ చీటర్!


భారత యువ జీఎంపై క్రామ్నిక్ ఆరోపణ

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ పోటీల్లో భారత యువ గ్రాండ్ మాస్టర్, 19 ఏళ్ల నిహాల్ సరీన్ మోసానికి పాల్పడుతున్నాడంటూ మాజీ వరల్డ్ చాంపియన్ వ్లాదిమిర్ క్రామ్నిక్ (రష్యా) ఎక్స్‌లో సంచలన ఆరోపణలు చేశాడు. అయితే, అతడు ఇలాంటి నిందలు వేయడం ఇదే తొలిసారి కాదు. గతంలో అమెరికా జీఎం నకమురా కూడా గేమ్‌లో మోసం చేస్తున్నాడంటూ గందరగోళం సృష్టించాడు. కాగా, క్రామ్నిక్ ఆరోపణల నేపథ్యంలో చెస్ సోషల్ నెట్‌వర్కింగ్ సైట్‌గా కూడా పనిచేస్తున్న 'చెస్.కామ్' అతడి బ్లాగ్‌ను నిలిపేసింది. టాప్-10 ప్లేయర్లపై సరీన్ విజయాలు 99.99 శాతం అసాధ్యమనేది క్రామ్నిక్ వాదన. ఈ నేపథ్యంలో సరీన్‌తో ముఖాముఖిగా తలపడాలని అతడి మేనేజర్ సవాల్ విసిరాడు.

మీ 'ఇంటి గోల' భరించలేకున్నాం

సచిన్‌పై పొరుగింటి వ్యక్తి ఫిర్యాదు

ముంబై: సచిన్ టెండూల్కర్ ఇంటి నిర్మాణం పురస్కరించుకొని వస్తున్న శబ్దాలను భరించలేకున్నామని అతడి పొరుగింటి వ్యక్తి ఒకరు సోషల్ మీడియాలో ఫిర్యాదు చేశాడు. బాంద్రాలో సచిన్ ఇంటి పక్కన ఉండే దిలీప్ డిసౌజా 'ఎక్స్'లో చేసిన ఫిర్యాదు విపరీతంగా వైరల్ అవుతోంది. 'రాత్రి 9 అయ్యింది. ఉదయం నుంచి మీ ఇంటివద్ద వున్న కాంక్రీట్ మిక్సర్ వాహనం పెద్ద శబ్దం చేస్తోంది. సచిన్.. సరైన వేళలు పాటించాలని మీ ఇంటిలో పని చేస్తున్న వారికి సూచిస్తారా' అని డిసౌజా కోరాడు. అయితే ఈ పోస్ట్‌పై టెండూల్కర్ మాత్రం స్పందించలేదు.



బౌలర్లకు ఉపశమనం హైబ్రిడ్ పిచ్‌లు వచ్చేశాయి

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో పూర్తిగా బ్యాటర్లే ఆధిపత్యం చెలాయిస్తుండడంతో..బౌలర్లకు ఏమాత్రం ప్రాధాన్యం లేకుండా పోయింది. దాంతో మాజీలు, క్రికెట్ విశ్లేషకులనుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో మ్యాచ్‌లలో బౌలర్లు, బ్యాటర్లకు నడుమ సమతూకం సాధించేందుకు బీసీసీఐ హైబ్రిడ్ పిచ్‌లవైపు మొగ్గుచూపింది. ధర్మశాలలో వీటిని ఏర్పాటు చేసింది. ఈసారి ఐపీఎల్‌లో రెండు మ్యాచ్‌ల్లో దీనిని ఉపయోగించాలని నిర్ణయించింది. చెన్నై సూపర్ కింగ్స్-పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య ఆదివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్ ద్వారా దేశంలో మొదటిసారి హైబ్రిడ్ వికెట్‌ను ఆవిష్కరించారు. 9న జరిగే రెండో మ్యాచ్‌లో బెంగళూరుతో పంజాబ్ ఈ హైబ్రిడ్ పిచ్‌పైనే తలపడనుంది. సహజ సిద్ధమైన పచ్చిక, సింథటిక్ ఫైబర్ మిశ్రమాలతో తయారు చేసిన వికెట్‌నే హైబ్రిడ్ పిచ్ అంటారు. చాలాసేపు ఈ పిచ్ తాజాగా ఉంటుంది. బౌలర్లు ఎక్కువ బౌన్స్ రాబట్టగలుగుతారు. క్రికెట్ పిచ్‌ల సహజ లక్షణాలను పరిరక్షించే క్రమంలో ఈ వికెట్లలో ఐదు శాతం మాత్రమే ఫైబర్ వినియోగిస్తున్నారు.

మరో ఐదుగురు బాక్సర్లకు స్వర్ణాలు

అస్తానా (కజకిస్థాన్): ఆసియా అండర్-22, యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మరో ఐదుగురు భారత బాక్సర్లు సత్తా చాటారు. సోమవారం జరిగిన పోటీల్లో బ్రిజేశ్ తమ్టా (48 కిలోలు), ఆర్యన్ (51 కి), యశ్‌వర్ధన్ (63.5 కి), లక్ష్మి (50 కి), నిషా (52 కి) స్వర్ణాలు సాధించారు. మరో తొమ్మిది మంది బాక్సర్లు రజతాలు అందుకున్నారు.

పేదల ఇళ్ల స్థలాల్లో పైసలేరుకున్నారు.. ఓట్లు రాబట్టుకునేందుకు నకిలీ ఇళ్ల పట్టాలు సృష్టించారు.. వలంటీర్లను అస్త్రంగా మార్చుకుని రాజకీయ లబ్ధి పొందారు.. అసైన్డ్ భూముల పేరుచెప్పి బడాబాబుల నుంచి భారీగా వసూలు చేశారు.. సముద్ర తీరప్రాంతాన్ని టార్గెట్‌గా చేసుకుని కబ్జాలకు తెరలేపారు.. అవసరమైన చోట చేపలు, రొయ్యల చెరువులు తవ్వేశారు.. మడ అడవులను నాశనం చేసేశారు.. ఐదేళ్లలో మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని సాధించిన ఘనకార్యాలివి. ఎమ్మెల్యేగా ఐదేళ్లు, మంత్రిగా రెండున్నరేళ్లు పనిచేసినా నియోజకవర్గంలో వీసమెత్తు అభివృద్ధి చేసింది లేదు. తెరపై తనంత మంచోడు లేడన్నట్టు నటిస్తూ.. తెరవెనుక అనుచరులతో అన్ని అవినీతి పనులు చేయిస్తూ పాలనలో పేర్ని నాని తనదైన మార్క్ చూపించారు.

- మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి



నీతుల నానీ.. అంతులేని అవినీతి



- ఎమ్మెల్యేగా, మంత్రిగా అన్నింటా అవినీతి
- బినామీల పేరిట అక్రమ ఆదాయం రూ.కోట్లలోనే..
- జగనన్న కాలనీ స్థలాల్లో భారీగా కమీషన్లు
- సముద్ర తీర భూములు కబ్జా చేసి అక్రమార్జన
- మడ అడవులను మింగేసి.. చేపల చెరువులుగా మార్చేసి..
- ఐటీ రిటర్న్స్ సాక్షిగా పది రెట్లు పెరిగిన ఆదాయం
- తనయుడి గెలుపు కోసం సీనియర్లకు చెక్
- ఎన్నికల ముందు నకిలీ పట్టాల పంపిణీ వివాదం

ఐదేళ్లలో మచిలీపట్నంలో పేర్ని నాని దోపిడీపర్వం

కాలనీల్లో కమీషన్లు

జగనన్న కాలనీల్లో పేదలకు ఇళ్ల స్థలాల సంగతి దేవుడెరుగు వైసీపీ ప్రజాప్రతినిధులకు మాత్రం కాసుల పంట పండింది. మచిలీపట్నం నియోజకవర్గంలోని కరగ్రహారం సమీపంలో సుమారు 350 ఎకరాలను జగనన్న ఇళ్ల స్థలాల కోసం సేకరించారు. ఎకరం భూమిని రూ.39 లక్షలకు కొన్నారు. ఈ భూముల కొనుగోలులో వారసత్వంగా వచ్చిన వారికి.. భూమికి సంబంధించిన పత్రాలు సక్రమంగా లేనివారికి.. వివాదాల్లో ఉన్న భూములకు.. రికార్డులు తారుమారు చేసి ఎకరాకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ పేర్ని అనుచరులు కమీషన్ తీసుకున్నారు. భూముల అసలు విలువ కంటే ఎక్కువ ధరకు కొన్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ ఎకరా రూ.30 లక్షలు అంటే చాలా ఎక్కువ. అలాంటి భూమిని కమీషన్ల కోసం ఎక్కువ ధర చూపి ప్రజాధనాన్ని దోచేశారు. పేర్ని అనుచరులు ఎకరాకు రూ.5 లక్షల వరకు కమీషన్ దోచేశారు. సుమారు రూ.20 కోట్ల వరకూ ముట్టినట్టు ఆరోపణలు ఉన్నాయి.

నకిలీ పట్టాల పంపిణీ

తన వారసుడిగా కొడుకు పేర్ని కిట్టును రంగంలోకి దించేందుకు సీనియర్లను పేర్ని పక్కనపెట్టారు. కిట్టును ఎలాగైనా గెలిపించుకోవాలని నానా తంటాలు పడుతున్నారు. ఇందుకు ఇళ్ల పట్టాలను ఓ మార్గంగా ఎంచుకున్నారు. వైసీపీలో చేరిన వారికి పట్టా ఇచ్చేలా మాట్లాడుకుని సుమారు 16 వేల మందికి నకిలీ పట్టాలు పంపిణీ చేయాలనుకున్నారు. రెవెన్యూ అధికారులూ సహకరించారు. చివరికి కలెక్టర్‌పై వేటు పడటంతో ఈ నకిలీ పట్టాల తంతుకు బ్రేక్ పడింది. అలాగే, తన స్వార్థ రాజకీయాల కోసం వలంటీర్ల జీవితాలతోనూ పేర్ని నాని ఆడుకున్నారు. మచిలీపట్నంలో వలంటీర్లతో భారీ ఎత్తున రాజీనామాలు చేయించారు. రాజీనామా చేసిన వలంటీర్లంతా పింఛన్ల పంపిణీలో పాల్గొనాలని, వృద్ధులను ఆటోలు పెట్టి దగ్గరుండి తీసుకెళ్లాలంటూ ఆడియో సందేశాన్ని విడుదల చేశారు.

ఆదాయం అంతకంతకూ..

గత ఎన్నికల సమయలో పేర్ని నాని దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్‌లో 2017-18 సంవత్సరానికి గానూ ఆదాయపు పన్ను రిటర్న్స్‌లో చూపిన ఆదాయం రూ.4.80 లక్షలు. 2019 తర్వాత ఆయన ఆదాయం ఒక్కసారిగా పెరిగింది. 2020-21లో ఆయన చూపిన ఆదాయం రూ.49.07 లక్షలు, అదే ఏడాది ఆయన భార్య పేరిట వేసిన రిటర్న్స్‌లో చూపిన ఆదాయం రూ.10.87 లక్షలు, 2021-22లోనూ ఆయన ఆదాయం రూ.30.94 లక్షలు, ఆయన భార్య ఆదాయం రూ.12.07 లక్షలు. ఆస్తులు కూడా పెరిగాయి. బినామీల పేరుతో ఆయన సంపాదించిన ఆదాయానికి లెక్కేలేదు.

కబ్జాసుర చరిత్ర

వివరాలు లోపలి పేజీలో...

3 గంటలు.. నరకం

సీఎం సభ పేరిట బందరులో పట్టపగలే చుక్కలు



సీఎం సభ సోమవారం సాయంత్రం 5.20 గంటలకైతే.. మధ్యాహ్నం ఒంటిగంటకే రాజా సెంటరులో బారికేడ్లు పెట్టి రోడ్లు మూసేశారు..

- మిట్టమధ్యాహ్నం 3 గంటలకే జనం తరలింపు
- తీరిగ్గా 5.20 గంటలకు వచ్చిన సీఎం జగన్
- సీఎం వచ్చేవరకు ఎవరూ కదలకుండా దిగ్బంధనం
- ఎండలోనే మాడిపోయిన మహిళలు, చిన్నారులు
- ఎక్కడికక్కడ రహదారులు మూసివేత
- భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్.. ఉక్కిరిబిక్కిరి
- ఆటోల్లో మహిళలను తరలించిన నాయకులు
- సభ ముగిసే వరకు పేర్ని నాని, కిట్టు హడావిడి
- ఉత్సవ విగ్రహంలా ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్

సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభ మాటేవిటో కానీ, బందరువాసులకు పట్టపగలే చుక్కలు కనిపించాయి. ఓపక్క మండిన ఎండలు, మరోపక్క ట్రాఫిక్ చిక్కులు, ఎక్కడికక్కడ రహదారుల దిగ్బంధనంతో మూడు గంటల పాటు నరకాన్ని అనుభవించారు. మరోవైపు మధ్యాహ్నం 3 గంటలకు సభ జరుగు తుందని జనాన్ని భారీగా పోగేయగా, సీఎం తీరిగ్గా సాయంత్రం 5.20 గంటలకు వచ్చారు. అంతసేపూ ఎవరూ వెనుదిరగ కుండా ఎక్కడికక్కడ నిర్బంధించడంతో మహిళలు, చిన్నారులు మండుటెండలో మలమలా మాడిపోయారు.

ఎండకు తట్టుకోలేక విలవిల

మహిళలను మిట్టమధ్యాహ్నమే సభా ప్రాంగణానికి తరలించడంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. వేదిక వద్దకు వచ్చినవారు వెనక్కు వెళ్లకుండా నిర్బంధించడంతో దాదాపు 3 గంటలు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ఒకచోటే ప్రజలు గుమికూడి ఉండటంతో ఎండవేడిమిని తట్టుకోలేక మహిళలు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. సాయంత్రం 5.20 గంటలకు సీఎం జగన్ సభావేదిక వద్దకు వచ్చారు.

ఒత్తిడి తెచ్చి జనసమీకరణ

సీఎం జగన్ సభకు ప్రజలను తరలించే బాధ్యతను ఆయా డివిజన్లు, పంచాయతీల్లోని కార్యకర్తలు, నాయకులకు అప్పగించారు. ఎండలో మహిళలు రాలేమని చెప్పినా ఒత్తిడి తెచ్చి మరీ వారిని ఆటోల్లో ఎక్కించారు. సభకు వచ్చిన వారికి నగదు ఇస్తామని కొన్ని ప్రాంతాల్లోని మహిళలకు వైసీపీ నాయకులు ఆశ చూపారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభ గందరగోళంగా తయారైంది. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సభ జరుగుతుందని ప్రచారం చేయగా, సభను విజయవంతం చేసేందుకు మచిలీపట్నం, పరిసర ప్రాంతాల నుంచి ప్రజలను 2 గంటల నుంచే ఆటోల్లో తరలించారు. వల్లూరి రాజా సెంటరులో సభను ఏర్పాటు చేయగా, కోనేరు, రేవతి సెంటర్ల మధ్య ప్రధాన రహదారి వెంబడి మధ్యాహ్నం ఒంటిగంట నుంచే బారికేడ్లు ఏర్పాటుచేసి రాకపోకలను నిలిపివేశారు. దీంతో కోనేరు సెంటర్ నుంచి బస్టాండ్ వైపునకు వెళ్లేవారు ఎండలో వివిధ మార్గాల్లో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఇక ఎక్కడికక్కడ ట్రాఫిక్ ఆగిపోవడంతో ఎటు వెళ్లాలో తెలియని గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. వల్లూరి రాజా సెంటరులో రెండేళ్లుగా రాజకీయ కారణాలతో రాకపోకలు నిలిపివేశారు. సీఎం జగన్ పర్యటన సందర్భంగా ఈ బారికేడ్లను తొలగించారు.



ఏజే కళాశాలలో హెలీప్యాడ్ ఏర్పాటుచేయడంతో మధ్యాహ్నం 3 గంటల నుంచే ఆ ప్రాంతంలోకి ఎవరినీ అనుమతించలేదు..

ఉత్తుత్తి మాటలు

ఉత్సవ విగ్రహంలా వైసీపీ ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్

మాట్లాడే అవకాశం ఇవ్వకుండా నిలబెట్టారు

సీఎం రాకముందే ప్రసంగించిన పేర్ని కిట్టు

మచిలీపట్నంలో రూ.550 కోట్లతో మెడికల్ కాలేజీ పూర్తిచేశామని సీఎం జగన్ తన ప్రసంగంలో చెప్పారు. కానీ, మెడికల్ కళాశాలలో వైద్యసేవలు ఎప్పటి నుంచి అందుబాటులోకి తెస్తారు, ఇంకా నిర్మాణం జరగాల్సిన భవనాలను ఎప్పటికి పూర్తిచేస్తారు.. అనే అంశాలను మాత్రం ప్రస్తావించలేదు. రూ.350 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామని సీఎం చెప్పారు. అయితే, ఆ పనులు నిలిచిపోయి దాదాపు ఆరు నెలలు కావస్తోంది. సీఎం ప్రసంగిస్తున్న సమయంలో మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని వేదికపైకి వచ్చి కాగితంపై ఏదో రాసి ఇచ్చారు. ఆ అంశాలనే సీఎం తన ప్రసంగంలో చూసి చెప్పడం విడ్డూరం. కాగా, వైసీపీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్‌కు వేదికపై మాట్లాడే అవకాశమే ఇవ్వలేదు. సీఎం వేదిక వద్దకు రాకముందు వైసీపీ మచిలీపట్నం అభ్యర్థి పేర్ని కిట్టు ప్రసంగించారు. ఎంపీ అభ్యర్థితో అసలు మాట్లాడించకపోవడంతో కార్యక్రమానికి హాజరైనవారు గుసగుసలాడుకున్నారు.

రెడ్ జోన్

- రేపు నగరంలో ప్రధాని పర్యటన
- 5వేల మందితో బందోబస్తు ఏర్పాట్లు
- ప్రకాశం బ్యారేజీ టూ కంట్రోల్ రూమ్ రెడ్‌జోన్ ప్రకటన
- డ్రోన్లు, బెలూన్లు ఎగురవేయడం నిషేధం
- 1.3 కిలోమీటర్ల మేర మోదీ రోడ్ షో



విజయవాడ, మే 6 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోదీ పర్యటనకు పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈనెల 8వ తేదీ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకూ మోదీ బందరురోడ్డులో రోడ్ షో నిర్వహించనున్నారు. ఇందిరాగాంధీ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు 1.3 కిలోమీటర్ల మేర ఈ పర్యటన సాగుతుంది. ఏడాది క్రితం ప్రధాని గన్నవరం విమానాశ్రయం నుంచి భీమవరం వెళ్లినప్పుడు కాంగ్రెస్ నేతలు నల్లబెలూన్లు ఎగురవేశారు. దీనిపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సీరియస్ అయ్యింది. ఈ నేపథ్యంలో పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ, డీఐజీలు రవీంద్రనాథ్‌బాబు, కేవీ మోహనరావు, గోపీనాథ్‌జెట్టి, ఐపీఎస్ అధికారులు వకుల్‌జిందాల్, మల్లికాగార్గ్, ఏఆర్ దామోదర్, డీసీపీలు కంచి శ్రీనివాసరావు, అధిరాజ్‌సింగ్ రాణా తదితరులతో కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. 5వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి పోలీస్ కంట్రోల్ రూమ్ వరకు రెడ్‌జోన్‌గా ప్రకటించారు.

దీంతో పాటు మోదీ పర్యటన జరిగే ప్రదేశాన్ని నో ఫ్లయింగ్ జోన్‌గా పేర్కొన్నారు. ఈ ప్రదేశంలో డ్రోన్లు, బెలూన్లు ఎగురవేయడం నిషేధం. కాగా, ఇతర జిల్లాల నుంచి వచ్చే వాహనాలతో పాటు నగరంలో ట్రాఫిక్‌పై ఆంక్షలు విధించారు.



సైకత సందేశం

ఓటర్లను జాగృతం చేసేలా స్వరాజ్య మైదానంలోని అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం వద్ద ఏర్పాటుచేసిన సైకత శిల్పాన్ని కలెక్టర్ దిల్లీరావు, జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. కైకలూరుకు చెందిన ఆకునూరు బాలాజీ వరప్రసాద్ దీనిని తీర్చిదిద్దారు. ఓటు అమ్మకానికి కాదు.. నేను కచ్చితంగా ఓటు వేస్తాను.. డబ్బు, మద్యం, బహుమతులు వంటి ప్రలోభాలకు లొంగొద్దు.. అంటూ ఈ శిల్పాన్ని ఏర్పాటు చేశారు. - కృష్ణలంక

మంత్రి జోగి కుమారుడిపై అట్రాసిటీ కేసు

పెనమలూరు, మే 6 : దాడి ఘటనలో మంత్రి జోగి రమేశ్ తనయుడు రాజీవ్‌తో పాటు వైసీపీ కార్యకర్తలు సుభాని, ఫరీద్ బాషా, మాబు సుభాని, రబ్బానీ తదితరులపై పోలీసులు సోమవారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. పెనమలూరు మండలంలోని పెదపులిపాక దళితులపై వైసీపీ నేతలు ఆదివారం చేసిన దాడిపై పత్రికల్లో వచ్చిన కథనాలను రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కేసు నమోదు చేయాల్సిందిగా ఉన్నతాధికారులు పోలీసులను ఆదేశించారు. పోలీసులు వివరాల ప్రకారం.. ఆదివారం పొద్దుపోయాక పెదపులిపాకలోని దళితవాడలో మంత్రి జోగి కుమారుడు రాజీవ్, వైసీపీ కార్యకర్తలతో కలిసి ప్రచారానికి వచ్చారు. ఈ సమయంలో కాలనీకి చెందిన సుదర్శన్, మరికొందరు మాట్లాడుకుంటుండగా, వైసీపీ కార్యకర్తలు తమ గురించే మాట్లాడుకుంటున్నట్టు అనుమానపడి వారిపై దాడిచేసి వెళ్లిపోయారు. దీనిపై నిమ్మగడ్డ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. రాజీవ్, పెదపులిపాకకు చెందిన ఏడుగురు వైసీపీ కార్యకర్తలపై పెనమలూరు పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. కాగా, వివరాలు వెల్లడించాల్సిన పోలీసు అధికారులు అందుబాటులో లేకుండాపోయారు.

మూడోరోజూ అధికంగా..



- పోస్టల్ బ్యాలెట్‌కు ఉద్యోగుల నుంచి విశేష స్పందన
- మూడోరోజు జిల్లాలో ఓటు వేసిన 6,576 మంది ఉద్యోగులు

ఇందిరాగాంధీ స్టేడియంలో ఓటు వేసేందుకు వచ్చిన ఉద్యోగులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పోస్టల్ బ్యాలెట్‌లో మూడో రోజైన సోమవారం జిల్లావ్యాప్తంగా 6,576 మంది ఉద్యోగులు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. కాగా, ఈ మూడు రోజుల్లో జిల్లావ్యాప్తంగా మొత్తం 16,225 మంది ఓటు వేశారు. సోమవారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 2,136 మంది, తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 360 మంది, తిరువూరులో 660 మంది, విజయవాడ పశ్చిమలో 574 మంది, విజయవాడ సెంట్రల్‌లో 486 మంది, స్థానిక ఆర్వో కార్యాలయంలో 90 మంది, విజయవాడ తూర్పులో 414 మంది, మైలవరంలో 701 మంది, స్థానిక ఆర్వో కార్యాలయంలో 49 మంది, నందిగామలో 616 మంది, జగ్గయ్యపేటలో 490 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.

నేడు, రేపు హోమ్ ఓటింగ్

జిల్లావ్యాప్తంగా మంగళ, బుధవారాల్లో హోమ్ ఓటింగ్ జరగనుంది. 1,052 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికే ఎన్నికల సిబ్బంది వెళ్లి ఓటు వేస్తారు. ఇంట్లోకి రాజకీయ పార్టీల వారిని అనుమతించరు. ఏజెంట్లకు మాత్రమే అవకాశమిస్తారు. ఈ ప్రక్రియలో సెక్టార్ ఆఫీసర్, మైక్రో అబ్జర్వర్, పోలింగ్ బూత్ అధికారి, సాయుధ పోలీస్ సిబ్బంది, వీడియోగ్రాఫర్ ఉంటారు. ఓటింగ్ విధానం రహస్యంగా జరుగుతుంది. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఈ ప్రక్రియను వీడియో తీస్తారు.

నేడు అత్యవసర సేవల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్

అత్యవసర సేవలు అందించే ఉద్యోగులకు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటుచేసిన కామన్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో మంగళవారం ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. జిల్లావ్యాప్తంగా 706 మంది తమ ఓటుహక్కు వినియోగించుకుంటారు.



ఆర్డీవో చైర్మన్‌గా ఉన్న ఆఫీసర్స్ క్లబ్

తీరు మారలేదు!

» అధికార పార్టీ సేవలో తరిస్తున్న ఆర్డీవో!

» కోడ్ అమలులో ఉన్నా ప్రభుత్వ భవనంలో వైసీపీకి ప్రచార అనుమతి

గుడివాడ : గుడివాడ ఆర్డీవో కం ఎన్నికల ఆర్వో తీరు మారడం లేదు. అధికార పార్టీ సేవలో తరిస్తూ.. చైర్మన్‌గా వ్యవహరించే ఆఫీసర్స్ క్లబ్‌లో కోడ్ నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ ప్రచార కార్యక్రమాలకు అనుమతులివ్వడం వివాదాస్పదమైంది. ఎన్నికల కోడ్ ప్రారంభం నుంచీ అధికార పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తూ రెడ్‌కార్పెట్ పరుస్తున్నారు. తొలి నుంచీ ఆర్డీవో తీరు వివాదాస్పదంగా ఉంది. వివరాల్లోకి వెళితే.. గుడివాడ నడిబొడ్డు, సర్వే నెం.153లో 4.84ఎకరాల విస్తీర్ణం గల డిప్యూటీ కలెక్టర్ కార్యాలయ



ఆఫీసర్స్ క్లబ్‌లో వైసీపీ కార్యక్రమాలు

స్థలంలో 1923లో బ్రిటీష్ హయాంలో గుడివాడ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. కాలక్రమేణా అది ఆఫీసర్స్ క్లబ్‌గా మారింది. క్లబ్ నిర్వహణకు ప్రతి రెండేళ్లకు ఒకసారి ఎన్నికలు నిర్వహించి కమిటీని ఎన్నుకుంటారు. క్లబ్ మెయింటెనెన్స్, ఆదాయ, వ్యయాలను కమిటీ పర్యవేక్షిస్తుంది. క్లబ్‌కు శాశ్వత అధ్యక్షునిగా ఆర్డీవో వ్యవహరిస్తారు.

ఐదేళ్లుగా కమిటీ ఎన్నికల్లేవు..

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు ఎన్నికలు నిర్వహించలేదు. స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని తన అనుచరగణంతో క్లబ్‌ను గుప్పిట్లో పెట్టుకున్నారు. మంత్రి అయిన కొత్తలో క్లబ్‌కు ఎన్నికలు నిర్వహించి నాని సూచించిన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాటి నుంచి ఇప్పటి వరకు క్లబ్‌ను సొంత జాగీరులా వాడుకుంటున్నారు. ఆరు నెలలకు ఒకసారి పాత కమిటీనే రెన్యూవల్ చేసుకుంటూ వస్తున్నారు. దీనికి కమిటీ చైర్మన్ వంతపాడుతున్నారు. ఎన్నికల నిర్వహించకుండా ఆర్డీవో తాత్సార్యం చేస్తున్నారని క్లబ్ సభ్యులు పేర్కొంటున్నారు.

క్లబ్‌ను స్వాధీనం చేసుకోవాల్సి ఉన్నా..

క్లబ్‌కు రెండేళ్లకు ఒకసారి తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించాలి. లేని పక్షంలో కమిటీ చైర్మన్‌గా ఉన్న ఆర్డీవో క్లబ్‌ను స్వాధీనం చేసుకోవాలి. ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే ప్రభుత్వ స్థలంలో ఉన్న క్లబ్‌లో ఎటువంటి రాజకీయ కార్యక్రమాలు నిర్వహించరాదు. కానీ ఈ నిబంధనలు ఇక్కడ పాటించలేదు. ఇప్పటికీ పాత కమిటీ అధీనంలోనే క్లబ్ కార్యకలాపాలు నడుస్తున్నాయి.

కోడ్ ఉల్లంఘించి వైసీపీ కార్యక్రమాలకు అనుమతులా..?

క్లబ్‌కు చైర్మన్‌గా వ్యవహరించే ఆర్డీవో అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత ఆ అధికారిపై ఉంది. క్లబ్‌లో ఆదివారం వైసీపీ నాయకులు నిబంధనలకు విరుద్ధంగా పలు కార్యక్రమాలు చేపట్టారు. ఆర్వోగా, క్లబ్ చైర్మన్‌గా వ్యవహరిస్తూ క్లబ్‌లో అధికార పార్టీ ఎన్నికల కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు అనుమతులు ఎలా యిస్తారని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి.

అధికార పార్టీ సేవలో..

గుడివాడ ఆర్డీవోగా పోస్టింగ్ వచ్చిన నాటి నుంచి నామినేషన్ల ప్రక్రియలోనూ రిటర్నింగ్ అధికారిగా ఉంటూనే అధికార పార్టీ సేవలో తరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఏకంగా క్లబ్‌ను వైసీపీ ఎన్నికల ప్రచారానికి అనువతులిచ్చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎవరూ ఏమీ చేయలేరనే ధీమా..

ఎన్నికల రిటర్నింగ్ అధికారినైన తనను ఎవరూ ఏమీ చేయలేరనే ధీమా.. తానే ఎన్నికల కోడ్‌ను అమలు చేయాలి కాబట్టి ఏది చేసినా చెల్లుతుందనే భావనలో ఆ అధికారిలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. కోరుకున్న చోట పోస్టింగ్ యిచ్చారు.. కాబట్టి అధికార పార్టీ సేవలో తరిస్తున్నారని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. నామినేషన్ స్క్రూటినీ సమయంలో ఆ అధికారి ప్రతిపక్షాలతో వ్యవహరించిన తీరు అమానుషం.. నోటికి వచ్చినట్టు తిట్టి, వారిపట్ల దురుసుగా ప్రవర్తించిన విషయం తెలిసిందే. తనను ఎవరూ ఏమి చేయలేరని.. తన వెనుక అధికార పార్టీ అండ మెండుగా ఉందనే ధీమాతో ఆర్వో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.



సీఎం వస్తున్నారని రాజా సెంటర్ బారికేడ్లను తెరిచిన పోలీసులు

వైసీపీ కార్యక్రమాలకే ఇక్కడ దారి తెరుస్తారు!

» సీఎం వస్తున్నారని బారికేడ్లు తొలగించిన అధికారులు

మచిలీపట్నం టౌన్, మే 6 : వైసీపీ నాయకులు వస్తే మచిలీపట్నం వల్లూరి రాజాసెంటర్ బారికేడ్లు తెరుచుకుంటాయి. కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఒక షాపు ప్రారంభానికి వైసీపీ నేతలను ఆహ్వానించలేదని వల్లూరు రాజా సెంటర్‌ను బారికేడ్లతో మూసేసారు. ఆసుపత్రులకు, కళాశాలలకు వెళ్లే రోడ్డును మూసివేయడం వల్ల బందరు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల వైసీపీ బస్సు యాత్ర రాజా సెంటర్ వచ్చినప్పుడు బారికేడ్లు తెరిచారు. ఇక తమ కష్టాలు తీరాయని అనుకున్న బందరు ప్రజలకు నిరాశే మిగిలింది. బస్సు యాత్ర వెళ్లిన మరుసటి రోజు నుంచే తిరిగి మూసేసారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన జనసేన నేత బండి రామకృష్ణ జనసైనికులతో వచ్చి బారికేడ్లు తొలగించాలని ఉద్యమించినా ఫలితం లేకపోయింది. సోమవారం ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చారని బారికేడ్లు తొలగించారు.

ప్రారంభానికి నోచని సిగ్నల్ లైట్లు..

మచిలీపట్నం ప్రధాన కూడలి ప్రాంతాల్లో సిగ్నల్ లైట్లు పెట్టి ఏడాదిన్నరయింది. ప్రజాధనంతో ఏర్పాటు చేసిన లైట్లు నిరుపయోగంగా ఉండటం వల్ల వల్లూరి రాజా సెంటర్ కూడలి ప్రాంతాల్లో బారికేడ్లతో మూసివేయాల్సి వస్తోంది. కొత్త ప్రభుత్వంలోనైనా సిగ్నల్ లైట్లను ప్రారంభించి ప్రమాదాలను అరికడతారని ప్రజలు ఆశిస్తున్నారు.

కబ్జాసుర చరిత్ర!



బందరు మండలం పల్లెతుమ్మలపాలెంలో చెరువులుగా మారుతున్న ప్రభుత్వ భూమి

ఈ ఐదేళ్లలో మచిలీపట్నం నియోజకవర్గంలో ప్రభుత్వ భూమి ఖాళీగా కనిపిస్తే చాలు అధికార పార్టీ నాయకులు ఆక్రమించేశారు. ఈ ఆక్రమణలను యథేచ్ఛగా కొనసాగించారు. తమకు అనుకూలంగా ఉండే అధికారులకు పోస్టింగులు ఇప్పించుకుని మరీ ఈ అక్రమాలకు తెరతీశారు. ఎదురుచెప్పిన వారిపై సామదానదండోపాయాలు ప్రయోగించి తమ దారిలోకి తెచ్చుకున్నారు. ఎమ్మెల్యే పేర్ని నాని అనుచరుల కనుసన్నల్లో ఈ భూదందా ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగింది.

(మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి)

బందరు మండలం పల్లెతుమ్మలపాలెం గ్రామం సమీపంలో 70 ఎకరాల ప్రభుత్వ భూమి వందేళ్లకు పైబడి ఖాళీగానే ఉంటోంది. సముద్రానికి సమీపంలో ఉన్న ఈ భూమిలోకి ఆటుపోట్లు వచ్చి పోతుంటాయి. వైసీపీ అధికారం చేపట్టాక ఈ భూమిపై వైసీపీ నాయకుల కన్నుపడింది. అనుకున్నదే తడవుగా ఈ భూమిని రొయ్యల చెరువులుగా తవ్వడం ప్రారంభించారు. గ్రామస్థులు అడ్డు చెప్పడంతో గ్రామంలోని వైసీపీ కార్యకర్తలను తెరపైకి తెచ్చి 50 ఏళ్ల క్రితమే తమకు పట్టాలు ఇచ్చారని చెప్పించారు. తప్పుడు పత్రాలు చూపించారు. రెవెన్యూ అధికారులు, ఆర్డీవో విచారణలో ఇది నిర్ధారణ కూడా అయ్యింది. ఇంతా జరిగినా అధికారాన్ని అడ్డుపెట్టుకుని గ్రామంలోని కొందరి పేర్లతో నకిలీ పత్రాలు సృష్టించి ఈ భూమిని రొయ్యల చెరువులుగా తవ్వేశారు. వేరే వ్యక్తులకు లీజుకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఈ భూములు వైసీపీ నేతల చేతుల్లోనే ఉన్నాయి.

● మచిలీపట్నం డంపింగ్ యార్డుకు భూమి కొనాలని వైసీపీ నాయకులు మచిలీపట్నం ప్రాంతంలో చేపల చెరువులు సాగుచేస్తున్న భీమవరం రాజుల నుంచి పెద్దమొత్తంలో నగదు వసూలు చేశారు. భూమి లభ్యంగా లేదని, భీమవరం రాజులు సాగుచేసే చేపల చెరువులోని 20 ఎకరాలను ఇవ్వాలని ఒత్తిడి చేశారు. కోనరోడ్డు వెంబడి, ఆటోమేటిక్ కాల్వ సమీపంలో 14 ఎకరాలను ఇచ్చేందుకు భీమవరం బడాబాబులు అంగీకరించారు. కానీ, ఆ భూమి డంపింగ్ యార్డు ఏర్పాటుకు సరిపోదని, నగదు రూపంలో ఇవ్వాలని ఇద్దరు, ముగ్గురు వైసీపీ కార్యకర్తల ద్వారా తెరవెనుక రాయబారాలు నడిపారు. బలవంతంగా నగదు వసూలు చేశారని భీమవరం రాజులు చెప్పకనే చెప్పారు. ఈ నగదు ఇవ్వకుంటే చేపల చెరువుల రూపంలో ఉన్న అసైన్డ్ భూములకు సంబంధించిన అన్ని రికార్డులు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని బెదిరింపులకు గురిచేశారు. డంపింగ్ యార్డు కోసం వసూలు చేసిన నగదు ఎవరికి చేరిందనేది అందరికీ తెలిసిన రహస్యమే.

● కరగ్రహారం-గిలకలదిండి వెళ్లే దారిలో గోదాముల సమీపంలో సర్వే నెంబరు 248లో 118 ఎకరాల మడ అడవులను ఎమ్మెల్యే పేర్ని నాని అనుచరుడొకరు ఆక్రమించి రొయ్యల చెరువులుగా మార్చేసే ప్రయత్నం చేశారు. ఈ అంశం పత్రికల్లో రావడంతో రెవెన్యూ అధికారులు ఆ పనులను నిలిపివేశారు. కొద్దికాలం పాటు మిన్నకుండిపోయి, రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని, రాత్రికి రాత్రే ఈ చెరువులను తవ్వి భీమవరం రాజులకు లీజుకు ఇచ్చారు.

● కృష్ణానది సముద్రంలో కలిసే ప్రాంతానికి దగ్గర్లో ఉన్న కొత్తపల్లెతుమ్మలపాలెం గ్రామ పరిధిలో కరకట్ట వెంబడి మడ అడవులున్నాయి. ఇక్కడ వివాదంలో ఉన్న 15 ఎకరాలను, వాటి పక్కనే ఉన్న మరో 30 ఎకరాల మడ అడవులను ఎమ్మెల్యే షాడో ఆక్రమించేశారు. ఈ భూములను రొయ్యల చెరువులుగా మార్చేశారు. కృష్ణానదికి సమీపంలో ఉన్న ఈ భూములు రొయ్యల చెరువుల సాగుకు అనుకూలంగా ఉండటంతో ఎకరాకు ఏడాదికి రూ.50 వేల చొప్పున లీజుకు ఇచ్చారు. ఈ వ్యవహారంపై గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. మచిలీపట్నం ఆర్డీవో, తహసీల్దార్‌లు స్వయంగా వెళ్లి ఈ భూములను పరిశీలించారు. రెండేళ్ల క్రితం అధికారులు ఇచ్చిన నివేదిక బయటకు రాకుండా వైసీపీ నాయకులు తొక్కిపెట్టేశారు. ఇప్పటికీ ఈ వ్యవహారంలో ఎలాంటి చర్యలు లేవు.

● మచిలీపట్నం కరగ్రహారానికి చెందిన శౌంరి ఫరీద్ అనే అనుచరుడిని అడ్డుపెట్టుకుని గ్రామంలో 100 ఎకరాలకు పైగా మడ అడవిని తవ్వి చెరువులుగా చేసేశారు. ఇవి ప్రభుత్వ భూములైనా.. పేదలను అడ్డుపెట్టి, వారే చెరువులుగా మారుస్తున్నారని చూపి కబ్జా చేశారు.

● ఈ ఐదేళ్లలో మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో పేర్ని అనుమతి లేకుండా ఒక్క అభివృద్ధి పని కూడా జరగకూడదని అనధికార ఆదేశాలు అమలయ్యాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో రూ.15 కోట్లతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. మంత్రి సూచించిన వారికే కాంట్రాక్టులు ఇచ్చారు. ఉల్లింగపాలెం, సర్కిల్‌పేట తదితర ప్రాంతాల్లో గతంలో వేసిన సిమెంట్ రోడ్లపైనే మళ్లీ సిమెంట్ రోడ్లు వేశారు.

● పేర్ని అనుచరుల దందాలతో మచిలీపట్నంలోని వ్యాపారవేత్తలు బెంబేలెత్తిపోయారు. నియోజకవర్గంలో ఉన్న ఉప్పు పరిశ్రమకు గతంలో పలువురు లారీలను అద్దెకు తిప్పుకుంటుండేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చి.. పేర్నికి మంత్రి పదవి దక్కగానే ఆయన అనుచరులు చెలరేగిపోయారు. లారీ యజమానులను బెదిరించి పంపేశారు. తమ లారీలే, తాము చెప్పిన ధరకే తిరిగేలా పరిశ్రమ పెద్దలను బెదిరించి ఒప్పించారు.

● మచిలీపట్నానికి చెందిన దళిత మహిళ పద్మజను 2020, సెప్టెంబరులో పేర్ని నాని సన్నిహితుడి అనుచరులు కిడ్నాప్ చేసి దారుణంగా హత్య చేశారు. ఈ కేసులో వైసీపీకి చెందిన కొందరు బడాబాబుల హస్తం ఉండటంతో అప్పట్లో మంత్రిగా ఉన్న పేర్ని నాని ఒత్తిడితో విచారణను పక్కదారి పట్టించి సూత్రధారులను తప్పించేశారు. దళిత మహిళ పట్ల పేర్ని నాని వ్యవహరించిన తీరు ఇది.

● పేర్ని నాని ముఖ్య అనుచరుడు మోకా భాస్కరరావును 2020, జూన్‌లో హత్య చేశారు. ఈ హత్యను కూడా పేర్ని నాని రాజకీయంగా వాడుకుని దాన్ని టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్రపై మోపి ఆయన్ను జైలుపాలు చేశారు. రాజకీయంగా లబ్ధి పొందారు.

బాబు అభివృద్ధి ముద్దు.. జగన్ వినాశనం వద్దు..

» వసంత కృష్ణప్రసాద్

జి.కొండూరు, మే 6 : రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయగల సత్తా ఉన్న చంద్రబాబును తిరిగి అధికారంలోకి తెచ్చుకుందామని.. ఒక్కచాన్స్ అంటూ వచ్చి రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనం చేసిన జగన్‌కు ఓటు ఆయుధంతో గట్టిగా బుద్ధి చెప్పి గద్దె దింపుదామని బీజేపీ, జనసేన బలపర్చిన మైలవరం కూటమి అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ అన్నారు. సోమవారం చిన్ననందిగామ, భీమవరప్పాడు గ్రామాల్లో వసంత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజా రాజధాని అమరావతి కొనసాగాలన్నా, చింతలపూడి ఎత్తిపోతల పూర్తి కావాలన్నా, నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దక్కాలన్నా, గాడి తప్పిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాలన్నా ఎన్డీఏ కూటమి అభ్యర్థులను ఆదరించి గెలిపించి చంద్రబాబు నాయుడుని సీఎం చేసుకోవాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేసి ఎన్డీఏ అధికారంలోకి రాగానే చింతలపూడిని పూర్తి చేయిస్తానని, ఈప్రాంత రైతుల సాగు, తాగునీటి ఇబ్బందులు తీరుస్తానన్నారు. సంక్షేమం, అభివృద్ధి చేయగల ఒకే ఒక్క నాయకుడు చంద్రబాబు అన్నారు.



విజయవాడ పార్లమెంట్ అభ్యర్థుల ఓటర్ జాబితాలో 1వ నంబరులో ఉన్న కేశినేని శివనాథ్ (చిన్ని)కి, మైలవరం అసెంబ్లీ అభ్యర్థుల్లో నాలుగో నంబరులో ఉన్న తనకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మైలవరం ఏఎంసీ మాజీ చైర్మన్ ధనేకుల సాంబశివరావు (బుల్లిబాబు), సర్పంచ్ ధనేకుల శ్రీకాంత్, ఉయ్యూరు వెంకట నరసింహారావు, ఉప్పు మధు, మన్నం వెంకట్రావ్, వల్లూరి విఠల్‌రావు, పజ్జూరు రవికుమార్, లంక రామకృష్ణ, పచ్చిగోళ్ల రామారావు, బాలకృష్ణ, ఆర్.శివయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలోకి..

ఇబ్రహీంపట్నం : తుమ్మలపాలెం గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ నందూరి బేబి, కుటుంబసభ్యులు, ఇబ్రహీంపట్నం 24వ వార్డు వైసీపీ నాయకులు, మద్దు



లవర్రు, జూపూడి గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నేతలు సోమవారం గొల్లపూడి టీడీపీ కార్యాలయంలో వసంత కృష్ణ ప్రసాద్ సమక్షంలో టీడీపీ తీర్థం తీసుకున్నారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, రామినేని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి

» నందిగామలో నారా రోహిత్, సౌమ్య ప్రచారం

చందర్లపాడు, మే 6 : తారలు దిగి వచ్చిన వేళ నందిగామ టీడీపీలో జోష్ నెలకొంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి అభ్యర్థులు తంగిరాల సౌమ్య, కేశినేని చిన్నిల విజయాన్ని కాంక్షిస్తూ సినీహీరో నారా రోహిత్, హాస్య నటుడు రఘులు చందర్లపాడులో సోమవారం పర్యటించారు. గ్రామంలో నాయకులు, కార్యకర్తలు తరలిరాగా తంగిరాల సౌమ్య తదితరులకు అడుగడుగునా హారతులిస్తూ ప్రజలు ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక వాహనంపై నారా రోహిత్ మాట్లాడుతూ, జగన్ పాలనలో అడుగడుగునా దోపిడీలు, దౌర్జన్యాలతో రాష్ట్రాన్ని రౌడీరాజ్యంగా మార్చారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకపోవడంతో యువతకు ఉపాధి దొరకని స్థితి వచ్చిందన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రానికి జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చి.. ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలను తీసుకొచ్చి ఆదాయాన్ని పెంచారన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు ప్రవేశపెట్టనున్నారన్నారు. రాష్ట్రానికి చంద్రబాబు పాలన అవసరమని జనసేన, బీజేపీ పార్టీలు ఆయనతో కలిసి వస్తున్నాయన్నారు. ప్రజలు మరో మారు మోసపోకుండా కూటమికి అండగా నిలవాలని కోరారు. నందిగామ నుంచి తంగిరాల సౌమ్యను, విజయవాడ పార్లమెంట్‌కు కేశినేని చిన్నికి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని కుమారుడు వెంకట్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట వీరబాబు, మేకల సుధాకర్‌బాబు, వాసిరెడ్డి ప్రసాద్, కేవీ సాంబశివరావు, చింతోటి మాళేశ్వరరావు, బొందల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. చందర్లపాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా గుడిమెట్లకు చెందిన ఇరవై కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి పార్టీ కండువా కప్పి రోహిత్ ఆహ్వానించారు. రాష్ట్రంలో ప్రజలు వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారన్నారు. ఎన్నికల నాటికి వైసీపీ ఖాళీ అవుతుందన్నారు.



పారదర్శకంగా ఎన్నికలు

» సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, మే 6: "ఎన్నికలను శాంతియుత వాతావరణంలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు హెచ్చరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించామని, వెబ్ క్యాస్టింగ్, వీడియోగ్రఫీ, మైక్రోఅబ్జర్వర్లు ఏర్పాట్లు చేశామని ఆయన వివరించారు. సోమవారం పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాలలో పశ్చిమ నియోజకవర్గ ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. తర్వాత నందిగామ కేవీఆర్ కళాశాలలో నందిగామ నియోజకవర్గ పీవో, ఏపీవోల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. నిర్వర్తించాల్సిన విధులను వివరించారు. నందిగామలో పోస్టల్ బ్యాలెట్ ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈనెల 4, 5 తేదీల్లో 9,636 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయన్నారు. 7,8 తేదీల్లోనూ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలు పనిచేస్తాయన్నారు. ఫాం-12 సమర్పించని వారికి ఈసీఐ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు మరో అవకాశం కల్పించామన్నారు. ఓటు ఉన్న నియోజకవర్గ ఆర్వో పరిధిలోని ఫెసిలిటేషన్ కేంద్రంలో 7 లేదా 8వ తేదీల్లో ఒకరోజు స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను ఉపయోగించుకుని డ్యూటీ ఆర్డర్‌ను చూపి, ఫాం- 12 సమర్పించి ఓటేయాలని సూచించారు. ఫాం-12 డీ సమర్పించిన అత్యవసర సేవల సిబ్బందికి 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలోని కేంద్రీకృత పోస్టల్ ఓటింగ్ సెంటర్ (పీవీసీ)తో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోల స్థాయిలో పీవీసీల ద్వారా ఓటేయాలన్నారు.

రూ. 10 లక్షలు స్వాధీనం

ఇబ్రహీంపట్నం, మే 6: గుంటుపల్లి చెక్‌పోస్టు వద్ద సోమవారం తనిఖీలు నిర్వహిస్తుండగా గమనించి కాస్త దూరంలో కారు ఆపి అందులో నుంచి నల్లని బ్యాగ్ తీసుకొని రోడ్డు దాటుతున్న వ్యక్తి కంచికచర్లకు చెందిన కొమర నాగేంద్రబాబు నుంచి రూ.10 లక్షలు స్వాధీనం చేసుకున్నామని సీఐ ఎం.సత్యనారాయణ తెలిపారు. సరైన పత్రాలు లేనందున సీజ్ చేశామని తెలిపారు.

పోలవరంపై అమిత్‌షా ఆరోపణలకు

జగన్ సమాధానం చెప్పాలి

» దేవినేని ఉమా డిమాండ్

గొల్లపూడి, మే 6: కమీషన్ల కక్కుర్తి వల్లే పోలవరం ప్రాజెక్టు పూర్తికాలేదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన ఆరోపణలకు సీఎం జగన్ ఏం సమాధానం చెబుతారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. గొల్లపూడిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. జగన్ కమీషన్ల కక్కుర్తి వల్లే పోలవరం పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయని కేంద్ర మంత్రి చెప్పడంతో రివర్స్ టెండరింగ్ డ్రామా బహిర్గతమైందన్నారు. చంద్రబాబు హయాంలో ప్రాజెక్టు 72శాతం పూర్తయిందన్నారు. 2019 ఫిబ్రవరిలో టీఏసీలో రూ.55,548 కోట్లకు చంద్రబాబు ఆమోదం తెచ్చారని జగన్ తన సొంత ప్రయోజనాలకు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆరోపించారు. అధికారంలో చేతిలో ఉన్నా, 33 మంది ఎంపీలున్నా పోలవరాన్ని పూర్తి చేయలేకపోయాడని, జగన్ అవినీతే అందుకు కారణమని ఉమా ఆరోపించారు.



బిల్డర్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న సుజనాచౌదరి

భవన నిర్మాణ రంగాన్ని ప్రోత్సహిస్తా

» బిల్డర్లు, కార్మికులకు అండగా ఉంటా

» కూటమి పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి హామీ

విద్యాధరపురం, మే 6: "జగన్ అనాలోచిత నిర్ణయాలతో నిర్మాణ రంగం కుదేలైంది. మూడు రాజధానుల పేరిట అమరావతి పనులను జగన్ నిలిపేశారు. దీంతో బిల్డర్లు, కార్మికులు రోడ్డునపడ్డారు. కార్మికులంతా పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిపోయారు. అమరావతిని రాజధానిగా కొనసాగించి ఉంటే లక్షలమందికి ఉపాధి దొరికేది. టీడీపీ హయాంలో కళకళలాడిన నిర్మాణ రంగం ప్రస్తుతం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. పశ్చిమ నియోజకవర్గంలో నన్ను గెలిపిస్తే భవన నిర్మాణ రంగాన్ని ప్రోత్సహిస్తా. బిల్డర్లకు భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటా." అని టీడీపీ- బీజేపీ- జనసేన కూటమి పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి సుజనాచౌదరి హామీ ఇచ్చారు. భవానీపురంలోని ఓ కన్వెన్షన్ హాలులో సోమవారం బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చైర్మన్ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన బిల్డర్లు, కాంట్రాక్టర్లు, బిల్డింగ్ వర్కర్ల ఉమ్మడి సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన సుజనా చౌదరి మాట్లాడారు. సిమెంట్, ఇసుక, స్టీలు ధరల పెంపు కూడా నిర్మాణ రంగంపై బాగా ప్రభావం చూపిందన్నారు. ధరల నియంత్రణకు జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కూటమి పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), క్రెడాయ్ ఏపీ అధ్యక్షుడు వైవీ రమణరావు, జాయింట్ సెక్రటరీ రమేష్ అంకినీడు, పరుచూరి కిరణ్, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విజయవాడ అధ్యక్షుడు మండవ వసంత్, ప్రతినిధులు రామకోటయ్య, పెనుగొండ సుబ్బారాయుడుతో పాటు బిల్డర్లు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

» అందుకే వైసీపీ నుంచి టీడీపీలో భారీగా చేరుతున్నారు: కేశినేని చిన్ని

విద్యాధరపురం, మే 6: "అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి చంద్రబాబు పాలనచేస్తారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. జగన్‌వి నియంతృత్వ విధానాలు. వైసీపీ నాయకులు ఆయన విధానాలతో విసిగి వేసారిపోయారు. పదవులు వదిలేసి భారీ సంఖ్యలో రాష్ట్ర భవిష్యత్తు కోసం వైసీపీ నుంచి టీడీపీలోకి చేరు తున్నారు. కూటమి భారీ మెజారిటీతో అధికారంలోకి రాబోతుంది." అని టీడీపీ- జనసేన-బీజేపీ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. మూడు రోజుల క్రితం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యలే శ్వరపు జగన్మోహనరాజు, ఏపీ బ్రాహ్మణ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ ఎం.నాగేంద్రబాబు గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా చిన్నిని కలిశారు. పార్టీ కండువాలు కప్పి చిన్ని ఆహ్వానించారు.



యలేశ్వరపు జగన్మోహనరాజుకు స్వాగతం పలుకుతున్న కేశినేని చిన్ని

జగన్ పాలనలో బ్రాహ్మణులకు తీరని అన్యాయం

"ఐదేళ్ల జగన్ పాలనలో బ్రాహ్మణులకు తీవ్ర అన్యాయం జరిగింది. దేవాలయాల్లో అర్చకుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. వారి దుస్థితిని చెప్పుకోవడానికి జగన్ మాకు అవకాశమివ్వలేదు. ఈ ఎన్నికల్లో బ్రాహ్మణ సంఘాలు టీడీపీకి మద్దతు పలుకుతున్నాయి." అని యలేశ్వరపు జగన్మోహనరాజు అన్నారు. సత్యనారాయణపురం పురోహిత సంఘం అధ్యక్షుడు చైతన్య శర్మ, విజయవాడ పురోహిత సంఘం అధ్యక్షుడు వంగల రామకృష్ణ, బీజేపీ నాయకుడు చెరువు రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.



చిన్ని సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ 35వ డివిజన్ నాయకులు

వైసీపీ నుంచి టీడీపీలోకి..

పశ్చిమ నియోజకవర్గం 35వ డివిజన్‌లోని బాప్టిస్టునగర్‌కు చెందిన వైసీపీ నాయకురాలు కటికల సృజన, డాక్టర్ కటికల మనోజ్, దాసరి సందీప్, కొదమల వరుణ్ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి కేశినేని శివనాథ్(చిన్ని) కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. కూటమి విజయానికి కృషి చేయాలని వారిని కోరారు. టీడీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇత్తడి చార్లెస్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్‌వర్మ, 35వ డివిజన్ టీడీపీ అధ్యక్షురాలు బూదాల నందకుమారి, నరసింహచౌదరి, డాక్టర్ సంకే విశ్వనాథ్ పాల్గొన్నారు.

విజయవాడ

● తూర్పు ● సెంట్రల్ ● పశ్చిమ

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	151, 160, 171
చికెన్ విత్ స్కిన్	290
చికెన్ స్కిన్‌లెస్	300



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.40

చంద్రబాబు హయాంలోనే నగరాభివృద్ధి : గద్దె అనురాధ



లబ్బీపేట, మే 6: విజయవాడ నగరం అభివృద్ధి చంద్రబాబునాయుడు హయాంలోనే జరిగిందని, వైసీపీ హయాంలో విజయవాడ అభివృద్ధి శూన్యమని గద్దె అనురాధ అన్నారు. 19వ డివిజన్‌లోని అమెరికన్ హాస్పిటల్ ఏరియాలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలోని ఏ ప్రధాన అభివృద్ధి చూసినా టీడీపీ హయాంలోనే జరిగిందని అన్నారు. నగర ప్రజలు వాస్తవాలు తెలుసుకుని అవాస్తవాలు ప్రచారం చేస్తున్న వైసీపీని ఓడించాలని అన్నారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గద్దె రామ్మోహన్, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌లను గెలిపించాలని కోరారు.

కుల ప్రస్తావన లేకుండా పశ్చిమను అభివృద్ధి చేస్తా

కూటమి అభ్యర్థి సుజనా చౌదరి



రోడ్ షోలో మాట్లాడుతున్న సుజనా చౌదరి

భవానీపురం. మే 6 : మానవత్వమే తన కులమని, కుల ప్రస్తావన లేకుండా పశ్చిమను మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి చేస్తానని పశ్చిమ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి హామీ ఇచ్చారు. సోమవారం సాయంత్రం కుమ్మరిపాలెం నుంచి చెరువు సెంటర్ రోడ్‌షోలో పాల్గొన్నారు ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడారు. 70 ఏళ్లలో చూడని అభివృద్ధిని పశ్చిమలో చేసి చూపిస్తానని, తనను ఎమ్మెల్యే గెలిపించడంతో పాటు, ఎంపీగా కేశినేని శివనాథ్(చిన్ని)ను భారీ మెజార్టీతో గెలిపించి తమను ఆశీర్వదించాలని కోరారు. ఉత్తరాంధ్ర జిల్లాల టీడీపీ ఇన్‌ఛార్జి బుద్దా వెంకన్న, మైనార్టీ నాయకులు ఎస్‌కే నాగుల్ మీరా, దుర్గగుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడు, టీడీపీ, జనసేన అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాసరావు, మల్లెపు విజయలక్ష్మి, పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండప్రాంతాల ప్రజల సమస్యలు పరిష్కరిస్తా

చిట్టినగర్: కొండప్రాంతాల ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడతానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి సుజనా చౌదరి హామీ ఇచ్చారు. సోమవారం 46వ డివిజన్ కొండప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు ప్రజలు తాగు నీటి, డ్రైయినేజీ, మెట్లు తదితర సమస్యలను సుజనా చౌదరి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ కొండప్రాంతాల్లో ప్రజలకు అండగా ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానన్నారు. తనను గెలపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

38, 39 డివిజన్లలో ప్రచారం

విద్యాధరపురం: కూటమి బలపర్చిన పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనాచౌదరి సోమవారం రాత్రి 38, 39 డివిజన్లలో టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి బుద్దా వెంకన్న, బీసీ మైనార్టీ ప్రతినిధి నాగుల్‌మీరాలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్లలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, గొల్లపూడి మాజీ సర్పంచ్ బొమ్మసాని సుబ్బారావు, మాజీ కార్పొరేటర్ గుండారపు హరిబాబు పాల్గొన్నారు.

కేశినేని వెంకట్, కార్తీక్ బైక్ ర్యాలీ

విద్యాధరపురం: ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం సుజనా చౌదరి కుమారుడు యలమంచిలి కార్తీక్, కేశినేని శివనాథ్(చిన్ని) కుమారుడు వెంకట్‌లు యువతతో కలిసి భవానీపురంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించడంతో పాటు బుల్లెట్ బండిపై సుజనా చౌదరి పాల్గొని హల్‌చల్ చేశారు. యువత ఉత్సాహంగా ముందుకు సాగారు.



పొనుగుపాటి ముమ్మర ప్రచారం

విద్యాధరపురం, మే 6: కూటమి బలపర్చిన పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి శివనాథ్ (చిన్ని)ల గెలుపును కాంక్షిస్తూ సోమవారం 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పొనుగుపాటి చిన వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ముమ్మర ప్రచారం జరిగింది. డివిజన్‌లో 13 పోలింగ్ బూత్‌లు ఉండగా బూత్‌కు పది మంది చొప్పున బీజేపీ, టీడీపీ, జనసేన కార్యకర్తలు 130 మందితో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి రూపొందించిన మేనిఫెస్టో, సూపర్ సిక్స్ వరాలు వంటి వాటిని ఓటర్లకు వివరించారు.



42వ డివిజన్‌లో టీడీపీ నాయకుల ప్రచారం

విద్యాధరపురం, మే 6: పశ్చిమలోని 42వ డివిజన్‌లో సోమవారం టీడీపీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేశారు. సుజనా చౌదరి, కేశినేని శివనాథ్‌ల గెలుపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. భవానీపురం టెలిఫోన్ కాలనీలో ఇంటింటికి ప్రచారం చేశారు. స్థానిక నాయకులు నేలకుర్తి వెంకట్రావు, అన్నబత్తిన శ్రీనివాస్, మైనంపాటి రమేష్, బోయపాటి శ్రీనివాస్, కళ్యూరి మాల్యాద్రి, చంద్రశేఖర్, కాశీ విశ్వనాథ్ తదితరులు ఈ ప్రచారంలో పాల్గొన్నారు.

● పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)ల గెలుపును కాంక్షిస్తూ తెలుగు యువత ఆధ్వర్యంలో సోమవారం వస్త్రలత ప్రాంగణంలో ప్రచారం నిర్వహించారు. ముఠా కార్మికులతో మాటమంతి నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. పశ్చిమ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ, నాయకులు షేక్ గాలీబ్‌సహేద్, బబ్బూరి శ్రీనివాస్, కోసూరి నూకరాజు, దేవర కళ్యాణ్, మణికంఠ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే మహిళా సాధికారత

● గద్దె రామ్మోహన్



గౌతమినగర్‌లో గద్దె రామ్మోహన్ ప్రచారం

కృష్ణలంక, మే 6 : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలోనే మహిళా సాధికారత సాధ్యమైందని, జగన్ హయాంలో మహిళలపై దాడులు, అఘాయిత్యాలు పెరిగిపోయాయని తూర్పు ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి గద్దె రామ్మోహన్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సోమవారం కృష్ణలంక 20వ డివిజన్‌లోని పలు వీధుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కృష్ణలంక గౌతమినగర్ రెండోలైనులో గద్దెకు మహిళలు హారతులు పట్టి నుదుటిన కుంకుమ దిద్దారు. ఈ సందర్భంగా వారు గద్దెతో మాట్లాడుతూ చంద్రబాబు హయాంలోనే మహిళలకు రక్షణ వుందని, ప్రస్తుత ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని గద్దె వద్ద ఏకరువు పెట్టారు. రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని తామంతా సమష్టిగా టీడీపీకి ఓటు వేసి ఎమ్మెల్యేగా గద్దె, ఎంపీగా శివనాథ్‌ను, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడిని గెలిపించుకుంటామని ప్రతిన పూనారు. స్థానిక మహిళలు పాల్గొన్నారు.

వాసవ్యలో టాలీ, జీఎస్టీపై శిక్షణ ప్రారంభం



పటమట, మే 6 : స్థానిక వాసవ్య మహిళా మండలిలో మహిళలు, యువతలకు టాలీ, జీఎస్టీలపై శిక్షణా తరగతులను సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ బి.కీర్తి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, యువతులు ఆర్థికంగా ఎదగటానికి వారి కుటుంబానికి అండగా ఉండేందుకు కంప్యూటర్‌పై శిక్షణా తరగతులు ప్రారంభించామన్నారు. జీఎస్టీ, టాలీపై మహిళలకు శిక్షణ ఇవ్వడం ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. వివరాలకు వాసవ్య మహిళా మండలిని, మొబైల్ నెంబర్ 8332842084ను సంప్రదించాలన్నారు.



కూటమిని గెలిపించండి : రాజేష్

పటమట, మే 6: టీడీపీ, జనసేన, బీజేపీలు బలపర్చిన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్, ఎంపీగా కేశినేని శివనాథ్(చిన్ని)లను భారీ మెజార్టీలతో గెలిపించాలని గద్దె రాజేష్ ఓటర్లను అభ్యర్థించారు. 13వ డివిజన్ కృష్ణానగర్ శ్రీదేవి అపార్టుమెంట్ ఏరియాలో రాజేష్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్, హేమాన్షులు మాట్లాడుతూ రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు సీఎం అయితే భవిష్యత్ ఉంటుందని,ఆయన హయాంలోను విజయవాడ అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు గద్దె ప్రసాద్, కార్పొరేటర్ ప్రసాద్, రామాయణపు కోటి, సత్యనారాయణ, లోకేశ్వరరావు, శ్రీను, కమ్మిల రాజేశ్వరి, నూతి శ్రీను, వేములపల్లి శ్రీను, సాయిలక్ష్మిలు పాల్గొన్నారు.

గుణదల: టీడీపీ యువ నాయకుడు గద్దె రాజేష్ 2వ డివిజన్ పరిధిలోని మాచవరం మసీదు రోడ్డులో సోమవారం ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ముందుగా ఆయన స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 2024లో కూటమి అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. ఎమ్మెల్యేగా గద్దెను, ఎంపీగా కేశినేని శివనాథ్‌ను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించుకోవాలని కోరారు. దాసరి గాబ్రియేలు, సుగసాని కృష్ణప్రసాద్, ఎలికల సురేష్‌బాబు, పి.నాగుల్ మీరా, పర్వతనేని రత్నశ్రీ, తుమ్మపూడి శ్యామ్ కుమార్, బోయిన రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న ప్రచారం

● 41వ డివిజన్‌లో టీఎన్ఎస్ఎఫ్ ● 43, 45 డివిజన్ల అధ్యక్షుల ప్రచారం



ఊర్మిళానగర్‌లో టీడీపీ యువ నేతల ప్రచారం

భవానీపురం, మే 6 : పోలింగ్ తేదీ సమీపిస్తుండటంతో అభ్యర్థులతో సంబంధం లేకుండా ఆయా డివిజన్లలో యువ నాయకులు, కూటమి పార్టీల నేతలు ఓటర్లను చుట్టేస్తున్నారు. గుర్తులపై విస్తృతంగా అవగాహన కల్పిస్తూ ఈవీఎంలు, బ్యాలెట్ నమూనాలతో వారి దగ్గరికి వెళ్లి వివరిస్తున్నారు. ప్రతీ ఓటు కీలకం అన్న కోణంలో చెబుతు న్నారు. 41వ డివిజన్‌లో తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్(టీఎన్ఎస్ఎఫ్) విజయ వాడ పార్లమెంట్ కార్యదర్శి సయ్యద్ ఖాజా, రాష్ట్ర నాయకులు సయ్యద్ బాజీ షరీఫ్‌లు ప్రెసిడెంట్ వీధిలోని 23 బూత్ నెంబర్‌లో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తూ ఎంపీగా కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేగా సుజనా చౌదరిలను గెలిపించాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలపైన అవగాహన కల్పించారు. నాయకులు షేక్ అఖారుద్దీన్, షేక్ రియాజ్, నాగసాయి, సురేష్, టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు. 45వ డివిజన్‌లో టీడీపీ డివిజన్ అధ్యక్షుడు పేరం సత్యనారాయణ, సీనియర్ నాయకులు దేవరకొండ చక్రవర్తిలు ప్రచారం చేశారు. జనసేన, టీడీపీ నేతలు పాల్గొన్నారు. 43వ డివిజన్‌లో ఊర్మిళానగర్‌లో టీడీపీ సీనియర్ బొమ్మసాని సుబ్బారావు నాయకత్వంలో నాయకులు మోరబోయిన రాంబాబు, బుల్లెపల్లి కోటేశ్వరరావు, మాగం ఆత్మారామ్, మోడీ వెంకట్రాజు, తెల్లగడ్డల దుర్గారావు, కోటి, రాయల శ్రీను, వేముల సుబ్బారావులు విజయవాడ ఎంపీగా కేశినేని శివనాథ్, పశ్చిమ ఎమ్మెల్యేగా సుజనా చౌదరిలను గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

అవినీతి పరులు.. ప్రజాప్రతినిధులు కాకూడదు

● సీపీఐ పశ్చిమ అభ్యర్థి కోటేశ్వరరావు

ధర్నాచౌక్, మే 6: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజలకు ఉన్న వ్యతిరేకత తనను గెలిపిస్తుందని పశ్చిమ నియోజకవర్గం సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి జి.కోటేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించినా మీట్ ది ప్రెస్' లో ఆయన మాట్లాడారు. బ్యాంకులకు రూ.5,700 కోట్లు ఎగనామం పెట్టిన వారు, ఇళ్ల కట్టుకునే వారి నుంచి డబ్బులు దండుకునే వారిని ప్రోత్సహిస్తున్న వ్యక్తులు ప్రజాప్రతినిధులు కాకూడదన్నారు. గతంలో కార్పొరేటర్‌గా పని చేసిన తాను అనేక అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. టీడీపీ, జనసేన, వైసీపీలు మోదీకి దాసోహం అంటున్నాయని విమర్శించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాన న్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధానకార్యదర్శి చందు జనార్ధన్, విజయవాడ అర్బన్ యూనిట్ అధ్యక్షుడు చావా రవి, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కంచల జయరాజ్, దాసరి నాగరాజు, సీనియర్ జర్నలిస్టు ఎస్‌కే.బాబు పాల్గొన్నారు.

క్యాటరింగ్ వర్కర్ మృతి

రైల్వేస్టేషన్, మే 6: విజయవాడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారమ్1లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి లిఫ్ట్ ఎంట్రన్స్ వద్ద ఆదివారం గుడివాడకు చెందిన క్యాటరింగ్ వర్కర్ గోపి(43) మృతి చెంది కనిపించాడు. స్టేషన్ సూపరిండెంటెంట్ జి.రామకృష్ణ సమాచారం మేరకు జీఆర్‌పీ పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని వివరాలు సేకరించారు. డ్యూటీ రైల్వే డాక్టర్‌ను పిలిపించి అచేతనంగా పడి ఉన్న గోపిని చూపించారు. డాక్టర్ పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో పోలీసులు అతని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు.



పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని లలితా జ్యూయలరీ వెనుక ఎస్‌బీఐ కాలనీలోని పార్కులో మూడు రోజులుగా పగలు లైట్లు వెలుగుతున్నాయి. ఆ పార్కులో మూడు రోజులుగా లైట్లు వెలుగుతున్నా వీఎంసీ సిబ్బంది పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది

జగన్ పాలనలో దళితులపై పెరిగిన దాడులు

● టీడీపీ సెంట్రల్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బెజ్జం జైపాల్



అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ ఎస్సీ సెల్ నేతలు

అజిత్‌సింగ్‌నగర్, మే 6 : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో దళితులపై దాడులు అధికమయ్యాయని టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బెజ్జం జైపాల్ విమర్శించారు. 59వ డివిజన్ తెలుగు బాపిస్ట్ చర్చి ప్రాంతంలో సోమవారం టీడీపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన ముందుగా డివిజన్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం దళితులను మోసం చేసిన విధానాలను స్థానికులకు వివరించారు. నేతలు చీకటి సుబ్బయ్య, రాజేష్, చీర దుర్గారావు, దేవరికి రాంబాబు, చీర ముసలయ్య, రాంబాబు, పాల్గొన్నారు.

టీడీపీ చేసిన అభివృద్ధిని చూసి ఓటేయండి

● బొండా శిల్ప



ఎన్నికల ప్రచారంలో బొండా శిల్ప

మధురానగర్, మే 6: టీడీపీ అధికారంలో ఉన్నపుడు ఎమ్మెల్యేగా ఉన్న బొండా ఉమా మీ డివిజన్‌లో చేసిన అభివృద్ధిని చూసి ఓటేయండని బొండా శిల్ప ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ, జనసేన బలపర్చిన పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని చిన్ని, అసెంబ్లీ అభ్యర్థి బొండా ఉమామహేశ్వర రావుకు సైకిల్ గుర్తు మీద ఓటేసి గెలిపించాలని కోరుతూ ఆమె సోమవారం మధురానగర్ 29వ డివిజన్‌లో బోయిన గంగాధరరావు వీధి, ఇందిరా కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల ప్రజలతో మాట్లాడుతూ మధురానగర్‌లో టీడీపీ చేసిన అభివృద్ధిని గుర్తు చేశారు. డివిజన్ అధ్యక్షులు పీవీఆర్, ఇన్‌ఛార్జి నెక్కంటి ప్రసాద్, రాంబాబు, వెంకన్న, రాజి, ఝాన్సీ, రామినాయుడు, సూరి, పుచ్చా పవన్, జనసేన డివిజన్ అధ్యక్షులు కెంబూరి కృష్ణ, భవానీ పాల్గొన్నారు.

59వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం

అజిత్‌సింగ్‌నగర్, మే 6 : అజిత్‌సింగ్‌నగర్ 59వ డివిజన్‌లో టీడీపీ నేతలు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమా ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం బొండా ఉమా మాట్లాడుతూ ప్రజలపై పన్నుల భారాలను మోపిన జగన్‌కు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన పొందాలి



ఎస్‌బీఐలో అవగాహన కార్యక్రమం

విద్యాధరపురం, మే 6: సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు తమ ఖాతాదారులను కోరారు. సోమవారం భవానీపురం స్వాతి జంక్షన్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో ఖాతాదారులు, పెన్షన్‌దారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అధికారులు మాట్లాడుతూ ఏటీఎం కార్డుల భద్రతా, సైబర్ నేరాల నుంచి ఎలా రక్షణ పొందాలి, తెలియని వ్యక్తులకు ఓటీపీలు షేర్ చేయకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలి తదితర అంశాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజియనల్ మేనేజర్ నవీన్‌బాబు, బ్రాంచ్ మేనేజర్ జి.ఉషా, సర్వీస్ మేనేజర్ రహీమా, చీఫ్ అసోసియేట్ ఎస్వీ భారతి, అసోసియేట్లు పి.సత్యనారాయణ, సంధ్యావతి, సుధా ప్రియదర్శినిలు పాల్గొన్నారు.





ఇంటింటికీ సంక్షేమ పథకాలు

'టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రతి ఇంటికీ అందజేసే బాధ్యత నాది.' అని విజయవాడ సెంట్రల్ నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఎన్నికలకు మరో వారం రోజులే ఉన్న నేపథ్యంలో ప్రచారంలో బిజీబిజీగా ఉన్న ఉమా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. - అజిత్‌సింగ్‌నగర్

- వైసీపీ పాలనతో విసిగిపోయిన జనం
- పశ్చిమలో అక్రమార్కుడిని సెంట్రల్‌లో ఆదరిస్తారా
- అవినీతిలో మునిగిపోయిన వ్యక్తి నాకు పోటీయే కాదు
- సెంట్రల్ నియోజకవర్గ కూటమి అభ్యర్థి బొండా ఉమా

ఎన్నికల ప్రచారం.. ప్రజాస్పందన ఎలా ఉంది?

ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంతో విసిగిన ప్రజలు ఎన్డీయే కూటమి అభ్యర్థులకు బ్రహ్మరథం పడుతున్నారు. స్వాగతిస్తూ హారతులు పడుతున్నారు. వైసీపీ పాలనలో ప్రజలు ఆర్థికంగా ఎదుగుదల లేకుండా పోయారు. సుపరిపాలన కోసం ఎదురుచూస్తున్నారు. కేవలం సంక్షేమ పథకాల పేరుతో పప్పులు బెల్లాలివ్వడం తప్ప జగన్ ప్రభుత్వం ఏ అభివృద్ధి చేయలేదు. దీంతో నియోజకవర్గంలో సమస్యలు పేరుకుపోయాయి. మేం నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు తమ సమస్యలను ఏకరవు పెడుతున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని కసిగా ఎదురుచూస్తున్నారు.

నియోజకవర్గ ప్రజలకిచ్చే ప్రధాన హామీలు

తెలుగుదేశం మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతి పథకాన్ని అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా బాధ్యత తీసుకుంటా. సంక్షేమ పథకాలకు ఆది అంతం తానే అన్నట్టు జగన్ రెడ్డి బిల్డప్‌లు ఇస్తున్నారు. ఆయనకు ముందు పేదలకు ఎన్నో పథకాలు అందాయి. ఆయన తర్వాత కూడా అందుతాయి. పేదలను దృష్టిలో పెట్టుకుని టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను తీసుకొచ్చింది. వాటిని అర్హులైన కుటుంబాలకు అందించే బాధ్యత నాది. వైసీపీ పాలనలో అనేక ప్రాంతాలు వెనుకబడిపోయాయి. ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తాం. సెంట్రల్‌లో కొన్ని ప్రాంతాలు నగర శివారులో ఉన్నాయి. ఆయా ప్రాంతాలను నగరానికి దీటుగా తయారు చేస్తాం.

ఐదేళ్ల వైసీపీ పాలనపై ప్రజాభిప్రాయం ఎలా ఉంది?

వైసీపీ ఐదేళ్ల పాలనలో పన్నుల భారాలు విపరీతంగా పెరిగాయి. దీనిపై ప్రజల్లో చాలా వ్యతిరేక ఉంది. ప్రభుత్వ పథకాలు కూడా వందకి 20 మందికి కూడా అందలేదు. కరెంట్ బిల్లులు, ఐటీ రిటర్న్స్ వంటి కారణాలు చెప్పి కోతవేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అర్హులను వెతికి మరీ సంక్షేమ పథకాలిస్తే వైసీపీ ప్రభుత్వం వెతికి మరీ కోత పెట్టింది. దీనిపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అదే మాకు బలం.

కూటమి నేతల మధ్య సమన్వయం ఎలా ఉంది?

అంతా అన్నదమ్ముల్లా కలిసిపోయాం. సైకో జగన్‌ను దింపాలని దృఢ నిశ్చయంతో పనిచేస్తున్నారు. బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు కలిసి ప్రజల్లోకి వెళ్తున్నారు. అందరూ సమష్టిగా పనిచేసి తెలుగుదేశం పార్టీ విజయానికి బాటలు వేస్తున్నారు.

మీ ప్రత్యర్థి బలాలు, బలహీనతలు ఏంటి?

సెంట్రల్‌లో నాకు ప్రత్యర్థి ఉన్నాడని నేను అనుకోవడం లేదు. పశ్చిమ నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలకు పాల్పడి అక్కడ ముఖం చెల్లక సెంట్రల్‌కు వచ్చిన వ్యక్తిని ఇక్కడ ప్రజలు ఆదరిస్తారని నేను అనుకోవడం లేదు. గతంలో నాకు పోటీగా ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యేని కూడా అవినీతి ఆరోపణలపైనే మార్చేశారు. ఇలాంటి వారా నాకు ప్రత్యర్థులు. సెంట్రల్ నియోజకవర్గంలో నాకు ఎవరు పోటీ లేరు. నాకు నేనే పోటీ.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రజా సమస్యలు పరిష్కరిస్తా

జిల్లా కేంద్రమైన మచిలీపట్నం నియోజకవర్గం ప్రజా సమస్యల పరిష్కారమే తన మొదటి ప్రాధాన్యత అని కూటమి అభ్యర్థి కొల్లు రవీంద్ర తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సాగు, తాగునీటి సమస్యలపై దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపుతానన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు బందరు ప్రముఖులు, మేధావులు, విద్యావేత్తల సలహాలు, సూచనలు తీసుకుని తనవంతు కృషి చేస్తానన్నారు. గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవంతోపాటు, ఐదేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా తిరిగానని, ప్రజాసమస్యలపై మరింత అవగాహన పెరిగిందని, కూటమి ప్రభుత్వం అధికారంలో వస్తుందని, జనరంజకపాలనను అందిస్తానని ఆయన తెలిపారు. - ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం



- తీరప్రాంతాలకు నీరు, ఇంటింటికీ కుళాయి
- కూటమి అభ్యర్థిగా నా గెలుపు ఖాయం
- వైసీపీ అరాచకపాలనతో విసిగిపోయారు
- మచిలీపట్నం అసెంబ్లీ కూటమి అభ్యర్థి కొల్లు రవీంద్ర

ప్రచారం ఎలా జరుగుతోంది..

ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులు ఎన్నో ఇబ్బందుల పాలయ్యారు. సాగు నీరు సకాలంలో ఇవ్వలేదు. రైతులు పండించిన ధాన్యం విక్రయిస్తే నెలల తరబడి ధాన్యం బిల్లులు రైతుల ఖాతాల్లో జమకాలేదు. ప్రకృతి విపత్తులకు రైతులు పంటలు కోల్పోతే ప్రభుత్వం పట్టించుకోలేదు. ఐదేళ్లుగా రైతులు, ప్రజలు సాగు, తాగునీటి సమస్యలు ఎన్నో ఎదుర్కొన్నారు. ప్రచారానికి ఇంటింటికీ వెళ్తుంటే తమకు ప్రజలు చెప్పిన మాటలివి. వారు తమ అభిమానాన్ని చాటుతూ అక్కున చేర్చుకుంటున్నారు. భూ ఆక్రమణలు పెరిగిపోయాయి. గంజాయి బ్యాచ్ ఆగడాలు అధికమయ్యాయి. రహదారుల దుస్థితి చెప్పనలవి కాదు. వీటన్నింటినీ ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేస్తున్నాం. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జరిగే మంచిని ఓటర్లకు వివరిస్తున్నాం. కూటమికి బలం తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించి పరిస్థితులను అనుకూలంగా మలచుకుంటున్నాం, ప్రజల వద్దకు వెళ్లినప్పుడు వారు చెబుతున్న సమస్యలను నమోదు చేసుకుంటున్నాం. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని భరోసా ఇస్తున్నాం.

ప్రత్యర్థి బలాలు, బలహీనతలు

పేర్నినానిని నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఆయన కుమారుడు పేర్ని కిట్టు అనధికార ఎమ్మెల్యేగా నాలుగేళ్లు కొనసాగారు. తండ్రి ఎమ్మెల్యే అయితే కొడుకు పెత్తనం చేశాడు. అధికారులను, పోలీసులను గుప్పెట్లో పెట్టుకుని కిట్టు చేసిన అరాచకాలను ప్రజలు గమనించారు. మునిసిపల్ కార్పొరేషన్‌లో మేయర్‌ను ఉత్సవవిగ్రహంలా కూర్చోబెట్టి పెత్తనం చలాయించాడు. మూడేళ్లపాటు మంత్రిగా పనిచేసిన పేర్ని నాని ప్రజా సమస్యలను, పార్టీ కార్యకర్తలను పట్టించుకోలేదని ఆ పార్టీవారే బాహటంగానే చెబుతున్నారు. రాజకీయ అనుభవం, ప్రజాసమస్యలపై కనీస అవగాహనలేని పేర్ని కిట్టు ఏం అభివృద్ధి చేస్తారు..? ప్రజాసమస్యలను ఎంతమేర పట్టించుకుంటారని నియోజకవర్గ ప్రజలు అంటున్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు తండ్రీ కొడుకులిద్దరూ అనేక కుట్రలు, కుతంత్రాలకు తెరతీశారు. పేర్ని కుటుంబం పట్ల మెజార్టీ వైసీపీ నేతల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. వైసీపీ నేతలు ఎన్ని కుట్రలు చేసినా నియోజకవర్గ ఓటర్లు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా ఉన్న నన్ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారు. మచిలీపట్నంలో నేను గెలిచి తీరుతా.

నియోజకవర్గ ప్రజలకు మీరిచ్చే హామీలు

వైసీపీ ప్రభుత్వం మచిలీపట్నం పోర్టును మైనరుపోర్టుగా మార్చేసింది. మేజరుపోర్టుగా అభివృద్ధి చేస్తాం. మచిలీపట్నం-రేపల్లె రైలు మార్గాన్ని కలిపేందుకు కేంద్ర నుంచి అనుమతులు తెచ్చి త్వరగా పనులు పూర్తిచేస్తాం. ప్రతి పేదకుటుంబానికి సొంతింటికలను సాకారం చేస్తాం. చెత్తపన్ను తొలగించి ప్రజలపై ఆర్థికభారం తగ్గిస్తాం. ప్రతి ఇంటికీ ఉచితంగా మంచినీటి కుళాయి, మురుగునీరు బయటకు పోయేలా శాశ్వతపరిష్కారం, మంగినపూడి బీచ్‌ను పర్యాటకకేంద్రంగా అభివృద్ధి, యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. క్రీడా ప్రాంగణాలు నిర్మాణం చేస్తాం. రైతులు ఇబ్బందులు పడకుండా సాగునీరు అందిస్తాం. బందరులో గోల్డ్ కవరింగ్ పరిశ్రమ అభివృద్ధితోపాటు కార్మికులను అన్నివిధాల ఆదుకుంటాం. రొయ్యల చెరువులకు ఆక్వాజోన్ పరిధితో సంబంధం లేకుండా అన్ని ప్రాంతాలకు సబ్సిడీ ఇచ్చి యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్‌ను అందిస్తాం. సముద్రతీరంలోని గ్రామాల్లో తాగునీటి ససమస్య లేకుండా చూస్తాం.

నేతల మధ్య సమన్వయం ఎలా ఉంది..?

కూటమి ఏర్పడినప్పుడు ఇబ్బందులు ఎదురైనా పార్టీపెద్దలు కూర్చుని మాట్లాడుకుని సమన్వయంతో పనిచేయాలని నిర్ణయం తీసుకున్నాం. కూటమిలోని నేతలంతా మనస్ఫూర్తిగా కష్టపడి పనిచేస్తున్నారు. ఎక్కడైనా లోపాలుంటే కూర్చుని మాట్లాడుకుని ఐకమత్యంగా ముందడుగు వేస్తున్నాం. మచిలీపట్నం పార్లమెంటు జనసేన అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరి పోటీచేయడం మాకు కలిసివచ్చే అంశం. అన్ని వర్గాలను కలుపుకుని ఎలాంటి బేషజాలు లేకుండా గెలుపుకోసం విరామం లేకుండా పనిచేస్తున్నాం.







ప్రజల మద్దతు కోసమే..!

నియోజకవర్గంలో దివి గ్రామాల సమూహమైన ఎదురుమొండి దీవుల్లో కూటమి అభ్యర్థులు, నేతలు పడవ కష్టాలు ఎదుర్కొన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారం చేసేందుకు నాచుగుంట నుంచి ఈలచెట్లదిబ్బ కు మండలి బుద్ధప్రసాద్, వల్లభనేని బాలశౌరి నాటు పడవలపై బయలుదేరి వెళ్లారు. పడవ మధ్యలో ఉండగా అలలు ఎగసిపడుతుండగా, హోరుగాలి నాయకులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. సముద్రపు పోటు సమయంలో ఎన్నికల ప్రచారం సాగగా, హోరు గాలిలో ఎగసిపడుతున్న అలలతో పడవ దిగేందుకు కూటమి అవనిగడ్డ అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ ఇబ్బంది పడగా, గ్రామస్థులు, కార్యకర్తలు ఆయనను భుజాలపై మోస్తూ ఒడ్డుకు తీసుకొచ్చారు. అలాగే మచిలీపట్నం పార్లమెంట్ కూటమి అభ్యర్థి బాలశౌరికి స్థానికులు చేయి అందించి జాగ్రత్తగా ఒడ్డుకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అభ్యర్థులిద్దరూ ప్రజల మద్దతు కోసం, వారి కష్టాలు తెలుసుకోవడం కోసం ఎన్ని కష్టాలు ఎదురైనా లెక్క చేయమని తెలిపారు. - అవనిగడ్డ

మెంబర్ నుంచి ఎంపీ వరకు..!

- పట్టుదలకు మారుపేరు అంబటి బ్రాహ్మణయ్య
- క్రమం తప్పని యోగా ఆయన దినచర్య
- పంచెకట్టుకుని తొడకొట్టే నాయకుడిగా పేరు



మచిలీపట్నం టౌన్: తెల్లని పంచెకట్టుతో చూడగానే చెయ్యెత్తి నమస్కరించాలనే ఆహార్యం ఆయన సొంతం. సామాన్య కుటుంబం నుంచి కృష్ణాజిల్లా రాజకీయాల్లో తనదైన ప్రత్యేక ముద్రను వేసుకున్నారు అంబటి బ్రాహ్మణయ్య. ఎంత పని ఒత్తిడిలో ఉన్నా తెల్లవారుజామున 5 గంటలకు లేవడం, యోగసాధన చేయడం ఆయన నిత్యకృత్యాల్లో ఒకటి. వార్డు మెంబర్ నుంచి ఎంపీ స్థాయి వరకు అంచెలంచెలుగా ఎదిగిన రాజకీయ నేత బ్రాహ్మణయ్య. అన్యాయం, అక్రమం జరిగితే తొడకొట్టి మరీ ప్రత్యర్థులకు సవాల్ విసిరే మనస్తత్వం ఆయనది. కృష్ణా జిల్లా నంగేగడ్డలో పంచాయతీ వార్డు మెంబర్‌గా రాజకీయ రంగప్రవేశంచేసిన బ్రాహ్మణయ్య 1970 నుంచి 81 వరకు వక్కపట్లవారిపాలెం సర్పంచ్‌గా సేవలందించారు. 1981 నుంచి 86 వరకు అవనిగడ్డ సమితి అధ్యక్షుడిగా పనిచేశారు. 1985లో తెలుగుదేశం పార్టీలో చేరిన బ్రాహ్మణయ్య కృష్ణాజిల్లా పార్టీ కన్వీనర్‌గా పనిచేశారు. 1986 నుంచి 90 వరకు టీడీపీ జిల్లా కార్యదర్శిగా, 1990 నుంచి 94 వరకు టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 1994లో పార్టీ మచిలీపట్నంలో పోటీచేయమని సూచించడంతో ధైర్యంగా మచిలీపట్నం వచ్చి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తరువాత 1999 నుంచి 2004 వరకు మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడిగా పనిచేశారు. అంతటితో ఆగక 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన సొంత ప్రాంతమైన అవనిగడ్డ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎన్టీ రామారావుకు ఎంతో సన్నిహితుడిగా ఉండే బ్రాహ్మణయ్య ఊహించని విధంగా లక్ష్మీపార్వతి స్థాపించిన ఎన్టీఆర్ టీడీపీలో చేరి తెనాలి పార్లమెంటు అభ్యర్థిగా 1996లో పోటీ చేసి ఓడిపోయారు. 2004లో నుంచి బందరు పార్లమెంటుకు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. మచిలీపట్నం నగరాభివృద్ధికి బ్రాహ్మణయ్య చేసిన కృషిని నగర ప్రజలు ఇప్పటికీ చెప్పుకుంటూ ఉంటారు. 1940 జనవరి 13న జన్మించిన బ్రాహ్మణయ్య 2013 ఏప్రిల్ 21న కన్నుమూశారు.

నాడు నియోజకవర్గం.. నేడు పంచాయతీ..!

- అభివృద్ధి శూన్యం.. ఎటు చూసినా సమస్యల కల్లోలం
- ఇదీ నాటి నియోజకవర్గం మల్లేశ్వరం రూపు

కృత్తివెన్ను, మే 5: 11 విడతల అసెంబ్లీ ఎన్నికలకు నియోజకవర్గ కేంద్రంగా ఉన్న మల్లేశ్వరం నేడు పంచాయతీగా మారింది. ఎటుచూసినా సమస్యల వలయంలో చిక్కుకుని అభివృద్ధికి దూరంగా మిగిలిపోయింది. ఆంధ్ర రాష్ట్రంలో జరిగిన తొలి ఎన్నికలకు మల్లేశ్వరం ఒక అసెంబ్లీ నియోజకవర్గం. తరువాత జరిగిన మరో 10 ఎన్నికల వరకు మల్లేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గంగానే కొనసాగింది. కాలక్రమేణ మల్లేశ్వరం నియోజకవర్గం కాస్త పెడన నియోజకవర్గంగా మారిపోవడంతో ప్రస్తుతం ఈ మల్లేశ్వరం బంటుమిల్లి మండలంలో ఓ పంచాయితీగా మిగిలిపోయింది. మల్లేశ్వరం అసెంబ్లీ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు విడతల వారిగా పనిచేశారు. అందులో కొందరు పలు కీలక పదవులను కూడా దక్కించుకున్నారు. రాజకీయంగా మల్లేశ్వరం మంచి ప్రాతినిథ్యం వహించింది. కానీ ఎలాంటి అభివృద్ధికి నోచుకోకుండా పోయింది. సుమారు 2,200 ఓటర్లు, 3వేల మంది జనాభా కలిగిన ఈ పంచాయతీలో కనీస మౌలిక వసతులు లేక వెలవెలబోతోంది. సరైన రహదారులు, మంచినీటి సౌకర్యం లేవు. పంచాయతీ భవనం సైతం శిథిలం కాగా దాన్ని తొలగించి సచివాలయ నిర్మాణం చేపట్టినా అది నిర్మాణ దశలోనే ఆగిపోయింది. కనీసం వచ్చే ప్రభుత్వంలోనైనా అభివృద్ధి చేయాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.



మల్లేశ్వరంలో నిర్మాణ దశలో నిలిచి, గొర్రెలకు షెల్టర్‌గా మారిన సచివాలయ సముదాయ కట్టడాలు



తండ్రులకు తోడుగా తనయులు

జిల్లాలో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. అభ్యర్థులు తమ ప్రచారాన్ని వేగవంతం చేశారు. తోడుగా వారి కుటుంబ సభ్యులు కూడా ప్రచారంలో పాల్గొని అండగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడ పార్లమెంట్ బరిలో నిల్చున కేశినేని శివనాథ్ (చిన్ని)కి తోడుగా ఆయన తనయుడు, పశ్చిమ అసెంబ్లీ బరిలో నిల్చున్న సుజనా చౌదరి తరపున ఆయన తనయుడు ప్రచారానికి వచ్చారు. వీరిద్దరూ కలిసి భవానీపురంలో తమ పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు.





ఎటు చూసినా పచ్చదనం, ఏ రోడ్డుపైకి వెళ్లినా గతుకులు లేని దారులు, అందమైన చిత్రాలతో కళగా కనిపించే గోడలు, ఆహ్లాదపరిచే పార్కులు, సాయంత్రం అయితే జనసమూహంతో కిటకిటలాడే ఫుడ్ పార్కులతో కళకళలాడే విజయవాడ నగరం నేడు వసతుల లేమితో బోసిపోయింది. నగరానికే మణిహారంలా నిలిచిన భవానీ ఐలాండ్ నేడు ప్రభుత్వ నిరాదరణకు గురై కునారిల్లింది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో భారీగా ఖర్చుపెట్టి భవానీ ఐలాండ్ వద్ద కృష్ణానది మధ్యలో లేజర్ షో ఏర్పాటు చేసింది. ఈ షో అప్పట్లో పిల్లల్ని, పెద్దల్ని ఎంతగానో అలరించింది. కానీ నేడు అక్కడ ఇలాంటి లేజర్ షో ఒకటి జరిగిందనే ఆనవాళ్లు లేకుండా నీటిలో తూడుకాడ, ఒడ్డున ముళ్లపొదలతో నామరూపాల్లేకుండా పోయింది. వచ్చే ప్రభుత్వమైనా పర్యాటక రంగాన్ని కొత్తపుంతలు తొక్కిస్తారని పర్యాటక ప్రేమికులు ఆశిస్తున్నారు.

ఆర్కే: అప్పటికి అతనికి తెలియదా, తెలిసీ అలా చెప్పాడా?

రాజశేఖర్‌రెడ్డి: నేను తెలియదనే అనుకున్నాను. కానీ తర్వాత తెలిసింది.. అతనికి కూడా పూర్తిగా అవగాహన ఉంది. అతనితో ఆ రోజు అలా చెప్పించారు. కానీ వాళ్లు అనుకున్నది అనుకున్నట్లు జరిగినట్లు లేదు. బావ(వివేకా)కి అప్పటికే స్టంట్ వేసి ఉంది. సిగరెట్స్ తాగుతుండేవారు. ఆల్కహాల్ తీసుకునే వారు. సో జరిగి ఉండచ్చునేమో అనుకున్నాను. బ్లడ్ వామ్‌టింగ్ అనేది తెలియదు. బట్, పుట్టిన ప్రతి మనిషి చనిపోవాల్సిందే కదా. సో అట్లా చనిపోయారు అనుకొని నేను ఎక్కువ పొడిగించ లేదు. ఎందుకంటే పక్కనే వాళ్ల(సునీత) అమ్మ ఉంది. ఆవిడకు వెంటనే తెలిస్తే ఎలా అని దాన్ని ముగించేసి పైకెళ్లిపోయాను. బ్లడ్ వామ్‌టింగ్ అంటున్నాడు కదా ఏమైనా ఉండచ్చు అని.. పులివెందుల ఇంట్లో పనిచేసే పిల్లాడు ఉన్నాడు. అతనికి ఫోన్ చేస్తే.. సార్ నేను లేను కాణిపాకం పోయాను. దారి మధ్యలో మా అక్క వాళ్ల ఇంట్లో ఆగిపోయాను అన్నాడు.



అంతా 'స్క్రిప్టు' ప్రకారమే

(మొదటి పేజీ తరువాయి)

అవమానాలు ఒకటి కాదు. ఇంత జరిగినప్పుడు ఇక చాలిద్దాం, మనవల్ల కాదు అన్న భావన వచ్చిందా?

సునీత: కొన్నిసార్లు కుంగిపోయాను. కానీ, రెండు మూడు రోజుల్లో తేరుకునేదాన్ని. తర్వాత ఏం చేయాలి అనిపించడం.. ప్రారంభమైంది. కానీ, ఏం ఎక్స్‌పెక్ట్ చేయాలో ఏమి చేయకూడదో తెలియదు. ఎలా ఉంటుందో తెలిసి ఉంటే.. ప్రాబబ్లీ ఇది ఎప్పుడో వదిలేసేదాన్నేమో. ఏమీ తెలియదు. ఈరోజు ఈ ఇష్యూ ఉంది.. ఎలా పరిష్కరించాలి.. నాకు తెలియకపోతే సలహాలు అడిగేదాన్ని.

ఆర్కే: ఒక రకంగా సుప్రీం కోర్టులో ప్రాక్టీస్ చేయగలిగినంత ప్రావీణ్యం వచ్చేసింది.

సునీత: ఐ డోంట్ అగ్రీవిత్ దట్. కొంత వరకు అవగాహన ఉంది. తర్వాతకాలంలో సుప్రీంకోర్టుకు వెళ్లాలన్నా, హైకోర్టుకు వెళ్లాలన్నా ప్రాసెస్ ఏంటని అర్థమవుతుంది. లాంగ్వేజ్ అర్థమవుతుంది.

రాజశేఖర్‌రెడ్డి: కానీ నాతో అంటుంటుంది.. నేను 'లా' చదువుతాను అని.

ఆర్కే: మర్డర్ జరిగిన రోజు మీకు అసలు ఫస్ట్ ఇన్‌ఫర్మేషన్ ఎవరి వద్ద నుంచి వచ్చింది.

రాజశేఖర్‌రెడ్డి: చాలా కాలం నుంచి మా దగ్గర పీఏ కృష్ణారెడ్డి అని ఒక వ్యక్తి ఉండేవారు. ఆ రోజు ఉదయం 6:16 గంటలకు ఫోన్ చేసి, రాజశేఖర్.. బావ మనకు లేరు అన్నారు. ఏమైందని అడిగాను. బ్లడ్ వామ్‌టింగ్ అనుకుంటానని, బాత్‌రూమ్‌లో బ్లడ్ ఉందని, బాత్‌రూమ్‌లో పడి ఉన్నారని చెప్పారు.

ఆర్కే: పనిచేసే వ్యక్తి చెప్పింది నిజమా? అబద్ధమా?

రాజశేఖర్‌రెడ్డి: నిజమే!

ఆర్కే: అతను లేడు కదా?

రాజశేఖర్‌రెడ్డి: అతను లేడు. కానీ, బావతో అక్కడే ఉన్న మా డ్రైవర్ ప్రసాద్‌కు ఫోన్ చేశాను. ప్రసాద్ ఇప్పటికీ మాకు డ్రైవర్‌గానే ఉన్నాడు. ఫోన్ చేస్తే అతని భార్య రిసీవ్ చేసుకుంది. ప్రసాద్ ఎక్కడమ్మా అంటే 'సార్ ప్రసాద్ నిద్రపోతున్నాడు. రాత్రి లేటుగా వచ్చాడు సార్' అనింది. లేపమ్మా అన్నాను. ప్రసాద్ లేచిన తర్వాత అడిగాను. రాత్రి ఎన్ని గంటలకు వచ్చారు? భోజనం చేశారా? డ్రింక్ ఏమైనా చేశారా? అని.. 'సార్ భోజనం అయితే టేబుల్ మీద పెట్టాను. డ్రింక్ తీసుకోలేదు సార్' అన్నాడు. వాస్తవానికి అతను చెప్పింది అబద్ధం. అతను వివేకాకి డ్రింక్ బాటిల్ ఇచ్చాడు.. నేను తిడతానేమోనని భయపడ్డాడు. సర్లే నువ్వు వెంటనే వివేకా ఇంటి వద్దకు వెళ్లిపో అనిచెప్పి ఫోన్ పెట్టేసి కిందికి వచ్చేశాను.

ఈ వ్యవహారంలో జగన్ సతీమణి భారతి ప్రమేయంపై నిర్దిష్టమైన సాక్ష్యాలు లేకుండా ఏమీ మాట్లాడలేను. కానీ.. ఆమె పాత్రపైనా దర్యాప్తు జరగాలి.

దర్యాప్తు చేయాల్సిందే అన్నాం...

నేను, అమ్మ 2019 సెప్టెంబరులో జగన్‌తో మాట్లాడాం. వాళ్ల మీద అనుమానాలు వస్తున్నాయి అంటే.. 'రాజశేఖర్ మామ (సునీత భర్త) మీదే అనుమానం వస్తోంది' అని జగన్ అన్నాడు. 'ఆయననైనా సరే ఇన్వెస్టిగేట్ చేయాల్సిందే' అని అమ్మ గట్టిగా చెప్పింది. అక్కడితో అది ఆగిపోయింది. ఒకరోజు హైదరాబాద్‌లో విజయ పెద్దమ్మను కలవడానికి వెళితే అదే టైంలో ఫోన్ చేశాడు. 'సునీత చాలా బాధపడుతోంది, ఒకసారి కలవరాదు' అని పెద్దమ్మ చెప్పింది. అపుడు నాకు ఫోన్ ఇవ్వడంతో మాట్లాడాను. అక్టోబర్ 7న అపాయింట్‌మెంట్ ఇచ్చారు. ఆరోజు నేను సుధీకర్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డి, విమలారెడ్డి, జార్జి పెదనాన్న భార్య, అమ్మతో పాటు వెళ్లాను. రూములోకి వెళితే సర్‌ప్రైజ్ అయ్యాను. అక్కడ డీజీపీ, సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వైఎస్ అనిల్ ఉన్నారు. మాట్లాడుతుండగా టైం చూసుకుంటున్నాడు నేను మాట్లాడాలి అని చెప్పినా... ఎక్కువసేపు ఉండలేదు. వెళ్లిపోయాడు. ఉన్న టైంలోనే నాకున్న అనుమానాలన్నీ పేపర్‌లో రాసి తీసుకెళ్లాను. ఎవరెవరి రోల్స్ ఎలా ఉన్నాయని రాశాను.

శంకర్ రెడ్డి మీద డౌట్ ఉంది. అవినాశ్‌పైనా డౌట్ ఉండిందికానీ... పేరు రాయలేదు. ఉదయ్ పేరు దగ్గరకు వచ్చేసరికి... ఉదయ్ అంటే ఎవరో నీకు తెలుసా? అని జగన్ ప్రశ్నించాడు. ఆ చిన్నపిల్లాడిని పట్టుకొని ఎలా మాట్లాడుతున్నారని అన్నాడు. అపుడు డీజీపీ సవాంగ్ మాట్లాడుతూ.. నార్కోలో కృష్ణారెడ్డి పేరు వచ్చిందన్నారు. ఎందుకు ఇంత గొడవ ఇండిపెండెంట్ ఏజెన్సీకి ఇవ్వచ్చు కదా అని అడిగాను. సీబీఐకి ఇవ్వాలని అడిగితే... అవినాశ్ బీజేపీలో చేరతాడని అప్పుడే అన్నారు.

ఆగస్టు 31న శంకర్, అవినాశ్, ఈసీ సురేంద్రనాథరెడ్డి విజయవాడ వెళ్లారు. డీజీపీని కలిసాం. శంకర్ రెడ్డి, అవినాశ్, సురేంద్రనాథరెడ్డి కూడా విజయవాడ వెళ్లారు. వాళ్ల ముగ్గురు ఎందుకు వచ్చారని అడిగితే చీఫ్ మినిస్టర్ నా వద్దకు పంపించారని డీజీపీ చెప్పారు. వాళ్లు తన రెండు కళ్లు అని సీఎంగారు చెప్పినట్లు ఆయన చెప్పాడు. ఏదో నడుస్తోందని అప్పుడు అనిపించింది.

\- సునీత

కిందికి వచ్చిన తర్వాత కృష్ణారెడ్డి దగ్గర నుంచి మళ్లీ ఫోన్ వచ్చింది. ఏంటని అడిగితే 'ఇక్కడ ఒక లెటర్ ఉంది' అన్నాడు. చదివి వినిపించు అన్నాను. అది గజిబిజిగా ఉంది చదవడానికి వీలు కాదేమో అన్నాడు. కొంచెం టైం తీసుకొని అయిన చదువు అన్నాను. దీంతో కృష్ణారెడ్డి.. 'ప్రసాద్‌ను నేను మార్నింగ్ తొందరగా ఇంటికి రమ్మన్నాను. దీంతో అతను చచ్చేటట్లు కొట్టాడు' అని రాసి ఉందన్నాడు. కానీ, ఎవడైనా అంత పనిచేసిన తర్వాత(వివేకాను కొట్టిన తర్వాత) నింపాదిగా పడుకొని నిద్రపోతాడా? నిద్రపట్టదు కదా! మాటల తీరు కూడా తెలుస్తుంది కదా.. సమ్‌థింగ్ రాంగ్ అనుకున్నారు. లెటర్ దొరికితే, అది 'మర్డర్' అని తెలుస్తోంది. బట్ లెటర్ దొరికితే వీడ్ని(ప్రసాద్) కూడా చంపేస్తారు. ఏదో ఒకటి జరుగుతుంది. నేను వచ్చే వరకు లెటర్ దాచమని కృష్ణారెడ్డికి చెప్పాను. అప్పుడు టీడీపీ ప్రభుత్వం ఉంది. సో మన ప్రభుత్వం కాదది. ఈ లెటరు పోలీసుల చేతికి వెళితే మళ్లీ వాళ్లేం చేస్తారో అని అనుకున్నాను. ఎందుకంటే ఇట్స్ గుడ్ పీస్ ఆఫ్ మెటీరియల్ విట్‌నెస్ కదా.

ఆర్కే: పీఏ కృష్ణారెడ్డి మీకు వ్యతిరేకంగా ఎందుకు మారిపోయాడు, ఎట్లా మార్చారు?

రాజశేఖర్‌రెడ్డి: ఇది మిలియన్ డాలర్ల ప్రశ్న

సునీత: ఆక్చువల్‌గా ఆయన పీఏ కాదు. అన్ అఫీషియల్‌గా అన్నీ చూసుకునేవాడు. సొంత మనిషి అనుకుంటాం కదా. సొంత మనిషి అన్నప్పుడు వాళ్లు నమ్మకంగా అన్నీ చేస్తుంటారు.

ఆర్కే: ఈయన కంటే ముందు ఆ ఇంట్లోకి ఎవరో వచ్చింటారు కదా. ఉండుంటారు కదా. అంటే ఈయనే తలుపు తీసి ఉంటాడా? సీబీఐ దర్యాప్తులో ఏం తేలింది? ఇపుడు ఆయన లోపలికి వచ్చి తిన్నారా, తాగారా అని పక్కన పెడితే.. పడుకున్నాడు.

సునీత: సాధారణంగా ఇంట్లో నాన్న ఒక్కరే ఉంటారు. తలుపులు నాన్నే వేసుకోవాలి. ఎవరికీ లోపలకు వచ్చేందుకు అవకాశం ఉండదు. కానీ, ఆరోజు డోర్ తెరిచి ఉంది. రంగన్న లోపలకు వెళ్లినపుడు డోర్ తెరిచి ఉంది. డోర్ తెరుచుకొని లోపలకు వెళ్లాడు. సీబీఐ వాళ్లు చెప్పిన ప్రకారం రాత్రి నాన్నను ఇంట్లో వదిలిపెట్టాక కొద్దిసేపటికి గంగిరెడ్డి వచ్చాడు. గంగిరెడ్డి రాత్రి ఇంట్లోనే ఉండిపోయాడు.

ఆర్కే: అంటే, అప్పటి దాకా గంగిరెడ్డి కూడా మీ సొంత మనిషిలాంటోడే. పీఏ కృష్ణారెడ్డి అంతకాకపోయినా!

రాజశేఖర్‌రెడ్డి: దాదాపు అంతే

సునీత: గంగిరెడ్డి ఫ్యామిలీతో 40 ఏళ్లుగా అనుబంధం ఉంది.

రాజశేఖర్‌రెడ్డి: వాళ్ల తండ్రి టైం నుంచి, సునీత వాళ్ల తండ్రి దగ్గర నుంచి సంబంధాలు ఉన్నాయి.

ఆర్కే: రాజారెడ్డి దగ్గర నుంచి కూడా

రాజశేఖర్‌రెడ్డి: యాజ్ ఎ యంగ్ బాయ్. మన పల్లెల్లో కూడా చూస్తుంటాం. పాలిటిక్స్ మీద ఇంట్రెస్ట్ ఉండేవాళ్లు, దెవిల్ బి పొలిటీషియన్స్ చుట్టూ తిరుగుతుంటారు. తను సింగిల్.. పెళ్లి కూడా కాలేదు. సో ప్యాషన్ ఇట్ అబౌట్ పాలిటిక్స్.

ఆర్కే: సో అతను లోపలకు వచ్చాడు కాబట్టి ఈయనకు తెలుసు. అయితే, మీ నాన్నకు కూడా తెలుసు యాజ్ పర్ చార్జిషీట్?

సునీత: నాన్నకు కూడా తెలుసు.

ఆర్కే: ఆటోమేటిక్‌గా ఒక మనిషి ఉంటే ఇంకేముంది తలుపు తీసి ఉంటుంది. అంటే ఫస్ట్.. పీఏ. ఈయనకు సంబంధం ఉన్నా లేకపోయినా మిగతా వాళ్లకు సంబంధం ఉంది.. తర్వాత పీఏను కూడా కలుపుకొన్నారో లేదో.. అది ఇంకా ప్రశ్నగానే ఉంది.

సునీత: చార్జిషీట్‌లో అనుమానాలైయితే ఉన్నాయి. అది ప్రూఫ్ లేక అక్కడే ఆగిపోయింది.

ఆర్కే: అసలు మీరు ఏం చేస్తుంటారు?

రాజశేఖర్‌రెడ్డి: నేను 1992 జనవరిలో అమెరికా వెళ్లాను. అక్కడ కొన్ని సంవత్సరాలు పనిచేసి గ్రీన్ కార్డు వచ్చిన తర్వాత.. ఈవెన్ పనిచేసే టైంలో కూడా రియల్ ఎస్టేట్ బిజినెస్ చేసేవాడిని. యాక్చువల్‌గా యూఎస్‌లోనే రియల్ ఎస్టేట్ ఏజెంట్. తర్వాత ఐటీ బిజినెస్ స్టార్ట్ చేశాను. అప్పటి నుంచి ఇంత వరకు 20 సంవత్సరాలుగా ఆ బిజినెస్‌లో ఉన్నా. ఇపుడు సిటిజన్. దానికి తోడు బీపీఓ పెట్టాం. సునీత 1996లో యూఎస్‌ఎకు వచ్చింది. పెళ్లైనపుడు గ్రీన్ కార్డు గురించి వచ్చింది. గ్రీన్ కార్డుకు అప్లై చేసి వచ్చి ఇంకా చదువుతూనే ఉంది. 2000 నుంచి తను కూడా పని చేస్తోంది. నాకు వ్యాపారంలో నష్టాలు రాలేదు. ఎపుడు కావాల్సినంత డబ్బు ఉండేది.

ఆర్కే: జగన్‌కు ఎప్పుడు ఫోన్ చేశారు?

సునీత: మాకు ఈ విషయం 6.20కి తెలిస్తే 7.20 గంటలకు బయలుదేరాం. శంషాబాద్ టోల్‌గేట్ దాటే సమయంలో 'మర్డర్' అని తెలిసింది. అప్పుడే మళ్లీ కాల్స్ వచ్చాయి. పోలీసు కేసు పెట్టాలని అడిగారు. అక్కడ నుంచి ఇంకా కొంచెం దూరం వెళ్లాక.. అంత్యక్రియలు ఈరోజే చేసేద్దామా అని కాల్స్ వచ్చాయి. నేను వెంటనే భారతి పీఏ నవీన్‌కి కాల్ చేసి.. భారతితో మాట్లాడా. భారతి ఫోన్ తీసుకున్నాక.. 'జగనన్నతో మాట్లాడాలి అన్నా' భారతి జగనన్నకి ఫోన్ ఇచ్చింది. ఇట్లా అంత్యక్రియల గురించి అడుగుతున్నారు ఏం చేద్దామని అడిగా. 'నువ్వు ఎలా డిసైడ్ చేసుకుంటే అలాగే పోదాం. యూ డిసైడ్' అన్నట్లుగా జగన్ చెప్పారు.

ఆర్కే: మీకు 6.20కి 7.20కి మధ్యలో మర్డర్ అని తెలిసింది కదా. జగన్‌తో మాట్లాడినప్పుడు అది అడగలేదా?

సునీత: నేనడగలేదు. అంత్యక్రియల వరకే మాట్లాడాను.

ఆర్కే: అంత్యక్రియల విషయం మీరు అడిగారా? ఆయన అడిగారా?

సునీత: నేనే అడిగాను.

ఆర్కే: అపుడు మీకు తెలిసింది కదా. తెలిసినపుడు ఏంటిది ఇలా జరిగింది అనలేదా?

సునీత: అంటే ఆయన(జగన్) నాకంటే పెద్ద. ఇప్పుడు నాన్న లేకుంటే ఆయనే కదా దిక్కు. సో ఏమున్నా గానీ చూసుకుంటాడని అనుకున్నా. ఏం చేయాలని అడగాలంటే ఏమని అడగాలో కూడా తెలియదు.

అన్నీ తెలిసే ప్రెస్‌తో అలా..

ఆర్కే: వివేకా మృతదేహాన్ని చూసిన తర్వాతే కదా దారుణంగా చంపారని మీకు డౌట్ వచ్చింది?

రాజశేఖర్‌రెడ్డి: ఇనయతుల్లా అని నా వద్ద ఇంకొకతను పనిచేస్తుంటాడు. అతను శంషాబాద్ ఎయిర్‌పోర్టు పరిసరాల్లో వెళ్లాక ఫోన్ చేశాడు. 'సార్ మీకు ఫొటోస్ పంపాను చూశారా' అన్నాడు. ఓపెన్ చేసి చూస్తే క్లారిటీ లేదు. అప్పుడు అనుకున్నా అక్కడేదో జరిగిందని! అప్పుడే సునీతకు చెప్పా. ఇది సహజ మరణంగా అనిపించడం లేదని. కృష్ణారెడ్డి మీద నాకు అనుమానం ఎందుకు రాలేదంటే ఫస్ట్ లెటర్ గురించి అతనే చెప్పాడు. అయితే.. దానిని కృష్ణారెడ్డి మాయం చేయాలని అనుకున్నట్టు తర్వాత తెలిసింది. అప్పుడైనా మాకు ఎందుకు చదివి వినిపించాడంటే.. స్పాట్‌లో పనిమనిషి కొడుకు ప్రకాశ్ ఉన్నాడు. అతను దీనిని చూశాడు. దీంతో లెటర్ చదివి వినిపించాడు. నేను ఆ లెటర్‌ను సేఫ్‌గా ఉంచమని సీఐకి కూడా ఫోన్‌లో చెప్పా. గంగిరెడ్డికి ఫోన్ చేస్తే రెస్పాండ్ కాలేదు. అపుడు అనుమానం వచ్చింది. పెట్రోల్ బంకు దగ్గర బండి ఆపినప్పుడు సునీతను కిందికి దిగమని అపుడు లెటర్ గురించి చెప్పాను. అప్పుడు ఫొటోలు చూపించాను. ఇంకా ఫోన్ కాల్స్ వస్తున్నాయి. 'సార్ వీళ్లు క్లీనప్(అంతా శుభ్రం చేస్తున్నారు) చేసేస్తున్నారని. మేము ఆపమని చెప్పినప్పటికీ సుమారుగా క్లీనప్ అయిపోయింది.

ఆర్కే: అక్కడ జగన్ మీతో మాట్లాడారా? ప్రెస్‌తో ఏం చెప్పాలనుకున్నది ముందుగా ప్రిపేర్ అయి వచ్చారా? మీకు ఏమనిపించింది?

రాజశేఖర్‌రెడ్డి: అప్పటికి ప్రెస్ వాళ్లు వచ్చేశారు. నేను రూం నుంచి బయటకు వచ్చేటపుడు సజ్జల రామకృష్ణారెడ్డి కూడా ఉన్నారు. మధ్యలో జగన్.. ప్రెస్‌తో ఏం చెప్పాలని రామకృష్ణారెడ్డిని అడిగారు. దానికి ఆయన 'మనం అనుకున్నట్లే కదా.. జస్ట్ స్క్రిప్ట్ ఫాలో అవు' అన్నాడు. 'ఆ లెటర్ పోలీసులు క్రియేషన్' అన్నట్లుగా జగన్ మీడియాతో చెప్పారు. 'అదేం కాదు ముందురోజు రాత్రి బావ (వివేకా) రాశారు. నేనే దాన్ని సేఫ్ చేయమని చెప్పాను' కదా అని తర్వాత ఆయనతో అన్నాను.

ఆర్కే: మీరు లెటర్ భద్రంగా పెట్టమన్న సంగతి వాళ్లకు తెలిసి కూడా ...

రాజశేఖర్‌రెడ్డి: వెరీ నెక్ట్సడే గవర్నర్ దగ్గరకు పిటిషన్ ఇవ్వడానికి వచ్చారు. గవర్నర్ ముందు కూడా అదే చెప్పారు. నేను చెప్పిన తర్వాత కూడా సేమ్ స్క్రిప్టు రిపీట్ చేశారు. పోలీసులు ఫ్యాబ్రికేట్ చేసి పెట్టారని చెప్పారు.

ఆర్కే: మీరు జగన్‌ని సీబీఐ ఎంక్వైరీ అడిగితే నో అన్నారు కదా!

సునీత: ఫస్ట్ సీబీఐ కేసు పెట్టాలంది వాళ్లే. జూన్‌లో వెళ్లినపుడు సమ్మర్ వెకేషన్ అయిపోయి కోర్టు మళ్లీ రీస్టార్ట్ అవుతోంది. మళ్లీ తీసుకెళ్లాలి అని. సొంత చిన్నాన్న చనిపోతే నేను ఇన్వెస్టిగేట్ చేసి కనుక్కోకపోతే అవమానం.. ఎలాగైనా కనుక్కుంటాం. దాని గురించి వర్రీ అవాల్సిన అవసరం లేదన్నట్లు చెప్పారు. నాకు సిగ్గుచేటు అన్నారు. ఒక డెడికేటెడ్ టీంను అయితే ఉంచాలని, ఎస్పీ మహంతిని అలాగే కంటిన్యూ చేయగలుగుతారా అని అడిగాను. అంటే ఎలక్షన్ కమిషన్ ఏర్పాటు చేసింది ఆయన్ను మార్చడం కుదరదు. ఆయనే కంటిన్యూ అవుతారు అని చెప్పారు. ఏం సపోర్టు అవసరమో అవన్నీ ప్రొవైడ్ చేస్తామన్నారు.

రాజశేఖర్‌రెడ్డి: సీబీఐ వస్తే అన్నీ మొదటికి వస్తాయని అనుకున్నాం. ఇప్పటికే మహంతికి చాలా విషయాలు తెలుసు కదా అనుకున్నాం.

అర్ధరాత్రి గొడ్డలి రాజకీయాలు మాకు తెలీదు

సీఎం హోదాలో ఉన్న వ్యక్తి హంతకుడిని కాపాడుతుంటే ఇక ప్రజల పరిస్థితి ఏమిటి?

» **జగన్ వైఎస్‌కి కాదు.. మోదీకి వారసుడు: షర్మిల**

కడప, మే 6(ఆంధ్రజ్యోతి): 'వీళ్లు ఊసరవెల్లులు. అవసరం తీరాక పుట్టుకనే అవమానిస్తారు. నా భర్త అనిల్‌పై అవినాశ్‌రెడ్డి ఆరోపణలు చేస్తున్నారు. నా భర్త చీకట్లో లాండ్ క్రూజర్‌లో వెళ్లి జమ్మలమడుగులో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డిని కలిశారని అంటున్నారు. అవినాశ్‌రెడ్డి చేసినట్లుగా అర్ధరాత్రి గొడ్డలి రాజకీయాలు చేసే అలవాటు లేదు. నా భర్త బీజేపీ నేతలను కలవలేదు. కలవరు' అని పీసీసీ చీఫ్ షర్మిల స్పష్టం చేశారు. సోమవారం ఇండియా కూటమి నేతలతో కలిసి కడపలో ఆమె మీడియాతో మాట్లాడారు. 'రూ.వెయ్యి కోట్ల పనులు అడిగానని నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. జగన్ పడేసిన కుక్క బిస్కెట్లు తినేవారే నా మీద నిందలు వేస్తున్నారు" అని షర్మిల ఘాటు వ్యాఖ్యలు చేశారు. తనకు రూ.వెయ్యి కోట్ల పనులు ఇవ్వలేదన్న కారణంతోనే జగన్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారంటూ కొండా రాఘవరెడ్డి చేసిన ఆరోపణలపై ఆమె తీవ్రంగా స్పందించారు. డబ్బులు అడిగానని నిరూపిస్తే రాజకీయాలు వదిలేసి వెళ్లిపోతా అని సవాల్ చేశారు. 'జగన్ వైఎస్ వారసుడు కాదు.. మోదీ వారసుడు. కేంద్రమంత్రి జగన్‌ను మోదీ దత్తపుత్రుడు అన్నారు. జగన్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని అమిత్‌షా అంటున్నారు. కేంద్రంలో ఉండేది మీరే.. మరి ఐదేళ్లు ఎందుకు చర్యలు తీసుకోలేదు? కాగ్, ఈడీ ఏం చేస్తున్నాయి? బీజేపీ అడగకున్నా సరే జగన్ మద్దతిస్తున్నారు. పోర్టులను అప్పగిస్తున్నారు. విశాఖ ఉక్కును మనోడే ప్రశ్నార్థకం చేశాడు. బీజేపీకి జగన్ తొత్తుగా మారారు. చంద్రబాబు బీజేపీతో బహిరంగంగా పొత్తు పెట్టుకుంటే... జగన్ చీకటి పొత్తు పెట్టుకున్నారు' అని షర్మిల విమర్శించారు.

గొడ్డళ్లతో వైసీపీ ఎమ్మెల్యేలు..

'సొంత చిన్నాన్న వివేకా హత్యకేసు నిందితుడికే మళ్లీ జగన్ టికెట్ ఇచ్చారు. వైఎస్సార్, వివేకా ప్రజానాయకులు. వివేకాను చంపినవారిని స్వయానా సీఎం జగన్ కాపాడుతున్నారు. వైఎస్ తమ్ముడిని చంపిన వారికే శిక్ష పడలేదు. ఇక రాష్ట్ర ప్రజల పరిస్థితి ఏంటి? యథా రాజా తథా ప్రజా అన్నట్లుగా ఉన్నారు కాబట్టే నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యేలు గొడ్డళ్లు పట్టుకుని తిరుగుతున్నారు' అని షర్మిల ఆరోపించారు. సోమవారం వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. తనకు అడ్డు వస్తే ప్రొద్దుటూరు ఎమ్మెల్యే ఎవరినైనా గొడ్డలితో నరుకుతారంట, మళ్లీ మళ్లీ ఇలాంటి నేరస్తులను చట్టసభలకు పంపుదామా? అని ప్రశ్నించారు. గొడ్డలి అవినాశ్ కావాలో, కొంగుచాచి అడుగుతున్న వైఎస్సార్ బిడ్డ కావాలో తేల్చుకోవాలన్నారు. కడప స్టీలు ప్లాంటు కోసం గొడ్డలి అవినాశ్‌రెడ్డి పోరాటం చేశాడా అని ప్రశ్నించారు. ఆయనకోసం తప్ప ప్రజల కోసం ఢిల్లీకి పోలేదని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఓటు వేస్తే నెత్తిన కుచ్చు టోపీ, చేతిలో చిప్ప పెట్టారని షర్మిల మండిపడ్డారు.

బద్వేలులో షర్మిలపై కేసు నమోదు

బద్వేలు టౌన్, మే 6: ఎన్నికల ప్రచారంలో భాగంగా కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించారంటూ పీసీసీ చీఫ్ షర్మిలపై బద్వేలు పోలీసులు కేసు నమోదు చేశారు. వివేకా హత్యకేసు కోర్టులో ఉన్నందున ఎన్నికల్లో ఎవరూ ప్రస్తావించకూడదని కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ ఈ నెల 1న బద్వేలు బహిరంగ సభలో హత్యగురించి షర్మిల పదే పదే వ్యాఖ్యలు చేశారని బద్వేలు నోడల్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నెల 3న షర్మిలపై కేసు నమోదు చేశారు.

భూ మాఫియా బాధితులకేం చెబుతారు?

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేట్రేగిపోతున్న భూమాఫియా దౌర్జన్యాల్లో నలిగిపోతున్న సామాన్య ప్రజలకేం సమాధానం చెబుతారని సీఎం జగన్‌ను షర్మిల నిలదీశారు. న్యాయ నవ సందేహాల పేరిట తొమ్మిది ప్రశ్నలు షర్మిల సంధిస్తూ సోమవారం లేఖ రాశారు. ఈ ప్రశ్నలకు తక్షణమే సమాధానం చెప్పాలని జగన్‌ను షర్మిల కోరారు.

» రాష్ట్రంలో పౌరుల భూ హక్కులు, వ్యక్తిగత ఆస్తులు, వాటి హక్కులకు భంగం కలిగేలా భూమాఫియా కబ్జాలకు పాల్పడుతున్న విషయం మీ దృష్టికి వచ్చిందా?
» ల్యాండ్ టైటిల్ యాక్టు ద్వారా ప్రైవేటు భూముల కబ్జాకు కుట్ర జరుగుతున్నట్లు అభియోగాలున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకుందా?
» వ్యక్తిగత స్థిరాస్తులకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకంపై మీ ఫొటో ఎందుకన్న ప్రశ్నకు మీవద్ద సమాధానం ఉందా? ఉంటే చెప్పండి.
» సుమారు 14 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు కబ్జాలకు గురయ్యే ప్రమాదంలో ఉన్నాయి. సుమారు 4లక్షల ఎకరాలకు పైగా ఉన్న దేవాలయాల భూముల్లో 40 వేల ఎకరాలు కనబడటం లేదని స్వయానా మీ మంత్రి అన్నారు. దీనిపై చర్యలేంటి?
» రాష్ట్రంలో 14లక్షల డీకేటీ భూముల అమ్మకాలు, కొనుగోళ్లపై ఉన్న ఆంక్షల్ని రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేయనుందని తెలుసుకున్న వైసీపీ నాయకులు కారుచౌకగా పేదల నుంచి వాటిని చాలావరకూ కాజేశారు. ఇది ఇన్‌సైడర్ ట్రేడింగ్ కాక మరేమవుతుంది?
» జగనన్న కాలనీల కోసం రూ.56,102 కోట్లు వెచ్చించి జరిపిన 71,811 ఎకరాల భూమి కొనుగోలులో వైసీపీ నాయకుల బినామీలే సుమారు రూ.30,000 కోట్లు దోచినట్లు ఆరోపణలున్నాయి. విచారణకు సిద్ధమా?
» ఇసుక మాఫియా దాష్టీకాల వల్ల అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి, 42మంది చనిపోతే, తగు విచారణ జరిపి ఎవరినైనా బాధ్యుల్ని చేశారా?
» దసపల్లా భూములు, సింహాచలం దేవస్థానం భూముల దోపిడీ బాగోతం ఎప్పటికి తేలుస్తారు?
» విశాఖ తీర ప్రాంత భూములు ఇప్పటికే కబ్జాలపాలయ్యాయి. రుషికొండను బోడిగుండు చేశారు. ఎన్జీటీ, కోర్టుల ఆక్షేపణలకు మీ సమాధానం ఏంటి?



సీఎం కాగానే.. జగనన్న మారిపోయాడు!

» **ఒకప్పుడు ఆయనకు నేనెంతో దగ్గర: షర్మిల**
» **ఓ ఆంగ్ల చానల్‌తో ముఖాముఖి**

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి పదవిలో కూర్చున్న తర్వాత తన అన్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పూర్తిగా మారిపోయారని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి అన్నారు. అక్రమాస్తుల కేసుల నుంచి బయటపడేందుకు ఆయన ఆదేశాలతోనే తన తండ్రి పేరును చార్జిషీటులో చేర్పించారని తెలిసి షాక్‌కు గురయ్యానని తెలిపారు. ఆంగ్ల వార్తాచానల్ 'సీఎన్ఎన్-న్యూస్18'కు ఆమె ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ముఖ్యాంశాలు..

ప్రశ్న: మీ తొలి ఎన్నిక, గెలుపుపై విశ్వాసంగా ఉన్నారా.?

కడపలో పోటీచేయడం నాకు విస్మయం కలిగిస్తోంది. మా అన్న.. మా తమ్ముడు అవినాశ్‌రెడ్డికి వైసీపీ టికెట్ ఇవ్వకుండా ఉంటే పోటీచేసేదానిని కాదు. అవినాశ్ మా చిన్నాన్న హత్య కేసులో నిందితుడు.

కాంగ్రెస్‌లో చేరాలని మీరెందుకు నిర్ణయించుకున్నారు?

కాంగ్రెస్‌లో చేరాలని అనుకున్నప్పుడు.. నిరుడు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అగ్ర నేత సోనియాగాంధీని కలిశాను. నా తండ్రి అవినీతికి పాల్పడ్డారంటూ సీబీఐ చార్జిషీటులో ఆయన పేరును ఎందుకు చేర్చారని ఆమెనే అడిగాను. తనకా ఉద్దేశమే లేదని ఆమె స్పష్టం చేశారు. అనంతరం ఓ కాంగ్రెస్ నేత అసలు గుట్టు విప్పారు. రాజశేఖర్‌రెడ్డి పేరును చార్జిషీటులో చేర్చేందుకు ఓ న్యాయవాది మూడు కోర్టులకు వెళ్లారని వెల్లడించారు. అన్న సీఎం అయిన ఆరోజుల్లోనే ఆ న్యాయవాదికి అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ) పదవి కట్టబెట్టారు. ఇది నన్ను షాక్‌కు గురిచేసింది.

మీ ఇద్దరి మధ్య ఇంత శత్రుత్వం ఎందుకు వచ్చింది?

అసలు మా అన్నకు నేనెంతో దగ్గర. కానీ సీఎం కుర్చీలో కూర్చోగానే పూర్తిగా మారిపోయారు. ఆయనలో నా అన్న కనిపించలేదు. సిద్ధాంతాన్ని, ఆయన ఇచ్చిన హామీలను పక్కనపెట్టేశారు. తండ్రిని కోల్పోయిన సునీతకు న్యాయం చేయలేదు. ఈ హత్య కేసులో అన్ని వేళ్లూ అవినాశ్ రెడ్డి వైపు చూపిస్తున్నాయి. న్యాయం కోసం సునీతకు మనం మద్దతివ్వాలని.. సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాల్సిందేనని అన్నకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించాను. కానీ ఆయన వినలేదు.

చంద్రబాబు, రేవంత్‌రెడ్డి వలలో పడ్డారని జగన్ ఆరోపణ..?

నా నిర్ణయాన్ని చంద్రబాబు, రేవంత్ ప్రభావితం చేశారనడం హాస్యాస్పదం. జీవితంలో చంద్రబాబును ఇప్పటిదాకా ఒక్కసారే కలిశాను. మా అబ్బాయి పెళ్లికి పిలిచేందుకు ఆయన వద్దకు వెళ్లాను. కడపలో నేను ఓడిపోతానని నిజంగా జగన్‌కు ఆందోళన ఉంటే తన అభ్యర్థిని పోటీ నుంచి వైదొలగమనండి.

లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేస్తానని అనుకున్నారా?

అసలు నేను రాజకీయాల్లోకి వస్తాననే అనుకోలేదు. నా జీవితంలో అన్నీ విస్మయకరమైనవే జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను వినిపించేందుకు ఓ గొంతుక కావాలి. అందుకే ఎన్నికల్లో పోటీచేస్తున్నాను.

కలకలం.. కలవరం!

» **ప్రధాని తీవ్ర వ్యాఖ్యలపై వైసీపీ నేతల్లో ఆందోళన**
» **ప్రభుత్వ అవినీతిపై తొలిసారి మోదీ ధ్వజం**
» **జగన్ పేరెత్తి మరీ విమర్శలు.. ప్రభుత్వ పెద్దలకు షాక్**

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ అవినీతిపై ప్రధాని మోదీ వ్యాఖ్యలు రాష్ట్రం రాజకీయ వర్గాల్లో వేడి పుట్టించాయి. నేరుగా సీఎం పేరెత్తి మరీ ప్రధాని చేసిన ఈ వ్యాఖ్యలు జగన్ శిబిరంలో కలకలం రేపాయి. ఆయన విమర్శలను మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన నేతలు స్వాగతిస్తుండగా.. ప్రధాని తీవ్ర స్వరం పెంచడానికి కారణాలేమిటని అధికార వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఈ ఐదేళ్లలో జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మోదీ ఇంతవరకూ ఎప్పుడూ మాట్లాడలేదు. పైగా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఒకానొక సందర్భంలో.. జగన్ ప్రధానికి దత్తపుత్రుడు వంటివారని ప్రశంసించారు కూడా. చాలాకాలం పాటు కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు కూడా ఆయన పట్ల ఇటువంటి వైఖరినే ప్రదర్శిస్తూ వచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా పురందేశ్వరి నియమితులైన తర్వాతే వైసీపీ ప్రభుత్వ పాలనపై ఆ పార్టీ రాష్ట్ర నేతల నుంచి విమర్శలు మొదలయ్యాయి. అప్పుడు కూడా కేంద్ర నేతలు వ్యతిరేక వ్యాఖ్యలు చేయలేదు. మార్చి 17న జరిగిన చిలకలూరిపేట సభలో ప్రధాని మోదీ.. వైసీపీ పాలనపై ఏ వ్యాఖ్యలూ చేయకుండా నిగ్రహం పాటించారు. ఇది చర్చనీయాంశంగా మారింది. రాజకీయ అవసరాల రీత్యా మాత్రమే టీడీపీ, జనసేనతో బీజేపీ పొత్తు పెట్టుకుందని.. ఆ పార్టీ కేంద్ర నాయకత్వం మాత్రం జగన్ పట్ల సానుకూలంగానే ఉందన్న వ్యాఖ్యలు వినిపించాయి. ఈ పరిణామాలను అనుకూలంగా మలుచుకోవడానికి వైసీపీ నేతలు గట్టి ప్రయత్నమే చేశారు. కూటమి మేనిఫెస్టోపై మోదీ బొమ్మ లేదని.. ఇది టీడీపీ-జనసేన మేనిఫెస్టో మాత్రమేనని, ఇందులో బీజేపీ భాగస్వామి కాదని విస్తృతంగా ప్రచారం చేశారు. దీనిని బీజేపీ నేతలు ఖండించారు. కూటమి మేనిఫెస్టోతో తమకు సంబంధం లేదని మోదీయే చెప్పారని, సొంత పార్టీ నేతలనే దూరంగా ఉంచారని జగన్ ఒక బహిరంగ సభలో వ్యాఖ్యానించారు. కానీ సోమవారం పర్యటనలో ప్రధాని చేసిన వ్యాఖ్యలతో అధికార పార్టీ పెద్దలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రాజమహేంద్రవరం సభలో వైసీపీ ప్రభుత్వ అవినీతిపై ధ్వజమెత్తిన ప్రధాని.. అనకాపల్లి సభలో నేరుగా జగన్మోహన్ రెడ్డి పేరు ప్రస్తావించి మరీ విమర్శలు గుప్పించారు. తమ మంత్రం అభివృద్ధి కాగా.. వైసీపీ మంత్రం కరప్షన్ అన్నారు. విశాఖ ప్రత్యేక రైల్వే జోన్ కార్యాలయం కోసం స్థలమే ఇవ్వలేదని ఆక్షేపించారు. అవినీతికి ఆస్కారమున్న పనులు మాత్రమే జగన్ చేస్తారని.. లేదంటే చేయరని.. మద్య నిషేదం చేస్తామని అధికారంలోకి వచ్చి.. రాష్ట్ర ప్రభుత్వమే మద్యంవ్యాపారం చేస్తోందని.. ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియాను నడిపిస్తోందని విరుచుకుపడ్డారు. మూడు రాజధానుల పేరుతో దోపిడీ చేయాలనుకున్నారని.. ఖజానాను ఖాళీ చేశారని విరుచుకుపడ్డారు. పోలవరం ఆపేశారని.. ఉత్తరాంధ్ర సుజల స్రవంతినీ అటకెక్కించారని విమర్శించారు. జగన్‌పై మోదీ ఈల వాలనివ్వరని భావించిన వైసీపీ నేతలు.. ఆయన ఇంత తీవ్ర విమర్శలకు దిగడం జీర్ణించుకోలేకపోతున్నారు. ఇకపై ఢిల్లీ అండ తమ అధినేతకు ఉండదేమోనని కలవరపడుతున్నారు. రాష్ట్ర పర్యటన ముగిసీ ముగియగానే ప్రధాని కొన్ని ట్వీట్లు చేశారు. 'ఆంధ్రప్రదేశ్ అంతటా ఎన్డీయేకి బ్రహ్మాండమైన మద్దతు కనిపిస్తోంది. క్షేత్ర స్థాయిలో ప్రజల నుంచి కనిపిస్తున్న ఈ మద్దతు ప్రత్యర్థులకు నిద్రలేని రాత్రులు కల్పిస్తోంది. నేనీ రోజు రాజమహేంద్రవరంలో అతి పెద్ద సభలో పాల్గొన్నాను. వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది. రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే బలమైన ఆర్థిక విధానాలను రూపొందించలేకపోయింది. మద్యపాన నిషేధం అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి దానికి బదులుగా శక్తిమంతమైన మద్యం సిండికేటును తయారు చేసింది. మా కూటమి ప్రజల్లోకి అభివృద్ధి ఎజెండాతో వెళ్తోంది. రాజమహేంద్రవరం, అనకాపల్లిలో జరిగిన భారీ బహిరంగ సభల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ పాల్గొనడం ఈ సభలను మరింత ప్రత్యేకంగా మార్చింది' అని పేర్కొన్నారు. రెండు సభల్లో చేసిన విమర్శలను, రాజకీయ దాడిని ప్రధాని తన ట్వీట్లలో కొనసాగించడం వైసీపీ శిబిరంలో కలకలం రేపింది. ఆయన తమ జోలికి రారని భావించిన ఆ పార్టీ పెద్దలు ఈ హఠాత్‌పరిణామంతో తీవ్ర నిర్వేదానికి గురయ్యారు. ఎన్నికల ఫలితాలెలా ఉన్నా కేంద్రం నుంచి తమకు రక్షణ ఉంటుందన్న అభిప్రాయం వారిలో ఉంది. అయితే ప్రధాని ఇంత నేరుగా అవినీతి గురించి మాట్లాడాక ఇక అలాంటి ఆశలు పెట్టుకోవడంలో ఉపయోగం లేదని ఓ వైసీపీ నేత వ్యాఖ్యానించారు. అధికార వర్గాలు కూడా ప్రధాని వ్యాఖ్యలపై ఆరాతీస్తున్నాయి. జగన్ పట్ల మోదీ వైఖరిలో మార్పు వచ్చిందా.. గతంలో ఉన్న మెతక వైఖరి ఇక ఉండదా అని చర్చించుకుంటున్నారు.

జనం జేజేలుతో మోదీ ఉబ్బితబ్బిబ్బు

(రాజమహేంద్రవరం/అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

తాను పాల్గొన్న రాజమహేంద్రవరం, తాళ్లపాలెం సభలకు జనం పోటెత్తడంపై ప్రధాని మోదీ ఉబ్బితబ్బిబ్బయ్యారు. పోలవరం ప్రాజెక్టు పూర్తికి, రాష్ట్రాభివృద్ధికి ఆయన ఇచ్చిన ఇచ్చిన హామీలకు జనం హర్షం వ్యక్తంచేయగా.. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి అమిత ఉత్సాహాన్నిచ్చింది. రాజమహేంద్రి సభే చరిత్రాత్మకమనుకున్న రీతిలో జరుగగా.. అనకాపల్లి సభకు అంతకుమించి జనం తరలిరావడంతో మూడు పార్టీల శ్రేణుల ఆనందానికి అంతే లేదు. రాజమహేంద్రవరం సభ గోదావరి జిల్లాలను ఓ ఊపు ఊపగా, అనపకాపల్లి సభ ఉత్తరాంధ్రను ఊపేసింది. దీతో కూటమి విజయం ఖాయమని, వైసీపీ పనైపోయిందని ప్రజలు బాహాటంగానే చర్చిస్తున్నారు. ఈ రెండు సభల్లో ప్రజలు 'మోదీ మోదీ' అని పెద్దగా నినాదాలిస్తూ నీరాజనాలు పలికారు. కాగా, రాజమండ్రి సభకు జనం మధ్యాహ్నం 12 గంటలకే చేరుకున్నారు. ఎండ సరున కాలినా, మంచినీళ్లు దొరకపోయినా పట్టించుకోలేదు. కొందరు భోజనం కూడా చేయకుండా వచ్చేశారు. 60ఎకరాల్లో నిర్మించిన వేదిక ప్రాంగణం చాలలేదు. హైవేపైనా జనం నిలబడిపోయారు. ప్రధాని మధ్యాహ్నం 3.35గంటలకు వేదికపైకి వచ్చారు. జనం ఆయన్ను చూడగానే బిగ్గరగా నినాదాలు చేస్తూ జేజేలు పలికారు. మోదీ 4.03 గంటలకు ప్రసంగం మొదలుపెట్టి.. 4.37గంటలకు ముగించారు. తర్వాత ఆయన ఎక్కిన హెలికాప్టర్‌తోపాటు భద్రతగా వచ్చిన మరో రెండు హెలికాప్టర్లు బయల్దేరేవరకు జనమంతా నిలబడే ఉండి తర్వాతే కదిలారు. ఇక తాళ్లపాలెం సభాస్థలికి మోదీ, చంద్రబాబు సాయంత్రం 5గంటలకు వస్తారని ప్రకటించినా మధ్యాహ్నం 3 గంటలకే ప్రాంగణం నిండిపోయింది. కాగా, రాజమహేంద్రి సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముందుగా మోదీని సన్మానించి, ఆయన కాళ్లకు మొక్కే ప్రయత్నం చేశారు. వెంటనే మోదీ వంగి ఆయన చేతులు పట్టుకుని ఆప్యాయంగా పైకి లేపారు. లోకేశ్ మంగళగిరి నుంచి తెచ్చిన చేనేత కండువాతో మోదీని సత్కరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరితోపాటు పలువురు నేతలు కూడా ప్రధానిని సన్మానించారు. తాళ్లపాలెంలో చంద్రబాబు, జనసేన సీనియర్ నేత కె.నాగబాబు ప్రధానికి శాలువాలు కప్పి సత్కరించారు. జ్ఞాపికలు అందజేశారు.

జన కేతనం

ప్రజా అజెండా

అభివృద్ధి.. సంక్షేమం.. సమ న్యాయం..



మీ ఓటు భవిష్యత్తు

ఆంధ్రజ్యోతి
మంగళవారం ◇ 7-5-2024

కౌంట్ డౌన్ 6 రోజులు

బోగస్ గొప్పలు.. సంక్షేమానికి తానే బ్రాండ్ అంబాసిడర్ అన్నట్టు గొప్పలు చెప్పుకొనే ముఖ్యమంత్రి జగన్.. ఓ చేత్తో పేదలకు ఇస్తూ, మరో చేత్తో రెండింతలు లాక్కొన్నారు. అమ్మఒడి, వాహన మిత్ర, చేదోడు, చేయూత పథకాలు మాత్రమే కొత్తవి. మిగతా పథకాలన్నీ పాతవే. వాటికి పేర్లు, అమలు తీరు మార్చి తానే కొత్తగా ప్రారంభించినట్టు కలరింగ్ ఇచ్చారు. పైగా గతంలో ఉన్న ఎన్నో పథకాలను రద్దు చేశారు.

జగన్ ఈ ఐదేళ్లలో కొత్త పథకాలకు చేసిన ఖర్చు రూ.44,825 కోట్లు అయితే.. ఆర్టీసీ, కరెంట్ చార్జీలు, పేదల ఇళ్లపై ఓటీఎస్, రకరకాల పన్నుల పేరిట ప్రజల నుంచి ఏకంగా రూ.1,02,830 కోట్లు లాక్కొన్నారు. కొత్త పథకాలకు చేసిన ఖర్చు కంటే.. వాతల మోతే ఎక్కువ.

వంద ఇచ్చి.. 200 లాగి..

జగన్ సంక్షేమ పథకాల పేరిట రూ.100 ఇస్తే.. ప్రజల నుంచి పన్నులు, చార్జీల రూపంలో రూ.200 లాక్కొన్నారు. ఉదాహరణకు ఈ ఐదేళ్లలో అమ్మఒడి పథకం కింద ఓ విడత ఎగ్గొట్టి, నాలుగు విడతల్లో మొత్తం రూ.25,000 కోట్లు ఇచ్చారు. ఈ ఐదేళ్లలో ట్రూఅప్, సర్దుబాటు పేరిట మొత్తం 9సార్లు కరెంటు చార్జీలు పెంచి ప్రజల నుంచి అదనంగా రూ.25,000 కోట్లు గుంజుకున్నారు. అంటే... అమ్మఒడి కింద ఇచ్చిన మొత్తాన్ని కరెంటు చార్జీల రూపంలో లాగేసుకున్నారు. మరి పేదలను ఏం ఉద్ధరించినట్టు? వారికి ఏం సాయం చేసినట్టు? ఒక్క అమ్మఒడే కాదు ఇతర పథకాల సంగతీ ఇంతే. ఆర్టీసీ చార్జీలు, పన్నులు, ఓటీఎస్, పెట్రోల్, డీజిల్‌పై సెస్, వ్యాట్ బాదుడుతో పేదల నుంచి పిండుకున్నారు. జగన్ ఎంతో గొప్పగా చెప్పుకొనే సంక్షేమం ఇదే.



- కొత్తగా తెచ్చింది నాలుగు పథకాలే
- అమ్మఒడి, వాహనమిత్ర, చేదోడు, చేయూత
- మినహా అన్నీ గతంలో ఉన్న పథకాలే
- పేర్లు మార్చి కొత్తగా ఇస్తున్నట్టు కలరింగ్
- పైగా నిబంధనలతో అమల్లో కోతలు
- మరోవైపు పేదలపై రకరకాలుగా బాదుడు

పిడికెడు పెట్టి.. బండెడు పట్టి



ఇదీ జగన్ మార్క్ డొల్ల 'సంక్షేమం'

ఐదేళ్లలో కొత్తగా ఇచ్చింది 44,825 కోట్లే.. సర్కారు లాక్కొంది 1,02,830 కోట్లు

బాదుడే బాదుడు

మద్యం నుంచి ₹30,000 కోట్లు

మద్య నిషేధం చేస్తామంటూ గత ఎన్నికల్లో గెలిచిన జగన్.. సీఎం అయ్యాక ప్రభుత్వ దుకాణాలు తెరిచి మద్యం అమ్మించారు. ఊరూపేరు లేని, ఆరోగ్యానికి హానిచేసే రకరకాల బ్రాండ్లు అమ్మించి పేదల జీవితాలతో ఆడుకున్నారు. భారీగా మద్యం ధరల పెంపుతో ప్రజలపై అదనంగా పడిన భారం 30,000 కోట్లు.

విద్యుత్ మోత ₹25,000 కోట్లు

ఈ ఐదేళ్లలో ట్రూఅప్, సర్దుబాటు చార్జీల పేరుతో భారీగా బాదేశారు. అది చాలదన్నట్టు స్మార్ట్‌మీటర్ల ఖర్చును ప్రజల నెత్తినే రుద్దుతున్నారు. ఈ బాదుడుతో పాటు పరిశ్రమలకు పెంచిన చార్జీలు కలిపి దాదాపు రూ.25,000 కోట్లు వసూలు చేశారు.

బస్సు చార్జీల బాదుడు ₹5,200 కోట్లు

ఆర్టీసీ చార్జీలను జగన్ సర్కార్ ఎడాపెడా పెంచేసింది. ఈ ఐదేళ్లుగా పేదలపై రూ.5,200 కోట్ల భారం వేసింది.

పన్నుల వాత ₹2,350 కోట్లు

2021-22 నుంచి కొత్త ఆస్తి పన్ను విధానంతో ప్రజలపై భారం మోపారు. జనాల నుంచి రూ.950 కోట్లను ప్రభుత్వం పిండేసింది. దీనికి తోడు చెత్త పన్ను వేశారు. దీని ద్వారా ప్రభుత్వం ఏటా రూ.400 కోట్లు లాగుతోంది. ఇక 2021 నవంబరు నుంచి వాహనాల లైఫ్ ట్యాక్స్‌ను పెంచింది. లైఫ్ ట్యాక్స్, గ్రీన్ ట్యాక్స్ పెంపు వల్ల ఏటా ప్రజలపై రూ.409 కోట్ల భారం పడుతోంది. రెండున్నరేళ్లలో ఈ బాదుడు రూ.1,000 కోట్లపైనే!

పెట్రోల్, డీజిల్‌పై ₹20,000 కోట్లు

పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే పెట్రోల్, డీజిల్ ధరలు చాలా ఎక్కువ. లీటరుకు రూ.2గా ఉన్న అదనపు వ్యాట్‌ను జగన్ సర్కారు రూ.4కు పెంచింది. దీంతోపాటు ప్రతి లీటర్‌పై రోడ్డు అభివృద్ధి సెస్ పేరిట రూపాయి చొప్పున అదనంగా వసూలు చేస్తోంది. ఈ ఐదేళ్లలో వీటి ద్వారా ఖజానాకు రూ.65,000 కోట్లు రాగా.. ఇందులో జగన్ సర్కారు అదనంగా వేసిన వ్యాట్, సెస్ ద్వారా పిండింది దాదాపు రూ.20,000 కోట్లు.

కోతలు.. వాతలు

రేషన్‌పై దెబ్బ ₹6,900 కోట్లు

జగన్ సర్కారు చివరికి రేషన్ సరుకులను కూడా వదల్లేదు. కందిపప్పు, చక్కెర ధరలను పెంచేసింది. రాష్ట్రంలో కోటీ 45 లక్షల రేషన్ కార్డులుండగా... సగటున ప్రతి నెలా కోటీ 23 లక్షల కార్డుదారులు కందిపప్పు తీసుకుంటున్నారు. 2 కిలోలు ఇవ్వాల్సిన కందిపప్పును జగన్ ప్రభుత్వం కేజీకి తగ్గించింది. పైగా రూ.40 ఉన్న కిలో కందిపప్పు ధరను రూ.67కి పెంచింది. పేదలపై ఏడాదికి రూ.1,590 కోట్ల చొప్పున, నాలుగేళ్లలో రూ.6,500 కోట్ల భారం పడింది. అలాగే, అర కిలో చక్కెర ధరను రూ.10 నుంచి రూ.17కు పెంచారు. దీనివల్ల ప్రజలపై ఏడాదికి రూ.103 కోట్ల చొప్పున, నాలుగేళ్లలో రూ.410 కోట్ల భారం వేశారు.

పేదల ఇళ్లపై ₹3,900 కోట్లు

గత ప్రభుత్వాలు పేదలకు కట్టించిన ఇళ్లపైనా జగన్ డబ్బులు వసూలు చేశారు. ఓటీఎస్ పేరిట గ్రామీణ ప్రాంతాల్లో రూ.10,000, పట్టణాల్లో రూ.15,000, నగరాల్లో రూ.20,000 చొప్పున బలవంతంగా వసూలు చేశారు. జగన్ ఫొటో, నవరత్నాల లోగోలతో కూడిన ఇంటి పట్టా అంటూ లబ్ధిదారులకు ఇచ్చారు. ఇప్పుడు ఆ ఇళ్లు అమ్ముకోవడానికి కానీ, బ్యాంకులో తాకట్టు పెట్టడానికి కానీ ఆ పట్టాలు పనికిరావడం లేదని పేదలు గగ్గోలు పెడుతున్నారు. జగన్ సర్కార్ మాత్రం పేదలను కుళ్లబొడిచి రూ.3,900 కోట్లు వసూలు చేసింది. అలాగే అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్న వారి ఇళ్లను క్రమబద్ధీకరించే పేరుతో మరో రూ.500 కోట్లు వసూలు చేసింది.

విద్యార్థులకు కోత ₹1,400 కోట్లు

ప్రైవేటు కాలేజీల్లో పీజీ కోర్సులు చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని జగన్ ప్రభుత్వం ఎత్తేస్తూ జీవో 77 ఇచ్చింది. దీనివల్ల విద్యార్థుల తల్లిదండ్రులపై దాదాపు రూ.1,400 కోట్ల భారం పడింది.

రైతుల నుంచి ₹650 కోట్లు

అసలే తీవ్రనష్టాల్లో ఉన్న రైతులపై ప్రభుత్వం నీటి తీరువా బకాయిల భారం మోపింది. 2013-14 నుంచి రైతులు చెల్లించాల్సిన ఈ బకాయిల భారం రూ.650 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

మీ సేవలపై మోత ₹120 కోట్లు

మీ సేవ చార్జీలను జగన్ సర్కారు పెంచింది. 2022 ఏప్రిల్ నుంచి మొదలైన ఈ పెంపుతో ప్రజలపై అదనంగా రూ.120 కోట్ల భారం పడింది.

ఇసుకతో ₹4,000 కోట్లు

జగన్ సీఎం అయ్యాక ఉచిత ఇసుక విధానాన్ని రద్దు చేశారు. టన్ను ఇసుక ధరను రూ.375గా నిర్ణయించారు. ఏడాదిన్నర తర్వాత రూ.475కి పెంచారు. ఈ ఐదేళ్లలో దాదాపు 10 కోట్ల టన్నుల ఇసుకను విక్రయించారు. దీని విలువ రూ.4,000 కోట్లు.

రిజిస్ట్రేషన్లపై వాత ₹1,000 కోట్లు



ఐదేళ్లలో మూడుసార్లు భూముల మార్కెట్ విలువ పెంచారు. యూజర్ చార్జీలు కూడా పెంచారు. దీంతో రిజిస్ట్రేషన్ చార్జీలు, స్టాంపు డ్యూటీలు భారీగా పెరిగాయి. దీనివల్ల ప్రజలపై ఈ ఐదేళ్లలో అదనంగా రూ.1000 కోట్ల భారం పడింది.

ఈ ఐదేళ్లలో అడ్డగోలుగా అప్పులు చేశారు. ప్రభుత్వ ఆస్తులు తనఖా పెట్టారు. కేంద్ర నిధులు దారి మళ్లించారు. ఉద్యోగులకు వేల కోట్ల బకాయిలు పెట్టారు. కాంట్రాక్టర్లకూ బిల్లులు పెండింగ్ పెట్టారు. అప్పులు పెరిగాయి కానీ, ఐదేళ్లుగా రాష్ట్రంలో అభివృద్ధి జాడ లేదు. 'సంక్షేమం'లోనూ సవాలక్ష నిబంధనలతో కోతలు పెట్టారు. రకరకాలుగా పన్నులు, చార్జీలు బాదుతూ సామాన్యులపై ఆర్థిక భారం మోపారు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ లేనివిధంగా చివరికి చెత్తకు కూడా పన్ను వేశారు. మరోవైపు యువతకు ఉపాధి లేదు. కార్మికులకు చేతిలో పనిలేదు. సంక్షేమానికి వేలు, లక్షల కోట్లు ఖర్చు చేశామని చెబుతూనే.. అస్తవ్యస్త విధానాలతో రాష్ట్రాన్ని నాశనం చేశారు. పేదలకు ఇచ్చిన దాని కంటే వారి నుంచి లాక్కొన్నదే ఎక్కువ. జగన్ సీఎం అయ్యాక తెచ్చిన కొత్త పథకాలు అమ్మఒడి, చేయూత, వాహనమిత్ర, చేదోడు. ఐదేళ్లలో అమ్మఒడి కోసం రూ.24,000 కోట్లు, చేయూతకు రూ.18,000 కోట్లు, చేదోడుకు రూ.1,625 కోట్లు, వాహన మిత్రకు రూ.1,200 కోట్లు ఖర్చు చేశారు. గతంలో ఉన్న పథకాల కోసం కాకుండా జగన్ తెచ్చిన ఈ కొత్త పథకాల కోసం ఈ ఐదేళ్లలో ఖర్చు పెట్టింది రూ.44,825 కోట్లు మాత్రమే. జగన్ గద్దెనెక్కాక మద్యం ధరలు, కరెంటు చార్జీలు, ఆర్టీసీ చార్జీలు, డీజిల్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెంచారు. ఆస్తిపన్ను పెంచారు. రిజిస్ట్రేషన్ చార్జీలు, యూజర్ చార్జీలు భారీగా పెంచారు. ఉచిత ఇసుకను అమ్ముకున్నారు. పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తేశారు. వాహనాలపై పన్నుల మోత మోగించారు. ఇలా పేదల జేబుకు చిల్లుపెట్టే ఏమార్గాన్నీ వదలకుండా వారిని మరింత పేదరికంలోకి నెట్టేశారు. ఈ ఐదేళ్లలో ఇలా పేదల నుంచి మొత్తం అక్షరాలా లక్ష కోట్ల రూపాయలకు పైగా లాక్కొన్నారు.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

NRI మాట

రోడ్డు వేయమంటే మీరే వేసుకోండన్నారు!



బి.కొత్తపల్లి రహదారి దుస్థితి

- జగన్ కోసం నాడు లండన్ నుంచి వచ్చి ఓటేశా
- ఇప్పుడు టీడీపీకి మద్దతిస్తా: ఎన్నారై శ్రీధర్‌రెడ్డి
- 'బి.కొత్తపల్లి' ప్రజల మాటా ఇదే

"మా ఊరికి రోడ్డు లేదు. గత ఎన్నికల్లో లండన్ నుంచి వచ్చి వైసీపీ అభ్యర్థి శంకర నారాయణకు ఓటేశాను. కానీ, ఆయన మాత్రం మీరు బాగా బలిసినోళ్లు కదా మీరే వేయించుకోండి అని ఉచిత సలహా ఇచ్చారు. ఇలాంటి వాళ్లను ఎన్నుకున్నందుకు బాధగా ఉంది" అని శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం బి.కొత్తపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి అన్నారు. నమ్మి గెలిపించినందుకు బాధపడుతున్నట్టు చెప్పారు. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీకి మద్దతివ్వాలని నిర్ణయించినట్టు తెలిపారు. 'మా ఊరికి దారి లేదు. ప్రధాన రహదారి నుంచి కేవలం రెండు కిలో మీటర్లు రోడ్డు వేయించాలని మంత్రి శంకర నారాయణను అడిగా. దాదాపు 30సార్లు ఆయనను కలిశా. రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నాం.. స్పందించాలని అడిగా. 'లండన్ నుంచి వచ్చారు కదా..? బాగానే డబ్బు సంపాదించి ఉంటారు. బలిసినోళ్లు మీరే వేసుకోవచ్చు కదా?' అన్నారు. నాకు ఇద్దరు పిల్లలు. ఇక్కడి పరిస్థితి, పాలకుల తీరు చూశాక.. నా పిల్లలకు ఆధార్ కార్డు ఏపీలో తీసుకోవాలా? లేక కర్ణాటకలో తీసుకోవాలా? అన్న సందేహం కలిగింది. నాకు ఓటు హక్కు వచ్చాక టీడీపీకి ఓటు వేసిందే లేదు. కానీ, ఇప్పుడు టీడీపీకే మద్దతు పలుకుతున్నా. మరికొందరు ఎన్నారైలను టీడీపీకి మద్దతుగా సమీకరిస్తా' అని శ్రీధర్‌రెడ్డి చెప్పారు.

ఇదీ దుస్థితి బి.కొత్తపల్లిలో సుమారు 400 కుటుంబాలు ఉంటాయి. గోరంట్ల-పుట్టపర్తి ప్రధాన రహదారి నుంచి 2 కిలోమీటర్ల మట్టి రోడ్డులో వెళితే ఈ ఊరు వస్తుంది. దారికి ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగాయి. గుంతలమయమైన ఈ దారిలో ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఊరికి రోడ్డు వేయాలని గ్రామస్థులు ఐదేళ్లుగా కోరుతున్నారు. కానీ, వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. గ్రామంలోని విద్యార్థులు బడికి వెళ్లాలంటే గోరంట్ల వెళ్లాలి. వైద్యం కోసం పుట్టపర్తి వెళ్లాలి. కానీ, ఈ ఊరికి రోడ్డు లేని కారణంగా అంబులెన్స్‌లు రావడం లేదు. తమ ఊరు బాగుపడాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిందేనని గ్రామస్థులు చెబుతున్నారు. అందుకే ఎన్ఆర్ఐ శ్రీధర్ రెడ్డి, గ్రామ నాయకుడు నరసింహారెడ్డిసహా గ్రామస్థులంతా టీడీపీలో చేరుతున్నారు. -పెనుకొండ టౌన్



సీఎం జగన్‌తో ఎన్ఆర్ఐ శ్రీధర్ రెడ్డి (ఫైల్)

మా ఆత్మగౌరవం ప్రశ్నార్థకమైంది

"వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో దళితుల కంటే ఎక్కువగా అవమానపడింది ముస్లింలు. దాడులు జరిగింది మాపైనే. ఈ ప్రభుత్వ పాలనలో ఆత్మగౌరవం ప్రశ్నార్థకమైంది. అందుకే 8 జిల్లాల్లో, ముఖ్యంగా రాయలసీమలో 69 శాతం ముస్లింలతో పాటు 17 ముస్లిం ప్రజా సంఘాలు టీడీపీకి మద్దతు ప్రకటించాయి. రెండు ప్రభుత్వాల పాలనలో ముస్లింలకు టీడీపీ హయాంలోనే ఎక్కువ మేలు జరిగింది" అని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు ఫారూక్ షుబ్లీ తెలిపారు. వైసీపీ పాలనలో జరిగిన అన్యాయాలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

- వైసీపీ పాలనలో దళితుల కంటే ఎక్కువ అవమానాలు
- 'నవరత్నాలు' అమలుకు మైనారిటీ కార్పొరేషన్ నిధులు
- మా దగ్గర అన్ని లెక్కలూ పక్కాగా ఉన్నాయి
- విలువైన వక్ఫ్ ఆస్తులపై వైసీపీ పెద్దల కన్ను పడింది
- అందుకే వాటిని 22(ఏ) జాబితా నుంచి తొలగించారు
- టీడీపీ హయాంలోనే ముస్లింలకు ఎక్కువగా మేలు
- అమరావతితోనే ముస్లింల అభివృద్ధి సాధ్యం
- రాజధాని విశాఖకు వెళ్తే ఇబ్బందులు పడతాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



'ఆంధ్రజ్యోతి'తో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు ఫారూక్ షుబ్లీ

• పథకాలన్నీ రద్దుచేసి ఏం చేసినట్టు?

టీడీపీ పాలనలో ముస్లింల కోసం ఏపీఎంఎఫ్‌సీ (ఆంధ్రప్రదేశ్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్) ఏర్పాటు చేసింది. దుల్హన్, విదేశీవిద్య, సబ్సిడీ రుణాలు, రంజాన్ తోఫా, మసీదుల మరమ్మతులు, సంక్రాంతి కానుక, మహిళలకు ఉపాధి శిక్షణ కేంద్రాలు వంటి కార్యక్రమాలు అమలు చేశారు. మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేశారు. సీఈడీఎం(సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఫర్ మైనారిటీస్) ఏర్పాటు చేసి యువతకు యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇచ్చేవారు. రోషిణి పథకంలో గృహనిర్మాణం చేశారు. రంజాన్ పండుగ నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించారు. మదర్సాల్లో విద్యా వలంటీర్లను నియమించారు. నైపుణ్యం కలిగిన యువతకు ఉచితంగా పనిముట్లను అందజేశారు. ఇవన్నీ ఏపీఎంఎఫ్‌సీ ద్వారా అమలయ్యేవి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ పథకాల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదు. అన్నింటినీ రద్దు చేశారు. వలంటీర్ల వ్యవస్థ గురించి ఎంతో గొప్పగా చెప్పుకొనే సీఎం జగన్... మదర్సాల్లో ఉన్న విద్యా వలంటీర్లను రద్దు చేశారు.

• ఆ నిధులన్నీ మావే

ముస్లింల సంక్షేమానికి రూ.23 వేల కోట్లు ఖర్చు చేశామని వైసీపీ చెబుతోంది. ఈ డబ్బంతా ఎక్కడిది? మా కార్పొరేషన్ నిధులు తీసుకెళ్లి నవరత్నాలకు పెట్టారు. ప్రభుత్వం కొత్తగా చేసిందేముంది? ఇంతకుముందు టీడీపీ ప్రభుత్వంలో అమలైన పథకాన్నీ రద్దుచేసి, మైనారిటీ కార్పొరేషన్ డబ్బును ప్రభుత్వం తీసుకుంది. 2019-20లో రూ.527.73కోట్లు, 2020-21లో రూ.1,614.94కోట్లు, 2021-22లో రూ1,253.22కోట్లు, 2022-23లో 1,146.62కోట్లు మైనారిటీ కార్పొరేషన్ ద్వారా తీసుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఎంత తీసుకున్నారో ఇంకా తెలియదు. ఎందుకంటే 6 నెలల క్రితమే మైనారిటీ కార్పొరేషన్ వెబ్‌సైట్‌ను మూసివేశారు.

• నవరత్నాలు పెద్ద మోసం

నవరత్నాల్లో ఏదో ఒరగబెట్టామని వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంటోంది. ఈ ప్రభుత్వ హయాంలో ఎక్కువగా నష్టపోయింది ముస్లింలే. నవరత్నాల ద్వారా ముస్లింలకు ఏ ప్రయోజనమూ చేకూరలేదు. వైఎస్సార్ చేయూత కింద 2020-21లో 2,25,268 మంది ముస్లింలకు రూ.422కోట్లు ఖర్చు చేశారు. 2021-22లో ఈ లబ్ధిదారుల సంఖ్య 83,024కి తగ్గించారు. వారికి చేసిన ఖర్చు రూ.155.27కోట్లు. 2022-23లో లబ్ధిదారులు 42,172కి తగ్గిపోయారు. వీరికి చేసిన ఖర్చు రూ.79.07 కోట్లు. అందుకే నవరత్నాలు పెద్ద మోసమని చెబుతున్నాం. మసీదుల మరమ్మతులకు టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రూ.35.94 కోట్లు కేటాయిస్తే, వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.87.82 లక్షలు వెచ్చించింది. రంజాన్ పండగ నిర్వహణకు టీడీపీ ప్రభుత్వంలో రూ.2,025 కోట్లు కేటాయించారు. వైసీపీ కేటాయించింది కేవలం రూ.1.06 కోట్లు. టీడీపీ పాలనలో విదేశీవిద్య కింద మొత్తం 527 మంది విద్యార్థులు లబ్ధి పొందారు. వైసీపీ ప్రభుత్వంలో వీరి సంఖ్య కేవలం 42. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఏటా ముస్లిం కార్మికులకు పనిముట్లు అందజేస్తే, ఈ ప్రభుత్వం దాన్ని పూర్తిగా ఎత్తేసింది. టీడీపీ ప్రభుత్వంలో దుల్హన్ పథకం కింద 48,689 మంది ముస్లింలు లబ్ధి పొందారు. ఈ ప్రభుత్వంలో వారి సంఖ్య 4వేలు. సబ్సిడీ రుణాలను టీడీపీ 45,244 మందికి అందజేస్తే, ఈ ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి ఈ మాటే వినిపించలేదు. వక్ఫ్ సంస్థల ఆదాయాన్ని అభివృద్ధి చేయడానికి టీడీపీ ప్రభుత్వం రూ.18.75కోట్ల రివాల్వింగ్ ఫండ్‌ను కేటాయించింది. దీనికి వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేటాయించిన మొత్తం రూ.1.33 కోట్లు. విడాకులు తీసుకున్న మహిళలకు టీడీపీ సర్కారు రూ.6.85కోట్ల సహాయాన్ని అందజేసింది. దీనికి వైసీపీ ప్రభుత్వం వెచ్చించిన మొత్తం రూ.2.49కోట్లు. మైనారిటీ వెల్ఫేర్ డే సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ముస్లింలకు రూ.2.50లక్షలను బహుమతిగా ఇచ్చేవారు. దాన్ని వైసీపీ ప్రభుత్వం రూ.1.2 లక్షలకు కుదించేసింది. రాష్ట్రంలో 1,571 ఉర్దూ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 600 పాఠశాలలకు వైసీపీ ప్రభుత్వం తాళాలు వేసింది. రోషిణి పథకంలో టీడీపీ ప్రభుత్వం 100 పాఠశాలలకు భవనాలను నిర్మించింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకటి కూడా నిర్మించలేదు.

• 22(ఎ) నుంచి తొలగింపులో కుట్ర

వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు టీడీపీ ప్రభుత్వం జీవో 18 తీసుకొచ్చింది. జిల్లాస్థాయిలో పోలీసు, రెవెన్యూ అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసింది. ఈ జీవో ద్వారా వక్ఫ్ ఆస్తులను 22(ఎ) జాబితాలో చేర్చింది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఈ జీవో అమలు చేయాలి. లేకపోతే దీన్ని మరింత పటిష్టంగా మార్చాలి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వక్ఫ్ ఆస్తులను ఈ జాబితా నుంచి తొలగించింది. దీనివెనుక పెద్ద కుట్ర ఉంది. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో కోట్లాది రూపాయల విలులైన ఆస్తులు, భూములు వక్ఫ్ బోర్డుకు ఉన్నాయి. వాటిపై వైసీపీ పెద్దల కన్ను కన్నుపడింది. 22(ఎ) జాబితాలో ఉంటే రిజిస్ట్రేషన్ చేయడం కదరదు కాబట్టి ఆ జాబితా నుంచి తొలగించేశారు.

• అమరావతితోనే మా అభివృద్ధి

ముస్లిం సామాజిక, రాజకీయ, ఆర్థికాభివృద్ధి అమరావతితో అనుసంధానమై ఉంది. దీనికి ఒక ప్రధాన కారణం ఉంది. రాజధానికి చుట్టుపక్కల మొత్తం 9 లక్షల మంది ముస్లిం జనాభా ఉన్నారు. అమరావతి నిర్మాణం పూర్తయితే ముస్లింలు రాబోయే 25 ఏళ్లపాటు ఉపాధి కోసం ప్రత్యామ్నాయాలు చూసుకోవాల్సిన అవసరం ఉండదు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

అనేక దాడులు.. ఎన్నో అవమానాలు

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో దళితుల కంటే ఎక్కువగా బాధపడింది ముస్లింలే. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ప్రభుత్వ పాలనలో ముస్లింల ఆత్మగౌరవం ప్రశ్నార్థకంగా మారిపోయింది. పెత్తందారుల ప్రభుత్వ పాలనలో అనేక దాడులు జరిగాయి. ఎన్నో అవమానాలు పడ్డాం. జ్యువెలరీ షాపులో పనిచేసే అబ్దుల్ సలాంపై చేయని దొంగతనం మోపారు. చివరికి అతడు కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై నోరెత్తకుండా సలాం అత్తకు రూ.29లక్షలు ఇచ్చి కట్టడి చేశారు. ఈ ఘటనపై సీబీఐ విచారణ చేయించాలని శాసనమండలిలో ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తే అప్పటి హోంమంత్రి సుచరిత అంగీకరించారు. తర్వాత పట్టించుకున్న పరిస్థితి లేదు. కర్నూలు జిల్లాలో గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామంలో పొలం పనికి వెళ్తున్న 22 ఏళ్ల యువతిపై స్థానిక ఎమ్మెల్యే అనుచరులు అత్యాచారం చేసి చంపేశారు. ఈ కేసును ఇప్పటి వరకు ఐపీసీ 302 సెక్షన్ కిందకు మార్చలేదు. రాజమహేంద్రవరంలో వైసీపీ కార్యకర్తలు ముస్లిం యువతిపై అత్యాచారం చేశారు. దీనిపై ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమపై ఫిర్యాదు చేసినందుకు వైసీపీ కార్యకర్తలు ఆ ఇంటికి వెళ్లి ఆయన భార్య స్నానం చేస్తుండగా వీడియోలు తీశారు. ఈ అవమానం తట్టుకోలేక అమ్మాయి తండ్రి ఎస్పీ కార్యాలయం ముందు ఆత్మహత్యకు యత్నించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఇబ్రహీం అనే వ్యక్తిని నడిరోడ్డుపై దారుణంగా హత్య చేశారు.

అబ్బ ఛా!



దొంగలతో నిండిపోయిన పార్టీలు!

అన్ని పార్టీలూ దొంగలతో నిండిపోయాయి. ఈ ఎన్నికలలో నన్ను గెలిపించండి. నేనూ ఈ ఊరోడినే. ఇక్కడి బడిలోనే చదువుకున్నా. పదో తరగతి ఫెయిల్ అయ్యా. ఆ తర్వాత అమెరికా వెళ్లాను.

\- భీమిలి ఎన్నికల ప్రచారంలో కేఏ పాల్

భీమిలి బీచ్‌లో చేపలు పడుతున్న కేఏ పాల్



సీఎం సొంత జిల్లా కడప నగర శివారులోని చలమారెడ్డిపల్లె వద్ద టిడ్కో ఇళ్ల దుస్థితి

తాడేపల్లిలో ప్యాలెస్ కట్టుకున్నారు. లోటస్‌పాండ్‌లో మరో ప్యాలెస్ ఉంది. ఇతర నగరాల్లోనూ ప్యాలెస్‌లు ఉన్నాయి. దాదాపు 500 కోట్ల ప్రజాధనం ఖర్చు పెట్టి రుషికొండపై నిబంధనలు ఉల్లంఘించి మరీ ప్యాలెస్ నిర్మించుకున్నారు. పేదనని తనకు తాను చెప్పుకొనే ముఖ్యమంత్రి జగన్ ప్యాలెసుల్లో హాయిగా ఉంటూ.. పేదల పక్షపాతినని చెబుతూ... పేదలగూడుపై పగబట్టారు. చంద్రబాబు ప్రభుత్వంలో పట్టణ పేదలకు కట్టించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా ఐదేళ్లుగా పాడుబెట్టారు. 90 శాతం పూర్తయిన ఇళ్లను కూడా పూర్తి చేయకుండా వదిలేశారు. ఆయన చేసిన ఘనకార్యం ఏమిటంటే.. టిడ్కో ఇళ్లకు వైసీపీ రంగులు వేయడమే!



తాడేపల్లిలోని సీఎం జగన్ ప్యాలెస్

పేదలగూడుపై.. పెత్తందారు పగ





సాలెగూళ్లుగా..

ఒంగోలు నగర పరిధిలో చింతల వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్ల దుస్థితి

ప్రకాశం జిల్లా ఒంగోలులో మొదటి దశలో 90 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో పది శాతం పనులను పూర్తి చేసుంటే లబ్ధిదారులు ఎప్పుడో గృహప్రవేశాలు చేసేవారు. వైసీపీ సర్కారు వచ్చాక అర్థంతరంగా ఆగిపోవడంతో అవి సాలెగూళ్లుగా మారాయి. రెండేళ్ల క్రితం టీడీపీ, సీపీఐ వేర్వేరుగా టిడ్కో ఇళ్ల వద్ద ఆందోళనలు చేపట్టగా త్వరలో ఇస్తామని ప్రభుత్వ పెద్దలు ప్రకటనలు చేశారు. ఆ తర్వాత పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొత్తం 9,568 టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. వైసీపీ సర్కారు వచ్చాక ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి.



అనంతపురం నగర శివారులో టిడ్కో ఇళ్లకు వైసీపీ రంగులు వేసి వదిలేసిన దృశ్యం

నిండా నిర్లక్ష్యం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం, గుత్తి, పామిడి, గుంతకల్లు, రాయదుర్గం, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, హిందూపురం ప్రాంతాల్లో టిడ్కో ఇళ్ల పరిస్థితి దయనీయంగా మారింది. టీడీపీ హయాంలో 80 శాతానికి పైగా నిర్మాణాలు పూర్తి కాగా.. వైసీపీ సర్కారు మిగిలిన 20 శాతం పనులను చేపట్టలేదు. కాంట్రాక్టర్లకు రూ.70 కోట్ల బకాయిలు చెల్లించలేదు. గుత్తి పట్టణవాసులకు నేమతాబాదు వద్ద చేపట్టిన ఇళ్ల నిర్మాణ సముదాయంలో ముళ్ల పొదలు పెరిగిపోయాయి. అనంతపురం నగర శివారులో టిడ్కో ఇళ్లకు వైసీపీ రంగులు వేసి, లబ్ధిదారులకు ఇవ్వకుండా వదిలేశారు. తాడిపత్రిలో మాత్రం మూడు నెలల క్రితం కొన్నింటిని ప్రారంభించారు. అక్కడ 5,184 టిడ్కో ఇళ్లు ఉండగా.. వెయ్యి ఇళ్లకు పైపై పనులు చేసి, రంగులు వేయించారు. ఇందులో కూడా లబ్ధిదారులకు 370 ఇళ్లను మాత్రమే అప్పగించారు.

టిడ్కో ఇళ్లకు జగన్ గ్రహణం

చంద్రబాబు కట్టించారనే కక్షతో పేదలకివ్వకుండా పాడుపెట్టిన వైనం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

పేదల పెన్నిధినని చెప్పుకొనే ముఖ్యమంత్రి జగన్ పట్టణ పేదల ఇళ్లపై పగబట్టారు. చంద్రబాబుపై కక్షతో ఆయన హయాంలో శ్రీకారం చుట్టిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా పాడుపెట్టారు. గత ప్రభుత్వ హయాంలోనే దాదాపుగా పూర్తయిన ఇళ్ల నిర్మాణాలను కూడా అసంపూర్తిగా వదిలేశారు. చంద్రబాబు మంజూరు చేశారన్న ఒకే ఒక్క కారణంతో పేదల ఆశలను అడియాసలు చేశారు. పట్టణ పేదలకు పక్కా ఇళ్లు అందించాలన్న లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 8 లక్షల ఇళ్లు నిర్మించాలని తలపెట్టింది. దాదాపు 6 లక్షల ఇళ్ల నిర్మాణపు పనులు చేపట్టింది. గత ఎన్నికల సమయానికి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే దాదాపు 2.70 లక్షల ఇళ్ల నిర్మాణం దాదాపుగా పూర్తయింది. కొన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా ఎన్నికల ముందు పంపిణీ చేయలేకపోయారు. జగన్ సర్కారు వచ్చాక టిడ్కో ఇళ్లకు గ్రహణం పట్టింది. ఎక్కడి నిర్మాణాలను అక్కడ ఆపేసింది. 90 శాతం పనులు జరిగిన నిర్మాణాలను కూడా పూర్తి చేయకుండా గాలికి వదిలేసింది. దీంతో చాలా చోట్ల టిడ్కో ఇళ్ల సముదాయాలు ముళ్ల చెట్ల పొదలతో నిండిపోయాయి. పలు ప్రాంతాల్లో జగన్ సర్కారు టిడ్కో ఇళ్లకు వైసీపీ రంగులు వేయించి మరీ లబ్ధిదారులకు ఇవ్వకుండా వదిలేసింది. తాగునీరు, రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ వంటి కనీస మౌలిక సదుపాయాలను కల్పించలేదు. తీవ్ర జాప్యం చేసి ఎన్నికల ముందు అక్కడక్కడ లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించినా వారు నివాసం ఉండలేని పరిస్థితి. చంద్రబాబు హయాంలో మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను జగన్ విస్మరించారని, మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వస్తే మిగిలిన పనులు పూర్తిచేసి ఇళ్లను అప్పగిస్తారని లబ్ధిదారులు ఆశిస్తున్నారు.

■ మీ ప్యాలెస్‌లు బాగుండాలి.. పేదల ఇళ్లు పాడుబడాలి

రంగులేసి వదిలేశారు

శ్రీకాకుళం జిల్లాలో కొన్ని చోట్ల టిడ్కో ఇళ్లకు వైసీపీ రంగులేసి మరీ లబ్ధిదారులకు ఇవ్వకుండా వదిలేశారు. పాత్రునివలస-2లో 624 ఇళ్ల నిర్మాణం ఇంకా కొంత చేయాల్సి ఉంది. ఆమదాలవలసలో 528 ఇళ్ల నిర్మాణం పూర్తయినా.. లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించలేదు. ఎన్నికల కోడ్‌కు ముందు స్పీకర్ తమ్మినేని సీతారాం హడావుడిగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పలాస పట్టణ ప్రజలకు బొడ్డపాడు వద్ద 912 ఇళ్లను నిర్మించినా లబ్ధిదారులకు అప్పగించలేదు. పాత్రునివలస-1లో నిర్మించిన ఇళ్లను మాత్రమే పది నెలల కిందట లబ్ధిదారులకు అందజేశారు.



ఇచ్ఛాపురంలో నిర్మాణంలో ఉన్న టిడ్కో ఇళ్లు



పశ్చిమలో పడకేసిన టిడ్కో

తణుకులో నిలిచిపోయిన టిడ్కో ఇళ్ల నిర్మాణం

పశ్చిమగోదావరి జిల్లాలో తొలి విడతగా భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు పట్టణాల్లో 19,872 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మూడు పట్టణాల్లో 5,512 ఇళ్లు టీడీపీ హయాంలోనే పూర్తిగా అందుబాటులోకి తెచ్చారు. మిగిలిన ఇళ్లకు రంగులు, అంతర్గత పనులు మిగిలాయి. వాటిని కూడా వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయింది. గతంలో నిర్మించి, రంగులేసిన ఇళ్లకు వైసీపీ రంగులు వేసుకుంది. గత ప్రభుత్వంలో పూర్తి చేసిన ఇళ్లను రెండేళ్ల కిందట లబ్ధిదారులకు ఇచ్చారు. ఎన్నికల కోడ్‌కు ముందు మరో మూడు వేల ఇళ్లు అందజేశారు. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించలేదు. మున్సిపాలిటీ నుంచి మంచినీళ్లు కూడా ఇవ్వలేదు. డ్రైనేజీ వ్యవస్థ లేదు. తణుకులో రెండో విడతలో చేపట్టిన 1200 ఇళ్ల నిర్మాణ పనులను వైసీపీ సర్కారు పూర్తిగా పక్కన పెట్టేసింది.

అసంపూర్తిగా నిర్మాణం



సూళ్లూరుపేటలో టిడ్కో ఇళ్ల నిర్మాణ పరిస్థితి ఇదీ

తిరుపతి జిల్లాలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, శ్రీకాళహస్తి, పుత్తూరు మున్సిపాలిటీలలో ఎక్కడా పూర్తిస్థాయిలో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు. ఒకటి రెండు చోట్ల దాదాపు పూర్తయినా లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించలేదు. అక్కడక్కడా ఇళ్లలో చేరిన లబ్ధిదారులు సైతం మౌలిక సదుపాయాలు లేక ఖాళీ చేస్తున్నారు.

పాడైపోతున్న ప్లాట్లు



పిఠాపురంలో టిడ్కో ఇంటిలో పగుళ్లిచ్చిన దృశ్యం

కాకినాడ జిల్లాలో చాలాచోట్ల టిడ్కో ఇళ్ల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. నిర్వహణ లేకపోవడంతో ప్లాట్లు పాడైపోయాయి. కాకినాడ నగరంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 4,608 ఇళ్లు మంజూరు కాగా మొదటి దశలో 1152 ఇళ్లు పూర్తి చేసి రంగులు వేసి సిద్ధం చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక మూడేళ్లు వీటిని పట్టించుకోలేదు. పిఠాపురం పట్టణంలోని టిడ్కో ఇళ్లు గృహప్రవేశ సమయానికే పగుళ్లిస్తున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 864 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లాటరీ వేసి లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించారు. వైసీపీ ప్రభుత్వం వాటిని రద్దు చేసి నాలుగేళ్ల కాలయాపన తర్వాత 350 మంది లబ్ధిదారులకు పాట్లు అప్పగించింది. తాగునీటి సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. పెద్దాపురం పట్టణంలో టిడ్కో గృహసముదాయాల్లో మౌలిక వసతులను విస్మరించారు.

సీఎం సొంత జిల్లాలోనూ..



జమ్మలమడుగులో టిడ్కో ఇళ్లకు వైసీపీ రంగులు వేసి వదిలేసిన దృశ్యం

ముఖ్యమంత్రి జగన్ సొంత జిల్లాలోనూ టిడ్కో ఇళ్లపై తన మార్కు నిర్లక్ష్యం చూపారు. చంద్రబాబు హయాంలో మొదటి విడతలో కడప నగర శివారులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద లక్ష్మీనగర్‌లో 992, జమ్మలమడుగు వద్ద 1440 టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2019 జనవరి నాటికే దాదాపు 90 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతుల పనులు మాత్రమే చేపట్టాల్సి ఉంది. రెండో విడతలో కడప నగర శివారులోని చలమారెడ్డిపల్లె వద్ద 1442 ఇళ్లు, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, బద్వేలులో టిడ్కో ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టారు. ఇవి వివిధ దశల్లో ఉన్నాయి. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయాయి.

నెల్లూరు

నారాయణ గెలుపు నల్లేరు మీద నడకే!





నెల్లూరు సిటీ నియోజకవర్గంలో ఈసారి ఎన్నికలు ఏకపక్షమేనని.. మాజీ మంత్రి, టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణకే పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ఆయన గెలుపు నల్లేరుపై బండినడక లాంటిదేనని అంచనా వేస్తున్నాయి. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్న మాజీ మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను కాదని ఆయన అనుచరుడైన ఖలీల్ అహ్మద్‌కు సీఎం జగన్ టికెట్ ఇచ్చారు. అయితే ఆయన ఎన్నికలకు కొత్త కావడం.. పార్టీలో వర్గ విభేదాలతో వైసీపీ శ్రేణులు ఎవరికివారుగా వ్యవహరిస్తున్నారు. వైసీపీ నాయకత్వం కూడా చేతులెత్తేసిందని అంటున్నారు. నగరంలోని పరిస్థితిపై వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి సైతం ఆందోళన చెందుతున్నారని అంటున్నారు.

అనిల్‌కుమార్‌పై వ్యతిరేకత..

2014, 19 ఎన్నికల్లో వైసీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి.. జగన్ కేబినెట్‌లో మూడేళ్లు మంత్రిగా పనిచేసిన పి.అనిల్‌కుమార్ యాదవ్ నగరాభివృద్ధికి ఏమీ చేయలేదు. గోతులు పడిన రోడ్లను కూడా బాగుచేయించలేకపోయారన్నది ప్రజల అభిప్రాయం. తానేమీ చేయకపోగా, నారాయణ హయాంలో చేసిన అభివృద్ధి పనులను సైతం నిలిపివేయడంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. నారాయణ హయాంలో నిర్మించిన 20వేల పైచిలుకు టిడ్కో ఇళ్లను ఐదేళ్లు గడిచినా ప్రజలకు ఇవ్వలేదు. 90శాతానికి పైగా పూర్తయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, డ్రింకింగ్ వాటర్ స్కీమ్‌లను పూర్తి చేయలేదు. దీనికితోడు అనిల్ వ్యవహారశైలితో వైసీపీలో కుమ్ములాటలు అధికమయ్యాయి. టీడీపీ కేడర్‌పైనే కాకుండా సొంత పార్టీ నేతలపైనా ఆయన కక్షసాధింపులకు పాల్పడ్డారు. ఫలితంగా ముఖ్య నాయకులందరూ పార్టీకి దూరమయ్యారు. అభివృద్ధి చేయకపోగా నగరంలో శాంతిభద్రతల సమస్య సృష్టించారన్న విమర్శలు ఉన్నాయి. దీనిని గుర్తించిన అధిష్ఠానం అనిల్‌ను తప్పించి.. ఆయన అనుచరుడైన డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్‌కు టికెట్ ఇచ్చింది. ఈ నిర్ణయాన్ని వైసీపీ శ్రేణులు తీవ్రంగా నిరసిస్తున్నాయి. టీడీపీలోకి వలసబాట పట్టారు.

నారాయణ అభివృద్ధి నినాదం..

2014-19లో నెల్లూరులో నారాయణ రూ.5,600 కోట్లతో అభివృద్ధి చేశారు. తాజా ఎన్నికల్లోనూ అభివృద్ధినే ప్రధాన అజెండాగా తీసుకొని ప్రచారంలో దూసుకుపోతున్నారు.

\- నెల్లూరు, ఆంధ్రజ్యోతి

నియోజకవర్గ స్వరూపం..

(నెల్లూరు కార్పొరేషన్‌లోని 26 డివిజన్లు)

మొత్తం ఓటర్లు	2,38,465
పురుషులు	1,16,230
మహిళలు	1,22,168
ట్రాన్స్‌జెండర్లు	67

పొంగూరు నారాయణ బలాలు..

సౌమ్యుడు, వివాదరహితుడు, ఆర్థికంగా సంపన్నుడు.. మంత్రిగా ఉన్నప్పుడు నెల్లూరు నగరంలో రూ.5600 కోట్లతో చేసిన అభివృద్ధి పనులు. అభివృద్ధి చేసినా ఓడిపోయారనే సానుభూతి.. జగన్ కక్ష సాధింపుతో రాజధాని అమరావతిలో పలు కేసులు.. పేపర్ లీకేజీ కేసులో హైదరాబాద్‌లో అరెస్టు చేసి నెల్లూరు తరలించడంపై ప్రజల్లో సానుభూతి. టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి వర్గం కలిసిరావడం.. ఎన్నికల నిర్వహణలో అందెవేసిన చేయి.

బలహీనతలు..

సొంత సిబ్బందిని నమ్మినట్లు టీడీపీ కేడర్‌ను నమ్మడం లేదనే ప్రచారం.

ఖలీల్ అహ్మద్ బలాలు...

వైసీపీ ఓటుబ్యాంకు.. మాజీ మంత్రి అనిల్‌కుమార్‌పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ఈయనపై లేకపోవడం.

బలహీనతలు..

అనిల్‌కుమార్ మనిషిగా ముద్ర.. ఎన్నికల నిర్వహణ కొత్త కావడం. వైసీపీ కేడర్ పట్టించుకోకపోవడం..

కీలకం

మామా అల్లుళ్ల సవాల్

ఆమదాలవలస పోరు రసవత్తరం



శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో బంధువుల మధ్య సంగ్రామం జరుగుతోంది. ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం మరోసారి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తుండగా.. ఆయనపై ఆయన మేనల్లుడు కూన రవికుమార్ టీడీపీ తరఫున తిరిగి పోటీచేస్తున్నారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత తమ్మినేని ఆ పార్టీ తరఫున 1983,85 ఎన్నికల్లో గెలిచి మంత్రి అయ్యారు. 1989లో ఓడిపోయినా మళ్లీ 94, 99 ఎన్నికల్లో గెలిచి మంత్రి పదవులు చేపట్టారు. 2009లో టీడీపీని వీడి ప్రజారాజ్యం తరఫున పోటీచేసి ఓడిపోయారు. మళ్లీ టీడీపీలోకి వచ్చి.. కొద్దినెలలకే వైసీపీలోకి వెళ్లారు. 2014లో కూన రవికుమార్ చేతిలో పరాజయం పాలయ్యారు. 2019లో విజయం సాధించారు. సీఎం జగన్ ఆయనకు స్పీకర్ పదవి కట్టబెట్టారు. అయితే ఈ ఐదేళ్లలో నియోజకవర్గాన్ని తమ్మినేని అభివృద్ధి చేయలేదనే విమర్శలు ఉన్నాయి. ఆమదాలవలస స్టేషన్‌కు కనీసం రోడ్డు కూడా వేయించలేకపోయారు. మూతపడిన చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తానని 2019 ఎన్నికల్లో హామీ ఇచ్చినా ఇంతవరకు అతీగతీ లేదు.

మామ వద్ద రాజకీయాలు నేర్చుకుని..

తమ్మినేని సీతారాం అక్క కుమారుడే టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పొందూరు మండలంలో కూన రాజకీయంగా ఎదిగారు. మామ వద్ద రాజకీయాలు నేర్చుకుని.. తాను, తన సతీమణి పొందూరు మండలంలో పట్టుసాధించి.. మండల పరిషత్ అధ్యక్షుడిగానూ పనిచేశారు. 2009లో తమ్మినేని ప్రజారాజ్యంలోకి వెళ్లగా.. రవికుమార్ టీడీపీ నుంచి పోటీచేసి ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందగా.. తమ్మినేని రెండో స్థానంలో నిలిచారు. 2014లో మామపై కూన విజయం సాధించారు. 2019లో తమ్మినేని మేనల్లుడిని ఓడించి స్పీకర్ అయ్యారు. నాటి నుంచి రవికుమార్‌పై కక్షసాధింపులు మొదలుపెట్టారు. ఏకంగా రౌడీషీట్ తెరిపించి, 20 కేసులు పెట్టి వేధించారు. అయినా రవికుమార్ వెనక్కితగ్గలేదు. మామకే మేకుగా మారి ఢీకొంటున్నారు.

\- శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి

నియోజకవర్గ స్వరూపం..

(ఆమదాలవలస, పొందూరు, సరుబుజ్జిలి, బూర్జ మండలాలు)

మొత్తం ఓటర్లు	1,96,098
పురుషులు	96,179
మహిళలు	97,664
ట్రాన్స్‌జెండర్లు	15

కీలక సామాజిక వర్గాల ఓటర్లు..(సుమారుగా)

కళింగ-65 వేలు, కాపులు-44 వేలు, ఎస్సీలు-17 వేలు, వెలమ-12 వేలు, యాదవ-7 వేలు, పట్టుశాలి-4 వేలు

తమ్మినేని బలాలు..

జిల్లాలోనే సీనియర్ రాజకీయ నేత. అనుభవజ్ఞుడు. ఎన్నికల మేనేజ్‌మెంట్ తెలుసు.

బలహీనతలు..

అభివృద్ధిపై దృష్టిసారించకపోవడం. పనుల కోసం వచ్చినవారు కుటుంబ సభ్యులకు కప్పం కట్టాలని.. లేదంటే ఏ పనీ జరగదన్న ప్రచారం. వైసీపీలో వర్గాలు.. పార్టీ శ్రేణుల్లోనే ఆయనపై వ్యతిరేకత.. పొందూరు నాయకుడు సువ్వారి గాంధీ ఇండిపెండెంట్‌గా బరిలోకి.

కూన రవికుమార్ బలాలు..

కార్యకర్తల కోసం.. పార్టీ కోసం శ్రమించడం విషయంలో ముందు వరుసలో ఉంటారు. ఐదేళ్లు స్పీకర్‌ను ఢీకొట్టి.. గుర్తింపు పొందారు.

బలహీనతలు..

దుందుడుకుగా వ్యవహరించడం.. గెలిచేస్తామన్న ధీమా.. ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం.. తన మాట వినని వారిని రాజకీయంగా దూరంపెట్టడం.

నేనొచ్చానని చెప్పండి

మీరంతా ఇక్కడి నుంచి వెళ్లగానే...ఇంటింటికీ వెళ్లి, మన మోదీ వచ్చారు, మీకు నమస్కరించానని చెప్పమన్నారని తెలియచేయండి. వారి ఆశీర్వాదాలు అందించమని కోరండి. ఆ ఆశీస్సులతో నాకు కొత్త శక్తి వస్తుంది.

కాంగ్రెస్‌తో జాగ్రత్త

కాంగ్రెస్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. పదేళ్ల కిందట దేశాన్ని కాంగ్రెస్ ఏ స్థితిలోకి నెట్టేసిందో! భారత్ అంటే స్కాములు గుర్తుకొచ్చేవి. వాటిపైనే చర్చ జరిగేది. ఇండియా కూటమి నేతలు ఈడీ, ఈడీ అని గోల చేస్తున్నారు. అది ఎందుకో అందరికీ తెలుసు! జార్ఖండ్‌లో కరెన్సీ కొండను బయటపెట్టింది. దీనిపై కాంగ్రెస్ 'రాకుమారుడు' జవాబు చెప్పాలి.



అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెంలో ప్రధాని మోదీ సభకు హాజరైన జనం

మాఫియా రాజ్.. కరప్షన్ కింగ్

(మొదటి పేజీ తరువాయి)

ఆయన రాజమహేంద్రవరం, అనకాపల్లిలో జరిగిన బహిరంగ సభల్లో పాల్గొన్నారు. రాజమండ్రి సభలో జనసేన అధిపతి పవన్ కల్యాణ్, టీడీపీ యువనేత లోకేశ్ పాల్గొనగా... అనకాపల్లి సభలో చంద్రబాబుతో కలిసి మోదీ వేదికను పంచుకున్నారు. రెండుచోట్లా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంపై ఆయన విరుచుకుపడ్డారు. 'ఆయనకు అవినీతి తప్ప మరేమీ తెలియదు' అని సూటిగా చెప్పారు. రాష్ట్రంలో మాఫియా రాజ్యం నడుస్తోందని మండిపడ్డారు. డబ్బులు వచ్చే పనులు తప్ప, మంచి పనులు చేయరని జగన్‌ను దునుమాడారు. చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపితే... జగన్ దానిని పట్టాలు తప్పించారని విమర్శించారు. రెండు సభల్లో ప్రధాని మోదీ చెప్పిన కీలకాంశాలు... ఆయన మాటల్లోనే!

రాముడంటే ఎన్టీఆర్...

ఏపీ అంటే గుర్తుకొచ్చేది ఎన్టీ రామారావు. తన చిత్రాల ద్వారా శ్రీరాముడి చరిత్రను ఇంటింటికీ చేర్చింది ఆయనే. బీజేపీ అయోధ్యలో రామాలయ నిర్మాణంతో 400 సంవత్సరాల కల నెరవేర్చింది. ఈ కార్యక్రమాన్ని కూడా కాంగ్రెస్ బహిష్కరించింది. ఎవరైనా కాంగ్రెస్ నేతలు భక్తితో ఆలయానికి వెళితే... వారినీ పార్టీ నుంచి బహిష్కరిస్తుంది.

భారతీయులకు గర్వకారణంగా...

నేడు భారత్ ప్రపంచంలోని ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించింది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ ఖ్యాతి గడించింది. ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ప్రతిష్ఠ పెరిగింది. ఇది ప్రతి భారతీయుడు గర్వంగా చెప్పుకోగలిగే విజయాలు. అంతేకాదు... ప్రవాస భారతీయులకూ ఇప్పుడు ప్రత్యేక గుర్తింపు, గౌరవం లభిస్తోంది.

వైసీపీ ఏం చేసింది...

మా మంత్రం అభివృద్ధి... అభివృద్ధి... అభివృద్ధి. కానీ... వైసీపీ మంత్రం కరప్షన్... కరప్షన్... కరప్షన్! అభివృద్ధికి బ్రేకులు వేయడమే వైసీపీ ప్రభుత్వానికి తెలిసిన విద్య. మేం విశాఖపట్నానికి ప్రత్యేక రైల్వే జోన్ ఇచ్చాం. కానీ... రాష్ట్ర ప్రభుత్వం రైల్వే కార్యాలయం కోసం స్థలమే ఇవ్వలేదు. ఏపీలో పేదల కోసం 20 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. కానీ... వైసీపీ సర్కారు వాటిలో సగం నిర్మించలేకపోయింది. ఎందుకంటే... అవినీతికి ఆస్కారమున్న పనులు మాత్రమే జగన్ చేస్తారు. లేదంటే చేయరు! మోదీ పేదరిక నిర్మూలన చేస్తుంటే... జగన్ పేదలను పీడించే పనిలో పడ్డారు. ఇదే జగన్ అజెండా! జగన్ మద్య నిషేధం చేస్తామని అధికారంలోకి వచ్చారు. కానీ... ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వమే మద్యం వ్యాపారం చేస్తోంది. రాష్ట్రంలో భారీ స్థాయిలో మద్యం సిండికేట్ నడుస్తోంది. ఏపీ సర్కారు ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియా నడిపిస్తోంది. ఏపీలో అవినీతి ఫుల్ స్పీడ్‌లో ఉండగా... అభివృద్ధికి బ్రేకులు పడ్డాయి. వైఎస్సార్ కాంగ్రెస్ ఏపీలో మూడు రాజధానులు ఏర్పాటు చేస్తామని చెప్పింది. కానీ... ఇన్నేళ్లలో ఒక్క రాజధానినీ నిర్మించలేదు. నిజానికి మూడు రాజధానుల పేరుతో దోపిడీ చేయాలని వైసీపీ భావించింది. అంతకంటే ముందే ఖజానాను ఖాళీ చేసింది. వీళ్లు కరప్షన్ మేనేజ్‌మెంట్ మాత్రమే చేయగలరు. కానీ... ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ వీళ్లకు చేతకాదు. సేవాభావం లేని ప్రభుత్వం రాష్ట్రానికి ఇలాంటి గతినే పట్టిస్తోంది. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.15వేల కోట్లు ఇచ్చింది. కానీ... జగన్ ప్రభుత్వం దానిని నిలిపివేసింది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి సాగునీటి ప్రాజెక్టు ఈ రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు చక్కటి నిదర్శనం. దీని పనులు జగన్ రెడ్డి తండ్రి వైఎస్ మొదలుపెట్టారు. జగన్ తన తండ్రి రాజకీయ వారసత్వాన్ని తీసుకున్నారు కానీ... ఆయన మొదలుపెట్టిన ప్రాజెక్టును మాత్రం పూర్తిచేయలేదు. వైసీపీకి రైతులంటే ఏమాత్రం శ్రద్ధ లేదు. ఆంధ్రప్రదేశ్‌లో చెరకు రైతులు పెద్దసంఖ్యలో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా చెరకు సాగునే మానేశారు. ఈ ప్రాంతంలో అనేక చక్కర కర్మాగారాలు మూతపడ్డాయి. ఏపీలో, ఢిల్లీలో డబుల్ ఇంజన్ సర్కారుతో చెరకు రైతుల జీవితాలు మారిపోతాయి. మా ప్రభుత్వం పెట్రోలులో ఇథనాల్‌ను కలుపుతోంది. దీనివల్ల దేశవ్యాప్తంగా చెరకు రైతులకు రూ.8వేల కోట్లు అందుతాయి. మత్స్యకారుల క్షేమం గురించి తొలిసారిగా ఎన్డీయే ప్రభుత్వమే ఆలోచించింది. వారి కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. కిసాన్ క్రెడిట్ కార్డుల జారీ, అనుబంధ రంగాల్లో ఉన్న వారికి బీమా సౌలభ్యం కల్పించాం. మోదీ గ్యారెంటీలో మత్స్యరంగాన్నీ చేర్చాం.

బాబు హయాంలో అభివృద్ధిపథం...

దేశంలో కాంగ్రెస్ నేతలు ఎన్నికల ఫలితాలకు ముందే ఓటమిని అంగీకరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్‌ను రిజెక్ట్ చేసేశారు. ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్‌కు ఐదేళ్ల అధికారాన్ని ఇస్తే... మొత్తం ఐదేళ్లను జగన్ వృథా చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో వెనక్కి నెట్టేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉండింది. వైఎస్సార్ కాంగ్రెస్ రాగానే అభివృద్ధి పట్టాలు తప్పింది. ఇప్పుడున్న ఏకైక ధీమా, నమ్మకం, గ్యారెంటీ... ఎన్డీయే ఒక్కటే! రాష్ట్రంలో, కేంద్రంలో డబుల్ ఇంజన్ సర్కారు ఉంటే... ఇప్పుడు ఆగిపోయిన పనులన్నీ వేగంగా పూర్తవుతాయి.

హద్దుల్లేని మాఫియా...

కాంగ్రెస్ పోయింది... వైఎస్సార్ కాంగ్రెస్ వచ్చింది! కానీ... ఆ రెండు పార్టీలదీ ఒకటే మాట, బాట! వారిది హద్దుల్లేని అవినీతి, మాఫియా రాజ్యం! పొరుగునే కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో ట్యాంకర్ మాఫియా, ల్యాండ్ మాఫియా ప్రభుత్వం నడుస్తోంది. ఇక్కడ ఏపీలో ల్యాండ్ మాఫియా, శ్యాండ్ మాఫియా, లిక్కర్ మాఫియా నడుస్తోంది. ఈ దోపిడీ నుంచి రాష్ట్రానికి విముక్తి లభించాలంటే... ఎన్డీయే ప్రభుత్వాన్ని ఎంచుకోవాలి. ఈనెల 13వ తేదీన మీరు వేసే ఓటు దేశ, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుంది. మీ ఓటుతో ఏపీ అభివృద్ధి ప్రస్థానంలో కొత్త అధ్యాయం సృష్టించాలి. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే రికార్డు సృష్టించడం ఖాయమైంది. ఏపీలో ఎన్డీయే సర్కారు ఏర్పడుతుంది.

తెలుగులో అభివందనం...

రాజమహేంద్రవరం, అనకాపల్లి సభల్లో మోదీ తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించారు. 'నాఆంధ్రా కుటుంబ సభ్యులందరికీ నమస్కారం! రాజమహేంద్రవరం వాసులకు నమస్కా రం. గోదావరి తల్లికి నమస్కారం. ఇది నన్నయ్య నడయాడిన నేల" అని రాజమండ్రిలో... "నూకాలమ్మకు ప్రణామం! మంగళవారం అల్లూరి వర్ధంతి. భీమవరంలో రెండేళ్ల క్రితం ఆయన విగ్రహావిష్కరణ చేసే అవకాశం నాకు లభించింది" అని తెలిపారు. తాను గుజరాత్‌కు బయలుదేరాల్సి ఉందని, అందువల్లే చంద్రబాబుకంటే ముందే ప్రసంగిస్తున్నానని అనకాపల్లి సభలో చెప్పారు. 'మీరంతా చంద్రబాబు ప్రసంగం విన్న తర్వాతే ఇక్కడి నుంచి వెళ్లాలి" అని కోరారు.



సభా వేదికపై మోదీని సత్కరిస్తున్న చంద్రబాబు

చేసింది చెప్పి...

అంతకుముందు నేతలు ఓట్లు అడిగితే మాకేం చేశారని ప్రజలు ప్రశ్నించేవారు. కానీ... మేం ఏం చేశామో చెప్పి ఓట్లు అడుగుతున్నాం. మాది వికసిత ఏపీ, వికసిత భారత్ విజన్! ఈ లక్ష్యంతోనే పదేళ్లు పనిచేశాం. అనకాపల్లి నుంచి ఆనందపురం వరకు 6 లేన్ల జాతీయ రహదారి వేశాం. రాయపూర్ నుంచి విశాఖపట్నం వరకు ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం జరుగుతోంది. కోల్‌కతా - చెన్నై హైవే పూర్తయింది. 2014 వరకు ఏపీలో కేవలం 4వేల కిలోమీటర్ల జాతీయ రహదారులు ఉండేవి. ఇప్పుడు ఆ నిడివి 8వేల కిలోమీటర్లకు పెరిగింది. ఇంకా... ఇక్కడి యువత కోసం ఎన్డీయే ప్రభుత్వం ఎంతో చేసింది. ఐఐఐటీ కర్నూలు, ఐఐటీ తిరుపతి, ఐసర్ తిరుపతి, ఐఐఎం విశాఖ.... ఇంకా పెట్రోలియం యూనివర్సిటీ ఇచ్చాం. గ్రీన్ ఎనర్జీ పార్క్ మంజూరు చేశాం. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు కోసం వెయ్యి కోట్ల నిధులు మంజూరు చేశాం. అమరావతి-విజయవాడ...రోడ్ ప్రాజెక్టు, ఏపీని హైదరాబాద్‌తో అనుసంధానించే కొత్తదారులు చేపట్టాం.

మోసానికి రూపం జగన్

- ధ్వంసమైన ఏపీని మోదీ సహకారంతో ముందుకు తీసుకెళ్తాం: లోకేశ్



సభలో ప్రధాని మోదీతో మాట్లాడుతున్న లోకేశ్

కాకినాడ/రాజమహేంద్రవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): మోసానికి షర్టు, ప్యాంటు వేస్తే అచ్చం సీఎం జగన్‌లా ఉంటారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ధ్వంసమైన ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి ప్రధాని మోదీ సహకారంతో అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తామని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచార సభలో భాగంగా సోమవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో జరిగిన సభలో ప్రధాని మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో కలిసి లోకేశ్‌ప్రసంగించారు. రాజమహేంద్రవరం పేరులోనే రాజసం ఉందన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ప్రఖ్యాతి చెందిన ఆత్రేయపురం పూతరేకులు, తాపేశ్వరం కాజాను ప్రధాని రుచి చూడాలని కోరారు. "పేద కుటుంబం నుంచి వచ్చిన మోదీ దేశాన్ని అన్ని రంగాల్లో పరుగులు పెట్టిస్తున్నారు. మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి పథకాలతో దేశాన్ని పరుగులు తీయిస్తున్నారు. రాష్ట్రంలో చంద్రబాబు సైతం తన కృషితో లోటు బడ్జెట్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను ప్రగతిపథంలో పయనించేలా చేశారు. పోలవరం ప్రాజెక్టు, అమరావతిని రాష్ట్రప్రజల కోసం వేగంగా పూర్తి చేసేందుకు నడుం బిగించారు. కానీ ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని నాశనం చేశారు.

ప్రపంచంలో అనేక దేశాలు భారత్‌ను, మోదీని ఆదర్శంగా తీసుకుని పరిపాలిస్తే తుగ్లక్ జగన్ మాత్రం దక్షిణాఫ్రికాను ఆదర్శంగా తీసుకున్నారు. తాను కూర్చున్న కొమ్మను తనే నరుక్కున్నారు. మూడు రాజధానులు అని అమరావతిని చంపేశారు. ప్రధానంగా జగన్ పాలనలో రాష్ట్రంలో యువత బాధితులుగా మారారు. రైల్వేజోన్ కేంద్రం మంజూరు చేసినా భూమి ఇవ్వకుండా జగన్ మోసం చేశారు. మంగళగిరి ఎయిమ్స్‌ను అనేకరకాల ఇబ్బందులకు గురిచేశారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాకపోవడంతో యువత ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వలసపోతున్నారు. డ్రగ్స్ విచ్చలవిడిగా పెరిగిపోయింది. అందుకే కూటమి ప్రభుత్వం వచ్చాక ఏపీ దిశ, దశను మార్చుతాం. వికసిత భారత్ మోదీ కల అయితే, వికసిత ఏపీ చంద్రబాబు, పవన్‌ల కల. వేదికపై విశ్వజిత్ మోదీ ఉన్నారు. విశ్వజిత్ అంటే విశ్వాన్ని జయించినవారు అని అర్థం" అని లోకేశ్ అన్నారు. ఈ సందర్భంగా మోదీకి వెంకటేశ్వరస్వామి విగ్రహం బహూకరించి, మంగళగిరి చేనేత కండువాను లోకేశ్ కప్పారు.



రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీతో మాట్లాడుతున్న పవన్

కూటమిని అధికారంలోకి తీసుకొస్తున్నాం..

రాష్ట్రంలో కూటమిని అధికారంలోకి తీసుకొస్తున్నామని పవన్ అన్నారు. ఐదు కోట్ల ఆంధ్రుల్ని హింసిస్తున్న జగన్ నాయకత్వాన్ని రాష్ట్రం నుంచి పారదోలేందుకు మీ ఆశీస్సులు కావాలని అడిగిన వెంటనే అంగీకరించినందుకు మోదీకి మరోసారి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. 100 మందిని ఇస్తే దేశాన్ని మార్చేస్తానన్న స్వామి వివేకానంద స్ఫూర్తితో దేశం కోసం ఎవరో ఒకరు వస్తారని కలలు కనేవాడినని, ఇన్నాళ్లకు మోదీ వచ్చారని చెప్పారు. ప్రపంచంలో 10వ ఆర్థికశక్తిగా ఉన్న దేశాన్ని 5వ స్థానానికి తీసుకువచ్చారన్నారు. దేశాన్ని సూపర్ పవర్‌గా, ప్రపంచంలోనే నంబర్‌వన్‌గా చేయడానికి మోదీ వెంట తామంతా నడుస్తామన్నారు. వైసీపీ అవినీతి కోటల్ని బద్దలు కొడతామని పవన్ స్పష్టం చేశారు.

దేశంలో అమృత ఘడియలు.. రాష్ట్రంలో విష ఘడియలు..

ఏపీలో ఎటు చూసినా దోపిడీలు, కుంభకోణాలే

- మోదీ ముందుండి నడిపిస్తే ఈ దోపిడీలుండవు
- వికసిత్ భారత్‌లో ఆంధ్రులం భాగస్వాములవుతాం
- రాజమహేంద్రవరం సభలో పవన్ కల్యాణ్

రాజమహేంద్రవరం సిటీ, మే 6: ప్రధాని నరేంద్ర మోదీ న్యాయకత్వంలో భారత దేశమంతా అమృత ఘడియలు కొనసాగుతుంటే... ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం వైసీపీ పాలనలో విష ఘడియలు సాగుతున్నాయని జనసేన అధినేత పవన్ కల్యాణ్ విమర్శించారు. రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో సోమవారం జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్నికల సభ ప్రజాగళంలో ప్రధాని మోదీతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎటుచూసినా ఇసుక, మట్టి దోపిడీ, స్కాములే కనిపిస్తున్నాయన్నారు. ప్రధాని మోదీ తమ కూటమిని ముందుండి నడిపిస్తే తప్ప ఈ దోపిడీలు ఆగవన్నారు. ఐదు కోట్ల మంది ఆంధ్రుల కోసం నిస్వార్థంగా మీ వెంట నడుస్తామని అడగగానే... ఆశీస్సులు అందించిన మోదీకి ఏపీ ప్రజానీకం తరఫున నమస్కారాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రాన్ని అమృత ఘడియల వైపు తీసుకువెళ్లేందుకు ప్రజలు సిద్ధమయ్యారని అన్నారు. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమంటూ ఆర్టికల్ 370ని రద్దుచేసిన బలమైన నాయకుడు మోదీ అని, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశాన్ని ప్రపంచ చిత్రపటంలో సగర్వంగా నిలబెట్టే వ్యక్తి ఆయనని కొనియాడారు. గుంటూరు శేషేంద్ర కవిత చదువుంటే తనకు మోదీయే గుర్తుకువస్తారన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలకు జగన్ పేరు

కేంద్ర ప్రభుత్వం ప్రజలకందిస్తున్న పథకాలకు జగన్ తన పేరు పెట్టుకుని ప్రచారం చేసుకుంటున్నాడని పవన్ ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి పసల్ బీమా పథకాన్ని వైఎస్ఆర్ బీమాగా మార్చి ప్రీమియం చెల్లించకుండా రైతుల్ని ముంచారన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వలేదన్నారు. ప్రధాని కేంద్రం నుంచి మధ్యాహ్న ఉచిత భోజనం ఇస్తుంటే.. దాన్ని వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కింద మార్చుకున్నారని అన్నారు. విఽషన్ వాత్సాలయ, శక్తి పథకాలను జగనన్న గోరుముద్ద, జగనన్న పాలు అంటూ రాష్ట్ర ప్రథకాలుగా ప్రచారం చేసుకుంటున్నారని చెప్పారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను ఇళ్లకు మళ్లించడంతో పాటు పేదల గృహనిర్మాణానికి కేంద్రం ఇస్తున్న రూ.1.80 లక్షలతో ఇళ్లు కట్టించి జగనన్న కాలనీలుగా పేరు పెట్టుకున్నారని అన్నారు.

మన కళాకారులను మోదీ గుర్తించారు

దేశంలో పద్మశ్రీ అవార్డులు అంటేనే రాజకీయం చేసే పరిస్థితి ఉండేదని, కానీ.. ప్రధానిగా మోదీ వచ్చాక సమూల మార్పులు చేశారని పవన్‌కల్యాణ్ అన్నారు. ఇప్పటివరకు ఎవరూ గుర్తించని గొప్ప గొప్ప వ్యక్తులను, కళాకారులను, సంఘ సేవకులను మోదీ గుర్తించారన్నారు. విమాన ప్రమాదంలో కుటుంబాన్ని కోల్పోయి స్వదేశంలో సేవలందిస్తున్న మన ప్రాంత డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్‌ను, 500 ఏళ్ల చరిత్ర కలిగిన ఏటికొప్పాక బొమ్మల కళని ముందుకు తీసుకెళుతున్న సీవీ రాజును, ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న 33 ఆర్కిడ్స్ జాతులను ప్రపంచానికి తెలియజేసిన శాస్త్రవేత్త అబ్బారెడ్డి నాగేశ్వరరావులను గుర్తించి పద్మశ్రీ ఇచ్చారన్నారు. హరికథల కళాకారులు సచ్చిదానందశాస్త్రిని, తోలుబొమ్మలాట కళాకారులు దళవాయి చలపతిరావును, పోలియో బాధితులకు 10 లక్షలకు పైగా ఆపరేషన్లు చేసిన డాక్టర్ సుంకర వెంకట ఆదినారాయణ, స్తపతి వేలు ఆనందాచారి, కిన్నెర మొగిలయ్య లాంటి కళాకారులను, వైద్యులను గుర్తించి దక్షిణాదికి 135 పద్మ అవార్డులు అందించిన నాయకుడు మోదీ అని గుర్తుచేశారు.

జగన్ బేల మాటలు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రచారంలో భాగంగా సోమవారం ఉమ్మడి గుంటూరు జిల్లాలో రేపల్లె, మాచర్ల, కృష్ణా జిల్లా బందరులో జరిగిన సభల్లో జగన్ పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు సక్రమంగా జరుగుతాయనే నమ్మకం రోజురోజుకీ సన్నగిల్లుతోందని, ఇష్టానుసారంగా అధికారులను మార్చి వేస్తున్నారని ఆయన వాపోయారు. పేదలకు మంచి జరగకుండా టీడీపీ అధినేత చంద్రబాబు అడ్డుపడుతున్నారని, ఈసీపై ఒత్తిడి తెచ్చి ఆన్‌గోయింగ్ పథకాలను కూడా ఆపివేయిస్తున్నారని అక్కసు వెళ్లగక్కారు. పేదలకు మంచి చేస్తున్న జగన్ ఉండకూడదని కుట్రలు చేస్తున్నారంటూ తన బేలతనం బయటపెట్టుకున్నారు. ఎన్నికల కోడ్ రాక ముందు ఎప్పుడో కొన్ని పథకాలకు బటన్ నొక్కిన డబ్బులు... అప్పుడు లబ్ధిదారుల ఖాతాల్లో వేయలేదు. సరిగ్గా పోలింగ్‌కు ముందు వాటిని జమ చేస్తామని ప్రభుత్వం అనడంతో, ఈసీ అంగీకరించలేదు. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయిన తర్వాత విడుదల చేయవచ్చునని సూచించింది. వాస్తవం ఇది కాగా, 'ఆన్ గోయింగ్ పథకాలను' చంద్రబాబు ఆపి వేయిస్తున్నారంటూ జగన్ అక్కసు వెళ్లగక్కడం గమనార్హం.

రాష్ట్రం పొలమట.. జగన్ సాగుదారట!

అసలే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై రైతులు బెంబేలెత్తుతుండగా... 'మొత్తం రాష్ట్రం నా పొలమే' అన్నట్లుగా జగన్ మాట్లాడేశారు. 'మన రాష్ట్రం ఓ పంట పొలం అనుకుంటే దానిని సాగుచేసే బాధ్యత జగన్‌కు జనం ఇచ్చా రు. నేను అమలు చేసిన స్కీములు, మార్పులు, సంస్కరణలు, తీసుకొచ్చిన విప్లవాలు వీటినే ఇంటింట విత్తనాలుగా నాటాను. అవి ప్రతి ఇంట్లో ఐదేళ్లుగా పెరుగుతూ వస్తున్నాయి. మరో 15 ఏళ్లలో వృక్షాలవుతాయి..' అని చెప్పుకొచ్చారు.

సభకు వచ్చిన పాపానికి ప్రాణాలపైకి...

రేపల్లె సభలో పోలీసుల ఆంక్షలు సభకు వచ్చిన ప్రజల ప్రాణాల మీదకు తెచ్చాయి. రోడ్డు ఇరుకుగా ఉండడం, తీవ్రమైన ఉక్కపోతతో పలువురు సొమ్మసిల్లి పడిపోయారు. ఓ మహిళా కానిస్టేబుల్ ఎండదెబ్బకు స్పృహ తప్పారు. మరో కానిస్టేబుల్‌కు కాలు మడతపడి స్వల్పగాయాలయ్యాయి. ఎండదెబ్బకు సభకు వచ్చిన ముగ్గురు అస్వస్థతకు గురయ్యారు.

- మచిలీపట్నం/బాపట్ల/మాచర్ల రూరల్,

'కోడ్' దాటొద్దు!

- జగన్, చంద్రబాబుకు ఈసీ ఆదేశం

అమరావతి, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో హుందాగా, గౌరవంగా మాట్లాడాలని... ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించొద్దని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, టీడీపీ అధినేత చంద్రబాబును కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ప్రసంగాల్లో వారు చేసిన పలు వ్యాఖ్యలను తప్పుపట్టింది. ఇది వరకే ఇచ్చిన నోటీసులకు పంపిన వివరణలను పరిశీలించిన అనంతరం ఈ ఆదేశాలు జారీ చేస్తున్నట్లు ఎన్నికల సంఘం ముఖ్య కార్యదర్శి అవినాశ్ కుమార్ స్పష్టం చేశారు. జగన్, చంద్రబాబు ఆయా ప్రసంగాల్లో చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను ప్రస్తావించారు. సంయమనం పాటించాలని ఆదేశించారు.



పాణ్యం ప్రజాగళం సభకు హాజరైన జనం, టీడీపీ అధినేత చంద్రబాబు అభివాదం

జగన్ సీన్ అయిపోయింది!

(మొదటి పేజీ తరువాయి)

పాణ్యంలో జరిగిన ప్రజాగళం బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో ప్రస్తుతం తమ కూటమికి అన్నీ మంచి శకునాలే కనిపిస్తున్నాయన్నారు. అధికారం ఉందని విర్రవీగిన జగన్‌రెడ్డిని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అధికారంలోకి రావడానికి ఆయన అనేక నాటకాలు ఆడారని.. ఊరూరా తిరిగి ముద్దులు పెట్టారని.. తీరా గద్దెనెక్కాక బాదుళ్లు, గుద్దులు ఇస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజల భూములు, ఆస్తులు దోచేయడానికి ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తీసుకొచ్చారని దుయ్యబట్టారు. ఓ ఐఏఎస్ అధికారి కూడా ఈ చట్టం బాధితుడేనన్నారు. రైతుల భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకాలపై సీఎం ఫొటో పెట్టుకోవడంపై మండిపడ్డారు. '14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన నేను నా భూమికి సంబంధించిన పాస్ పుస్తకంపై ఈ సైకో ఫొటో పెట్టుకోవాలా' అని ప్రశ్నించారు. ఆయా చోట్ల కూటమి అభ్యర్థులను పరిచయం చేసి గెలిపించాలని అభ్యర్థించారు. బాబు ఇంకా ఏమన్నారంటే...

ఉద్యోగుల్లో కసి చూస్తున్నాం..

ప్రభుత్వ ఉద్యోగులను చూస్తుంటే నా కడుపు నిండిపోయింది. అవినీతి డబ్బుతో వారి ఓట్లు కొనడానికి వైసీపీ నాయకులు వెళ్తుంటే వారిని ఛీత్కరిస్తున్నారు. ఒంగోలులో ఒక మహిళా ఉద్యోగి టీడీపీ కూటమి క్యాంపు వద్దకు వచ్చి పది వేల రూపాయలు ఇచ్చి మరీ గెలవాలని ఆకాంక్షించారు. ఉద్యోగుల్లో ఆ కసిని చూస్తున్నాం. రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించడానికే కూటమి ఏర్పాటైంది. వైసీపీ నాయకుల గూండాగిరీని అణచివేయడానికి, రాజధాని అమరావతి, పోలవరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తి చేయడానికి, అవినీతి ప్రభుత్వాన్ని అంతం చేయడానికి, తెలుగు భాష, దేవాలయాలను కాపాడడానికి, అందరికీ న్యాయం చేయడానికే మూడు పార్టీలూ కలిశాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ధర్మవరం సభలో చెప్పారు.

కిమ్ తాత జిమ్ జగన్..

'నార్సిసిస్టిక్ పర్సనాలిటీ డిజార్డర్' అనే మానసిక వైకల్యం కలిగిన వ్యక్తి జగన్. ఇలాంటి మనస్తత్వం ఉన్నవాళ్లకు.. వాళ్లు చెప్పిందే వినాలి. ఎదురుతిరిగితే దాడులు చేస్తారు.. చంపేస్తారు. జగన్ కూడా అదే అమలు చేస్తున్నాడు. హిట్లర్, ఒసామా బిన్‌లాడెన్, అఫ్గానిస్థాన్ తాలిబన్లు, నార్త్ కొరియాలో కిమ్‌లదీ ఇలాంటి మానసిక స్థితే. కిమ్ తాత జిమ్ జగన్. చెప్పిన అబద్ధాలు చెప్పకుండా మోసం చేస్తున్నారు.

తండ్రిని చంపారన్న వాళ్లకే ఎంపీ పదవి

జగన్ విధానాలు నచ్చక వ్యతిరేకంగా మాట్లాడిన ఒక ఎంపీపై సీఐడీ కేసులు పెట్టించారు. పోలీసు కస్టడీలో ఆ ఎంపీని కొడుతుంటూ తాడేపల్లి కొంప నుంచి చూస్తూ బలే కొడుతున్నారు.. ఇంకా కొట్టమన్నాడు ఈ సైకో. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ నాటకాలాడడం ఈయనకు అలవాటు. 2014 ఎన్నికల సమయంలో తండ్రి చనిపోయాడంటూ ఊరూరా తిరిగారు. తన తండ్రిని రిలయన్స్ అధినేత చంపించాడని విమర్శించి వారి షాపులపై దాడులు చేయించిన జగన్.. ఎన్నికల తర్వాత రాజ్యసభ ఎంపీ పదవిని వారు చెప్పిన వారికి కట్టబెట్టారు. రాయలసీమలో 53 ప్రాజెక్టులను రద్దు చేశారు. ఈ ఎన్నికల్లో మనం రాయలసీమలో 52 స్థానాల్లో గెలవబోతున్నాం.. వైసీపీని భూస్థాపితం చేద్దామా..? (చంద్రబాబు అనగానే... ప్రజలు చేద్దాం చేద్దాం అని నినాదాలు చేశారు). అధికారం చేపట్టిన వెంటనే జగన్ పోలవరాన్ని సర్వనాశనం చేశారు. ఇప్పటికే రూ.13 లక్షల కోట్లు అప్పు చేశారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయా..? ఆదాయం పెరిగిందా..?

> సైకో పోవాలి.. రాష్ట్రం నిలవాలన్నది ప్రజల ఆకాంక్ష. పవన్ కల్యాణ్, అమిత్‌షా, నేను అదే చెబుతున్నాం. రాష్ట్రానికి పట్టిన శని జగన్ పోవాలన్నది పవన్ సంకల్పం. అందుకు ఆయన త్యాగాలకు కూడా సిద్ధపడ్డారు. ప్రజాజీవితంలో నిజమైన హీరో ఆయన. - చంద్రబాబు

ఉత్తరాంధ్రపై వైసీపీ నేతల పెత్తనమేంటి?

ఉత్తరాంధ్రపై వైసీపీకి చెందిన విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి వంటి నేతల పెత్తనం పెరిగింది. ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ పెత్తనం చేయడమేంటి? ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న విశాఖను వైసీపీ నాయకులు దోపిడీకి కేంద్రంగా చేసుకున్నారు. ఈ ప్రాంత భూములపై కన్నేశారు. అభివృద్ధి కుంటుపడేలా చేశారు.

నన్ను చంపేందుకు జగన్ కుట్ర..

నన్ను కూడా చంపేందుకు ఈ జగన్ కుట్ర చేశాడు. 24 క్లైమోర్ మైన్స్‌తో నాపై బ్లాస్ట్ జరిగితే సాక్షాత్తూ వేంకటేశ్వరుడు ఏడు కొండలూ దిగివచ్చి కాపాడాడు. అలాంటి నన్ను వీళ్లు ఏం చేయగలరు? ఈయన తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వల్ల ఓ ఐఏఎస్ అధికారి కూడా బాధితుడయ్యారు. 35 ఏళ్లు సేవలు చేసిన ఆ అధికారి తల్లిదండ్రుల పట్టా భూములు కూడా మ్యుటేషన్ చేసేందుకు నిరాకరించారంటే ఎంత దారుణం? ముస్లింల నాలుగు శాతం రిజర్వేషన్లు కాపాడే బాధ్యత నాది. సూపర్ సిక్స్ పథకాలు, కేంద్రం ఇచ్చే మోదీ గ్యారెంటీ ద్వారా మహిళలను లక్షాధికారులుగా మారుస్తాను. ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500 అందజేస్తాం. రూ.200గా ఉన్న సామాజిక పింఛన్‌ను 2 వేలు చేసిన ఘనత మాదే. మేం వచ్చాక ఏప్రిల్ నుంచే పెన్షన్ రూ.4 వేలు చేస్తా.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

పింఛన్ కోసం వచ్చి ప్రాణాలు కోల్పోయి...

● రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన నాగమ్మ

గన్నవరం, మే 6 : బ్యాంక్ ఖాతాలో జమైన పింఛన్ డబ్బుల కోసం వెళ్తున్న వృద్ధురాలు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందింది. ఈ విషాదకర సంఘటన గన్నవరంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం మండలంలోని గోపవరపుగూడెం గ్రామానికి చెందిన వలగాని నాగమ్మ(68) ఆమె భర్తతో కలిసి కుమారుడు రాంబాబు వద్ద ఉంటున్నారు. ఈ నేపథ్యంలో బ్యాంక్ ఖాతాలో జమైన ఈ నెల వృద్ధాప్య పింఛన్ డబ్బులు తీసుకునేందుకు ఉదయం ఆటోలో గన్నవరం బయలుదేరింది. స్థానిక ఉషోదయ సూపర్ మార్కెట్ వద్ద ఆటో దిగి రాయనగర్‌లో ఎస్‌బీఐ బ్యాంక్ వద్దకు వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుంది. అదే సమయంలో విజయవాడ నుంచి ఏలూరు వైపుగా వేగంగా వెళ్తున్న పల్సర్ బైక్ ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వృద్ధురాలి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

దళిత ఉద్యోగి ఇంటికి ఎన్నికల అధికారులు

● బాధిత కుటుంబం నుంచి స్టేట్‌మెంట్ రికార్డు



ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తున్న ఉద్యోగి సోదరుడు

పాయకాపురం, మే 6 : పాయకాపురం 63వ డివిజన్‌లో వైసీపీ నేతల దాడిలో గాయపడిన దళిత ఉద్యోగి ఇంటికి సోమవారం ఎన్నికల అధికారులు వెళ్లారు. జోనల్ కమిషనర్, ఎంసీసీ టీం సభ్యుడు కె.ప్రభుదాస్, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి డి.మాల్యాద్రి సిబ్బందితో విశాలాంధ్ర కాలనీలోని ఉద్యోగి మనోజ్‌కుమార్ నివాసానికి వెళ్లి ఆదివారం నాటి దాడి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. దాడిలో గాయపడిన ఉద్యోగి విధుల నిమిత్తం వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యుల నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. బాధితుడి భార్య, సోదరుడు నుంచి వివరాలు అడిగి తెలుసుకుని స్థానికులను విచారించారు. అనంతరం దాడిలో గాయపడిన మనోజ్‌కుమార్‌ను రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి రావాలని అధికారులు కోరడంతో ఆయన సోమవారం సాయంత్రం రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ కార్యాలయానికి వెళ్లి జరిగిన విషయాన్ని వివరించారు. అనంతరం రిటర్నింగ్ అధికారికి కూడా ఉద్యోగి మనోజ్‌కుమార్ దాడి జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశారు.

దుర్గగుడిలో అన్నవితరణకు రూ.1,11,116 విరాళం



అన్నవితరణకు విరాళం అందజేస్తున్న అనుమంచి విజయలక్ష్మి, కుటుంబసభ్యులు

వన్‌టౌన్, మే 6 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న అన్న వితరణ కార్యక్రమానికి విజయవాడ సెంట్రల్ ఎక్సైజ్ కాలనీకి చెందిన అనుమంచి విజయలక్ష్మి ఆమె కుటుంబ సభ్యులతో కలిసి రూ.1,11,116 విరాళం అందజేశారు. సోమవారం ఆలయంలోని అధికా రులకు చెక్కు రూపంలో విరాళాన్ని అందజేశారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆమెకు ప్రసాదం, చిత్రపటం, ఆశీస్సులు, శేషవస్త్రం అందజేశారు. దుర్గగుడిలో జరుగుతున్న వివిధ నిర్మాణపు పనులను ఈ వో రామరావు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. స్థపతి షణ్ముఖ శాస్త్రి, ఇంజనీరింగ్ సిబ్బందితో ఆయన వివిధ అంశాలపై మాట్లాడి తగు సూచనలు చేశారు. పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

కాపుల ఓట్లన్నీ ఎన్డీయే కూటమికే

● ఏపీ కాపు జేఏసీ నేతల పిలుపు

పెనమలూరు, మే 6 : వైసీపీ పాలనలో దగాపడ్డ రాష్ట్ర కాపులంతా వచ్చే ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి ఓట్లువేసి కాపు జాతి ప్రయోజనాలు కాపాడుకుందామని ఏపీ కాపు జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాపులతో పాటు ఇతర కులాలకు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వైసీపీ హయాంలో జరిగిన అన్యాయాలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేస్తూ కాపు జేఏసీ నేతలు సోమవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. చిత్తూరు నుండి శ్రీకాకుళం వరకు ఉన్న కాపు కులాల పెద్దలు పాల్గొని టీడీపీ జనసేన, బీజేపీ కూటమికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. చంద్రబాబు కాపులకు వెన్నుదన్నుగా ఉంటే జగన్‌రెడ్డి వెన్నుపోటు పొడిచారని దుయ్యబట్టారు. జగన్ రెడ్డి కాపులకు అసలు రిజర్వేషన్ లేదని చెప్పినా 2019లో ఓట్లు వేశారని, కానీ కాపులను జగన్‌రెడ్డి అణగదొక్కే ప్రయత్నం చేశాడు తప్ప విశ్వాసం నిరూపించుకోలేక పాయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాపులకు ఏప్రభుత్వమూ చెయ్యని విధంగా దారుణంగా వెన్నుపోటు పొడిచిన జగన్‌రెడ్డిని సాగనంపుదామని పిలుపునిచ్చారు.

చంద్రబాబును సీఎంను చేద్దాం

● బోడె ప్రసాద్, ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి



చోడవరంలో జరిగిన ప్రచార యాత్రలో బోడె ప్రసాద్, ఉండవల్లి శ్రీదేవి

పెనమలూరు, మే 6 : తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పి, తెలుగు ప్రజలు ప్రపంచానికి ఎంతో అవసరమని చాటి, ఉమ్మడి తెలుగు రాష్ట్రాన్ని ప్రపంచ పటంపై నిలబెట్టి, ఎంతోమంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను తయారుచేసి దేశవిదేశాలకు పంపిన దేశం గర్వించదగ్గ నేత చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకొందామని టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్, ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని చోడవరంలో జరిగిన ప్రచార యాత్రలో వారు పాల్గొని మాట్లాడారు. టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు కలపాల శ్రీధర్ నేతృత్వంలో జరిగిన ప్రచారయాత్రకు భారీగా ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమంలో ముప్పా రాజా, యార్లగడ్డ సుచిత్ర, హేమలత, కోయ ఆనంద్‌ప్రసాద్, కాకర్ల శ్రీనివాస్, బాలకోటేశ్వరరావు, వెలిసెల రఘు, దొండపాటి సురేష్, మొవ్వ నాని, తదితరులు పాల్గొన్నారు. కానూరు సనత్‌నగర్‌లో సోమవారం జరిగిన ప్రచారయాత్రలో బోడె హేమ, బోడె వైష్ణవి పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ సూపర్‌సిక్స్ కరపత్రాలు అందించారు.

రేపే పవన్‌కల్యాణ్ హనుమాన్‌జంక్షన్ పర్యటన

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 6 : జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఎన్నికల పర్యటన హనుమాన్‌జంక్షన్‌లో 8వ తేదీ జరుగనున్నట్టు గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు సోమవారం తెలిపారు. జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి విజయాన్ని కాంక్షిస్తూ పవన్‌కల్యాణ్ నిర్వహించే ఎన్నికల ప్రచారంలో భాగంగా హనుమాన్‌జంక్షన్ మూలకొట్టు సెంటరు వద్ద 8వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు బహిరంగసభ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు జనసేన మండల అధ్యక్షుడు వడ్డి శివనాగేశ్వరరావు తెలిపారు.

రూ. 600 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా

● బొండా ఉమామహేశ్వరరావు

ధర్నాచౌక్, మే 6 : గతంలో ఎమ్మెల్యేగా రూ.600 కోట్లతో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని తనకు మళ్లీ అవకాశమిస్తే ప్రణాళికబద్ధంగా మరింత అభివృద్ధి చేస్తానని టీడీపీ సెంట్రల్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన "మీట్ ది ప్రెస్" కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిగా మోడల్ రైతు బజారును ప్రకాష్‌నగర్‌లో ఏర్పాటు చేశామన్నారు. సత్యనారాయణపురంలో అంతిమయాత్ర భవన్‌ను నిర్మించామన్నారు. సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ రద్దీ పెరగడంతో రామకృష్ణాపురంలో బుడమేరు వద్ద ఆర్.యు.బి నిర్మించామన్నారు. 16 డివిజన్లలో ప్రాథమిక వైద్య కేంద్రాలను ఏర్పాటు చేశామని, టిడ్కోలో లక్ష ఇళ్ల ప్రతిపాదనలో 10 వేల ఇళ్లను నిర్మించామన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధానకార్యదర్శి చందు జనార్దన్, విజయవాడ అర్బన్ యూనిట్ అధ్యక్షుడు చావా రవి, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కంచల జయరాజ్ పాల్గొన్నారు.

రేపు ట్రాఫిక్ మళ్లింపు

● ప్రధాని పర్యటన నేపథ్యంలో ఇతర జిల్లాల వాహనాలకు నో ఎంట్రీ



విజయవాడ, మే 6 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన నరేంద్ర మోదీ బుధవారం నగరంలో పర్యటించనున్న నేపథ్యంలో ఆరోజు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజ్‌సర్కిల్ వరకు సాయంత్రం 6-8 గంటల మధ్య ఎలాంటి వాహనాలను అనుమతించరు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనాలు ఏలూరు రోడ్డు, కృష్ణలంక జాతీయ రహదారిపై వెళ్లాలి.

● రామవరప్పాడు నుంచి బెంజ్‌సర్కిల్ వైపు వచ్చే వాహనాలను మహానాడు జంక్షన్ నుంచి ఆటోనగర్ వైపునకు మళ్లిస్తారు. అక్కడ నుంచి ఆటోనగర్ గేటు, పటమట, ఎన్టీఆర్ సర్కిల్, కృష్ణవేణి రోడ్డు, రామలింగేశ్వరనగర్ మీదుగా వెళ్లాలి.

● ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజ్‌సర్కిల్ వరకు ఉన్న ఎంజీ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న వీధుల్లో ఎలాంటి వాహనాలను అనుమతించరు.

వాహనాల నిలుపుదల ఇక్కడ

ప్రధానమంత్రి మోదీ రోడ్డులో పాల్గొనడానికి వచ్చే ప్రముఖుల వాహనాలను నిలుపుదల చేసుకోవడానికి పోలీసులు ప్రత్యేక ప్రదేశాలను ఏర్పాటు చేశారు. వీఐపీల వాహనాలను ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం హ్యాండ్‌బాల్ కోర్టులో నిలుపుదల చేయాలి. పోలీసు అధికారులు, సిబ్బంది వాహనాలను సిటీ ఆర్మడ్ రిజర్వు గ్రౌండ్ నిలుపుకోవాలి. పార్టీ నాయకుల వాహనాల నిలుపుదలకు బిషప్ అజరయ్య పాఠశాల ప్రాంగణాన్ని కేటాయించారు. విజయవాడ వన్‌టౌన్, ఎన్టీఆర్ జిల్లాల నుంచి వచ్చే వారి వాహనాలను పోలీసు కమిషనర్ కార్యాలయం వద్ద ఉన్న సీఎస్ఐ చర్చి, రైల్వే ఫంక్షన్ హాలు ప్రాంగణంలో నిలుపుదల చేసుకోవాలి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా నుంచి వచ్చే వాహనాల కోసం మొగల్రాజపురంలోని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రాంగణాన్ని కేటాయించారు. కృష్ణా జిల్లా నుంచి వచ్చే వాహనాలను సిద్ధార్థ హోటల్‌మేనేజ్‌మెంట్ కళాశాల ప్రాంగణంలో నిలుపుదల చేయాలి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి నేతల వాహనాలను బీఆర్టీఎస్ రోడ్డులో నిలుపుదల చేయాలి. కారులు, ద్విచక్రవాహనాలను జ్యోతి కన్వెన్షన్, వేదిక కల్యాణ మండపం, ఎస్వీఎస్ కల్యాణ మండపం ప్రాంగణాల్లో నిలుపుదల చేసుకోవచ్చు.

ఇతర జిల్లాల వాహనాలు మళ్లింపు ఇలా..



● ఇతర జిల్లాల నుంచి విజయవాడ మీదుగా రాకపోలు సాగించే వాహనాలను ఎనిమిదో తేదీ మధ్యాహ్నం నుంచి అనుమతించరు. రెండు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఈ వాహనాలను దారి మళ్లిస్తారు.

● విశాఖపట్నం - హైదరాబాద్ - విశాఖపట్నం వైపునకు వెళ్లే భారీ వాహనాలను ఇబ్రహీంపట్నం వద్ద నుంచి మైలవరం, తిరువూరు, సత్తుపల్లి, అశ్వారావుపేట మీదుగా పంపుతారు.

● విశాఖపట్నం - చెన్నై - విశాఖపట్నం వైపునకు వెళ్లే వాహనాలను హనుమాన్ జంక్షన్, గుడివాడ, పామర్రు, అవనిగడ్డ, పెనుమూడి వారధి, రేపల్లె, బాపట్ల, త్రోవగుంట మీదుగా పంపుతారు.

ఆర్టీసీ బస్సుల మళ్లింపు ఇలా..



● మధ్యాహ్నం రెండు నుంచి తొమ్మిది గంటల వరకు ఎంజీ రోడ్డులో ఎలాంటి ఆర్టీసీ బస్సులను అనుమతించరు. ఈ బస్సులను ఏలూరు రోడ్డు, రామవరప్పాడు రింగ్, మహానాడు రోడ్డు, ఆటోనగర్ మీదుగా బందరు రోడ్డులోకి అనుమతిస్తారు.

● మచిలీపట్నం నుంచి పీఎన్‌బీఎస్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఆటోనగర్ గేటు, ఆటోనగర్, మహానాడు జంక్షన్, రామవరప్పాడు రింగ్, ఏలూరు రోడ్డు, పడవల రేవు, బీఆర్టీఎస్ రోడ్డు, సీతన్నపేట గేటు, ఏలూరు లాకులు, పాత ప్రభుత్వాసుపత్రి, పీసీఆర్ నుంచి పీఎన్‌బీఎస్‌కు వెళ్లాలి.

● పీఎన్‌బీఎస్ నుంచి మచిలీపట్నం వెళ్లాల్సిన బస్సులు పీసీఆర్, ఆర్టీసీ వై జంక్షన్ , స్వర్ణప్యాలస్, హనుమాన్‌పేట, ఏలూరు లాకులు, సీతన్నపేట గేటు, బీఆర్టీఎస్ రోడ్డు, పడవలరేవు, రామవరప్పాడు రింగ్, మహానాడు జంక్షన్, ఆటోనగర్ గేటు నుంచి బందరు రోడ్డులోకి పంపుతారు.

● ఏలూరు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను రామవరప్పాడు రింగ్, పడవలరేవు, బీఆర్టీఎస్ రోడ్డు, సీతన్నపేట గేటు, ఏలూరు లాకులు, పాత ప్రభుత్వాసుపత్రి రోడ్డు, పీసీఆర్ నుంచి పీఎన్‌బీఎస్‌కు వెళ్లాలి.

● పీఎన్‌బీఎస్ నుంచి ఏలూరు వైపు వెళ్లాల్సిన బస్సులు పీసీఆర్ జంక్షన్, ఆర్టీసీ వై జంక్షన్, స్వర్ణా ప్యాలస్, హనుమాన్‌పేట, ఏలూరు లాకులు, సీతన్నపేట గేటు, బీఆర్టీఎస్ రోడ్డు, పడవల రేవు, రామవరప్పాడు రింగ్ నుంచి ఏలూరుకు వెళ్లాల్సి ఉంటుంది.

దాడులకు పాల్పడి.. ఆపై దళిత ఉద్యోగిపై కేసు

● ఉద్యోగిపై దాడి చేసిన వైసీపీ నేతలపై హత్యాయత్నం, అట్రాసిటీ కేసులు నమోదు చేయాలి

● రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్లీపింగ్ మోడ్‌లో ఉంది ● బొండా ఉమా

పాయకాపురం, మే 6 : సెంట్రల్ నియోజకవర్గంలో వైసీపీ నేతల ఆగడాలు రోజు రోజుకు మితిమీరిపోతున్నాయని పోలీసుల అండ చూసుకుని అధికార పార్టీ నేతలు ఇష్టానుసారం రెచ్చిపోతున్నారని టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. మొగల్రాజపురంలోని ఆయన నివాసంలో సోమవారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాలెట్ ఓట్ల కోసం 63వ డివిజన్‌లోని దళిత ఉద్యోగి ఇంటికి వెళ్లిన వైసీపీ నేతలు మాట వినలేదని ఉద్యోగిపై దాడికి పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఇంటికి వెళ్లి ఉద్యోగిపై దాడికి పాల్పడటమే కాకుండా అదే ఉద్యోగిపై ఎదురు కేసులు పెట్టి బెదిరించడం దుర్మార్గమన్నారు. పోలీసుల అండ చూసుకునే వైసీపీ నేతలు పేట్రేగిపోతున్నారని ప్రధానంగా నార్త్‌జోన్ ఏసీపీ ప్రసాద్, నున్న రూరల్ సీఐ దుర్గాప్రసాద్ వైసీపీ నేతలకు తొత్తులుగా పని చేస్తున్నారని దుయ్యబట్టారు. దళిత ఉద్యోగి మనోజ్‌కుమార్‌పై వైసీపీ నేతలు దాడి చేస్తే సదరు ఉద్యోగిపైనే పోలీసులు ఎదురు కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ నేతల అరాచకాలపై చాలాకాలం నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నామని, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. నార్త్‌జోన్ ఏసీపీ, నున్న రూరల్ సీఐలపై పలుమార్లు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసిన రాష్ట్ర ఎన్నికల అధికారులు పెడచెవిన పెడుతున్నారని ఈ విషయమై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. దళిత ఉద్యోగిపై దాడికి పాల్పడిన కార్పొరేటర్ భర్త, మాజీ రౌడీషీటర్ గణేష్‌తో పాటుగా అతని అనుచరులపై తక్షణం హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొండా ఉమా

కేడీసీఏ పురుషుల క్రికెట్ జట్ల ఎంపిక పూర్తి

విజయవాడ స్పోర్ట్సు, మే 6 : ఉమ్మడి కృష్ణా క్రికెట్ అసోసియేషన్ అడహక్ కమిటీ (కేడీసీఏ) ఆధ్వర్యంలో 2024-25 క్రికెట్ సీజన్‌కు సీనియర్ పురుషుల వన్డే, టీ-20, అండర్-23 క్రికెట్ల జట్ల ఎంపికలను పూర్తి చేసినట్టు అడహక్ కమిటీ చైర్మన్ టి.త్రినాథ్‌రాజు, కన్వీనర్ ఎం.రవిశంకర్, క్రికెట్ హెడ్ విజయసారథి ఒక ప్రకటనలో తెలిపారు.

● **వన్డే టీమ్ :** వై.సందీప్(కెప్టెన్), ఎ.బ్రహ్మతేజ (వైస్ కెప్టెన్), సీహెచ్‌వీఎస్. కౌశిక్, వై.ప్రమోద్, వి.విశాల్, ఎం.శ్యామ్‌ప్రసాద్, ఎంఎ.ప్రణీత్, పీవీ.దుర్గారావు, ఎ.సుసమ్‌కీరత్, ఎంఎస్.నిఖిల్ నాయుడు, టి.శివకుమార్ ఎం.శుశాంత్ నాయుడు,జి చంటి, ఎం.మానస్, సీహెచ్.యోచన్, స్టాండ్‌బైలుగా పి.రూకేష్‌బాబు, జి.నిఖిల్, డి.భానుప్రకాష్, పి.అనంతకార్తికేయ, జేకే.హనుమాన్ శాస్త్రి.

● **పురుషుల టి-20 టీమ్ :** వై.సందీప్, ఎ.బ్రహ్మతేజ, సీహెచ్‌వీఎస్, కౌశిక్, వై.ప్రమోద్, వి.విశాల్, టి.వరుణ్ సాత్విక్, ఎంఎ.ప్రణీత్, పీవీ.దుర్గారావు, ఎ.సుసమ్‌కీరత్, ఎంఎస్.నిఖిల్ నాయుడు, టి.శివకుమార్, ఎం.సుశాంత్ నాయుడు, జి.చంటి, పి.రూకేష్‌బాబు, సీహెచ్.యోచన్, స్టాండ్‌బైలుగా ఎం.మానస్, జి.నిఖిల్, డి.భాను ప్రకాష్, పి.అనంత కార్తికేయ, జేకే.హనుమాన్ శాస్త్రి.

● **పురుషుల అండర్-23 జట్టు :** జి.చంటి, టి.వరుణ్ సాత్విక్, ఎం.సుశాంత్ నాయుడు, వి.విశాల్, ఎస్‌కే.ఖాజా మొహిద్దీన్, పీవీ.దుర్గారావు, సీహెచ్.యోచన్, ఎం.మానస్, బి.గీత్, జి.నిఖిల్, జేకే.హనుమాన్ శాస్త్రి, ఎన్.రాజేష్, ఎన్.భాను వరప్రసాద్, కేఎస్ఎన్. నిశ్చయ్, ఆర్.యశ్వంత్, స్టాండ్‌బైలుగా టి.సాయి ప్రకాష్, పి.అనంతకార్తికేయ, బి.బార్గవ్, టి. హర్ష సాయి సాత్విక్.

యువతకు ఉపాధి కల్పించటమే లక్ష్యం

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ● సావరగూడెం, వీరపనేనిగూడెం, మెట్లపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

గన్నవరం, మే 6 : యువతకు ఉపాధి కల్పించేందుకు గన్నవరం నియోజకవర్గంలో కారిడార్లు పుష్కలంగా ఉన్నాయని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగ పరిచి 20వేల మందికి ఉపాధి కల్పిస్తానని తెలిపారు. సాగు, తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తానని భరోసా ఇచ్చారు. మండలంలోని సావరగూడెం, వీరపనేనిగూడెం, మెట్లపల్లి గ్రామాల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి తనయుడు అరుణ్‌శౌరి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో మహిళలు అడుగడుగున హారతులిచ్చి బ్రహ్మరథం పట్టారు. స్థానిక సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. వీరపనేనిగూడెంలో క్రేన్ ద్వారా భారీ గజమాలను వేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కి వెళ్లిందన్నారు. బ్రహ్మయ్యలింగం చెరువును రిజర్వాయర్ చేసి 12వేల ఎకరాలకు తాగు, సాగునీరు అందిస్తానని తెలిపారు. అర్హులైన 15వేల మందికి ఇళ్ల స్థలాలు అధికారంలోకి వచ్చిన 9 మాసాల్లో ఇస్తానని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, ఆరుమళ్ల కృష్ణారెడ్డి, కొండేటి వెకటేశ్వరరావు, గుర్రం గోపి, ధారావత్ మౌలా నాయక్, రెడ్డి మనోజ్, కాగితాల సురేంద్ర, చిన్నిపాములు, చీమలదండు రామకృష్ణ, జనసేన, బీజేపీ తదితరులు పాల్గొన్నారు.



వీరపనేనిగూడెంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుకు గజమాల వేస్తున్న నాయకులు

● **పేదల సొంతింటి కల నిజం చేస్తా**

గుణదల, మే 6: పేదల సొంతింటి కలను సాకారం చేసే విషయమై పూర్తి బాధ్యత తీసుకుంటానని గన్నవరం నియోజకవర్గం కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఎనికేపాడు గ్రామంలో సోమవారం ఇంటింటికి వెళ్ళి ఓట్లు అభ్యర్థించారు.

ఘనంగా సంతోష్ హోండా వార్షికోత్సవం



కస్టమర్‌కు బహుమతి అందజేస్తున్న చుక్కపల్లి శ్రీకాంత్, జగన్మోహనరావు

పాయకాపురం, మే 6 : సంతోష్ హోండా పది సంవత్సరాలు ముగించుకుని 11వ సంవత్సరంలో అడుగుపెడుతున్న శుభ సందర్భంగా కస్టమర్ దేవుళ్లకు సంతోష్ హోండా మేనేజింగ్ డైరెక్టర్ చుక్కపల్లి శ్రీకాంత్, చైర్మన్ చుక్కపల్లి జగన్మోహనరావు లు అన్నారు. నగరంలోని సంతోష్ హోండా షోరూం వద్ద సోమవారం సాయంత్రం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంలో వారు మాట్లాడుతూ సంతోష్ హోండా 11వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా కస్టమర్ దేవుళ్లకు లక్కీ డ్రా నిర్వహించి ఎన్నో అద్భుతమైన బహుమతులు అందజేసామన్నారు. దానిలో భాగంగానే బంపర్ ప్రైజులైన రిఫ్రిజిరేటర్, ఏసీ, లాప్‌టాప్, టీవీ, మారుతి ఆల్టో కారును లక్కీ డ్రా ద్వారా కస్టమర్‌లకు అందజేయడం జరిగిందన్నారు. సంతోష్ హోండాను పదేళ్ల నుంచి ప్రోత్సహిస్తున్న కస్టమర్ దేవుళ్లకు కృతజ్ఞతలు తెలిపారు.

సాయితేజ్‌పై దాడి జరిగితే పోలీసుల స్పందన ఏది?

● గులకరాయి తగిలితే హత్యాయత్నం పెడతారా? ● తూర్పు నియోజకవర్గం కూటమి అభ్యర్థి గద్దె రామ్మోహనరావు

గుణదల, మే 6: ముఖ్యమంత్రికి ఒక న్యాయం ఎదుటి వారికి మరో న్యాయం అని తెలియజేయడానికి తాజాగా సాయి ధరమ్ తేజ్‌పై ఆదివారం జరిగిన దాడికి పోలీసుల నుంచి స్పందన లేకపోవడమే నిదర్శనమని తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దే రామ్మోహనరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గద్దె రామ్మోహనరావు స్థానిక ఐదవ డివిజన్ పరిధిలోని గుణదల గంగిరెద్దుల దిబ్బ ఏరియాలో సోమవారం ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ముందుగా స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కల్వరి స్కూల్ వద్దగల అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను ఉద్దేశించి మాట్లాడుతూ...బస్సు యాత్ర చేస్తున్న వైఎస్ జగన్‌మోహనరెడ్డిపై గులకరాయితో దాడి చేశారని మైనర్ అయిన బీసీ బిడ్డపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారన్నారు. ఎన్నికల ప్రచారం చేస్తున్న సమయంలో సాయి ధరమ్ తేజ్‌పై రాళ్లతో దాడి చేస్తే మాత్రం పోలీసుల నుంచి స్పందన లేకపోగా కేసులు కూడా లేకపోవడం దారుణం అన్నారు. ఈ విషయమై జగన్ రెడ్డి ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. సాయి ధరమ్ తేజ్‌పై దాడి దృశ్యాలు సిసి కెమెరాల్లో స్పష్టంగా నమోదయినా ప్రయోజనం లేకపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.



గుణదల గంగిరెద్దుల దిబ్బ ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్న తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు

జగన్ పత్రికపై పరువు నష్టం దావా వేస్తాం

● బీజేపీ నేతలు పైలా, పోతిన, అడ్డూరి

విద్యాధరపురం, మే 6 : అభూత కల్పనల రాతలు రాస్తున్న జగన్ పత్రికపై పరువునష్టం దావా వేస్తామని బీజేపీ నాయకులు పైలా సోమినాయుడు, పోతిన బేసికంటేశ్వరుడు, అడ్డూరి శ్రీరామ్‌లు వెల్లడించారు. భవానీపురంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పశ్చిమ నియోజకవర్గంలో గెలుపు ఏకపక్షం కానుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం రానుందని తట్టుకోలేక తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్‌లో అవాస్తవ కథనాలు అల్లుతున్నారని దుష్ప్రచారం చేస్తున్నారని నగరాల కులస్తులందరూ ఐక్యంగా ఉండి సుజనా చౌదరి గెలుపునకు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని విమర్శించారు. పత్రికలో కథనాలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు.

మ్యుటేషన్ కష్టాలు

● భూమిని అమ్మిన వ్యక్తే రికార్డుల్లో యజమాని ● 3.69 ఎకరాలు 3.09 అయింది

● 1(బి)లో కొనుగోలు చేసిన వ్యక్తి పేరు ● అడంగళ్‌లో భూమిని అమ్మిన వ్యక్తి పేరు

విజయవాడ, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఆస్తిని కొనుగోలు చేయగానే ఆటోమ్యుటేషన్ జరగాలి. కానీ అందుకు భిన్నంగా విక్రయించిన వ్యక్తే యజమానిగా వుండటం కొనుగోలుదార్లను కష్టాలపాల్జేస్తోంది. పైగా కొనుగోలు చేసింది 3.69 ఎకరాలైతే 3.06కు తగ్గిపోవడం మరో విడ్డూరం. ఆటో మ్యుటేషన్‌లో ఇలా వుంటే ఇక ల్యాండ్ టైట్లింగ్ వస్తే ఇంకెన్ని కష్టాలు పడాల్సి వుంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. నగరంలోని అయ్యప్పనగర్‌కు చెందిన నబిగారి వెంకటేశ్వరావుకు మైలవరం మండలం గణపవరంలో 3.69 ఎకరాల పొలం ఉంది. దానిని పెనమలూరు మండలం పెదపులిపాక గ్రామానికి చెందిన ముసునూరు శ్రీధర్ తన భార్య విజయలక్ష్మి పేరున కొనుగోలు చేశారు. గత ఏడాది డిసెంబరులో దస్తావేజు నంబర్ 8240/2023 ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రిజిస్ట్రేషన్ జరిగిన 15 రోజుల తర్వాత శ్రీధర్ 1(బి) కోసం రెవెన్యూ శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ రికార్డుల్లో సర్వేనంబరు 251ఎ, 251బిల్లో ఉన్న 3.69 ఎకరాల భూమి శ్రీధర్ భార్య విజయలక్ష్మి పేరున ఉన్నట్టు చూపించారు. గడచిన ఏప్రిల్ నెలలో ఈ భూమి శ్రీధర్ వేరొకరికి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. దీని కోసం కొద్దిరోజుల క్రితం ప్రైవేటు సర్వేయర్‌తో భూమిని కొలిపించారు. సర్వే చేసిన సర్వేయర్ రికార్డులను చూసి భూమి విజయలక్ష్మి పేరున లేదని, పైగా దస్తావేజుల్లో పేర్కొన్న భూమికి, అడంగళ్ రికార్డులో ఉన్న భూవికి వ్యత్యాసం ఉందని చెప్పడంతో కొనుగోలు చేసిన వ్యక్తి షాక్ తిన్నారు. ఎల్పీ నంబర్ 1153తో ఈ భూమి ఇంకా నబిగారి వెంటేశ్వరరావు పేరుపైనే ఉంది. పైగా భూమి 3.69 ఎకరాలు ఉండగా, ఇందులో 3.09 ఎకరాలు భూమి ఉన్నట్టు చూపించారు. 60 సెంట్ల భూమిని లెక్కల్లో మాయం చేశారు. దీంతో శ్రీధర్ వెంటనే తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ తహసీల్దార్, సర్వేయర్ అంతా ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత వస్తే సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో శ్రీధర్‌కు ఏం చేయాలో తెలియలేదు. అసలు రికార్డుల్లో తన భార్య పేరు కాకుండా విక్రయించిన వ్యక్తి పేరు ఎలా ఉంటుందని శ్రీధర్ ప్రశ్నించగా కొద్దిరోజుల క్రితమే రీసర్వే చేశామని రెవెన్యూ అధికారులు చెప్పినట్టు తెలిపారు. తమ భూమిలో తమకు తెలియకుండా అధికారులు ఎలా రీసర్వే చేస్తారని శ్రీధర్ ప్రశ్నించారు.

ఇంజనీరింగ్ కళాశాలలో వైసీపీ ప్రచారం



విజయసాయిరెడ్డి మాస్కులు ధరించిన విద్యార్థినులు

గూడూరు అర్బన్, మే 6: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఇంజనీరింగ్ కళాశాలను అధికార వైసీపీ ఎన్నికల ప్రచార వేదికగా మార్చేసింది. తిరుపతి జిల్లా గూడూరులోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం యూత్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నెల్లూరు ఎంపీ వైసీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి ముఖ్యఅతిథిగా 'సాధికారత, స్థిరత్వంపై' విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమం రాజకీయ వేదికగా మారింది. సమావేశంలో విద్యార్థులు విజయసాయిరెడ్డి మాస్కులను ధరించడం, ఓ అధ్యాపకుడు విజయసాయిరెడ్డికి రాజకీయ ప్రచారం చేయడం, దిశ చట్టానికి చెందిన సభ్యురాలు జై జగన్ నినాదాలు చేయడం, వైసీపీ పాటలు వేయడంపై విమర్శలు వచ్చాయి.

ఆర్యవైశ్యులను అణగదొక్కిన జగన్: డూండి

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): 'గత ఐదేళ్లలో ఆర్యవైశ్యులను అణగదొక్కడం, ఇబ్బంది పెట్టడమే జగన్ కర్తవ్యంగా ఉంది. రాష్ట్రంలో ఆర్యవైశ్యుల ఉనికి పోగొట్టడమే లక్ష్యంగా జగన్ వైఖరి ఉంది' అని టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షులు డూండి రాకేశ్ ఆరోపించారు. వైసీపీకి ఆర్యవైశ్యులంటే ఎందుకంత చులకన అని ఆయన ప్రశ్నించారు.

టీడీపీ రాష్ట్ర కమిటీలో మరికొందరికి చోటు

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కమిటీలో మరో ఏడుగురికి చోటుదక్కింది. కార్యనిర్వాహక కార్యదర్శులుగా జీవీఎన్ శేఖర్‌రెడ్డి (కోవూరు), కసుకుర్తి హనుమంతరావు(గుంటూరు పశ్చిమ), మన్నెం శ్రీనివాసులు నాయుడు(తిరుపతి), కొండవీటి భావన(అనంతపురం), కార్యదర్శులుగా గుల్లపల్లి సుదర్శన్‌రావు(కురుపాం), తోట రత్నం(విశాఖ పశ్చిమ), రాయల్ మురళీ (అనంతపురం)ను, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శిగా అనిల్ చౌదరి (కళ్యాణదుర్గం)ని నియమిస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సోమవారం ప్రకటించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్‌ను చింతలపూడి ఎన్నికల సమన్వయకర్తగా నియమించారు.

వైసీపీ అరాచకాలపై ఎన్నారై మహిళల సమరశంఖం

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచకాలపై మేము సైతం అంటూ ఎన్నారై మహిళలు సమరశంఖం పూరించారు. అమెరికాలోని వాషింగ్టన్ డీసీ వర్జీనియాలో ఈ మేరకు సోమవారం సమావేశం నిర్వహించారు. ఎన్నారై మహిళా నేతలు పాలడుగు సాయిసుధ, గోరంట్ల మంజూష, మన్నవ అనిత, పూసల సింధు, పారుపల్లి శాంతి, మండవ నీలిమ తదితరులు మాట్లాడుతూ, స్వస్థలాలకు వెళ్లగలిగిన వారు టీడీపీకి ఓటేసి, చంద్రబాబు విజయానికి దోహదపడాలని కోరారు.

పెన్షనర్ల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే: కనకమేడల

న్యూఢిల్లీ, మే 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పింఛన్లు పంపిణీ చేయకుండా పింఛనుదారులను వైసీపీ ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పింఛన్ల విషయంలో రాజకీయ ప్రయోజనాల కోసం ఇతర పార్టీలపై వైసీపీ అసత్యప్రచారం చేయడం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు.

విట్ పరీక్షలు వాయిదా వేయాలి: వర్ల

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): ఏపీలో కొత్త ఓటర్లుగా నమోదై, తమిళనాడులోని విట్ యూనివర్సిటీలో చదువుకుంటున్న విద్యార్థులకు మే 14న పెడుతున్న పరీక్షలను వాయిదా వేయాలని టీడీపీ నేతలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి విజ్ఞప్తి చేశారు. మే 13న ఓటు వేసి, మరుసటి రోజే తమిళనాడు వెళ్లి పరీక్షలు రాయడం కష్టమని సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. అందువల్ల పరీక్షలను కొన్ని రోజులు వాయిదా వేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం అమరావతి సచివాలయంలో టీడీపీ నేతల బృందం సీఈవోను కలిసి, పలు అంశాలపై ఫిర్యాదులిచ్చారు.

'పల్నాడు'లో పిడుగుపాటుకు ఇద్దరు మృతి

అచ్చంపేట, మే 6: పల్నాడు జిల్లాలో పిడుగుపాటుకు గురై ఇద్దరు మృతి చెందారు. అచ్చంపేట మండలం పెదపాలెం గ్రామానికి చెందిన దంతాల లక్ష్మీనారాయణ(55), మాదిపాడు పంచాయతీ పరిధి గింజుపల్లి తండాకు చెందిన ధరావత్తు బాబునాయక్(62) సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంలో పిడుగుపాటుకు గురై మరణించారు.

అరెస్ట్ భయంతో యువకుడి ఆత్మహత్యాయత్నం

మర్రిపూడి, మే 6: పోలీసులు అరెస్ట్ చేస్తారన్న భయంతో పోలీస్ వాహనం ఎదుట ఓ యువకుడు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం గార్లపేట గ్రామానికి చెందిన గుమ్మళ్ల వెంకటేష్ మూడురోజుల క్రితం ట్రాక్టర్‌పై వెళుతుండగా కనిగిరి మండలం ఎనిమిరెడ్డిపల్లెకు చెందిన దంపతులు బైక్‌పై వస్తూ ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపుతప్పి పడిపోయారు. వారి మధ్య మాటామాట పెరగడంతో వెంకటేష్‌పై దంపతులతో పాటు మరికొందరు దాడి చేశారు. వెంకటేష్ ఆదివారం సాయంత్రం కొందరు యువకులను వెంటబెట్టుకొని ఎనిమిరెడ్డిపల్లెకు వెళ్లి తనను కొట్టిన దంపతులపై తిరిగి దాడి చేశాడు. గ్రామస్థులు వారిలో ముగ్గురిని పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వారిని తీసుకుని వస్తుండగా వెంకటేష్ తనను అరెస్ట్ చేసేందుకు వస్తున్నారని భయపడి ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పు అంటించుకున్నాడు. తీవ్రగాయాలతో ఉన్న వెంకటేష్‌ను మెరుగైన వైద్యంకోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

'కోడ్'కు జెల్లకొట్టి..

- 61 మంది సీనియర్ వైద్యుల ఆకస్మిక బదిలీ
- ఈసీ అనుమతించడంపై విమర్శలు



అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): వైద్యులకు ముందస్తు సమాచారం ఇవ్వలేదు.. ఆప్షన్లు అడగలేదు.. కానీ కోడ్ అమలులో ఉండగానే అకస్మాత్తుగా 61మంది సీనియర్ వైద్యుల్ని ప్రభుత్వం బదిలీ చేసింది. వైద్యులంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా.. వారి మెడమీద కత్తి పెట్టి.. బదిలీ స్థానాల్లో చేరాల్సిందేనని ఒత్తిడి తెస్తోంది! ముందస్తు కార్యాచరణ లేకుండా ఆరోగ్యశాఖ అధికారులు ఈ ఏడాది కొత్త మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం ఎన్ఎంసీకి దరఖాస్తు చేసేయడం, ఇంతవరకు వైద్యుల నియామకం చేపట్టకపోవడమే ఇందుకు కారణం. వాస్తవానికి 17 మెడికల్ కాలేజీలూ 2021 నాటికి పూర్తి చేస్తామని జగన్ అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రగల్భాలు పలికినా.. ఇప్పటికీ వాటి నిర్మాణం పూర్తి కాలేదు. ఆరు నెలల క్రితం అతి కష్టం మీద 5కాలేజీల్లో అడ్మిషన్లు పూర్తి చేసినా.. నిర్మాణాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పుడు మరో 5కాలేజీల్లో అడ్మిషన్లకు కసరత్తు చేస్తున్నారు. పాడేరు, మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని కాలేజీల్లో ఎంబీబీఎస్ అడ్మిషన్లకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికీ ఆయా కాలేజీల్లో పూర్తిస్థాయిలో నిర్మాణాలు జరగలేదు. దీంతో 150 ఎంబీబీఎస్ సీట్లు కాస్త 100సీట్లకు ప్రభుత్వమే కుదించుకుని అడ్మిషన్లు చేసేద్దామని హడావుడి చేస్తోంది. డీఎంఈ అధికారులు కూడా ముందూవెనుకా ఆలోచించకుండా ప్రభుత్వం చెప్పిందే గుడ్డిగా ఫాలో అయిపోతున్నారు. రెండోఫేజ్‌లో అడ్మిషన్ల కోసం ప్రయత్నం చేస్తున్న పాడేరు, మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని వైద్యుల నియామకానికి డీఎంఈ అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. కానీ ప్రభుత్వంపై నమ్మకం లేక వైద్యులెవ్వరూ కొత్త కాలేజీల్లో చేరడానికి రాలేదు. వైద్యసిబ్బంది లేకపోతే అడ్మిషన్లు నిలిచిపోతాయి. కానీ అనుమతుల కోసం దరఖాస్తు చేయడంతో ఎన్ఎంసీకి తనిఖీలకు సిద్ధమైపోయింది. కొత్త నియామకాలు చేపట్టడంలో విఫలమైన ప్రభుత్వం.. పాత వారినే కొత్త కాలేజీలకు పంపించేద్దామంటూ వైద్యుల ఆకస్మిక బదిలీలకు తెరతీసింది. బదిలీల్లో భాగంగా పాడేరు మెడికల్ కాలేజీకి విశాఖ ఆంధ్ర మెడికల్ కాలేజీ నుంచి, మదనపల్లెకి తిరుపతి నుంచి, మార్కాపురానికి విజయవాడ, గుంటూరు నుంచి, ఆదోనికి కర్నూలు మెడికల్ కాలేజీల సిబ్బందిని బదిలీ చేసేశారు. ఒక ఉద్యోగిని ఒక చోటు నుంచి మరో చోటుకు బదిలీ చేసే సమయంలో సదరు ఉద్యోగి నుంచి ఆప్షన్ తీసుకోవాలి. లేదంటే కనీస సమాచారం ఇవ్వాలి. డీఎంఈ అధికారులు కనీసం ఈ నిబంధనలు పాటించకుండా ఇలా అకస్మాత్తుగా 61 మంది సీనియర్ వైద్యులను కొత్త కాలేజీలకు బదిలీ చేసేశారు. ప్రొఫెసర్లు 12 మంది, అసోసియేట్ ప్రొఫెసర్లు 15, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 34 మందిని బదిలీ చేసేశారు.

పీక మీద కత్తిపెట్టి..

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచే వైద్యులతో ఫుట్‌బాల్ ఆడుకుంటోంది. ఐదేళ్ల నుంచి ప్రభుత్వం చేసిన బదిలీల పుణ్యమా అని వైద్యులు కుటుంబాలను వదిలేసి నెలల తరబడి వివిధ జిల్లాల చుట్టూ తిరుగుతున్నారు. తాజాగా బదిలీ చేసినవారిలో కొంత మందికి అనారోగ్య సమస్యలు, మరికొంత మందికి ఇతరత్రా అనేక సమస్యలున్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకోకుండానే ఆకస్మిక బదిలీలు చేసేశారు. సోమవారం ఉదయం చాలామంది వైద్యులు డీఎంఈ కార్యాలయానికి వచ్చిన వారి సమస్యలను విన్నవించారు. డీఎంఈ డాక్టర్ నరసింహం మాత్రం.. ఇదంతా తాత్కాలిక బదిలీలేనని, కొన్ని రోజుల తర్వాత వెనక్కి పంపించేస్తామని చెప్పుకొచ్చారు. అయితే, ఆ విషయాన్ని ఉత్తర్వుల్లో పేర్కొనాలని వైద్యుల కోరగా సమాధానం లేదు. కాగా, ఫేజ్- 2 లో ఐదు కాలేజీల్లో అడ్మిషన్లకు డీఎంఈ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. బదిలీల విషయానికి వచ్చే సరికి కేవలం నాలుగు కాలేజీలకు వైద్యులను బదిలీలు చేశారు. పులివెందుల కాలేజీకి మాత్రం ఒక్కరిని కూడా బదిలీ చేయలేదు. పులివెందుల్లో కూడా వైద్య సిబ్బంది కొరత ఉంది. ఇప్పుడు కడప లేదా అనంతపురం నుంచి వైద్యులను పులివెందుల మెడికల్ కాలేజీకి బదిలీ చేస్తే ఎన్నికల సమయం కనుక ప్రభుత్వానికి నెగెటివ్ అవుతుందని, ప్రత్యక్షంగా జగన్‌కు నష్టం వాటిల్లుతుందని.. ఆ కాలేజీకి కొత్త వారిని బదిలీ చేయలేదు. మిగిలిన నాలుగు కాలేజీలకు మాత్రం వైద్యులను బదిలీ చేసేశారు.

కేజ్రీవాల్‌పై ఎన్ఐఏ దర్యాప్తు

సిఫార్సు చేసిన లెఫ్టినెంట్ గవర్నర్.. కేంద్ర హోం శాఖకు లేఖ

- ఉగ్రవాది విడుదలకు ఖలిస్థాన్ సంస్థ నుంచి నిధులు తీసుకున్నట్టు ఆరోపణలు



న్యూఢిల్లీ, మే 6: మద్యం విధానం కుంభకోణం కేసులో ఇప్పటికే సీబీఐ, ఈడీ విచారణలను ఎదుర్కొంటున్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఇకపై మరో అంశంలో ఎన్ఐఏ దర్యాప్తును ఎదుర్కొనే సూచనలు కనిపిస్తున్నాయి. ఖలిస్థాన్‌కు అనుకూలంగా ఉండే నిషేధిత తీవ్రవాద సంస్థ సిక్స్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే) నుంచి రాజకీయ విరాళాలు తీసుకున్నారంటూ అందిన ఫిర్యాదుపై ఎన్ఐఏతో దర్యాప్తు చేయించాలని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా సిఫార్సు చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం కేంద్ర హోం శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. జైలు శిక్ష అనుభవిస్తున్న ఖలిస్థాన్ తీవ్రవాది దేవేంద్ర పాల్ భుల్లర్‌ను విడుదల చేయించడంతో పాటు, ఖలిస్థాన్ సెంటిమెంట్లను రెచ్చగొట్టేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ ఆ తీవ్రవాద సంస్థ నుంచి 16 మిలియన్ డాలర్లు (సుమారు రూ.135 కోట్లు) తీసుకున్నట్టు వరల్డ్ హిందూ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆషూ మోగియా గతంలో ఫిర్యాదు చేశారు. దాన్ని ఆధారం చేసుకొని సక్సేనా ఈ లేఖ రాశారు. 2014 నుంచి 2022 వరకు ఆమ్ ఆద్మీ పార్టీకి ఖలిస్థాన్ గ్రూపుల నుంచి 16 మిలియన్ డాలర్లు విరాళాలుగా అందాయని పేర్కొంటూ ఖలిస్థాన్ ఉగ్రవాది, సిక్స్ ఫర్ జస్టిస్ వ్యవస్థాపకుడు గురుపత్వంత్ సింగ్ పన్నూన్ విడుదల చేసిన వీడియోను కూడా ఈ లేఖలో ప్రస్తావించారు. ప్రొఫెసర్ భుల్లర్‌ను జైలు నుంచి విడుదల చేయాలని ఆప్ ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రపతికి సిఫార్సు చేసిందని ఆ లేఖలో రాశారు. 1993లో ఢిల్లీలోని యువజన కాంగ్రెస్ కార్యాలయం వద్ద బాంబు దాడి జరిగిన ఘటనలో భుల్లర్ జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. ఆ సంఘటనలో తొమ్మిది మంది మరణించగా, 31 మంది గాయపడ్డారు. జర్మనీలో ఉన్న అతడ్ని 1995లో తీసుకువచ్చి అరెస్టు చేశారు. అప్పటి నుంచి అతడు తిహాడ్ జైలులో ఉన్నాడు. ట్రయల్ కోర్టు అతనికి 2001లో మరణశిక్ష విధించగా, 2014లో ఉన్నత న్యాయస్థానం దాన్ని యావజ్జీవ కారాగార శిక్షగా తగ్గించింది. అతని విడుదల కోసం కేజ్రీవాల్ న్యూయార్క్‌లోని గురుద్వారా రిచ్‌మాండ్ హిల్స్‌లో వేర్పాటువాదులను కలిసినట్టు, వారి నుంచి నిధులు తీసుకున్నట్టు ఫిర్యాదు అందినందున ఎన్ఐఏ దర్యాప్తునకు లెఫ్టినెంట్ గవర్నర్ సిఫార్సు చేశారు. న్యూయార్క్ గురుద్వారాలో ఖలిస్థాన్ అనుకూల వ్యక్తులతో కేజ్రీవాల్ భేటీ అయిన ఫొటోను ఆప్ మాజీ కార్యకర్త మునీష్ కుమార్ రైజాదా అప్పట్లో ట్విటర్‌లో పెట్టారు. దాన్ని కూడా లేఖలో పేర్కొన్నారు. వీటన్నింటిపై ఫోరెన్సిక్ పరీక్షలతో పాటు, సమగ్ర దర్యాప్తు జరగాల్సి ఉందని తెలిపారు.

మరో కుట్ర

దీనిపై ఆప్ స్పందిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ బీజేపీ ఏజెంటని, ఢిల్లీలోని మొత్తం ఏడు స్థానాల్లో ఆ పార్టీ ఓడిపోతుందని తెలిసి కేజ్రీవాల్‌పై మరో పెద్ద కుట్రకు తెరతీశారని వ్యాఖ్యానించింది. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఇలాంటి ప్రయత్నం జరిగిందని ఆ పార్టీ నాయకుడు, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ చెప్పారు.

చైనా సీ డ్రాగన్.. ఫ్యూజియాన్

విమానవాహక యుద్ధ నౌక సీ ట్రయల్స్ ప్రారంభం



బీజింగ్, మే 6: సంఖ్యాపరంగా ఇప్పటికే ప్రపంచంలోనే అతి పెద్ద నౌకాదళ శక్తిగా ఉన్న చైనా.. తన బలాన్ని ఇతోధికంగా పెంచుకునే క్రమంలో మూడో విమాన వాహక యుద్ధనౌక ఫ్యూజియాన్‌ను రంగంలోకి దించింది! ప్రపంచంలోనే అతిపెద్దదైన అమెరికా విమానవాహక యుద్ధ నౌక 'యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్'లో మాత్రమే ఉన్న 'ఈమాల్స్ (ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ లాంచ్ సిస్టమ్)'తో చైనా దీన్ని రూపొందించడం విశేషం. ప్రపంచ కార్మికులంతా మేడే సంబరాలు జరుపుకొంటున్న మే ఒకటో తేదీన.. ఈ ఫ్యూజియాన్ సీ ట్రయల్స్‌ను ప్రారంభించింది. ట్రయల్స్‌లో భాగంగా.. ఆ యుద్ధనౌకలోని ప్రొపల్షన్, విద్యుత్ వ్యవస్థల పనితీరును, స్థిరత్వాన్ని చైనా రెండేళ్లపాటు పరీక్షించి, ఐదేళ్లలో తన నౌకాదళానికి అందుబాటులోకి తేనుంది. దీని బరువు దాదాపు 80 వేల టన్నులు. పొడుగు 1036 అడుగులు. ఫ్యూజియాన్ కన్నా ముందు.. చైనా వద్ద రెండు విమాన వాహక యుద్ధ నౌకలున్నాయి. మొదటిది.. లియావోనింగ్. 1998లో చైనా దీన్ని ఉక్రెయిన్ నుంచి కొనుగోలు చేసి దేశీయంగా రీఫిట్ చేసుకుంది. దాంట్లో తనకు కావాల్సిన విధంగా మార్పుచేర్పులు చేసుకుంది. ఆ తర్వాత మళ్లీ రెండు దశాబ్దాలకు.. 2019లో షాంగ్‌డాంగ్ అనే దేశీయ విమాన వాహక యుద్ధనౌకను తన నేవీకి అందుబాటులోకి తెచ్చింది. ఆ రెండింటికన్నా సాంకేతికంగా అత్యంత అధునాతనమైనది ఈ ఫ్యూజియాన్ యుద్ధ నౌక. అత్యంత అధునాతనమైన 'ఈమాల్స్'తో చైనా మూడో ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌ను రంగంలోకి దించడం భారత్‌కు ఆందోళన కలిగించే విషయమే.

ఇఫ్కోకు భూ కేటాయింపులు సక్రమమే

- హైకోర్టు ధర్మాసనం కీలక తీర్పు

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా, కొత్తూరు గ్రామం పరిధిలో యురియా ప్లాంట్ ఏర్పాటు కోసం కేటాయించిన భూములను ఇఫ్కో సంస్థ వ్యవసాయ ఉత్పత్తులు, ఫుడ్ ప్రాసెసింగ్ యునిట్లు నెలకొల్పేందుకు వినియోగించడాన్ని హైకోర్టు సమర్థించింది. ఎరువుల ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు కేంద్రం అనుమతి నిరాకరించడంతో కిసాన్ ఎస్ఈజెడ్ ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వమే అనుమతులు ఇచ్చిందని గుర్తు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధంగా, హక్కులకు విఘాతం కలిగించేలా ఉన్నప్పుడు మాత్రమే కోర్టులు జోక్యం చేసుకోగలవని పేర్కొంది. ప్రస్తుత కేసులో రాష్ట్ర ప్రభుత్వమే అనుమతి ఇచ్చినందున తాము కలగజేసుకోలేమని స్పష్టం చేసింది. కోదండరామస్వామి దేవస్థానానికి చెందిన భూమిగా చెప్పబడుతున్న 1,009.91 ఎకరాలతో ఆలయానికి ఏ సంబంధం లేదని, దీనిని ప్రభుత్వ భూమిగా నిర్ధారిస్తూ ఫిబ్రవరిలో హైకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేసింది. రైతుల ప్రయోజనాల నిమిత్తం ఎరువుల ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినందున ఇఫ్కో కోసం చేసిన భూకేటాయింపులు ప్రజా ప్రయోజనం నిర్వచనం పరిధిలోకి వస్తాయని పేర్కొంది. ప్రైవేటు ప్రయోజనం కోసం ప్రభుత్వం భూములు కేటాయించిందన్న పిటిషనర్ వాదనను తోసిపుచ్చింది. ఇఫ్కోకు భూకేటాయింపుల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం స్విస్ ఛాలెంజ్ విధానం అనుసరించి ఉండాల్సిందన్న పిటిషనర్ల వాదనపై అభ్యంతరం తెలిపింది. ఇఫ్కోకు బహిరంగ వేలం ద్వారా భూములు కేటాయించి ఉంటే రాష్ట్ర ప్రభుత్వానికి మరింత ఆదాయం వచ్చేదన్న పిటిషనర్ వాదనను తోసిపుచ్చుతూ వ్యాజ్యాలను కొట్టివేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం సోమవారం తీర్పు ఇచ్చింది. యూరియా ప్లాంట్ ఏర్పాటు కోసం నెల్లూరు జిల్లా, కొత్తూరు గ్రామం పరిధిలోని శ్రీ కోదండరామస్వామి దేవాలయానికి చెందిన 1009 ఎకరాలతో పాటు కొడవలూరు మండలం పరిధిలోని బొడ్డవారిపాలెం, రేగడిచెలిక, రాచర్లపాడు, తలమంచి తదితర గ్రామాల రైతులకు చెందిన పట్టా భూములు కలిపి మొత్తం 2776 ఎకరాలను ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్స్ కో ఆపరేటివ్ లిమిటెడ్(ఇఫ్కో)కు ఇచ్చారు. యూరియా, అమోనియా ప్లాంట్ ఏర్పాటులో ఎలాంటి పురోగతి లేదని, భూకేటాయింపుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని పేర్కొంటూ కొడవలూరు మండలం అప్పటి జడ్పీటీసీ సభ్యుడు ఈ శ్రీధర్‌రెడ్డితో పాటు మరో ముగ్గురు 2017లో హైకోర్టులో పిల్ వేశారు. ఈ వ్యవహారాన్ని సీబీఐ చేత దర్యాప్తు చేయించాలని అభ్యర్థించారు. మరోవైపు తమకు ఎలాంటి పరిహారం చెల్లించకుండానే భూములు సేకరించి ఇఫ్కోకు కేటాయించారని, తమకు పరిహారం చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కే సుశీలమ్మ, మరో 120 మంది పిటిషన్లు వేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం సోమవారం నిర్ణయాన్ని వెల్లడించింది. పిటిషనర్ల వాదనను తోసిపుచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు మేరకే కనిగిరి రిజర్వాయర్ నుంచి కోకాకోలా సంస్థ నీటిని వాడుకుంటుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో వ్యాజ్యాలను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.

ఫిఫో విధానంలో బకాయిలు చెల్లించండి

- సీఈవోకు సబ్‌కా కాంట్రాక్టర్ల ఫిర్యాదు

విజయవాడ, మే 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా పారదర్శకంగా బిల్లులు చెల్లించడం లేదని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సబ్‌కా) అధ్యక్షుడు కొండా రమేష్, ఎస్.విజయకుమార్ సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు. ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్(ఫిఫో) విధానంలో బిల్లులు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వానికి, ఆర్థిక శాఖ అధికారులకు ఆదేశాలివ్వాలని కోరారు. ఈసీ ఆదేశించినా.. మార్చి నెలలో ఫిఫో విధానంలో బిల్లులు చెల్లించలేదన్నారు. దీనిపై విచారణ జరపాలని కోరారు. సంబంధిత శాఖల నుంచి వివరణ కోరతామని, వారిచ్చిన సమాధానం ప్రాతిపదికగా విచారణ జరుపుతామని సీఈవో హామీ ఇచ్చినట్టు సబ్‌కా ప్రతినిధులు తెలిపారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలి: సీపీఐ

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): పేద, సామాన్య, మధ్య తరగతి వర్గాల ప్రజల ఆస్తులను వివాదాల్లోకి నెట్టే ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. సామాన్యుల ఆస్తుల పరిరక్షణకు సంకటంగా మారే ఈ చట్టం అమలుకు జగన్ ప్రభుత్వం వేగంగా అడుగులు వేయడం, ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే హడావుడిగా ఈ యాక్ట్‌ను అమలు చేయాలంటూ సంబంధిత అధికారులకు ఉత్తర్వులివ్వడం దుర్మార్గమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ఏపీలో అరాచక, అవినీతి పాలన సాగుతుందనే విషయం కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు ఐదేళ్ల తర్వాత తెలిసిందా? అని ప్రశ్నించారు. ఆయన ఇప్పుడే నిద్ర లేచినట్లున్నారని ఎద్దేవా చేశారు. ఏపీకి పదే పదే ద్రోహం చేస్తున్న బీజేపీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని రామకృష్ణ పేర్కొన్నారు.

నవ్య | చిత్రజ్యోతి

వీళ్లిద్దరిలో ఎవరు?





కన్నడ సూపర్‌స్టార్ యశ్ నటిస్తున్న 'టాక్సిక్' సినిమా గురించి రోజుకో వార్త వినిపిస్తోంది. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రూపుదిద్దుకొనే ఈ చిత్రం జూన్‌లో సెట్స్ పైకి వెళ్లనుంది. సినిమాలో హీరో చెల్లెలు పాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉండడంతో ఆ పాత్రకు ఎవరిని ఎంపిక చేయాలా అనే విషయంపై ఇంకా ఓ నిర్ణయానికి రాలేకపోతున్నారు దర్శకనిర్మాతలు. నయనతార ఆ పాత్ర పోషించనున్నారని వార్తలు వచ్చాయి. అయితే ఇప్పుడు ఇంకో పేరు వినిపిస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకొనే పాన్ ఇండియా సినిమా కనుక చెల్లెలు పాత్రకు నయనతార కాకుండా కృతి సనన్‌ను తీసుకుంటే ఎలా ఉంటుందా అనే కొత్త ఆలోచన మొదలైనట్లు తెలుస్తోంది. నయనతార సౌత్ వరకూ ఓకే కానీ బాలీవుడ్‌లోని టాప్ హీరోయిన్లలో కృతి ఒకరు కనుక ఆమెను తీసుకుంటే సినిమాకు మరింత ప్లస్ అవవచ్చు అని ఆలోచిస్తున్నట్లు సమాచారం. నయతార, కృతి.. వీరిద్దరిలో ఎవరు అనే విషయం త్వరలోనే తేలిపోతుందని అంటున్నారు. ఇక యశ్ సరసన కియారా నటిస్తున్న సంగతి తెలిసిందే.

మంచి చిత్రాన్ని అందించాలని...



తమిళంలో చిన్న చిత్రంగా విడుదలై విమర్శకుల ప్రశంసలతో పాటూ పెద్ద విజయాన్ని అందుకున్న చిత్రం 'రంగోలి'ని తెలుగులో 'సత్య'గా డబ్ చేశారు. హమరేశ్, ప్రార్థన సందీప్ హీరో హీరోయిన్లుగా నటించారు. ఆడుకాలం మురుగదాస్, సాయిశ్రీ, అక్షయ కీలక పాత్రలు పోషించారు. వాలి మోహన్ దాస్ దర్శకత్వం వహించారు. తెలుగు వర్షన్‌కు శివ మల్లాల నిర్మాత. ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కిన 'సత్య' ఈ నెల 10న తెలుగులో విడుదల అవుతోంది. సోమవారం ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ వేడుకలో 8 మంది దర్శకులు కలసి ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత శివ మల్లాల మాట్లాడుతూ "నిర్మాతగా ఒక ప్రేక్షకులకు ఒక మంచి చిత్రాన్ని అందించాలని ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నా" అని చెప్పారు. దర్శకుడు వాలి మోహన్ దాస్ మాట్లాడుతూ "కుటుంబం కథా చిత్రంగా వస్తున్న 'సత్య'ను తెలుగు ప్రేక్షకులు ఆదరించాలి" అని కోరారు.

దేవర... ఎన్టీఆర్‌కు స్పెషల్



'ఆర్ఆర్ఆర్' తర్వాత వస్తున్న జూనియర్ ఎన్టీఆర్ చిత్రం కావడంపై 'దేవర పార్ట్ వన్' మీద భారీ అంచనాలు ఉన్నాయి. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నారు. సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా అక్టోబర్ 10న విడుదల కానుంది. ఇటీవల ఎన్టీఆర్ 'అభిమానులు కాలర్ ఎగరేసుకునేలా చిత్రం ఉంటుంది' అని కామెంట్ చేసి అభిమానుల్లో జోష్ పెంచారు. తాజాగా ఓ సినిమా ప్రమోషన్‌లో పాల్గొన్న దర్శకుడు కొరటాల శివ మాట్లాడుతూ 'ఎన్టీఆర్‌కు, ఆయన అభిమానులకు ఈ సినిమా కచ్చితంగా ప్రత్యేకంగా ఉంటుంది. త్వరలో అప్‌డేట్స్ వస్తాయి' అన్నారు. ఈ నెల 20 ఎన్టీఆర్ బర్త్‌డే కావడంతో ఆ రోజు 'దేవర' చిత్రం నుంచి సర్‌ప్రైజ్ ఉంటుందని అభిమానులు ఆశగా ఎదురు చూస్తున్నారు. 'దేవర' చిత్రం షూటింగ్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో జరుగుతోంది. ఎన్టీఆర్ మాత్రం ముంబైలో 'వార్ 2' షూటింగ్‌లో ఉన్నారు.

ఇలాంటి పరిస్థితి మరెవ్వరికీ రాకూడదు



'హుషారు', 'జాంబీ రెడ్డి', 'రావణాసుర' వంటి చిత్రాలతో గుర్తింపు పొందారు దక్షా నగార్కర్. తొమ్మిదేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నా దక్షా నటించింది కేవలం ఐదు చిత్రాలు మాత్రమే. ఇటీవలే ఆమె కొన్ని అనారోగ్య సమస్యలతో హాస్పిటల్‌లో చికిత్స తీసుకున్నారు. కోలుకున్నాక ఈ విషయమై ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. "గడిచిన కొద్ది రోజులు నరకప్రాయంగా తోచాయి. ఇలా ఆస్పత్రి బెడ్‌లో చికిత్స పొందుతూ ఉండటం ఎంతో బాధాకరం. నా వెన్నెముకకు ఇప్పటికే రెండు సార్లు మత్తు మందు ఇచ్చారు. ఇలాంటి పరిస్థితి మరెవ్వరికీ రాకూడదు. ఈ పరిస్థితుల నుంచి కోలుకోవడం ఎంతో కష్టంగా ఉన్నా.. కుటుంబ సభ్యుల అభిమానం, కేరింగ్ ఆరోగ్యాన్ని మెల్లిమెల్లిగా కుదుటపడేలా చేస్తున్నాయి. వారు కురిపించిన ప్రేమ వల్ల ఎంతటి నొప్పినైనా భరించే శక్తి వచ్చింది. కంటికి కనిపించని గాయాలను మాయం చేసే అద్భుత గుణం ప్రేమకు ఉంది. కుటుంబ సభ్యుల ప్రేమ ఈ విషయాన్ని రుజువు చేసింది. నేను అందరికీ చెప్పేదొక్కటే.. ఆరోగ్యాన్ని కాపాడుకోండి. అలాగే మీ చుట్టూ పాజిటివ్ వైబ్స్‌ను పెంచే రిలేషన్స్‌తో ఎక్కువ సమయం గడపండి" అని పేర్కొన్నారు.

ఆ విషయంలో మార్పు రావాలి



తెలుగు, తమిళంలో అగ్ర హీరోల చిత్రాల్లో నటించి వరుస విజయాలు అందుకున్న నటి జ్యోతిక. కెరీర్ పీక్ టైమ్‌లోనే నటుడు సూర్యని పెళ్లి చేసుకుని సినిమాల్లో నటించడం తగ్గించారు. అప్పుడప్పుడు నటనా ప్రాధాన్యమున్న పాత్రలతో ప్రేక్షకులను పలకరించే ఆమె.. బాలీవుడ్ చిత్రం శ్రీకాంత్ బొల్లా బయోపిక్ 'శ్రీకాంత్'లో కీలక పాత్రను పోషించారు. ఈ నెల 10న ఈ సినిమా విడుదలవుతున్న సందర్భంగా జ్యోతిక మీడియాతో ముచ్చటించారు.

"నాకు వాస్తవానికి దగ్గరగా ఉండే పాత్రల్లో నటించడం ఇష్టం. ఇందులో నేను టీచర్‌గా నటించాను. ఒక ఫ్రెండ్‌గా, తల్లిగా, టీచర్‌గా శ్రీకాంత్ పాత్ర అనుకున్నది చేయడానికి నేను సహకరిస్తాను. నా కెరీర్‌లో నేను చేసిన పాత్రల్లో హృదయానికి బాగా చేరువైన రోల్ ఇది. పుట్టుకతోనే అంధుడిగా పుట్టిన శ్రీకాంత్ అనే ఒక సాధారణ వ్యక్తి, వ్యవస్థగా మారడమే ఈ సినిమా కథాంశం. విద్యార్థిగా, వ్యాపార వేత్తగా శ్రీకాంత్ జీవితంలో ఎదుర్కొన్న సవాళ్లకు ఏ విధంగా సమాధానం చెప్పాడో సినిమాలో ఆసక్తికరంగా చూపించాం. ఈ బయోపిక్‌లో రాజ్‌కుమార్ రావు నటన అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. పాత్ర కోసం ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్ నిజంగా అద్భుతం. ఈ సినిమా సెట్స్‌కు అప్పుడప్పుడు 'శ్రీకాంత్' మూవీ రియల్ లైఫ్ క్యారెక్టర్ శ్రీకాంత్ బొల్లా వచ్చేవారు. తెలుగువాడైన శ్రీకాంత్ బొల్లా జీవితం నిజంగా ఒక ఇన్స్పిరేషనల్ జర్నీ. ఈ సినిమా విద్యార్థులకు కష్టపడితే జీవితంలో ఏదైనా సాధించవచ్చనే నమ్మకాన్ని కల్పిస్తుంది. అలాగే, ఇందులోని సన్నివేశాలు యూత్‌ను, కుటుంబాలను విపరీతంగా ఆకట్టుకుంటాయి. ఇక, ఎక్కడచూసినా సినిమాల్లో మహిళా సాధికారత గురించి చర్చ నడుస్తోంది. ఆ విషయంలో మార్పు రావాలి. ప్రత్యేకించి ఉమెన్ ఓరియెంటెడ్ చిత్రాలు తీయక్కర్లేదు. కథలోనే మహిళలకు సమాన అవకాశం ఉన్న పాత్రలు సృష్టిస్తే సరిపోతుంది" అని చెప్పారు.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● మంగళవారం 7 మే 2024

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లాకు చెందిన నేషనల్ అకాడమీ ఆఫ్ లీగల్ స్టడీస్, న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్(ఐఐసీఏ) ఉమ్మడిగా నిర్వహిస్తున్న ఎల్ఎల్ఎం(ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ లాస్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. ఇది ఫుల్ టైమ్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీని వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 66 సీట్లు ఉన్నాయి. తెలంగాణ విద్యార్థుల కోసం 25 శాతం సీట్లు ప్రత్యేకించారు. మిగిలిన 75 శాతం సీట్లను ఆలిండియా కోటా కింద భర్తీ చేస్తారు. ఆన్‌లైన్ ఎగ్జామినేషన్, ఆన్‌లైన్ పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

నల్సార్ వర్సిటీలో ఎల్ఎల్ఎం



ప్రోగ్రామ్ వివరాలు: మొదటి ఏడాది నల్సార్ యూనివర్సిటీలో రెండో ఏడాది ఐఐసీఏలో చదవాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా మొదటి ఏడాది లీగల్ కాన్సెప్ట్‌లు, ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ లాస్‌లకు సంబంధించి కోర్సు వర్క్‌లు, సెమినార్లు, గెస్ట్ లెక్చర్లు, ఇంటరాక్టివ్ డిస్కషన్స్ నిర్వహిస్తారు. లీగల్ ప్రొఫెషనల్స్, ఇండస్ట్రీ నిపుణులతో కేస్ స్టడీస్ సెషన్స్ ఉంటాయి. రెండో ఏడాది స్పెషలైజేషన్ కోర్సులు, ప్రాక్టికల్ అప్లికేషన్స్, రీసెర్చ్ ప్రాజెక్ట్‌లు, ఇంటర్న్‌షిప్‌లు, కస్టమైజ్డ్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లు ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తానికి 54 క్రెడిట్లు నిర్దేశించారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ లేదా ఏదేని బ్యాచిలర్ డిగ్రీ ఇన్ లా పూర్తిచేసి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఆన్‌లైన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఇది ఆబ్జెక్టివ్ ఎగ్జామ్. ఇందులో అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. లా ఆఫ్ కాంట్రాక్ట్, సేల్ ఆఫ్ గూడ్స్ యాక్ట్, ప్రాపర్టీ లా, కంపెనీ లా, ట్యాక్స్ లా, సెబీ అండ్ క్యాపిటల్ మార్కెట్స్, కార్పొరేట్ ఫైనాన్స్ అండ్ ఐబీసీ కోడ్ అంశాలకు సంబంధించి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం రెండు గంటలు. మొత్తం మార్కులు 100.

వెయిటేజీ: ఎంట్రెన్స్ ఎగ్జామ్ స్కోర్‌కు 60 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 40 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.5,000; ఓబీసీ, దివ్యాంగులకు రూ.4,000; ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.3,500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 15
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూన్ 20 నుంచి
- **ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్:** జూన్ 23
- **ఆన్‌లైన్ పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూన్ 24
- **ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాలు విడుదల:** జూన్ 27
- **తుది ఫలితాలు విడుదల:** జూలై 15
- **అడ్మిషన్ ప్రాసెస్ ప్రారంభం:** జూలై 18 నుంచి
- **తరగతులు ప్రారంభం:** జూలై 22 నుంచి
- **వెబ్‌సైట్:** www.nalsar.ac.in

సీఐటీడీలో పోస్ట్ డిప్లొమా



హైదరాబాద్, బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ)- పోస్ట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్(పీడీటీడీ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 60 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. కౌన్సెలింగ్ సమయంలో అర్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో అప్లయ్ చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్ విధానంలో వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని పూర్తిగా నింపి నిర్దేశిత పత్రాలు జతచేసి కొరియర్/స్పీడ్ పోస్ట్ ద్వారా సంస్థకు పంపాలి. పర్సనల్‌గా కూడా సబ్మిట్ చేయవచ్చు. ఎంపికైన అభ్యర్థులు ఇతర పార్ట్ టైమ్ కోర్సులు/ఈవెనింగ్ కోర్సులు చేయడానికి అనుమతించరు. ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్‌లో భాగంగా డిజైన్ ప్రాక్టీస్, మెట్రాలజీ, జిగ్స్ అండ్ ఫిక్చర్స్, ప్రెస్ టూల్స్, మెటీరియల్స్ అండ్ హీట్ ట్రీట్‌మెంట్, ప్రాసెస్ ప్లానింగ్, టూల్ రూం ప్రాక్టీస్, గ్యాజెస్, కటింగ్ టూల్స్, మౌల్డ్స్ ఫర్ ప్లాస్టిక్స్, డై క్యాస్టింగ్ డైస్, ఫోర్జింగ్ డైస్, ఆటోమేషన్, క్యాడ్/క్యామ్(ఆటో క్యాడ్ అండ్ మాస్టర్ క్యామ్) అంశాలు బోధిస్తారు.

● ప్రతి రోజూ ఉదయం తొమ్మిది గంటల నలభై అయిదు నిమిషాల నుంచి సాయంత్రం అయిదున్నర వరకు తరగతులు నిర్వహిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. అభ్యర్థులకు కనీసం 85 శాతం అటెండెన్స్ తప్పనిసరి. నిర్దేశించిన మేరకు అసైన్‌మెంట్స్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ చివరలో ఫైనల్ ఎగ్జామ్ ఉంటుంది.

అర్హత: డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 27 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్: ఈ పరీక్షలో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. డిప్లొమా(మెకానికల్ ఇంజనీరింగ్/టూల్, డై అండ్ మౌల్డ్ మేకింగ్)కు సంబంధించిన మూడేళ్ల సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం గంటన్నర.

- **కోర్సు ఫీజు:** సెల్ఫ్ స్పాన్సర్డ్ అభ్యర్థులకు సెమిస్టర్‌కు రూ.25,000; ఇండస్ట్రీ స్పాన్సర్డ్ అభ్యర్థులకు సెమిస్టర్‌కు రూ.35,000
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.700; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.350
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూన్ 30
- **ఎగ్జామ్ సెంటర్:** డిప్లొమా బ్లాక్, సీఐటీడీ, బాలానగర్, హైదరాబాద్ - 500037
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 12
- **చిరునామా:** ప్రిన్సిపాల్ డైరెక్టర్, సీఐటీడీ, బాలానగర్, హైదరాబాద్ - 500037
- **వెబ్‌సైట్:** citdindia.org

ఐఐటీ మద్రాస్‌లో బీఎస్ డేటా సైన్స్ అండ్ అప్లికేషన్స్



మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)- బీఎస్ ఇన్ డేటా సైన్స్ అండ్ అప్లికేషన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తారు. ఇప్పటికే వివిధ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్, ఉద్యోగార్థులకు ఈ ప్రోగ్రామ్ ఉపయోగకరంగా ఉంటుంది. క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు ఇంజనీరింగ్ అర్హత లేకున్నా ప్రోగ్రామర్లుగా, డేటా సైంటిస్టులుగా రాణించవచ్చు.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తి చేయాలి. ఇందులో నాలుగు దశలు ఉన్నాయి. అవి ఫౌండేషన్ లెవెల్, డిప్లొమా లెవెల్, బీఎస్సీ డిగ్రీ లెవెల్, బీఎస్ లెవెల్.

- రెగ్యులర్ ఎంట్రీ విధానంలో దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు అసైన్‌మెంట్స్ స్కోర్, క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా ఫౌండేషన్ లెవెల్ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్ ఇస్తారు. దీనిని పూర్తిచేసిన తరవాత డిప్లొమా లెవెల్ ప్రోగ్రామ్‌లో ఆ తరవాత బీఎస్సీలో, తరవాత బీఎస్‌లో అడ్మిషన్ లభిస్తుంది.
- ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024కు అర్హత పొందిన వారికి ఫౌండేషన్ లెవెల్ ప్రోగ్రామ్‌లో నేరుగా అడ్మిషన్ ఇస్తారు.
- ప్రోగ్రామ్ నుంచి ఏ దశలోనైనా అభ్యర్థులు నిష్క్రమించే వీలుంది. పూర్తిచేసిన కోర్సులకు సంబంధించి సంస్థ సర్టిఫికెట్ ప్రదానం చేస్తుంది.
- ఫౌండేషన్ లెవెల్లో ఎనిమిది కోర్సులు ఉంటాయి. 32 క్రెడిట్లు నిర్దేశించారు.
- డిప్లొమా లెవల్లో ఆరు థియరీ కోర్సులు, రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. 27 క్రెడిట్లు నిర్దేశించారు. ఈ లెవెల్లో ప్రోగ్రామింగ్, డేటా సైన్స్ స్పెషలైజేషన్‌లు ఉంటాయి. వీటిలో ఏదైనా ఒకదాన్ని లేదా రెంటినీ ఎంచుకోవచ్చు.
- బీఎస్సీ, బీఎస్ లెవెల్లో ఒక్కోదానికి 28 క్రెడిట్స్ నిర్దేశించారు.
- లెవెల్ వారీగా నిర్దేశించిన ఒక్కో అంతర్గత కోర్సు 12 వారాలు ఉంటుంది. ప్రతి వారం వీడియో క్లాసులు, అసైన్‌మెంట్స్ ఉంటాయి. మంత్లీ క్విజ్‌లు, ఎండ్ టర్మ్ ఎగ్జామ్‌లు కూడా నిర్వహిస్తారు.

అర్హత: ఇంగ్లీష్, మేథమెటిక్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.

- నేషనల్ డిఫెన్స్ అకాడమీ నిర్వహించే రెండేళ్ల జాయింట్ సర్వీసెస్ వింగ్ ఫైనల్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు; మూడేళ్ల డిప్లొమా పూర్తిచేసినవారు; జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్(జీసీఈ) అడ్వాన్స్‌డ్ లెవెల్ ఉత్తీర్ణులు; కనీసం అయిదు సబ్జెక్టులతో ఎన్ఐఓఎస్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

క్వాలిఫయర్ ఎగ్జామ్: రెగ్యులర్ ఎంట్రీ విధానంలో దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు మొదట నెల రోజులు ఆన్‌లైన్ శిక్షణ నిర్వహిస్తారు. ఇందులో ఇంగ్లీష్, మేథమెటిక్స్ ఫర్ డేటా సైన్స్, స్టాటిస్టిక్స్ ఫర్ డేటా సైన్స్, కంప్యూటేషనల్ థింకింగ్ అంశాలపై తరగతులు ఉంటాయి. ఒక్కో అంశంపై వారానికి 2 నుంచి 3 గంటల వీడియో కంటెంట్ పంపుతారు. అభ్యర్థులకు ఇచ్చిన అసైన్‌మెంట్లను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసి ఆన్‌లైన్‌లో పంపాలి. వీటికి మార్కులు ఉంటాయి. మొదటి మూడు అసైన్‌మెంట్లలో కనీసం రెంటిలో 40 శాతం స్కోర్ సాధించినవారిని క్వాలిఫయర్ ఎగ్జామ్‌కు అనుమతిస్తారు. రిజర్వుడు వర్గాలకు 30 శాతం వస్తే చాలు.

● పరీక్ష సమయం 3 గంటలు ఉంటుంది. అంటే ఒక్కో సబ్జెక్టుకు 45 నిమిషాలు ఇస్తారు. ఒక్కోదానిలో కనీసం 40 శాతం చొప్పున మొత్తమ్మీద 50 శాతం మార్కులు రావాలి. ఈ ఎగ్జామ్ రిజల్ట్ వ్యాలిడిటీ ఏడాది లేదా మూడు టర్మ్‌ల వరకు ఉంటుంది

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.3,000; జనరల్ కేటగిరీ దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన దివ్యాంగులకు రూ.750
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 26
- **క్వాలిఫయిర్ ఫేజ్ ప్రారంభం:** మే 31 నుంచి
- **క్వాలిఫయిర్ ఎగ్జామ్ తేదీ:** జూలై 7
- **ఫలితాలు విడుదల:** జూలై 12
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్:** జూలై 17 నుంచి 18 వరకు
- **వెబ్‌సైట్:** study.iitm.ac.in

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

భారత్ - చైనా సంబంధాలు

శనివారం (మే 5) నాటి తరువాయి..

● చైనా నుంచి నేపాల్ మీదుగా బంగ్లాదేశ్‌ను తద్వారా బంగాళాఖాతాన్ని అతి త్వరగా చేరుకోవచ్చు. అయితే మధ్యలో భారతదేశానికి చెందిన ఒక అతి చిన్న కారిడార్ సిలిగురి కారిడార్(చికెన్ నెక్ కారిడార్) ఉంది. ఇది భారతదేశంలో ఈశాన్య రాష్ట్రాలను అనుసంధానిస్తుంది. ఈ చికెన్ నెక్ కారిడార్‌ను ఆక్రమించాలని ఎప్పటి నుంచో చైనా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే చికెన్ నెక్ కారిడార్‌కు ఇరువైపుల ఉన్న నేపాల్, బంగ్లాదేశ్‌లో పటిష్ఠ స్థావరాలు ఏర్పాటు చేస్తోంది. ఈ చర్య భారత భౌగోళిక భద్రతకు ముప్పు కలిగించే అంశమే.

● అంతేకాక దశాబ్ద కాలంగా నేపాల్‌లో చైనా విస్తృతంగా పెట్టుబడులు పెడుతూ వస్తోంది. ముఖ్యంగా హైడ్రో పవర్ ప్లాంట్స్ సిమెంట్ ఫ్యాక్టరీలు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలైన్ ప్రాజెక్టుల వంటి వాటిలో స్థానిక సంపన్న, రాజకీయ వర్గాల వారికి భాగస్వామ్యం కల్పిస్తోంది. వారిని తనకు అనుకూలంగా మార్చుకుని భారత వ్యతిరేక భావనను పెంపొందించేందుకు చైనా ప్రయత్నిస్తోంది.

● నేపాల్-భారత్ మధ్య ఉన్న చిరకాలమైత్రి వల్ల ఓపెన్ బోర్డర్స్ ద్వారా ప్రజల రాకపోకల్లో స్వేచ్ఛ ఉంది. అయితే ప్రస్తుతం నేపాల్‌ను తనవైపు తిప్పుకోవడానికి నిధులు గుమ్మరిస్తున్న చైనా... దాని అంతిమ వ్యూహం మాత్రం భారత్‌కు నేపాల్‌ను దూరం చేయడమే. భారత్-నేపాల్ మధ్య గల కాలాపానీ, సుస్తా ప్రాంతాల భౌగోళిక హక్కుల వివాదం, నేపాల్ రాజ్యాంగ రచన సమయంలో ఇరుదేశాల మధ్య కలిగిన అభిప్రాయ భేదాలు వంటి చిన్నాచితక వివాదాలు ఇరు దేశాల మధ్య స్పర్థను కలిగించడం చైనాకు కలిసి వచ్చింది.

● అదేవిధంగా శ్రీలంకలో సివిల్ వార్ సందర్భంగా ప్రపంచ దేశాలన్నీ నిరసన వ్యక్తం చేశాయి. అయితే శ్రీలంకకు చైనా మాత్రం భారీ ఎత్తున ఆయుధాలు సరఫరా చేసింది. ఐక్యరాజ్యసమితిలో సివిల్‌వార్‌కు వ్యతిరేకంగా/మానవ హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా ప్రతిపాదించిన తీర్మానాన్ని సైతం చైనా తన వీటో అధికారంతో అడ్డుకుంది. తద్వారా అక్కడి సైనిక ప్రభుత్వానికి దగ్గరైంది. శ్రీలంకలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెట్టుబడుల సహాయం పేరుతో భారీస్థాయిలో రుణాలను అత్యధిక వడ్డీరేట్లకు(6.9%) కుమ్మరించింది. ప్రపంచబ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ వంటి రుణ వితరణ సంస్థల వడ్డీరేట్ల(2.5% - 3%)తో పోల్చితే ఇది చాలా ఎక్కువ. ఈవిధంగా శ్రీలంకకు వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో దాదాపు 30% చైనా నుంచే. అలా శ్రీలంక ఆర్థికవ్యవస్థ చైనా నియంత్రణలోకి వెళ్లిపోయింది. శ్రీలంక ఆర్థిక పరిస్థితి క్షీణత దృష్ట్యా రెవెన్యూ ఆదాయంలో 83% అప్పుల చెల్లింపునకే పోతున్నాయి. దానిలో 25% విదేశీ అప్పులకు సంబంధించిన చెల్లింపులే ఉండటం గమనార్హం. ఈవిధంగా శ్రీలంకను అప్పుల ఉచ్చులోకి చైనా నెట్టేసింది. శ్రీలంక నిర్మించిన హంబిన్‌తోట నౌకాశ్రయానికి అవసరానికి మించి చైనా అప్పు ఇచ్చింది. ఆ అప్పును ఈక్విటీగా మార్చడం ద్వారా, శ్రీలంక నుంచి 99 ఏళ్లకు లీజును చైనా హస్తగతం చేసుకుంది. అంతర్జాతీయ నౌకాయానంలో హిందూ మహాసముద్ర ప్రాంతంలో అత్యంత కీలక స్థావరం ఇది. చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌లో కీలకమైన ఈ పోర్టు నిర్మాణానికి చైనా 85 శాతం నిధులు సమకూర్చింది. గూఢచర్య నౌకలకు ఈ ప్రాంతంలో ఆశ్రయమివ్వడానికి, సైనిక మోహరింపునకు కూడా ఈ నౌకాశ్రయాన్ని చైనా వినియోగిస్తోంది. ఫలితంగా భారత నౌకా రవాణాకు, దేశభద్రతకు ప్రమాదం ఏర్పడుతోంది.



● అదేవిధంగా భారత్‌తో సముద్ర సరిహద్దును పంచుకుంటున్న మరో చిరకాల మిత్రదేశమైన మాల్దీవులు ఇప్పుడు ఒక్కసారిగా భారత్ వ్యతిరేక ధోరణిని అనుసరిస్తూ 'ఇండియా అవుట్' నినాదం అందిపుచ్చుకోవడానికి కూడా చైనానే కారణం. ఇటీవల భారత వ్యతిరేక అజెండాతో ఎన్నికల్లో గెలుపొంది, ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన మొహ్మద్ మొయిజ్జు రానురానూ భారత్ వ్యతిరేక ధోరణిని తీవ్రం చేస్తూ చైనాకు దగ్గరవడం ప్రస్ఫుటంగా కనిపిస్తూనే ఉంది. భారత విపత్తు, మానవతా సహాయ దళాలను దేశం విడిచి వెళ్లాలని ఆదేశించిన మొయిజ్జు వెనువెంటనే చైనాతో సైనిక రక్షణ సహకార ఒప్పందం చేసుకోవడం, చైనా గూఢచార నౌక షియాంగ్ యాంగ్ హాంగ్-3 సముద్ర సర్వే నెపంతో మాల్దీవుల ప్రాదేశిక జలాల్లో తిష్టవేయడం వంటి అనేక సంఘటనలు భారత వ్యతిరేక వైఖరిని చాటి చెబుతూనే ఉన్నాయి. దీనంతటికీ కారణం చైనా నుంచి మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టు పెట్టుబడులు కుమ్మరించడమే అన్నది జగమెరిగిన సత్యం. మాల్దీవుల అప్పుల్లో 60% చైనా ద్వారా లభించినవే. మాల్దీవుల జాతీయాదాయంలో 31%గా ఉంది.

● ఈవిధంగా భారత్ సరిహద్దు దేశాలైన శ్రీలంక, పాకిస్థాన్, మాల్దీవులు తీవ్రంగా అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో వాటి ఆర్థిక, రాజకీయ నిర్ణయాల్లో చైనా నేరుగా జోక్యం చేసుకోగలుగుతోంది. తన వ్యూహాత్మక ప్రయోజనాల కోసం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 97 దేశాలపై చైనా తన అప్పుల వల విసిరిందని ప్రపంచబ్యాంకు నుంచి సేకరించిన గణాంకాల ద్వారా ఫోర్బ్స్ సంస్థ ఒక నివేదికలో వెల్లడించింది. ఈవిధంగా చైనా తన ప్రపంచ వాణిజ్యం, అమెరికాకు దీటుగా ఎదగడం, వ్యూహాత్మక స్థావరాలను ఏర్పర్చుకొనే నిమిత్తం బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ రూపంలో అప్పుల వల విసురుతూ నయా వలసవాదానికి తెరలేపింది.


● అదేవిధంగా తనకు పక్కలో బల్లెంలా ఉన్న భారత్‌ను పనిలో పనిగా ఇదే వ్యూహంతో అష్టదిగ్బంధనం చేయడానికి ఇరుగుపొరుగు దేశాల్లో పాగా వేస్తోంది. ఈవిధంగా కుయుక్తులతో చొచ్చుకువస్తున్న చైనాను నిలువరించాలంటే అంతర్జాతీయంగా కదలిక రావాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా మిలిటరీ జుంటా పాలనలో ఉన్న మయన్మార్, పాకిస్థాన్, శ్రీలంక వంటి దేశాలకు ఆయుధాలు, నిధులు సరఫరా చేసే చైనాకు అట్టి పాలన వ్యవస్థలు మన్నినంత కాలం ఢోకా ఉండదు. ఆ దేశాలను తన చదరంగంలో పావులుగా మార్చుకోగలదు. కాబట్టి ఆ దేశాల్లో ప్రజాస్వామ్య ప్రభుత్వాల ఏర్పాటుకు అంతర్జాతీయ కృషి జరగాలి. చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్, స్ట్రింగ్ ఆఫ్ పెర్ల్స్ పాలసీలకు దీటుగా అంతర్జాతీయ సమాజం ప్రత్యామ్నాయాలను తీసుకురావాలి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా చైనాను నిలువరించగలం.

● అదేవిధంగా భారత్ కూడా తన ఇరుగుపొరుగు దేశాలతో మరింత వ్యూహాత్మకంగా మెలగడం, అంతర్జాతీయ మద్దతు పొందడం, స్థానిక భాగస్వామ్య కూటములను బలోపేతం చేసుకోవడం ద్వారా చైనాకు అడ్డుకట్ట వేయవచ్చు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

భయంలేని జింక పిల్ల భయపడిన సింహరాజు



అనగనగా ఓ అడవి. దగ్గర్లోనే ఒక గ్రామం ఉంది. ఆ గ్రామంలోని ఒక రైతు చేలోకి జింకలొచ్చేవి. వాటిని ఏమీ అనేవాడు కాదు. ఆ రైతు గుడిసెలోకి కూడా జింకలు వెళ్లి పడుకునేవి. ఒక రోజు రాత్రి జింకపిల్ల విపరీతంగా ఏడుస్తోంది. వాళ్ల అమ్మ జింకపిల్ల ఏడ్వొద్దని కథలు చెబుతోంది. అయినా ఏడుపు ఆపలేదు ఆ జింకపిల్ల. అంతలోనే ఆ గుడిసె దగ్గరకొచ్చి ఓ సింహం బయట పొంచి ఉంది. బయటికి వస్తూనే జింక గొంతు కొరికేద్దామా? అన్నట్లు సింహం ఎదురు చూస్తోంది. 'అదిగో ఎలుగు బంటి వస్తోంది' అంటూ పిల్లతో అన్నది జింక. జింకపిల్ల భయపడలేదు. అదిగో.. హైనా వచ్చె అన్నది. అయినా జింక భయపడలేదు. అదిగో సింహం వచ్చింది. తింటుంది అని చెప్పినా జింకపిల్ల ఏడుపు ఆపలేదు. 'అదిగో అఫ్లాతూన్ వచ్చాడు' అంటూనే జింకపిల్ల ఏడుపు ఆపింది. సైలెంట్ అయింది. ఇది విన్న సింహం వెనక్కి పరిగెత్తింది. ఆ చీకట్లో ఒక వ్యక్తికి ఢీ కొట్టింది. అది సింహమనే విషయం తెలీక దాని మెడను ఆ వ్యక్తి గట్టిగా పట్టుకున్నాడు. అఫ్లాతూన్ గాడు చంపేస్తాడేమోనని ఆ సింహం పరిగెడుతోంది. కిందపడితే.. ఇదేదో తింటుందని ఆ వ్యక్తి అలానే సింహాన్ని పట్టుకున్నాడు. కొంచెం దూరం వెళ్లాక సింహం గొంతు విడిచేశాడు ఆ వ్యక్తి. కిందపడిపోయాడు. అఫ్లాతూన్ వస్తాడేమోననే భయంతో సింహం గుండె వేగంగా కొట్టుకుంటోంది. వాడేమైనా చంపేస్తాడేమోనని వణుకుతోంది.

వాస్తవానికి అఫ్లాతూన్ అంటే బాక్సర్ అని అర్థం. అయితే అదో భయంకరమైన జంతువు అని సింహం అనుకుంది. దాని బారిన నుండి తప్పించుకున్నాని సంబరపడిపోయింది.

నీతి- నువ్వు మెదడులో ఏమనుకుంటే అదే జరుగుతుంది.




పదాలు కనుక్కోండి

BIKE
CONTAINER
ELECTROCAR
FOREST
MOUNTAINS
PLANET
PLANT
SORTING
SUN
TREE

C	O	N	S	O	R	T	I
L	E	T	B	I	K	E	N
E	C	A	I	N	E	R	G
T	T	R	O	C	A	R	N
P	R	P	L	M	O	S	U
L	F	E	A	N	U	N	S
A	O	R	E	E	T	T	N
N	T	E	S	T	🌍	A	I






10 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 300

6	3				8		4	7
								3
		9	3					6
	2			9				4
3			1		4			2
8				3			1	
9					7	4		
1								
2	6		9				5	8

సుడోకు - 299 సమాధానం

5	1	3	7	2	4	9	6	8
7	6	8	5	9	3	4	1	2
2	4	9	1	8	6	7	3	5
3	7	6	2	5	1	8	9	4
8	9	2	4	3	7	1	5	6
1	5	4	9	6	8	3	2	7
6	8	1	3	7	2	5	4	9
4	2	5	8	1	9	6	7	3
9	3	7	6	4	5	2	8	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.